


'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 313

శుక్రవారం 3-2-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ప్రతి పైసా కూడగట్టి విమానం ఎక్కారు

అమ్మ విమానం ఎక్కి ఉండదు ఒక్కసారైనా. మనకు తీసుకెళ్లే వీలు ఉన్నా ఇంట్లోని ఆడవాళ్లను విమానం ఎక్కించడానికి ఖర్చు కారణం చూపుతాము. కేరళలో కూలి పని చేసే 24 మంది స్త్రీలు తాము జీవితంలో ఒక్కసారైనా విమానం ఎక్కాలని నిశ్చయించుకున్నారు. పైసా పైసా కూడగట్టారు. టికెట్లు బుక్ చేశారు. చిన్నపిల్లల్లా కేరింతలు కొడుతూ కొచ్చి నుంచి బెంగళూరుకు ఆకాశంలో ఎగిరారు. ప్రయత్నిస్తే సాధ్యమని వీరు అంటున్నారు.

-11లో



Pre-book now and get at ₹ 69999*

Retail price	₹ 124999#
Exchange value of old device	₹ 47000~
Upgrade bonus / Bank cashback	₹ 8000^
Effective price	₹ 69999*

+


Galaxy Watch4 Classic LTE
+

Galaxy Buds2

at ₹ 4999**

Samsung Upgrade
up to ₹ 8000 bonus^

10% CASHBACK
with Samsung Axis Bank Credit Cards***

Offer valid till Feb 23, 2023

Re+ Please dispose of e-waste and plastic waste responsibly. For more information or for e-waste pick up, please call 1800 40 7267864 or 1800 5 7267864.

Image simulated. Colour as per availability. Offers may be revised or withdrawn without prior notice. *T&C apply. Offer price shown for 1 Unit of Galaxy S23 Ultra 12GB | 256GB inclusive of exchange value of old device & upgrade bonus / bank cashback. Final pricing subject to dealer discretion. #Retail price of 1 Unit of Galaxy S23 Ultra 12GB | 256GB. Price inclusive of taxes. ~Approximate value on exchange of 1 Unit of Galaxy S22 Ultra 12GB | 256GB. Exchange value varies basis model & condition of old device. Exchange at the discretion of retailer. ^Cashback provided by issuer at its sole discretion. **Combined price for 1 Unit of Galaxy Watch4 Classic LTE (46mm) and 1 Unit of Galaxy Buds2. ***10% cashback applicable as per limits - Signature variant: ₹ 2500 monthly, ₹ 10000 annually. Infinite variant: ₹ 5000 monthly, ₹ 20000 annually.

Scan to pre-book

Or WhatsApp "S23" to 9870-494949 to pre-book at Samsung Exclusive Stores

Cheil-14208/23


'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 313

శుక్రవారం 3-2-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




విజేత దక్షిణాఫ్రికా

సీనియర్ మహిళల ముక్కోణపు టి20 టోర్నీ ఫైనల్లో భారత్ ఓటమి -13లో



కొనసాగిన ఊగిసలాట

అదానీ గ్రూప్ షేర్ల అమ్మకాల ప్రభావం.. సెన్సెక్స్‌కు లాభం.. నిఫ్టీకి నష్టం -13లో



'హిండెన్‌బర్గ్' ప్రకంపనలు

అదానీపై హిండెన్‌బర్గ్ నివేదిక పార్లమెంట్‌లో ప్రకంపనలు సృష్టించింది. 9 విపక్షాల ఎంపీలు సభా కార్యక్రమాలను అడ్డుకున్నారు.

- వివరాలు 6లో▶



సుదీర్ఘ పోరాటం చేశా: సిద్దిఖీ

ఉత్తరప్రదేశ్ జైల్లో రెండేళ్లకుపైగా ఉన్న కేరళ జర్నలిస్టు సిద్దిఖ కప్పన్ ఎట్టకేలకు బెయిల్‌పై గురువారం బయటకు వచ్చారు.

- వివరాలు 6లో▶



బైడెన్ ప్రభుత్వంలో ఎన్నారైల పట్టు

కాంగ్రెస్ సభ్యులైన నలుగురు ఇండియన్ అమెరికన్లను అత్యంత ముఖ్యమైన హౌస్ ప్యానెల్స్ సభ్యులుగా నియమించారు.

- వివరాలు 6లో▶



అవమానాలు, నిరాదరణ..

అమెరికాలో జరిగిన విశ్వసుందరి పోటీల్లో పక్షపాతం చూపించారని, నిరాదరణ ఎదుర్కొన్నానని రష్యా సుందరి అన్నాలిన్నికోవా అన్నారు.

- వివరాలు 6లో▶

న్యూస్‌రీల్

24 గంటల కరెంటా.. నిరూపిస్తారా..?



రాష్ట్రంలో వ్యవసాయానికి 24 గంటలు కరెంట్ ఇస్తున్నట్టు నిరూపిస్తే ముక్కు నేలకు రాసి, రాజకీయాల నుంచి తప్పుకుంటానని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ మంత్రులకు సవాల్ విసిరారు. ఓ బీసీ మంత్రి తనను ఉద్దేశించి విమర్శలు చేస్తున్నారని, బీసీలకు ఎన్ని మంత్రి పదవులిచ్చారు?, ఏయే శాఖలిచ్చారో చెప్పాలన్నారు.

- వివరాలు 3లో▶


50% నిధులు జమచేస్తేనే ఆర్‌ఆర్‌ఆర్ ప్రారంభం



ఇప్పటికే హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టు ఉత్తరభాగం అలైన్‌మెంట్, భూసేకరణ ప్లాన్ ఆమోదం పూర్తయిందని కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. భూసేకరణ వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్న 50% వాటాను జమ చేయడాన్ని బట్టి ప్రాజెక్ట్ చేపట్టే సమయం ఆధారపడి ఉంటుందన్నారు.

- వివరాలు 2లో▶

'బడ్జెట్'ను 35 రోజులు నిర్వహించాలి: భట్టి



శాసనసభ బడ్జెట్ సమావేశాలను కనీసం 30 నుంచి 35 రోజుల పాటు నిర్వహించాలని సీఎల్పీనేత భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. ఈ మేరకు బీఏసీ సమావేశంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని ఆయన అన్నారు. బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. బడ్జెట్ సమావేశాల్లో ప్రజా సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలను ఎజెండాగా తీసుకొని ప్రజల గొంతుకను అసెంబ్లీలో వినిపిస్తామన్నారు.

- వివరాలు 3లో▶


• కళా తపస్సు ముగిసింది

తుదిశ్వాస విడిచిన కె.విశ్వనాథ్

విశ్వ విఖ్యాతి తెచ్చిన 'శంకరాభరణం' విడుదల రోజే కన్నుమూత

ఆస్పత్రి నుంచి ఫిలింనగర్‌లోని స్వగృహానికి భౌతికకాయం తరలింపు

సినీ, రాజకీయరంగ ప్రముఖుల దిగ్భ్రాంతి



వినువీధికి విశ్వనాథుడు

సాక్షి, హైదరాబాద్: ఓ శంకరాభరణం, ఓ సిరిసిరి మువ్వ, ఓ సిరివెన్నెల, ఓ స్వాతి ముత్యం, ఓ శుభసంకల్పం.. తెలుగు సినీ రంగానికి ఇలాంటి ఎన్నో ఆణిముత్యాల్లాంటి చిత్రాలనిచ్చిన దర్శక దిగ్గజం, రచయిత, నటుడు, దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, కళా తపస్వి కె.విశ్వనాథ్‌గా ప్రఖ్యాతిగాంచిన కాశీనాథుని విశ్వనాథ్ (92) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి 11 గంటల సమయంలో తుదిశ్వాస విడిచారు. వయోభారం వల్ల ఆయన ఈ మధ్య కాలంలో పలుమార్లు ఆస్పత్రిలో చేరినా కోలుకుని తిరిగి వచ్చారు. అయితే రెండురోజుల క్రితం ఆయన తిరిగి అస్వస్థతకు గురికావడంతో కుటుంబసభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. ఎప్పటిలాగే తిరిగొస్తారని కుటుంబసభ్యులు, అభిమానులు, చిత్ర పరిశ్రమకు చెందినవారు ఆశించారు. కానీ ఆయన మిగతా 2వ పేజీలో ▶

ఐదు జాతీయ అవార్డులు

విశ్వనాథ్ దర్శకత్వం వహించిన 'శంకరాభరణం' సినిమాకు జాతీయ పురస్కారంతో పాటు 'సప్తపది'కి జాతీయ సమగ్రతా పురస్కారం లభించింది. 'స్వాతిముత్యం' సినిమా 1986లో ఆస్కార్ అవార్డుల నామినేషన్లకు అధికారిక ప్రవేశం పొందింది. మొత్తం ఐదు జాతీయ అవార్డులు లభించాయి. భారతీయ సినిమాకు చేసిన సేవకు గాను విశ్వనాథ్‌కు భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారమిచ్చి గౌరవించింది. 1992లో రఘుపతి వెంకయ్య పురస్కారం అందుకున్నారు. దాదాసాహెబ్ ఫాల్కేతో పాటు ఐదు నంది అవార్డులు, 10 ఫిలింఫేర్ అవార్డులు, 'సాక్షి' లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు కూడా అందుకున్నారు.

తెలుగు సినిమా 'ఆత్మగౌరవం'! 2లో

ఈడీ చార్జిషీట్‌లో కేజ్రీవాల్ పేరు

లిక్కర్ స్కామ్ అనుబంధ చార్జిషీట్‌లో చేర్చిన ఈడీ

ఎమ్మెల్సీ కవిత, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పేర్లు ప్రస్తావన



ఢిల్లీ లిక్కర్ కుంభకోణానికి సంబంధించి ఈడీ గురువారం అనుబంధ చార్జిషీట్ దాఖలు చేసింది. ఇందులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ పేరును చేర్చింది. అలాగే బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పేర్లను మరోమారు ప్రస్తావించింది. ప్రత్యేక కోర్టు తదుపరి విచారణను ఈ నెల 23కు వాయిదా వేసింది.

6లో

ఈడీ కేసులు మొత్తం ఫేక్: కేజ్రీవాల్

ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఈడీ తనపై నకిలీ కేసు నమోదు చేసిందని ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆక్షేపించారు. ఈ కేసులో ఈడీ అనుబంధ చార్జిషీట్ దాఖలు చేయడాన్ని ఖండించారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రాల్లో ప్రభుత్వాలను అప్రతిష్టపాలు చేయడానికి, కొత్త ప్రభుత్వాలను ఏర్పాటు చేయడానికి దర్యాప్తు సంస్థలను ఉపయోగించుకుంటున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యేలను కొనేయడానికి, ప్రభుత్వాలను పడగొట్టడానికి ఉపయోగపడేలా కేసులు పెడుతున్న ఈడీ అవినీతిని అంతం చేయడానికి ఎందుకు కేసులు పెట్టడం లేదని నిలదీశారు. బీజేపీ సర్కారు హయాంలో ఈడీ ఇప్పటిదాకా 5,000 చార్జిషీట్లు దాఖలు చేసిందని, ఇందులో ఎంతమందికి శిక్ష పడిందో చెప్పాలని ప్రశ్నించారు. ఈడీ నమోదు చేస్తున్న కేసులన్నీ నకిలీవేనని దుయ్యబట్టారు.

జూలై 1న గ్రూప్-4 పరీక్షలు

ఉదయం జనరల్ స్టడీస్.. మధ్యాహ్నం సెక్రటేరియల్ ఎబిలిటీ పరీక్షలు

ఓఎంఆర్ విధానంలో నిర్వహిస్తామని టీఎస్‌పీఎస్సీ ప్రకటన

- ఇంగ్లిష్-తెలుగు, ఇంగ్లిష్-ఉర్దూలలో ప్రశ్నపత్రాలు
- నేటి సాయంత్రంతో ముగుస్తున్న దరఖాస్తు గడువు
- ఒక్కో పోస్టుకు 110 మందికిపైగా పోటీ

సాక్షి, హైదరాబాద్: వరుసగా ఉద్యోగ భర్తీ ప్రకటనలతో రెండు నెలలపాటు హడావుడి చేసిన రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ఇక పరీక్షల నిర్వహణకు ఉపక్రమించింది. ఇటీవలే గ్రూప్-1 మెయిన్ పరీక్ష తేదీలను ఖరారు చేయగా.. అత్యధిక పోస్టులున్న గ్రూప్-4 పరీక్షల తేదీలను గురువారం ప్రకటించింది. ఈ ఏడాది జూలై ఒకటో తేదీన రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో గ్రూప్-4 పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపింది. ఓఎంఆర్ విధానంలో పరీక్ష నిర్వహిస్తామని.. ప్రశ్నపత్రాలు ఇంగ్లిష్-తెలుగు, ఇంగ్లిష్-ఉర్దూలలో ఉంటాయని పేర్కొంది.

ఎక్కువ పోస్టులు చూపి.. కొన్ని తగ్గించి..

వివిధ ప్రభుత్వ శాఖల్లో 9,168 గ్రూప్-4 పోస్టులను భర్తీ చేస్తామని గత ఏడాది డిసెంబర్ 1న టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. దీనికి సంబంధించి డిసెంబర్ 30న పూర్తిస్థాయి నోటిఫికేషన్ విడుదల చేసినా.. 8,039 ఖాళీ పోస్టులను మాత్రమే చూపింది. అదే రోజు నుంచి దరఖాస్తుల స్వీకరణ చేపట్టింది. తర్వాత ఈ ఏడాది జనవరి 28న విడుదల చేసిన అనుబంధ నోటిఫికేషన్‌తో మరో 141 జూనియర్ అసిస్టెంట్ పోస్టులను జత చేసింది. వీటితో కలిపి మొత్తంగా భర్తీ చేసే గ్రూప్-4 పోస్టుల సంఖ్య 8,180కి చేరింది.

నేటితో గడువు పూర్తి

గ్రూప్-4 పోస్టులకు శుక్రవారం సాయంత్రం 5 గంటలకు దరఖాస్తు గడువు ముగియనుంది. గురువారం సాయంత్రం వరకు దాదాపు 9 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. అంటే దాదాపు మిగతా 3వ పేజీలో ▶



గ్రూప్-4 పరీక్ష షెడ్యూల్, వివరాలివీ..

సెషన్	సమయం	పేపర్/సబ్జెక్ట్	సమయం	ప్రశ్నలు	మార్కులు
ఉదయం	10.00-12.30	పేపర్-1/జనరల్ స్టడీస్	2.30గం.	150	150
మధ్యాహ్నం	2.30-5.00	పేపర్-2/సెక్రటేరియల్ ఎబిలిటీ	2.30గం.	150	150



దేశంలో అభివృద్ధి కన్నా రాజకీయాలపైనే దృష్టి

ప్రధాని నరేంద్ర మోదీ సర్కారుపై మంత్రి కేటీఆర్ పరోక్ష విమర్శలు

ఉద్యోగ కల్పనపై ఆలోచించే దేశ నాయకత్వం కావాలి

ఎన్నికల కోసమే పనిచేస్తున్నారు

మూడు 'ఐ'లపై తెలంగాణ సర్కారు దృష్టి సారించిందని వెల్లడి

సాక్షి, హైదరాబాద్/మాదాపూర్: యువతకు ఉద్యోగాల కల్పన దిశగా ఆలోచించే నాయకత్వం దేశానికి అవసరమని పరిశ్రమలు, ఐటీ, పురపాలక శాఖ మంత్రి కె.తారక రామారావు అన్నారు. ప్రపంచంలో గుర్తించదగిన బ్రాండ్స్ మన దేశం నుంచి ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. చైనా, జపాన్ లాంటి దేశాలు అభివృద్ధిలో ముందున్నాయని, భారత్‌లో మాత్రం ఆర్థికాభివృద్ధి కన్నా.. రాజకీయాలపై ఎక్కువ దృష్టి పెడుతున్నారని దుయ్యబట్టారు. మన దేశంలో కూడా ఆర్థిక మిగతా 3వ పేజీలో ▶

గవర్నర్ సూచనలకు సర్కారు ఓకే..!

నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

- ఉభయ సభలను ఉద్దేశించి మాట్లాడనున్న తమిళిసై
- ప్రసంగ పాఠానికి చేయాల్సిన మార్పులపై సూచనలు
- ఆ మేరకు మార్పులతో తుదిరూపు ఇచ్చిన ప్రభుత్వం
- అస్త్రశస్త్రాలతో అధికార, విపక్షాలు రెడీ
- నేటి బీఏసీ భేటీలో సమావేశాల ఎజెండా ఖరారు
- రేపు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ
- 5న రాష్ట్ర కేబినెట్ భేటీ.. బడ్జెట్‌కు ఆమోదం.. 6న సభ ముందుకు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ 2023-24 వార్షిక బడ్జెట్ సమావేశాలు శుక్రవారం మధ్యాహ్నం 12.10 గంటలకు ప్రారంభం కానున్నాయి. మొదటిరోజున శాసనసభ హాల్‌లో శాసనసభ, శాసనమండలి సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రసంగిస్తారు. ప్రసంగ పాఠం బుధవారం రాత్రి ప్రభుత్వం నుంచి రాజ్‌భవన్‌కు చేరింది. దాన్ని పరిశీలించిన గవర్నర్.. కొన్ని అంశాలకు సంబంధించి మరిన్ని వివరాలు కోరడంతో పాటు కొన్ని సూచనలు చేసినట్లు సమాచారం. ప్రభుత్వం కూడా గవర్నర్ సూచనలను పరిగణనలోకి తీసుకుని, ప్రసంగ పాఠంలో పలు మార్పులు చేసి తుదిరూపు ఇచ్చినట్లు తెలిసింది. గవర్నర్ ప్రసంగం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం వివిధ రంగాల్లో సాధించిన అభివృద్ధి నమూనాను ఆవిష్కరించాలని మిగతా 2వ పేజీలో ▶

ఇద్దరు విద్యార్థుల ఘర్షణ ఒకరి మృతి

మెస్ హాల్‌లోని బెంచీపై కూర్చునే విషయమై ఇద్దరు విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు మృతి చెందారు. నిజామాబాద్ జిల్లాలో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది 5లో

ఇదండీ సంగతి



• విజయోత్సాహం



అండర్-19 క్రికెట్ ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన భారత జట్టులోని తెలంగాణకు చెందిన క్రీడాకారిణిలు జి.త్రిష, యషశ్రీ, ఫిట్నెస్ ట్రైనర్ శాలిని గురువారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో రాష్ట్ర క్రీడలు, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వారికి ఘన స్వాగతం పలికారు. క్రీడాకారిణిలను అభినందించారు.

పంటలకు 'కట్'కట

వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు

ప్రభుత్వం చెప్తున్నది 24 గంటల సరఫరా


వాస్తవంగా జరుగుతున్నది 8-10 గంటలే..



ఈ ఫొటోలోని రైతు గద్వాల జిల్లా గట్టు మండలం రాయపురానికి చెందిన కృష్ణయ్య. నాలుగెకరాల భూమి, అందులో 2 బోర్లు ఉన్నాయి. యాసంగిలో ఎకరా పొగాకు సాగు చేశాడు. 3ఎకరాల్లో వరి సాగుకు సిద్ధమైనా.. కరెంటు కోతలు మొదలవడంతో ఒక ఎకరాలోనే వరి నాటు వేశాడు. మిగతా రెండెకరాలు బీడుగానే వదిలేశాడు. ఇప్పటికీ రాత్రి, పగలు బోర్ల వద్ద పడిగాపులు కాస్తూ పొగాకు, వరికి నీరు పారించుకుంటున్నట్టు చెప్తున్నాడు.

- అదీ ఉదయం, సాయంత్రం 2 విడతలుగా సరఫరా
- జిల్లాలు, సబ్‌స్టేషన్ల వారీగా సరఫరా వేళల్లో తేడాలు
- మధ్యలో పలుమార్లు ట్రిప్.. ఆగిపోతున్న మోటార్లు
- వేసవికి ముందే విద్యుత్ కోతలపై రైతుల ఆందోళన
- భారీ నష్టాలతో ఎక్స్ఛేంజీల నుంచి కరెంట్ కొనుగోళ్లు తగ్గించిన రాష్ట్రం.. దీనితోనే సాగు విద్యుత్‌కు కత్తెర

రైతు: సర్.. నమస్తే!
ఏఈ: నమస్తే..చెప్పండి
రైతు: సర్.. త్రీఫేజ్ కరెంట్ ఏమైంది? ఇట్లా కట్ చేస్తున్నారు?
ఏఈ: (మధ్యాహ్నం) మూడింటికి త్రీఫేజ్ తీయమన్నారండి. మూడింటికి తీస్తున్నాం. ఉదయం ఎనిమిదిన్నర నుంచి మూడింటి వరకు ఇవ్వమన్నారు. ఆ తర్వాత మళ్లీ ఎప్పుడు ఇస్తారో తెల్వదు.
రైతు: ఎన్నిరోజులు సర్ ఇట్లా?
ఏఈ: తెల్వదండి మాకు. ఇన్ఫర్మేషన్ ఏం ఉండదు. పై నుంచి ఎలా వస్తే అలా ఫాలో అవుతున్నాం.
రైతు: 24 గంటలు అంటున్నారు. 10 గంటలు కూడా కరెంట్ ఇస్తలేరు. నైట్ కూడా మిగతా 5వ పేజీలో ▶





1. తేనెమనసులు సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా కె. విశ్వనాథ్
2. 'స్వాతిముత్యం' సినిమా షూటింగ్‌లో కమల్‌హాసన్‌కు సూచనలిస్తూ..
3. విశ్వనాథ్‌కు విశ్వవిఖ్యాతి తెచ్చిన శంకరాభరణంలోని ఓ సన్నివేశం

తెలుగు సినిమా 'ఆత్మగౌరవం'!

ఎంతటి నిర్ఝర గంగా ప్రవాహమైనా గంగోత్రి లాంటి ఓ పవిత్ర స్థానంలో చిన్నగా, ఓ పాయలా మొదలవుతుంది. వెండితెరపై శంకరాభరణం, సాగర సంగమం వంటి ఎన్నో కళాఖండాలను సృజించిన కళాతపస్వి కె.విశ్వనాథ్ దర్శకత్వ ప్రయాణం కూడా అలాగే ఓ చిన్న పాయలా మొదలైంది. సౌండ్ రికార్డిస్టుగా మొదలై.. దర్శకత్వ శాఖకు విస్తరించిన విశ్వనాథ్ సరిగ్గా 1965లో తొలిసారిగా 'ఆత్మగౌరవం' సినిమాతో మెగాఫోన్ పట్టుకున్నారు. నాటి నుంచి ఐదున్నర దశాబ్దాలకుపైగా వెండితెర అద్భుతాలను అందించారు. తొలితరంలో గూడవల్లి రామబ్రహ్మం, బీఎన్ రెడ్డి, కేవీ రెడ్డి, మలితరంలో ఆదుర్తి సుబ్బారావు తదితరుల తర్వాత 3వ తరంలో తెలుగు సినిమాకు 'ఆత్మగౌరవం' తెచ్చిన దర్శక కళాతపస్వి కాశీనాథుని విశ్వనాథ్.



వాహినీ స్టూడియోలో సౌండ్ రికార్డింగ్ విభాగంలో కెరీర్‌ను ప్రారంభించి బీఎన్ రెడ్డి, కేవీ రెడ్డి, ఆదుర్తి సుబ్బారావు వంటి వారి పనితీరును దగ్గరగా పరిశీలిస్తూ వచ్చిన కె.విశ్వనాథ్ స్క్రిప్టులో తోచిన సలహాలు, సూచనలు ఇస్తుండేవారు. ఈ క్రమంలో ఆదుర్తి తన సినిమాలకు స్క్రిప్ట్ అసిస్టెంట్‌గా, అసోసియేట్‌గా పనిచేసే అవకాశం ఇచ్చారు. అలా కథా విస్తరణ, స్క్రీన్ ప్లే రచనలో విశ్వనాథ్‌కు ఉన్న ప్రతిభను గుర్తించి తమ అన్నపూర్ణా పిక్చర్స్ సంస్థలో దర్శకత్వ శాఖలోకి రమ్మని హీరో అక్కినేని నాగేశ్వరరావు ప్రోత్సహించారు. మొదట తటపటాయించినా తర్వాత అన్నపూర్ణా పిక్చర్స్‌లో చేరారు. ఇలా కె.విశ్వనాథ్ సినీ జీవితం ఊహించని మలుపు తిరిగింది.

అవకాశం కోసం వేచి చూస్తూ..

స్వతహాగా సృజనశీలి అయిన విశ్వనాథ్.. ఆదుర్తి శిష్యరికంలో సానబెట్టిన వజ్రంలా మరిన్ని మెరుగులు దిద్దుకున్నారు. కథ, స్క్రీన్‌ప్లే రచన, ఆదుర్తి ప్రోత్సాహంతో సెకండ్ యూనిట్ డైరెక్షన్.. ఇలా విశ్వనాథ్ చేయనిది లేదు. నిజానికి ''అన్నపూర్ణాలో రెండు సినిమాలకు ఆదుర్తి గారి దగ్గర దర్శకత్వ శాఖలో వర్క్ చేసిన తర్వాత నాకు రెండు సినిమాలకు డైరెక్షన్ చాన్స్ ఇస్తామని మాటిచ్చారు. కానీ నాలుగు చిత్రాలకు ('వెలుగు నీడలు', 'ఇద్దరు మిత్రులు'-1961, 'చదువుకున్న అమ్మాయిలు'-63, 'డాక్టర్ చక్రవర్తి'-64)లకు వర్క్ చేశాకే ఐదో సినిమా దుక్కిపాటి మధుసూదనరావు నిర్మించిన 'ఆత్మగౌరవం'తో మెగాఫోన్ నా చేతికిచ్చారు. 'పూల రంగడు' సినిమాకూ నేనే దర్శకత్వం వహించాల్సింది. మొదట నాతో స్క్రిప్టు వర్క్ వగైరా చేయించారు. అనుకోని కారణాల వల్ల మా గురువు ఆదుర్తి గారే డైరెక్ట్ చేస్తున్నారన్నారు. ఏమైతేనేం 'ఆత్మగౌరవం'తో దర్శకుడినయ్యా'' అని కె.విశ్వనాథ్ ఒక సందర్భంలో గుర్తుచేసుకున్నారు.

'ఆత్మగౌరవం'కి డైరెక్షన్ చాన్స్ ఇచ్చే ముందు.. దుక్కిపాటి గట్టిగా పట్టుబట్టడంతో కె.విశ్వనాథ్ కాపురాన్ని హైదరాబాద్‌కు మార్చాల్సి వచ్చింది. ట్యాంక్ బండ్ దగ్గర గగన్ మహల్ కాలనీలో రెండేళ్లు చిన్న అద్దె ఇంట్లో గడిపారు.

పబ్లిక్ గార్డెన్స్ చెట్ల నీడలో..

అన్నపూర్ణా వారి అన్ని సినిమాల లానే 'ఆత్మగౌరవం' సినిమా కథ కోసం పలువురు రచయితలతో కలసి దర్శక, నిర్మాతలు మేధోమథనం జరిపారు. నాటక రచయిత గొల్లపూడి మారుతీరావు, నవలా రచయిత్రి యద్దనపూడి సులోచనారాణి, మరికొందరు కలసి హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్స్ చెట్ల నీడల్లో పచ్చిక బయళ్లలో కూర్చొని కథా చర్చలు, ఆలోచనలు చేశారు. సంగీతాభిరుచి ఉన్న విశ్వనాథ్ మద్రాసు వర్క్ బిజీకి దూరంగా రచయితలు, సంగీత దర్శకుడిని హైదరాబాద్ రప్పించి, ఇక్కడ మ్యూజిక్ సిట్టింగ్స్ జరిపారు. హైదరాబాద్ సారథీ స్టూడియోలో షూటింగ్ ముహూర్తం. తొలి షాట్ చిత్రీకరణ తమాషాగా సాగింది. సంప్రదాయ శైవ కుటుంబంలో పుట్టిన విశ్వనాథ్ ఇంట్లో అంతా పరమ దైవభక్తులు. నిర్మాత దుక్కిపాటి నాస్తికుడు. తొలిషాట్ దేవుడి పటాల మీద తీసే అవకాశం లేదు. చివరకు అద్దం సాక్షాత్తూ లక్ష్మీదేవి స్వరూపమని విశ్వనాథ్ తెలివిగా ఫస్ట్ షాట్ ఖాళీగా ఉన్న అద్దం మీద పెట్టారు. క్షణమాగి అద్దంలో ప్రతిబింబంగా అక్కినేని ఫ్రేములోకి వచ్చి, డ్రెస్ సర్దుకుంటారు. ఇలా అద్దం మీద నుంచి హీరో అక్కినేని మీదకు వచ్చేలా కెమెరామ్యాన్ సెల్వరాజ్ తో కలసి విశ్వనాథ్ వేసిన ప్లాన్ అద్భుతంగా ఫలించింది. విశ్వనాథ్ సెంటిమెంట్ నిలిచింది. నిర్మాతకూ ఇబ్బంది లేకుండా పోయింది. అద్దం మీద మొదలైన విశ్వనాథ్ దర్శకత్వ ప్రస్థానం అపూర్వంగా ముందుకు సాగింది.

ఆ పాటల పల్లవులు విశ్వనాథ్‌వే!

విశ్వనాథ్‌లో బాహ్య ప్రపంచానికి తెలియని ఓ అద్భుత సినీ గీతరచయిత ఉన్నారు. ఆదుర్తి దగ్గర సహాయకుడిగా ఉన్నరోజుల్లో గీత రచయితలతో పాటలు రాయించుకుంటున్నప్పుడు సైతం వారికి తన ఇన్‌పుట్స్‌గా పాటల పల్లవులు అందించేవారు. 'దమ్మీ లిరిక్స్.. అబద్ధపు సాహిత్యం' అంటూ ఆయన ఇచ్చిన పల్లవులే.. తలమానికమైన ఎన్నో సినీగీతాలకు కిరీటాలయ్యాయి. 'ఆత్మగౌరవం'లో 'మా రాజులొచ్చారు..', 'అందెను నేడే..' పాటల పల్లవులు అలా విశ్వనాథ్ రాసినవే. రచయితలకు ఆ పదాలకు మరింత సొబగులద్ది రచయితలు మిగతా పాటంతా అద్భుతంగా అల్లడం విశేషం. 'ఆత్మగౌరవం'నుంచి లేటెస్ట్ 'శుభప్రదం'దాకా తన సినిమాలన్నిటిలో విశ్వనాథ్ ఇలా అందించిన పల్లవులు ఎన్నెన్నో!

తొలి చిత్రంతోనే అవార్డుల వేట

కె.విశ్వనాథ్ నిర్మించిన తొలి చిత్రం 'ఆత్మ గౌరవం' 1965లో ఉత్తమ తృతీయ చిత్రంగా కాంస్య నంది అవార్డును గెల్చుకుంది. ఇదే చిత్రానికి సంబంధించి ఉత్తమ నటుడిగా అక్కినేని నాగేశ్వరరావు, ఉత్తమ కథా రచయితలుగా గొల్లపూడి, యద్దనపూడి నంది అవార్డులు అందుకున్నారు. ఇలా తొలి చిత్రంతోనే కె. విశ్వనాథ్ అవార్డు చిత్రాల దర్శకుడిగా తన అప్రతిహత ప్రయాణానికి నాంది పలికారు. ఈ అవార్డుల చిహ్నం రామప్ప గుడిలోని నంది ఏకశిలా విగ్రహం. తాను తొలిసారి దర్శకత్వం వహించిన 'ఆత్మగౌరవం' చిత్రం తమ షూటింగ్‌లో చాలా భాగం అదే రామప్ప గుడిలో జరగడం, అక్కడి ఏకశిలా విగ్రహం తాలూకు చిహ్నమైన నంది అవార్డును అందుకోవడాన్ని కె.విశ్వనాథ్ తరచూ గుర్తు చేసుకునేవారు. తొలి చిత్రం నుంచి ఇప్పటిదాకా ఓ నాలుగైదు మినహా విశ్వనాథ్ రూపొందించిన చిత్రాలన్నీ నందులో, జాతీయ అవార్డులో ఏవో ఒకటి అందుకున్నవే. కె.విశ్వనాథ్ స్వయంగా కళాప్రపూర్ణ, రఘుపతి వెంకయ్య అవార్డు, పద్మశ్రీ పురస్కారం, సినీరంగంలో ఇచ్చే అత్యున్నత దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు వంటివెన్నో అందుకున్నారు. తన దర్శకత్వ ప్రస్థానంలో తెలుగుతెరకు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో అమితమైన ఆత్మగౌరవం తెచ్చారు.

ఎన్టీఆర్, ఏఎన్నార్‌లతో సినిమాలు..

రెండో సినిమాగా తాను తీర్చిదిద్దిన హీరోలు రామ్మోహన్, కృష్ణలతోనే బయటి నిర్మాతలకు 'ప్రైవేటు మాష్టారు' (1967 సెప్టెంబర్ 14న రిలీజ్) తీశారు. అయితే అక్కినేనితో మరో చిత్రం చేయడానికి విశ్వనాథ్‌కు చాలా కాలం పట్టింది. 1989లో అక్కినేనితో రెండో చిత్రం 'సూత్రధారులు' రూపొందించారు. మొత్తంగా అప్పటి అగ్రహీరోలు ఎన్టీఆర్‌తో నాలుగు, ఏఎన్నార్‌తో రెండు సినిమాలను తీశారు. 'శంకరాభరణం' సినిమాతో శిఖరాగ్రానికి చేరుకున్నారు. తెలుగులో తొలి మహిళా కొరియోగ్రాఫర్‌గా సుమతీ కౌశల్‌కు అవకాశం ఇచ్చినది కె.విశ్వనాథే.

శ్రీశ్రీతో సాలూరి తమాషా


సౌండ్ రికార్డిస్ట్ రోజుల నుంచి సంగీత దర్శకుడు సాలూరి రాజేశ్వరరావుతో విశ్వనాథ్‌కు మంచి అనుబంధం. సాలూరి ఎంత అద్భుతమైన సంగీత దర్శకులు, గాయకులో, అంత పసి మనస్తత్వం. ఆయనలో భలే చిలిపితనం ఉండేది! అది అర్థం చేసుకోకపోతే గొడవ. ఒక్కోసారి ఆయన కావాలని ఆటపట్టించేందుకు గమ్మత్తు చేసేవారు. 'ఆత్మగౌరవం' సినిమాలో ఓ పాట కోసం శ్రీశ్రీ గారికి అన్నీ లఘువులతో (హ్రస్వాక్షరాలు వచ్చేలా) ఓ క్లిష్టమైన బాణీ ఇచ్చారు. శ్రీశ్రీ కూడా విషయం గ్రహించి, చిరునవ్వుతో దాన్ని ఓ సవాలుగా తీసుకొని, 'వలపు విరిసిన పూవులే...'అంటూ పాట రాసిచ్చారు. ఇదే సినిమా కోసం సి. నారాయణరెడ్డి రాసిన 'మా రాజులొచ్చారు...'పాట అంటే కె.విశ్వనాథ్‌కు చాలా ఇష్టమని చెప్పేవారు. దాశరథి రాసిన 'అందెను నేడే అందని జాబిల్లి..', డ్యూయట్ 'ఒక పూలబాణం..', ఆరుద్ర రచన 'రానని రాలేనని..' పాటలు ఇప్పటికీ పాపులరే.



గురువు ఆదుర్తి సుబ్బారావుతో...



దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు తీసుకుంటూ..



స్వయంకృషి చిత్రీకరణ సమయంలో నిర్మాత ఏడిద నాగేశ్వరరావు, చిరంజీవితో..

సినీ రంగానికి తీరని లోటు

కళాతపస్వి విశ్వనాథ్ మృతిపై ఏపీ సీఎం వైఎస్ జగన్ దిగ్భ్రాంతి



సాక్షి, అమరావతి: ప్రముఖ సినీ దర్శకుడు, కళాతపస్వి కె.విశ్వనాథ్ మహాభినిష్క్రమణం తెలుగు సినీ రంగానికి తీరని లోటు అని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలుగు సినీ దర్శకుల్లో విశ్వనాథ్ అగ్రగణ్యుడని కొనియాడారు. తెలుగు సంస్కృతికి, భారతీయ కళలకు తన సినిమాల ద్వారా గొప్ప గుర్తింపు తీసుకొచ్చారన్నారు. ఆయన దర్శకత్వంలో వచ్చిన సినిమాలు సినీ సాహిత్యానికి, సంప్రదాయ సంగీతానికి, కళలకు.. ముఖ్యంగా తెలుగు చలన చిత్ర రంగానికి ఎనలేని ప్రతిష్టను తెచ్చాయని చెప్పారు. సామాజిక అంశాలను ఇతివృత్తంగా తీసుకుని విశ్వనాథ్ చేసిన సినిమాలు గొప్ప మార్పునకు దారితీశాయన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ పేరుపై రాష్ట్ర ప్రభుత్వం లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డును విశ్వనాథ్‌కి ఇచ్చిన అంశాన్ని సీఎం జగన్ గుర్తు చేసుకున్నారు. విశ్వనాథ్ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ మేరకు గురువారం రాత్రి సీఎం కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.

వినువీధికి విశ్వనాథుడు

▶ మొదటి పేజీ తరువాయి

ఇక సెలవంటూ వెళ్లిపోయారు. రాత్రి 12 గంటల ప్రాంతంలో విశ్వనాథ్ భౌతికకాయాన్ని అపోలో ఆస్పత్రి నుంచి ఆయన స్వగృహానికి తరలించారు. గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా పెద్దపులివర్రు గ్రామంలో జన్మించిన విశ్వనాథ్ ఫిలింనగర్‌లో నివాసం ఉంటున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయనకు విశ్వవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టిన శంకరాభరణం సినిమా విడుదల రోజైన ఫిబ్రవరి 2వ తేదీనే కె.విశ్వనాథ్ కన్ను మూయడం విశేషం. 1930 ఫిబ్రవరి 19న జన్మించిన విశ్వనాథ్.. 50కి పైగా సినిమాలకు దర్శకత్వం వహించారు. మొదటిసారిగా 1965లో ఆత్మ గౌరవం సినిమాకు దర్శకత్వం వహించారు. చివరిసారిగా శుభప్రదం సినిమాకు దర్శకత్వం వహించారు. 1992లో పద్మశ్రీ, 2016లో దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు పొందారు. ఆయన మరణంతో తెలుగు చిత్ర పరిశ్రమ తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యింది. పలువురు సినీ రాజకీయ ప్రముఖులు ఆయన మరణం పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

వాహినీ పిక్చర్స్ జీఎంగా మొదలుపెట్టి..

కాశీనాథుని సుబ్రమణ్యం, సరస్వతమ్మ దంపతులకు కె. విశ్వనాథ్ జన్మించారు. ప్రాథమిక విద్య గుంటూరు జిల్లాలోనే సాగినా ఆ తర్వాత ఆయన కుటుంబం విజయవాడకు మకాం మార్చింది. అయితే కాలేజీ చదువు మాత్రం గుంటూరులో సాగింది. బీఎన్ రెడ్డి, నాగిరెడ్డి ఆరంభించిన వాహినీ పిక్చర్స్‌లో విజయవాడ బ్రాంచ్‌కి జనరల్ మేనేజర్‌గా పనిచేశారు. బీఎస్సీ పూర్తి చేశాక చెన్నై వాహినీ స్టూడియోలో సౌండ్ రికార్డిస్ట్‌గా కెరీర్ ఆరంభించారు. అన్నపూర్ణ పిక్చర్స్ సంస్థ నిర్మించిన 'తోడికోడళ్ళు' సినిమాకు పనిచేస్తున్నప్పుడు ప్రముఖ దర్శకుడు ఆదుర్తి సుబ్బారావుతో పరిచయం ఏర్పడింది. ఆయన వద్ద సహాయకుడిగా చేరారు. ఆదుర్తి దర్శకత్వంలో 'ఇద్దరు మిత్రులు', 'డాక్టర్ చక్రవర్తి' వంటి చిత్రాలకు సహాయ దర్శకుడిగా చేశారు. కె. విశ్వనాథ్ ప్రతిభను గుర్తించిన అక్కినేని నాగేశ్వరరావు తన సంస్థ నిర్మించిన 'ఆత్మ గౌరవం' (1965) సినిమాతో దర్శకుడిగా పరిచయం చేశారు. 'సిరిసిరి మువ్వ' సినిమాతో కె. విశ్వనాథ్ ప్రతిభ వెలుగులోకి వచ్చింది. అప్పటినుంచి చివరి సినిమా 'శుభప్రదం' (2016) వరకూ విశ్వనాథ్ 50కి పైగా చిత్రాలకు దర్శకత్వం వహించారు. సాగరసంగమం, శ్రుతిలయలు, సిరివెన్నెల, స్వర్ణకమలం, స్వాతికిరణం, స్వయంకృషి తదితర అద్భుత చిత్రాలను తెరకెక్కించారు. విశ్వనాథ్ చిత్రాలన్నీ సంగీత ప్రాధాన్యంగా సాగడం ఓ విశేషం. నటుడిగానూ వెండితెరపై తనదైన ముద్రవేశారు. శుభసంకల్పం, నరసింహ నాయుడు, కలిసుందాం రా, ఆడవారి మాటలకు అర్థాలే వేరులే, ఠాగూర్, అతడు, మిస్టర్ పర్‌ఫెక్ట్ తదితర చిత్రాల్లో నటించారు. దర్శకుడిగా ఏ సినిమా తీసినా అది ఆరంభించి, ముగించేవరకూ షూటింగ్‌కి ఖాకీ బట్టలు ధరించడం విశ్వనాథ్ అలవాటు. తనను తాను కార్మికుడిలా భావిస్తానని, అందుకే ఖాకీ తొడుక్కుంటానని పలు సందర్భాల్లో విశ్వనాథ్ పేర్కొన్నారు. తాను దర్శకత్వం వహించిన కొన్ని తెలుగు చిత్రాలను హిందీలో రీమేక్ చేశారు. వాటిలో సరగమ్ (సిరిసిరిమువ్వ), సుర్ సంగమ్ (శంకరాభరణం), కామ్‌చోర్ (శుభోదయం), శుభ్‌కామ్నా (శుభలేఖ), సమ్‌జోగ్ (జీవన జ్యోతి) ఉన్నాయి.



కళాతపస్వి పార్థివదేహం

గవర్నర్ సూచనలకు సర్కారు ఓకే!

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అయితే ఇటీవల కేరళ, తమిళనాడు శాసనసభల్లో ఆయా రాష్ట్రాల గవర్నర్లు చేసిన ప్రసంగాలు వివాదాస్పదం కావడంతో శుక్రవారం తమిళిసై ప్రసంగం ఎలా ఉంటుందోనన్న ఆసక్తి నెలకొంది.

కేంద్రం తీరును ఎండగట్టేలా..

ఎన్నికల ఏడాది కావడంతో అసెంబ్లీ వేదికగా ప్రభుత్వ విధానాలు, పాలన తీరును ఎండగట్టేందుకు విపక్ష కాంగ్రెస్, బీజేపీ అస్త్ర శస్త్రాలు సిద్ధం చేసుకుంటుండగా, విపక్షాలను ధీటుగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం కూడా సన్నద్ధమవుతోంది. రాష్ట్రాన్ని ఆర్థికంగా దిగ్బంధిస్తూ కేంద్రం అనుసరిస్తున్న విధానాలను ఎండగట్టేందుకు గత ఏడాది డిసెంబర్‌లోనే ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. అయితే డిసెంబర్‌లో సమావేశాలు వీలు కాలేదు. దీంతో ప్రస్తుత సమావేశాలను సద్వినియోగం చేసుకోవాలని, కేంద్రంవైఖరిని ఎండగట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. 3 రోజుల క్రితం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లోనూ రాష్ట్రానికి రిక్తహస్తం చూపడంపై ఇప్పటికే మంత్రి హరీశ్ సహా బీఆర్‌ఎస్ వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. అయితే బడ్జెట్ సమావేశాల్లో భాగంగా గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం, బడ్జె ట్‌పై చర్చకు సమాధానం, ఇతర పద్దులపై చర్చ సందర్భంగా కేంద్ర విధానాలను కేసీఆర్ ఎండగడతారని బీఆర్‌ఎస్ శాసనసభా పక్షం వర్గాలు వెల్లడించాయి.

ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేలా..: మరోవైపు రాష్ట్ర ప్రభుత్వ పాలన వైఫల్యాలు ముఖ్యంగా.. డబుల్ బెడ్ రూం ఇళ్లు, 24 గంటల విద్యుత్, రుణ మాఫీ వంటి అంశాలను ఎత్తి చూప డం ద్వారా ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేలా విప క్షాలు వ్యూహరచన చేస్తున్నాయి. గత ఏడాది సెప్టెంబర్‌లో జరిగిన అసెంబ్లీ సమావేశాలు స్వల్ప వ్యవధిలో ముగిసినందున ప్రస్తుత బడ్జెట్ సమావేశాలను ఎక్కువ రోజులు కొనసాగించాలని కాంగ్రెస్, బీజేపీ కోరే అవకాశముంది. గత రెండు అసెంబ్లీ సమావేశాల్లోనూ బీజేపీ సభ్యులపై బహిష్కరణ వేటు పడిన నేపథ్యంలో, ప్రస్తుత సమావేశాల్లో ఆ పార్టీ అనుసరించే వ్యూహంపై ఆసక్తి నెలకొంది.

భారీ సభల నేపథ్యంలోనే..: ఈ నెల 11న కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, 13న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటనకు వస్తున్నారు. అమిత్‌షా ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో జరిగే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటారని సమాచారం. కాగా 13న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు మోదీ ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేస్తారు. అనంతరం సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో బీజేపీ నిర్వహించే భారీ బహిరంగ సభలో మోదీ పాల్గొంటారు. మరోవైపు ఈ నెల 17న సీఎం కేసీఆర్ పుట్టిన రోజు పురస్కరించుకుని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరిట నామకరణం చేసిన కొత్త సచివాలయ భవనాన్ని ప్రారంభించేందుకు శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా 17న పరేడ్ మైదానంలో జరిగే బహిరంగ సభలో కేసీఆర్‌తో పాటు తమిళనాడు సీఎం స్టాలిన్, జార్ఖండ్ సీఎం హేమంత్ సొరేన్, బిహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్‌తో పాటు పలువురు ముఖ్య నేతలు పాల్గొననున్నారు. సభలకు పోలీసు బందోబస్తు ఏర్పాట్లు, ఇతర అంశాలను దృష్టిలో పెట్టుకుంటే.. సమావేశాలు ఈ నెల 14లోగానే ముగిసే అవకాశముందని అంటున్నారు. ఈ నెల 5న మహారాష్ట్రలోని నాందేడ్‌లో బీఆర్‌ఎస్ చేరికల సభ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దీనికి ముందు ఉదయం 10.30 గంటలకు రాష్ట్ర మంత్రివర్గం సమావేశమై బడ్జెట్‌కు ఆమోదం తెలపనుంది. కేబినెట్ భేటీ తర్వాత సీఎం కేసీఆర్ నాందేడ్ వెళతారు.

14 వరకు సమావేశాలు!

శుక్రవారం మధ్యాహ్నం శాసనసభ స్పీకర్, శాసన మండలి చైర్మన్ చాంబర్లలో వేర్వేరుగా బిజినెస్ అడ్వైజరీ కమిటీలు (బీఏసీలు) సమావేశమవుతాయి. ఇందులోనే అసెంబ్లీ ఎప్పటి నుంచి ఎప్పటివరకు కొనసాగుతుంది? ఎజెండా ఏమిటనేది ఖరారవుతుంది. శుక్రవారం గవర్నర్ ప్రసంగం తర్వాత వాయిదా పడే సభ శనివారం ఉదయం 10.30కు తిరిగి ప్రారంభం అవుతుంది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని చర్చించి ఆమోదించిన తర్వాత ఆదివారం సమావేశానికి విరామంగా ప్రకటిస్తారు. ఈ నెల 6న ఉదయం శాసనసభలో ఆర్థిక మంత్రి హరీశ్, మండలిలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. ఈ నెల 14 వరకు సమావేశాలు కొనసాగే అవకాశమున్నట్లు బీఆర్‌ఎస్ శాసనసభా పక్షం వర్గాలు అంచనా వేస్తున్నాయి.

బీఆర్‌ఎస్, ఆప్ బంధానికి 'లిక్కర్' లింకు



సాక్షి, న్యూఢిల్లీ : బీఆర్‌ఎస్, ఆప్‌ల మధ్య బంధానికి ఢిల్లీ మద్యం కుంభకోణం పునాదని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ ఆరోపించారు. ఆయన ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో గురువారం విలేకరులతో మాట్లాడుతూ చట్టానికి ఎవరూ అతీతులు కారని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ మహిళలకు రాజ్యాంగ పదవుల్లో ప్రధాన స్థానం కల్పిస్తుంటే.. తెలంగాణ సీఎం కేసీఆర్‌తో పాటు ఆయన పార్టీ ఎంపీలు అగౌరవపరుస్తున్నారని మండిపడ్డారు. రాజకీయాలతో నిమిత్తం లేకుండా ప్రధాని తెలంగాణకు నిధులు ఇస్తున్నారని వివరించారు. చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యం పెంచేందుకు హైదరాబాద్‌లో మిల్లెట్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారని లక్ష్మణ్ పేర్కొన్నారు.

3.18 గ్రేడ్‌తో నిజామాబాద్ ప్రభుత్వ మహిళా ఐటీఐ టాప్

మిగతా ప్రభుత్వ ఐటీఐలన్నీ 2.5 గ్రేడ్‌లోపే.. 88 ప్రైవేట్ ఐటీఐలకు 1 కంటే తక్కువ గ్రేడ్‌లు



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలోని మొత్తం 295 ఐటీఐల్లో నిజామాబాద్ ప్రభుత్వ మహిళా ఐటీఐ 3.18 గ్రేడ్‌తో అగ్రస్థానంలో నిలిచిందని నీతి ఆయోగ్ తెలిపింది. ఈ ఒక్క ఐటీఐ మినహా రాష్ట్రంలోని ప్రభుత్వ ఐటీఐలు అన్నీ 2.5 కంటే తక్కువ గ్రేడ్‌లు పొందాయి. 196 ప్రైవేట్ ఐటీఐలలో 2 మాత్రమే 2.5 కంటే ఎక్కువ గ్రేడ్‌లు, 88 ప్రైవేట్ ఐటీఐలు 1 కంటే తక్కువ గ్రేడ్‌లు పొందాయి. 'ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్స్– స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంప్లాయిమెంట్ వర్టికల్'పేరుతో నీతిఆయోగ్ సిద్ధం చేసిన నివేదికలో రాష్ట్రాల్లోని ఐటీఐలకు సంబంధించిన అంశాలను పొందుపరిచారు. తెలంగాణలోని ఇతర జిల్లాల కంటే హైదరాబాద్‌లోనే అత్యధిక ఐటీఐలు ఉన్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వ ఐటీఐల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ, ప్రభుత్వ ఐటీఐలతో పోలిస్తే ప్రైవేట్ ఐటీఐలలో అందించే ట్రేడ్‌ల సంఖ్య చాలా తక్కువగా ఉంది. 2022 సంవత్సరంలో రాష్ట్రంలోని 295 ఐటీఐల్లో 66 ప్రభుత్వ ఆధ్వర్యంలో, 77% ప్రైవేట్ నిర్వహణలో ఉన్నాయి. మహిళా ఐటీఐలను ప్రభుత్వమే నిర్వహిస్తోంది. 2020 సంవత్సరంలో 3,976 మంది ట్రైనీలు సర్టిఫికెట్లు అందుకున్నారు. కాగా, 2021 సంవత్సరంలో మొత్తం 54,340 సీట్లలో 50% మాత్రమే భర్తీ కావడంతో ఐటీఐలు పూర్తి సామర్థ్యంతో పనిచేయట్లేదు.

పార్లమెంట్‌లో తెలంగాణ

రాష్ట్రంలో కొత్తగా 3 ఎయిర్‌పోర్టులే సాధ్యం: వీకే సింగ్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో మూడు ప్రాంతాలను మాత్రమే కొత్తగా విమానాశ్రయాల నిర్మాణానికి సాంకేతికంగా అనువైన ప్రదేశాలుగా గుర్తించినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఆరు విమానాశ్రయాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రతిపాదనలపై ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) చేసిన అధ్యయ నం ప్రకారం ఈమేరకు కేంద్రం వెల్లడించింది. వరంగల్ (బ్రౌన్‌ఫీల్డ్), ఆదిలాబాద్ (బ్రౌన్‌ఫీల్డ్), జక్రాన్‌పల్లి (గ్రీన్‌ఫీల్డ్) ప్రాంతాలు మాత్రమే సాంకేతికంగా సాధ్యమయ్యేవని ఏఏఐ నివేదికలో పేర్కొంది. అయితే తక్షణ భూసేకరణ అవసరాన్ని నివారించడానికి చిన్న విమానాల ప్రైవేట్ కార్యకలాపాల కోసం ఈ మూడు ప్రాంతాల్లో సాధ్యమయ్యే స్థలాలను అభివృద్ధి చేసి, ప్రారంభించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఏఏఐ కోరిందని పౌర విమానయాన శాఖ సహాయమంత్రి వీకే సింగ్ తెలిపారు. బీఆర్‌ఎస్ ఎంపీలు మాలోత్ కవిత, వెంకటేశ్ నేత, రంజిత్‌రెడ్డి అడిగిన ప్రశ్నలకు కేంద్రమంత్రి సమాధానం ఇచ్చారు.

హైదరాబాద్‌లో ఏవియేషన్ వర్సిటీకి నో

హైదరాబాద్‌లో రాజీవ్‌గాంధీ జాతీయ ఏవియేషన్ వర్సిటీ క్యాంపస్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదన తెలంగాణ ప్రభుత్వం నుంచి 2018లో వచ్చిందని కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి వీకే సింగ్ తెలిపారు. అయితే ఈ ప్రతిపాదనను ఆర్‌జీఎన్‌ఏయూ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఆమోదించలేదని వెల్లడించారు. ఎంపీ రంజిత్‌రెడ్డి ప్రశ్నకు కేంద్రమంత్రి ఈమేరకు బదులిచ్చారు.

50% నిధులు జమచేస్తేనే ఆర్ఆర్ఆర్ ప్రారంభం: గడ్కరీ

సాక్షి, న్యూఢిల్లీ: ఇప్పటికే హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టు ఉత్తరభాగం అలైన్‌మెంట్, భూసేకరణ ప్లాన్ ఆమోదం పూర్తయిందని కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. 3 డీ నోటిఫికేషన్‌ను చేపట్టేందుకు వీలుగా భూసేకరణ ఖర్చులో 50% వాటాను డిపాజిట్ చేసేందుకు అవసరమైన ప్రతిపాదన, సరైన యంత్రాంగాన్ని రూపొందించాలన్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. భూసేకరణ వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్న 50% వాటాను జమ చేయడంపై ప్రతిస్పందనను బట్టి ప్రాజెక్ట్ చేపట్టే సమయం ఆధారపడి ఉంటుందని లోక్‌సభలో బీఆర్‌ఎస్ ఎంపీ నామా నాగేశ్వరరావు అడిగిన ప్రశ్నలకు కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

జాతీయ రహదారులకు రూ.5,534 కోట్లు

గత ఐదేళ్లలో తెలంగాణలోని జాతీయ రహదారుల అభివృద్ధికి రూ.5,534 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌లో రూ.9,215 కోట్లు ఖర్చు చేసినట్లు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. లోక్‌సభలో బీఆర్‌ఎస్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అడిగిన ప్రశ్నలకు కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

క్లుప్తంగా...

మళ్లీ టెట్ నిర్వహించండి

సాక్షి, హైదరాబాద్: టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) పరీక్షను మళ్లీ నిర్వహించి తమకూ గురుకుల, డీఎస్సీ, టీఆర్టీ పరీక్ష రాసే అవకాశం కల్పించాలని టెట్ అభ్యర్థులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తాము బీఈడీ, డీఈడీ రెండో సంవత్సరం కోర్సు పూర్తి చేశామని, గతంలో నిర్వహించిన టెట్‌కు హాజరు కాలేకపోవడంతో పాటు దాదాపు నాలుగు లక్షలమంది దాకా అర్హత సాధించలేక పోయామని పేర్కొన్నారు. గురుకుల, డీఎస్సీ నిర్వహించే ముందు మరోసారి టెట్ నిర్వహిస్తే తమకు న్యాయం జరుగుతుందని కోరారు. ఈ మేరకు గురువారం ఇతర ఎమ్మెల్యేలతో పాటు బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఈటల రాజేందర్, ఎం.రఘునందన్‌రావులకు వినతిపత్రాలు సమర్పించారు.

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు హాల్ టికెట్లు సిద్ధం

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 11 నుంచి 14 వరకూ జరగనున్న టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల హాల్ టికెట్లు ఆన్‌లైన్లో అందుబాటులో ఉన్నాయని స్కూల్ ఎడ్యుకేషన్ పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. www.bse.telanga-na.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా హాల్ టికెట్లు పొందవచ్చని పేర్కొన్నారు. ఏదైనా సమాచారం కోసం జిల్లా విద్యాశాఖాధికారులను సంప్రదించాలని సూచించారు.

అనాథల కోసం ప్రత్యేక చట్టం

సీఎం కేసీఆర్‌కు మందకృష్ణ లేఖ

సాక్షి, హైదరాబాద్/బౌద్ధనగర్: రాష్ట్రంలోని అనాథ పిల్లల సంక్షేమం కోసం ప్రత్యేకచట్టాన్ని తీసుకురావాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. అనాథలను ప్రభుత్వబిడ్డలుగా గుర్తించాలని, కేజీ టు పీజీ వరకు ఇంటిగ్రేటెడ్ క్యాంపస్ ఏర్పాటు చేయాలని, కుల, ఆదాయ ధ్రువీకరణపత్రాలతోపాటు ఎలాంటి ధ్రువీకరణపత్రాలు అవసరం లేకుండా స్మార్ట్‌కార్డులు జారీచేయాలన్నారు. అనాథలకు ప్రత్యేక రిజర్వేషన్లు అమలుచేయాలని, పిల్లల అక్రమ రవాణా, బిక్షాటనను తీవ్రంగా పరిగణించి పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేసేందుకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని, అనాథల శరణాలయాలను ప్రభుత్వ పరిధిలోకి తీసుకురావాలని సూచించారు.

పదోన్నతుల్లో మాకు న్యాయం చేయండి

మంత్రులకు 2009 బ్యాచ్ ఎస్‌ఐల వినతి

సాక్షి, హైదరాబాద్: సర్కిల్ ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతుల కల్పనలో తమకు న్యాయం చేయాలని 2009 బ్యాచ్‌కు చెందిన ఎస్‌ఐలు గురువారం పలువురు మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. వారు మంత్రులు జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సబితాఇంద్రారెడ్డి, ప్రభుత్వ విప్ గొంగిడి సునీతలను కలిశారు. తమ బ్యాచ్‌కు చెందిన మొత్తం 450 మంది ఎస్‌ఐల్లో ఇప్పటికే 200 మంది వరకు సీఐలుగా పదోన్నతులు పొందినట్టు వివరించారు. గతంలో సీఐ పోస్టులు సరిపడా లేనందున ఒకసారి, మల్టీ జోన్ల విభజన కారణంగా మరోసారి ఇలా అనేక మార్లు తమకు పదోన్నతుల కల్పనలో అన్యాయం జరిగిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వరంగల్ జోన్‌లోని 2012 బ్యాచ్‌కు చెందిన ఎస్‌ఐలు సైతం సీఐలుగా పదోన్నతి పొందారని వారు గుర్తు చేశారు.

కేంద్రం ఉపాధి కూలీల పొట్టకొడుతోంది

మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిదినాలు పెంచకుండా, నిధులివ్వకుండా కూలీల పొట్టకొడుతోందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మండిపడ్డారు. ఈ పథకానికి మోదీ సర్కార్ ఏటా నిధుల్లో కోత పెడుతూ నిర్వీర్యం చేస్తున్నందున పేదల ఉసురు తగులుతుందన్నారు. ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించి 17 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం ఆయన ఈజీఎస్ ఉద్యోగులతో కలసి కేక్‌కట్ చేశారు. ఉపాధి హామీ ఉద్యోగులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పథకం కింద సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రజోపయోగ పనులు చేసిందని, అందుకు కేంద్రం కూడా కొనియాడిందని మంత్రి చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉద్యోగుల క్యాలెండర్ 2023ను మంత్రి ఎర్రబెల్లి ఆవిష్కరించారు. కూలీలకు ఉపాధి కల్పించేందుకు పనిదినాలు పెంచాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు.


జూలై 1న గ్రూప్‌-4 పరీక్షలు

▶ మొదటి పేజీ తరువాయి

ఒక్కో పోస్టుకు 110 మంది వరకు దరఖాస్తు చేసుకున్నారు.

రెండు పేపర్లు.. 300 మార్కులు..: గ్రూప్‌-4 పోస్టుల భర్తీకి రెండు పరీక్షలు ఉంటాయి. ఇందులో జూలై 1న ఉదయం జనరల్ స్టడీస్ పరీక్ష, మధ్యాహ్నం సెక్రటేరియల్ ఎబిలిటీ పరీక్షను నిర్వహించనున్నారు. ఒక్కో పరీక్షకు రెండున్నర గంటలు సమయం ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు చొప్పున ప్రతి పేపర్‌కు 150 మార్కులు.. రెండు పరీక్షలు కలిపి మొత్తం 300 మార్కులు ఉంటాయి. పరీక్షలకు సంబంధించిన సిలబస్ వివరాలను టీఎస్‌పీఎస్సీ తమ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది.

యాప్.. ఏజ్ గ్యాప్!



భారత్‌లో వయసుల వారీగా మారుతున్న యాప్‌ల ప్రాధాన్యతలు

24 ఏళ్లలోపు యువతరం ఇన్‌స్టా, ట్రూకాలర్, ఫ్లిప్‌కార్ట్, ఎంఎక్స్ ప్లేయర్, టెలిగ్రామ్‌ల వినియోగం

25 ఏళ్లుపైన వారు వాట్సాప్, ఫేస్‌బుక్, ఫోన్‌పే, అమెజాన్, ఫేస్‌బుక్ మెసెంజర్ల వైపు మొగ్గు

మహిళలు, పురుషులు ఉపయోగించే యాప్‌లూ వేరే..

ఫోన్ వాడే సమయంలో 88శాతం యాప్‌లలోనే గడుపుతున్న తీరు

సాక్షి, హైదరాబాద్: కొందరికి బిర్యానీ ఇష్టం.. ఇంకొందరికి వంకాయ అంటే మధురం.. మరికొందరికి పప్పన్నమే అమృతం.. ఇలా ఇష్టాలు మరెన్నో.. అదీ దేశాలు, రాష్ట్రాలు, జిల్లాలు, గ్రామాల వారీగా భిన్నంగా ఉంటుంది. అందుకే 'లోకో భిన్న రుచి' అన్న సామెత పుట్టింది. మరి ఒక్క భోజనం విషయంలోనేనా.. అన్ని వ్యవహారాలకూ ఈ నానుడి వర్తిస్తుంది. ఇది తేల్చేందుకే ప్రపంచవ్యాప్తంగా స్మార్ట్ ఫోన్లు, యాప్‌ల వినియోగంపై వివిధ అధ్యయనాలు జరిగాయి. అన్ని అధ్యయనాలూ కొంచెం అటూ ఇటూగా ఒకే తరహా ఫలితాలను ఇవ్వడం గమనార్హం. అన్నీ కూడా లోకా 'మొబైల్ యాప్స్' భిన్న రుచీ అన్నట్టుగా నివేదికలు ఇచ్చేశాయి మరి..

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 630 కోట్ల మందికిపైగా స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు ఉన్నట్టు అంచనా. దీనికి తగ్గట్టుగానే మొబైల్ అప్లికేషన్స్ (యాప్స్) భారీగా పెరుగుతున్నాయి. ఇదే సమయంలో ఫోన్లు, యాప్‌ల వినియోగం బాగా ఎక్కువైంది. ఆఫీసులో, ఇంట్లో, వీధిలో, బెడ్‌పై ఉన్నా, భోజనం చేస్తున్నా, వాహనాల్లో ఉన్నా ఫోన్లను ఉపయోగించడం పెరిగిపోయింది. అయితే ఇందులో ఫోన్ మాట్లాడటానికి వినియోగించే సమయం తక్కువేనని.. 88శాతం సమయాన్ని యాప్స్‌లోనే గడుపుతున్నారని అధ్యయనాల్లో వెల్లడైంది. ఇక తరచూ ఫోన్ చెక్ చేసుకోవడం కూడా బాగా పెరిగిపోయినట్టు తేలింది. ఉదాహరణకు అమెరికన్లు సగటున రోజూ 262 సార్లు అంటే ప్రతి ఐదున్నర నిమిషాలకోసారి తమ ఫోన్‌ను చెక్ చేసుకుంటున్నట్టు వెల్లడైంది.

వివిధ అధ్యయనాలు, పరిశీలనల్లో తేలినది ఇదీ..

- 24 ఏళ్లలోపు యువతరంలో 21శాతం రోజుకు యాభైకంటే ఎక్కువసార్లు ఒక యాప్‌ను ఓపెన్ చేస్తున్నారు.
- 49 శాతం వినియోగదారులు రోజుకు 11 సార్లు యాప్‌లను తెరుస్తున్నారు.
- సగటు స్మార్ట్‌ఫోన్‌యూజర్ రోజుకు 10 యాప్‌లను.. నెలకు 30 యాప్‌లను ఉపయోగిస్తున్నారు.
- యాపిల్ యాప్ స్టోర్‌లో 1.96 మిలియన్ల యాప్‌లు, గూగుల్ ప్లేస్టోర్‌లో 2.87 మిలియన్ల యాప్‌లు ఉన్నాయి.



- గతేడాది మొత్తంగా 219 బిలియన్ల యాప్‌లను స్మార్ట్ ఫోన్ యూజర్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు.
- ప్రపంచవ్యాప్తంగా అధిక శాతం యాప్ డౌన్‌లోడ్లు ఉచితంగానే జరుగుతున్నాయి.
- సగటున ఒక్కో వ్యక్తి తమ ఫోన్‌లో 80 దాకా యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకుంటున్నారు. వీటిలో 62 శాతం యాప్‌లను నెలలో ఒకసారి కూడా ఉపయోగించడం లేదు
- 2023లో మొబైల్ యాప్స్ ద్వారా 935 బిలియన్ డాలర్ల రెవెన్యూ జనరేట్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

భారత్ విషయానికొస్తే..

ప్రపంచవ్యాప్తంగా ఉన్న ట్రెండ్లకు భిన్నంగా మనదేశంలో వయసు వారీగా యాప్‌ల వినియోగంలో ప్రాధాన్యతలు వేరుగా ఉన్నట్టు అధ్యయనాల్లో తేలింది. ముఖ్యంగా 18- 24 ఏళ్ల మధ్యవారు తమ మొబైల్స్‌లో గడిపే సమయం, వినియోగించే యాప్‌లకు.. 25ఏళ్లు, ఆపైనవారి అభిరుచులు, ప్రాధాన్యతలకు భిన్నంగా ఉన్నట్టు వెల్లడైంది.

- 24 ఏళ్లలోపు యువతరం ఇన్‌స్టా, ట్రూకాలర్, ఫ్లిప్‌కార్ట్, ఎంఎక్స్ ప్లేయర్, టెలిగ్రామ్‌లను అధికంగా వినియోగిస్తున్నారు.
- 25 ఏళ్లు, ఆపై వయసు వారు వాట్సాప్, ఫేస్‌బుక్, ఫోన్‌పే, అమెజాన్, ఫేస్‌బుక్ మెసెంజర్ల వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు.
- మహిళలు ఉపయోగించే టాప్‌–5 యాప్‌లలో వాట్సాప్, స్నాప్ చాట్, మీషో, షేర్‌చాట్, మోజో ఉన్నాయి.
- పురుషులు ఎక్కువగా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్రూకాలర్, ఫోన్‌పే, అమెజాన్‌లను వినియోగిస్తున్నారు.

దేశంలో అభివృద్ధి కన్నా రాజకీయాలపైనే దృష్టి..

▶ మొదటి పేజీ తరువాయి

అభివృద్ధిపై దృష్టిసారిస్తే నంబర్ వన్‌గా ఎదుగుతామన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఇన్నొవేషన్ (ఆవిష్కరణ), ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (మౌలిక వసతులు), ఇన్‌క్లూజివ్ గ్రోత్ (సమ్మిళిత అభివృద్ధి) అనే మూడు 'ఐ'లపై దృష్టి సారించిందని చెప్పారు. దేశ జనాభాలో కేవలం 2.5 శాతమే ఉన్న తెలంగాణ.. దేశ జీడీపీకి 5 శాతం సమకూరుస్తోందన్నారు. దేశానికి నాయకత్వం వహిస్తున్న వారు కేవలం ఎన్నికల కోసమే పనిచేస్తున్న పరిస్థితి ఉందని పరోక్షంగా ప్రధాని మోదీనుద్దేశించి విమర్శించారు. తెలంగాణలో అతిపెద్ద లైఫ్‌సైన్స్ యూనివర్సిటీ, ఏవియేషన్ యూనివర్సిటీలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో ఎన్‌హెచ్‌ఆర్‌డీ 'డీకోడ్ ది ఫ్యూచర్' అనే అంశంలో భాగంగా '5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ– తెలంగాణ తోడ్పాటు'పై గురువారం నిర్వహించిన జాతీయస్థాయి సదస్సుకు కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

యువత ఎదురుచూస్తోంది..: మన దేశంలో మానవ వనరులు పుష్కలంగా ఉన్నాయని, మొత్తం జనాభాలో 60 శాతం మంది యువతేనని కేటీఆర్ చెప్పారు. దేశంలో యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తోందని, ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలని ఆలోచన చేయకపోవడం బాధాకరమని అన్నారు. హైదరాబాద్ కన్నా విస్తీర్ణంలో చిన్నగా ఉండే సింగపూర్ అభివృద్ధిలో మాత్రం వేగంగా ముందుకెళ్తున్నదని చెప్పారు. గత ఎనిమిదేళ్లుగా అభివృద్ధిలో దూసుకుపోతున్న తెలంగాణ.. దేశ ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు. అమెజాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి ప్రపంచ ప్రఖ్యాతిచెందిన సంస్థలు తమ రెండో అతిపెద్ద క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడం శుభపరిణామమని చెప్పారు. ఎనిమిదేళ్లలో 47 బిలియన్ డాలర్ల మేరకు పెట్టుబడులు ఆకర్షించినట్లు తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అయిన కాళేశ్వరంను నాలుగేళ్లలోనే పూర్తిచేశామన్నారు. భారత్ ఫైనాన్షియల్ ఇంక్లూజన్ లిమిటెడ్ సీఈవో శ్రీనివాస్ ఉడుముల పాల్గొన్నారు.

రాష్ట్రంలో గుణాత్మక అభివృద్ధి

జాతీయ డిఫెన్స్ కళాశాల బృందంతో సీఎస్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ చిన్న రాష్ట్రమైనప్పటికీ, వివిధ రంగాల్లో గుణాత్మక అభివృద్ధి సాధించిందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎ.శాంతి కుమారి అన్నారు. వేసవిలో కూడా పరిశ్రమలకు, వ్యవసాయానికి 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరాతో అద్వితీయమైన పురోగతి, వ్యవసాయ దిగుబడుల్లో గణనీయమైన వృద్ధి సాధించామని చెప్పారు. జాతీయ రక్షణ కళాశాల(ఎన్‌డీసీ) ప్రతినిధి బృందంతో గురువారం బీఆర్‌కేఆర్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కొత్తజిల్లాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఏర్పాటు, మిషన్ భగీరథ, హరితహారంతో సాధించిన పురోగతిని వివరించారు. ఇంధన, పంచాయతీ రాజ్, గిరిజన సంక్షేమం, ఆరోగ్య శాఖల పథకాలపై ఆయా శాఖల ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కళాశాల ఫ్యాకల్టీ ఇన్‌చార్జి ప్రియాంక్ భారతి నేతృత్వంలోని ఎన్‌డీసీ ప్రతినిధి బృందం హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాలను సందర్శిస్తోంది.

సాగుకు 24 గంటల కరెంటా.. నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తా!

బీఆర్ఎస్ మంత్రులకు బీజేపీ ఎమ్మెల్యే ఈటల సవాల్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వ్యవసాయానికి 24 గంటలు కరెంట్ ఇస్తున్నట్టు నిరూపిస్తే ముక్కు నేలకు రాసి, రాజకీయాల నుంచి తప్పుకుంటానని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ మంత్రులకు సవాల్ విసిరారు. చిల్లర, గూండా నాయకులతో తనను సీఎం కేసీఆర్ తిట్టిస్తే తిట్టిస్తారేమో కానీ, 24 గంటల కరెంట్ ఎక్కడ ఇస్తున్నారో చెప్పలేరని ఎద్దేవా చేశారు. హుజూరాబాద్‌లో చీటర్లను, బ్రోకర్లను పెట్టుకొని వ్యవహారం నడుపుతున్న కేసీఆర్‌కు 2014, 2023లలో ఎన్ని ఆస్తులు ఉన్నాయో, అదే సమయంలో తన ఆస్తుల పరిస్థితి ఏమిటో చర్చకు సిద్ధమని ప్రకటించారు. గురువారం మాజీ ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాసరెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డిలతో కలిసి ఈటల మీడియాతో మాట్లాడుతూ తల్లిపాలు తాగి రొమ్ము గుద్దింది కేసీఆర్ అని, మోసానికి, ద్రోహానికి మారుపేరు ఆయనేనని ఆరోపించారు. ఓ బీసీ మంత్రి తనను ఉద్దేశించి విమర్శలు చేస్తున్నారని, రాష్ట్రంలో 52 శాతమున్న బీసీలకు ఎన్ని మంత్రి పదవులిచ్చారు.. ఏ ఏ శాఖలిచ్చారో చెప్పాలని ఈటల ప్రశ్నించారు. దేశంలో అధిక ద్రవ్యోల్బణం తెలంగాణలోనే ఉందని, రాష్ట్ర ప్రభుత్వ అప్పు రూ.5 లక్షల కోట్లకుపైగా, తలసరి అప్పు రూ.1.20 లక్షలుగా ఉందని చెప్పారు. జీఎస్‌డీపీలో రాష్ట్రం అప్పు 2014లో 15 శాతం ఉండగా, అది 2021–22లో 28.8 శాతానికి చేరుకుందన్నారు. కేంద్రంలో 2014లో జీడీపీలో 50.1% అప్పు ఉంటే, 2020–21 కల్లా 48 శాతానికి తగ్గిందని పేర్కొన్నారు. ఈ లెక్కలపై కేటీఆర్ చర్చకు రావాలని చాలెంజ్ చేశారు.

'బడ్జెట్'ను 35 రోజులు నిర్వహించాలి: భట్టి

సాక్షి, హైదరాబాద్: శాసనసభ బడ్జెట్ సమావేశాలను కనీసం 30 నుంచి 35 రోజుల పాటు నిర్వహించాలని సీఎల్పీనేత భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. ఈ మేరకు బీఏసీ సమావేశంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని ఆయన అన్నారు. బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. బడ్జెట్ సమావేశాల్లో ప్రజా సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలను ఎజెండాగా తీసుకొని ప్రజల గొంతుకను అసెంబ్లీలో వినిపిస్తామన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని విమర్శించారు. హాథ్‌సే హాథ్ జోడో యాత్ర గురించి ఈ నెల 4న పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే అధ్యక్షతన సమావేశం జరగనుందని, అందులో చర్చించి కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. పాదయాత్ర చేయాల్సిందిగా అధిష్టానం తనను ఆదేశిస్తే రాష్ట్ర మొత్తం యాత్ర చేయడానికి సిద్ధంగా ఉన్నానని భట్టి పేర్కొన్నారు.

పనిచేయిస్తాం.. ప్రయోజనాలివ్వం!

ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలో ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల ఇష్టారాజ్యం

- ఉద్యోగులకు చట్టబద్ధమైన ప్రయోజనాలు ఎగవేస్తున్న వైనం
- ఈఎస్‌ఐ, పీఎఫ్‌కు ఇవ్వమని సొసైటీ అధికారులకు స్పష్టీకరణ
- నిబంధనలు ఉల్లంఘించినా బకాయిలు చెల్లించేందుకు కొందరి యత్నాలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ(టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్) పరిధిలోని ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ, కోడింగ్ పాఠశాలల నిర్వహణ సంస్థల తప్పిదాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. కాంట్రాక్టు సిబ్బంది వేతనాల చెల్లింపుల్లో మాయాజాలం, నాణ్యత లేని బోధనపై శాఖాపరమైన పరిశీలన తేటతెల్లం చేయగా.. సంస్థ ఆధ్వర్యంలో పనిచేస్తున్న కాంట్రాక్టు సిబ్బందికి చట్టబద్ధంగా ఇవ్వాల్సిన ప్రయోజనాలకు మంగళం పాడిన తీరు బయటపడింది. గురుకుల సొసైటీ పరిధిలో కొనసాగుతున్న మూడు కోడింగ్ పాఠశాలలు, ఇతర పాఠశాలల్లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్లకు ఈఎస్‌ఐ, పీఎఫ్ ఇవ్వడం లేదని కాంట్రాక్టు సంస్థలు తేల్చి చెప్పాయి. ఈ మేరకు లిఖితపూర్వకంగా తెలియజేయడంతో సొసైటీ అధికారులు నివ్వెరపోయారు. అయితే ఏళ్లుగా పనిచేస్తున్న సిబ్బంది ప్రయోజనాలపై సొసైటీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

ఈఎస్‌ఐ, పీఎఫ్ ఇవ్వం..

టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ పరిధిలోని పాఠశాలల్లో కంప్యూటర్ విద్య బోధనకు ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని నియమించారు. ఈ సిబ్బందిని సొసైటీ నేరుగా కాకుండా ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా ఎంపిక చేసుకుంది. సిబ్బంది వేతనాల డబ్బును ప్రతి నెలా సొసైటీ నేరుగా ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలకి అందజేస్తే అక్కడినుంచి సిబ్బందికి వేతనాల చెల్లింపులు జరుగుతాయి. అదేవిధంగా సొసైటీ పరిధిలో చురుకైన విద్యార్థులకు ప్రయోగాత్మక పద్ధతిలో బోధన, అభ్యసన కార్యక్రమాలు నిర్వహించి గ్రాడ్యుయేషన్ కోర్సుకు చేరుకునే వరకు అత్యుత్తమ నిపుణులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రత్యేకంగా మూడు కోడింగ్ పాఠశాలలను ప్రారంభించారు. ఇక్కడ సాధారణ తరగతులతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం, ప్రోగ్రామింగ్ తదితరలపై నిపుణులతో శిక్షణ ఇస్తారు. ఈ మూడు పాఠశాలలు సాధారణ కార్యకలాపాలు నిర్వహిస్తూనే సమాంతరంగా కంప్యూటర్ లాంగ్వేజెస్, ప్రోగ్రామింగ్ తరగతులు నిర్వహిస్తాయి. సాధారణ తరగతులను రెగ్యులర్ టీచర్లు నిర్వహిస్తుండగా.. కోడింగ్ సబ్జెక్టులను మాత్రం నిపుణులు బోధిస్తారు. ఈ నిపుణుల నియామకాల కోసం గురుకుల సొసైటీ రెండు ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలను ఎంపిక చేసింది. ఇలా రెండు వందలకుపైగా కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్లు, కోడింగ్ పాఠశాలల్లో నిపుణులకు నెలవారీ వేతనాలు ఇస్తున్నప్పటికీ చట్టబద్ధంగా వారికి అందాల్సిన ఈఎస్‌ఐ, పీఎఫ్ ప్రయోజనాలను ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు దెబ్బతీశాయి. ఈ అంశంపై గురుకుల సొసైటీకి ఫిర్యాదులు రావడంతో అధికారులు ఈ ఏజెన్సీలకు నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో ఏజెన్సీలు వివరణ ఇచ్చాయి. కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్లు, కోడింగ్ పాఠశాలల నిపుణులు సంవత్సర కాలంలో కేవలం పది నెలలు మాత్రమే పనిచేస్తున్నారని, మిగతా రెండు నెలలు పనిచేయడం లేదని తెలిపాయి. దీంతో వారికి ఈఎస్‌ఐ, పీఎఫ్ వర్తించవని పేర్కొన్నాయి. వాస్తవానికి ఈఎస్‌ఐ, పీఎఫ్ చట్టాల ప్రకారం సంఘటిత రంగంలో కార్మికుడు ఒక్క రోజు పనిచేసినా అందుకు సంబంధించిన ప్రయోజనాలను కల్పించాలి. అయితే ఈ ఏజెన్సీలు నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్నట్లు వివరణలో తేలినప్పటికీ సొసైటీ అధికారులు మాత్రం చడీచప్పుడు చేయడం లేదు.

బకాయిల క్లియరెన్స్‌కు ఉరుకులు, పరుగులు

ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలో ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల వ్యవహారాలు వెలుగు చూస్తున్నప్పటికీ వాటిపై చర్యలు తీసుకోకుండా బకాయిల క్లియరెన్స్‌కు అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారని తెలుస్తోంది. ఏజెన్సీల నిర్వాహకులు సొసైటీలోని ఒకరిద్దరు దిగువ స్థాయి అధికారులతో లోపాయికారి ఒప్పందాన్ని కుదుర్చుకుని బిల్లుల క్లియరెన్స్ వ్యవహారాన్ని గుట్టుగా సాగిస్తున్నట్లు సమాచారం. దాదాపు రూ.8 కోట్ల మేర బకాయిలను అతి త్వరలో విడుదల చేసేందుకు తాజాగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేసినట్లు వెల్లడైంది. ఆయా సంస్థల పొరపాట్లపై చర్యల్లో భాగంగా నిధుల విడుదలను ఉన్నతాధికారులు అడ్డుకోగా.. ఇప్పుడు దిగువస్థాయి అధికారులు మాత్రం వాటి విడుదలకు అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారని తెలుస్తోంది.

టీఎస్‌ఎస్పీడీసీఎల్‌లో 1,601 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు

- ఏఈ(ఎలక్ట్రికల్) పోస్టులు 48, జేఎల్ఎం పోస్టులు 1,553
- 15న లేదా ఆ తర్వాత సమగ్ర ప్రకటన జారీ

సాక్షి, హైదరాబాద్: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీఎస్ఎస్పీడీసీఎల్) 48 అసిస్టెంట్ ఇంజనీర్(ఎలక్ట్రికల్), 1,553 జూనియర్ లైన్‌మెన్ పోస్టుల భర్తీకి గురువారం వేర్వేరు నియామక ప్రకటనలు జారీ చేసింది. విద్యార్హతలు, వయోపరిమితి, దరఖాస్తుల స్వీకరణ తదితర వివరాలతో ఈ నెల 15 లేదా ఆ తర్వాత పూర్తి స్థాయి నియామక ప్రకటనను సంస్థ వెబ్‌సైట్ల www. tssouthernpower.com లేదా tssouthernpower. cgg.gov.in) లో పొందుపరచనున్నారు. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ లేదా ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానికల్ ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హతలు కలిగిన వారు ఏఈ(ఎలక్ట్రికల్) పోస్టులకు అర్హులు కానున్నారు. జూనియర్ లైన్‌మెన్ పోస్టులకు పదో తరగతితోపాటు ఎలక్ట్రికల్/వైర్‌మెన్ ట్రేడ్లలో ఐటీఐ లేదా ఎలక్ట్రికల్ ట్రేడ్‌లో ఇంటర్ వొకేషనల్ కోర్సు చేసి ఉండాలి. గతేడాది 1,000 జేఎల్ఎం పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసి నిర్వహించిన రాతపరీక్షలో అక్రమాలు జరిగినట్టు గుర్తించడంతో ఆ నోటిఫికేషన్‌ను పూర్తిగా రద్దుచేశారు. కొత్తగా మళ్లీ నోటిఫికేషన్ జారీ చేస్తామని గతంలో ఇచ్చిన హామీ మేరకు పోస్టుల సంఖ్యను 1,553కి పెంచి తాజాగా సంస్థ యాజమాన్యం నోటిఫికేషన్ జారీ చేసింది.

7 నుంచి అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు సర్టిఫికెట్ల పరిశీలన

సాక్షి, హైదరాబాద్: వైద్య, ఆరోగ్యశాఖలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ కోసం గత ఏడాది పరీక్ష రాసిన అభ్యర్థులకు ఈనెల 7 నుంచి 14 వరకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని మెడికల్, హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు కార్యదర్శి తెలిపారు. వెంగళరావు నగర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయంలో ఈ కార్యక్రమం ఉంటుందని గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. వచ్చేటప్పుడు అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, జత జిరాక్సు ప్రతులు తీసుకురావాలని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు mhsrb.telangana.gov.in చూడాలని సూచించారు.

ఈసారి సస్పెన్షన్ వేటు పడొద్దు..!

- అసెంబ్లీలో ఆచితూచి వ్యవహరించాలని భావిస్తున్న బీజేపీ
- బీజేఎల్పీ నేతను ప్రకటించకపోవడంపై అయోమయం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, విపక్ష పార్టీల నేతల పట్ల అనుసరిస్తున్న వైఖరిని అసెంబ్లీలో ఎండగట్టాలనే ఆలోచనతో బీజేపీ ఎమ్మెల్యేలున్నారు. శుక్రవారం నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మొదలుకానుండగా ఈసారి తాము సస్పెన్షన్‌కు గురికాకుండా జాగ్రత్తగా వ్యవహరించాలనే ఆలోచనతో టి.రాజాసింగ్, ఎం.రఘునందన్‌రావు, ఈటల రాజేందర్ ఉన్నట్టు తెలుస్తోంది. వివాదాస్పద వ్యాఖ్యల ఫలితంగా పార్టీ నుంచి బీజేఎల్పీనేత రాజాసింగ్ సస్పెన్షన్‌కు గురికాగా ఆయన ఒక సభ్యుడి హోదాలో వ్యక్తిగతంగా సమావేశాలకు హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో కొత్త బీజేఎల్పీ నేతను ప్రకటించకపోవడంతో అసెంబ్లీలో పార్టీపరంగా కార్యకలాపాల నిర్వహణలో కొంత అయోమయం నెలకొంది. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఈటల కొనసాగుతున్నందున, గతంలోనే ఆయన అసెంబ్లీలో కీలకబాధ్యతలు నిర్వహించినందున, బీజేఎల్పీనేతగా రఘునందన్‌రావును నియమిస్తే మంచిదనే చర్చ పార్టీవర్గాల్లో సాగుతోంది. ఐతే దీనిపై రాష్ట్ర నాయకత్వం నిర్ణయం తీసుకోకపోవడంతో రాజకీయంగా సందిగ్ధత నెలకొందనే అభిప్రాయం వ్యక్తమౌతోంది.

పోడు, అప్పులు, జీఓ 317పై...

బడ్జెట్ సమావేశాలకు సంబంధించిన వర్తమానం బీజేపీ ఎమ్మెల్యేలకు శాసనసభా కార్యాలయం నుంచి అందినట్టు సమాచారం. హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో ఈటల గెలిచాక రెండుసార్లు అసెంబ్లీ జరగగా, ఆ రెండు పర్యాయాలు ఆయన సస్పెన్షన్‌కు గురయ్యారు. మొదటి సమావేశంలో తొలుత ఈటలను సస్పెండ్ చేయగా, మిగతా ఇద్దరు సభను బహిష్కరించారు. వివాదాస్పద వ్యాఖ్యల కారణంగా అరెస్టయి జైల్లో ఉండటంతో రెండోసారి రాజాసింగ్ సమావేశాలకు హాజరుకాలేదు. రెండో సమావేశంలో ఈటలను సస్పెండ్ చేశాక, తన స్థానంలోనే రఘునందన్‌రావు లేచి నిలుచోగానే ఆయనపైనా సస్పెన్షన్ విధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో సస్పెన్షన్‌కు గురికాకుండా ఆచితూచి వ్యవహరించి, అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలనే ఆలోచనతో బీజేపీ ఎమ్మెల్యేలున్నట్టు తెలుస్తోంది. ప్రధానంగా పోడు భూముల సమస్యతోపాటు ఉద్యోగ, ఉపాధ్యాయుల బదిలీల జీవో 317, స్పౌజ్ బదిలీలు, ఎస్‌ఐ, కానిస్టేబుల్ పోస్టుల రిక్రూట్‌మెంట్‌లో పెట్టిన కఠిన నిబంధనలు, రాష్ట్ర ప్రభుత్వ అప్పులు రూ.5 లక్షల కోట్లకు చేరుకోవడం, తలసరి తప్పు లక్షన్నర దాకా చేరుకోవడం వంటి సమస్యలను లేవనెత్తాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. పరిమితంగా కొన్ని రోజులే సమావేశాలు జరగనున్నందున వాటిని ఉపయోగించుకునే దిశలో వ్యవహరించాలని భావిస్తున్నారు. ఈ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహ్యాలపై గురువారం పార్టీ కార్యాలయంలో రఘునందన్‌రావు, ఈటల చర్చలు జరిపారు.

రాహుల్‌తో పాదయాత్ర గొప్ప అనుభవం

కాంగ్రెస్ జాతీయ ఆదివాసీ విభాగం ఉపాధ్యక్షుడు బెల్లయ్య నాయక్

సాక్షి, హైదరాబాద్: రాహుల్ గాంధీ సాగించిన భారత్ జోడో యాత్రలో కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర సాగించడం గొప్ప అనుభూతిని, అనుభవాన్ని మిగిల్చిందని కాంగ్రెస్ జాతీయ ఆదివాసీ విభాగం ఉపాధ్యక్షుడు బెల్లయ్య నాయక్ అన్నారు. రాహుల్ వెంట నడిచిన 10 మందిలో బెల్లయ్యతోపాటు కేతూరి వెంకటేశ్, వెంకటరెడ్డిలను.. పార్టీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి గురువారం గాంధీభవన్‌లో సన్మానించారు. బెల్లయ్య మాట్లాడుతూ యాత్రలో నడిచి 11 కిలోల బరువు తగ్గానని తెలిపారు. చామల కిరణ్ మాట్లాడుతూ ఎండ, వాన, చలి లెక్క చేయకుండా నాలుగున్నర నెలలపాటు సాగించిన పాదయాత్ర మనోధైర్యాన్నిచ్చిందన్నారు. వెంకటేష్ మాట్లాడుతూ పాదయాత్ర వల్ల దేశ గొప్ప తనాన్ని, సార్వభౌమత్వాన్ని కళ్లారా చూశామన్నారు. పార్టీ ఉపాధ్యక్షుడు మల్లు రవి మాట్లాడుతూ ఈనెల 6 నుంచి రేవంత్ పాదయాత్ర సాగుతుందన్నారు.

వజ్రంలా ఉండండి. అది విలువైనది, అరుదైనది. రాయిలా కాదు. అది ప్రతిచోటా కనిపిస్తుంది.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, ఫిబ్రవరి, 3

కటకటాల నుంచి స్వేచ్ఛ

రెండేళ్లకుపైగా ఉత్తరప్రదేశ్ జైల్లో మగ్గిన కేరళ పాత్రికేయుడు సిద్దిఖీ కప్పన్ బెయిల్ మంజూరై ఎట్టకేలకు స్వేచ్ఛా ప్రపంచంలోకి అడుగుపెట్టారు. 2020 అక్టోబర్‌లో దుండగుల అమానుషత్వానికి బలైపోయిన పందొమ్మిదేళ్ల దళిత యువతి భౌతికకాయాన్ని పోలీసులు ఆమె తల్లిదండ్రుల అభీష్టానికి విరుద్ధంగా తరలించుకుపోయి, తామే అంత్యక్రియలు పూర్తిచేసేందుకు ప్రయత్నిస్తున్నారన్న సంగతి తెలిసి వెళ్తున్న కప్పన్‌ను యూపీ పోలీసులు మార్గమధ్యంలో అరెస్టు చేశారు. పాత్రికేయ వృత్తిలో ఉండేవారికి ఇలాంటి అనుభవాలు కొత్తేమీ కాదు. ఉద్యమకారులకూ, పోలీసులకూ మధ్య ఘర్షణలు తలెత్తినప్పుడైనా...అవినీతి, మాఫియా సామ్రాజ్యాల గుట్టు రట్టు చేసేందుకు ప్రయత్నించినప్పుడైనా వారికి సమస్యలు ఎదురవుతుంటాయి. సిద్దిఖీ కప్పన్‌ను పోలీసులు అరెస్టు చేసినప్పుడు అంత్యక్రియల ప్రాంతానికి వెళ్లకుండా ఆయన్ను అడ్డుకోవడానికేనని అందరూ అనుకున్నారు. కానీ జరిగిందంతా అందుకు విరుద్ధం. ఒక సాధారణ పాత్రికేయుడని అందరూ అనుకుంటున్న కప్పన్‌ను పోలీసులు ఉగ్రవాద సమర్థకుడిగా చిత్రిస్తూ వరస కేసులు పెట్టారు. అప్పటికింకా నిషేధానికి గురికాని పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్ఐ)కు సలహాదారుగా చిత్రించి చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం(యూఏపీఏ)కింద కేసు పెట్టారు. కేసును జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) స్వీకరించింది. ఆ తర్వాత ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కూడా రంగంలోకొచ్చి నేరారోపణలు చేసింది. ఆయనతోపాటు మరో అయిదుగురు కూడా ఈ కేసులన్నిటా సహ నిందితులుగా ఉన్నారు. ఈ ఆరోపణలు ఏమేరకు నిలబడతాయో, కప్పన్, ఆయన సహచరులు నిర్దోషులుగా బయటికొస్తారో లేదో ముమ్ముందు తేలుతుంది.

అయితే నిరుడు సెప్టెంబర్‌లో కప్పన్‌కు బెయిల్ మంజూరు చేస్తూ అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యూ యూ లలిత్ లేవనెత్తిన ప్రశ్న కీలకమైనది. 'ప్రతి పౌరుడికీ తన అభిప్రాయాలు వ్యక్తంచేసే స్వేచ్ఛ ఉంది. హథ్రాస్ బాధితురాలికి న్యాయం జరగాలని ఆయన కోరుకుంటే అది చట్టం దృష్టిలో నేరమెలా అవుతుంది?' అని ఆయన నిలదీశారు. అదుపులోనికి తీసుకున్న సమయంలో కప్పన్ వాహనం నుంచి స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు చెబుతున్న కొన్ని కాగితాలు జస్టిస్ లలిత్‌కు అభ్యంతరకరమైనవిగా కనబడలేదు. అప్పటికే దీర్ఘకాలం జైల్లో ఉన్నందువల్ల, అరెస్టు చేసినప్పుడున్న పరిస్థితులను, ఈ కేసులోని ప్రత్యేకతలనూ పరిగణనలోకి తీసుకుని బెయిల్ ఇస్తున్నట్టు ప్రకటించారు. అయితే ఈడీ కేసులో బెయిల్ లభించడానికి మరో నాలుగు నెలలు పట్టింది. ఈడీ పెట్టిన మనీ లాండరింగ్ కేసు చిత్రమైనది. తన బ్యాంకు ఖాతా నుంచి సహ నిందితుడి ఖాతాకు కప్పన్ రూ. 5,000 బదిలీ చేయటం దీని సారాంశం. యూఏపీఏ కేసులో బెయిల్ లభించినవారు సమర్పించే పూచీకత్తులు సరిచూడటానికి 90 రోజులు తీసుకోవచ్చు గనుక కప్పన్ బయటికొచ్చేందుకు ఇంత సమయం పట్టింది. కప్పన్ ఒక్కరే కాదు... దేశంలో ఇదే మాదిరి యూఏపీఏ కేసుల్లో ఇరుక్కొని జైలుపాలైనవారు మరో అయిదుగురున్నారని నిరుడు డిసెంబర్‌లో పాత్రికేయుల పరిరక్షణ సంఘం(సీపీజే) తెలిపింది. మణిపూర్ పాత్రికేయుడు కిషోర్‌చంద్ర వాంఖెమ్‌ను 2019లో జాతీయ భద్రతా చట్టం(నాసా) కింద అరెస్టు చేశారు. నిజానికి కప్పన్ యూపీ నివాసి కాదు. ఆయన ఢిల్లీ కేంద్రంగా ఒక మలయాళ మీడియా సంస్థకు పనిచేస్తున్నారు. అందువల్ల కప్పన్‌పై యూపీ పోలీసులకైనా, అక్కడి రాజకీయ నాయకత్వానికైనా వ్యక్తిగత కక్ష ఉండే అవకాశం లేదు. మరైతే ఏ ప్రయోజనాన్ని ఆశించి, ఎవరు కప్పన్‌పై కేసులు పెట్టడానికి పూనుకున్నట్టు? హథ్రాస్ అమానుషం చుట్టూ అలుముకున్న పరిస్థితులనూ, ఈ ఉదంతంవల్ల ప్రభుత్వానికి కలగబోయే అప్రదిష్టనూ పరిగణనలోకి తీసుకుని మీడియా కథనాలను నియంత్రించాలన్న లక్ష్యంతో, పాత్రికేయులను భయభ్రాంతుల్ని చేసే ఉద్దేశంతో యూపీ సర్కారు ఈ చర్యకు దిగిందని పాత్రికేయ సంఘాలు అప్పట్లో ఆరోపించాయి.

ఈమాదిరి కేసులు విచారణకు రావాలంటే కింది స్థాయి కోర్టుల్లోనే ఏళ్ల తరబడి సమయం పడుతుంది. ఈలోగా బెయిల్ కోసం ఉన్నత స్థాయి న్యాయస్థానాలను ఆశ్రయించాల్సివస్తుంది. అక్కడ వెంటనే ఉపశమనం లభించటం సులభం కాదు. అప్పటికే పెండింగ్‌లో ఉన్న లక్షల కేసుల్లో ఇదొకటవుతుంది గనుక సహజంగానే జాప్యం చోటుచేసుకుంటుంది. సుదీర్ఘంగా సాగే ఈ ప్రక్రియంతా నిందితులకూ, వారి కుటుంబాలకూ ఒక శిక్షలాంటిదే. ప్రస్తుత కేసుల్లో కప్పన్‌కు బెయిల్ రావటానికే 28 నెలలు పట్టింది. ఇక కేసు విచారణ పూర్తయి, తీర్పు వెలువడటానికి మరెన్నేళ్లు పడుతుందో? తీర్పు ప్రతికూలంగా వెలువడితే మళ్లీ జైలుకూ, ఆ తర్వాత అప్పీల్‌కూ పోవాలి. ఆ తర్వాత మళ్లీ బెయిల్, విచారణకు హాజరుకావడం షరా మామూలు. అడపా దడపా జరిగే ఉగ్రవాద ఘటనలను సాకుగా చూపి ప్రభుత్వాలు ఈ కఠినమైన చట్టాలు తీసుకొచ్చాయి. ఉన్న చట్టాలకు సవరణలద్వారా పదునుపెట్టాయి. చట్టసభల్లో చర్చ జరిగినప్పుడల్లా తమ చర్యలను గట్టిగా సమర్థించుకున్నాయి. దుర్వినియోగానికి ఆస్కారం లేనివిధంగా పకడ్బందీ నిబంధనలు చేర్చామని స్వోత్కర్షకు పోయాయి. సాధారణ పౌరులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం లేనేలేదని చెప్పాయి. ఆచరణలో మాత్రం జనం తరఫున ప్రశ్నిస్తున్న ఉద్యమకారులు, నిజాలను ధైర్యంగా వెలికితీసేందుకు ప్రయత్నించే పాత్రికేయులు ఈ చట్టాలకు బలైపోతున్నారు. ఈ ధోరణి ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. కనుక దీన్ని అరికట్టేందుకు సర్వోన్నత న్యాయస్థానం తగిన ఆదేశాలివ్వాలి.

ఉత్తరాదిన కొత్త ఉరుములు

విశ్లేషణ



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

పదహారవ శతాబ్దపు భక్తకవి తులసీదాసు రాసిన 'రామ్‌చరిత్‌మానస్' ఇప్పుడు ఉత్తరాదిలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ప్రాచీన, మధ్య యుగాల్లో ద్విజులు రాసిన ఇతర గ్రంథాలకు వ్యతిరేకంగా శూద్ర, దళిత రాజకీయనేతలు నేడు మొట్టమొదటిసారిగా మేధా పోరాటానికి పిడికిలి బిగిస్తున్నారు. ఆ పుస్తకాలను ఆయుధాలుగా చేసుకుని ఆరెస్సెస్, బీజేపీలు సమకాలీన హిందూ జాతీయవాదాన్ని నిర్మించి అన్ని విద్యా సంస్థలపై ఆధిపత్యాన్ని నెలకొల్పాలని ప్రయత్నిస్తున్నాయన్నది వారి ప్రధాన ఆరోపణ. అందుకే వారు శూద్రులు, దళితులు వర్సెస్ ద్విజులు అనే కొత్త వ్యూహంలోకి ఆరెస్సెస్, బీజేపీని లాగడం ద్వారా ఉత్తరాదిన సరికొత్త యుద్ధానికి తెర తీయడానికి సిద్ధం అవుతున్నట్లు కనిపిస్తోంది.

గోస్వామి తులసీదాస్ రాసిన రామ్‌చరిత్ మానస్ ఇప్పుడు ఉత్తర భారతదేశంలో... ప్రత్యేకించి ఉత్తరప్రదేశ్, బీహార్‌లలో కుల యుద్ధాన్ని రాజేస్తోంది. ఆ ప్రాంత బ్రాహ్మణులు, క్షత్రియులు ఈ పుస్తకాన్ని తమ ఆధ్యాత్మిక రామాయణంగా భావిస్తుంటారు. అయితే ఈ పుస్తకంలో శూద్రులకు, దళితులకు వ్యతిరేకంగా అవమానకరమైన ద్విపదలు ఉన్నాయని ఆరోపిస్తూ తాజాగా ఇద్దరు శూద్ర ఓబీసీ నేతలు స్వామి ప్రసాద్ మౌర్య (సమాజ్‌వాది పార్టీ–యూపీ), బీహార్ విద్యామంత్రి చంద్రశేఖర్ (ఆర్జేడి) పుస్తకాన్ని నిషేధించాలన్న డిమాండ్‌తో పోరు ప్రారంభించారు. ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్ సైతం తన బలమైన శూద్ర నేపథ్యంతో పుస్తకంపై తీవ్ర వైఖరిని చేపట్టారు.

సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షుడు, యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ 2023 జనవరి 29న ఒక పత్రికా సదస్సులో ప్రసంగిస్తూ... ''నేను శూద్రుడినా లేక శూద్రుడిని కాదా తెలీదు కానీ, నేను రాముడికి వ్యతిరేకం కాదు. మరే ఇతర హిందూ దేవుడికి కూడా వ్యతిరేకం కాదు. అయితే ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, రామ్‌చరిత్‌మానస్ నుంచి శూద్రుల గురించి ప్రస్తావించిన ఆ పంక్తులను పఠించగలరా?'' అని ప్రశ్నించారు. ఈ అంశం గురించి ఒక జర్నలిస్టు మళ్లీ ప్రశ్నించి చీకాకు పరచినప్పుడు 'మీకు తెలిసి ఉంటే వాటిని చదవగలరా?'' అని అడిగారు. అప్పుడు ఆ జర్నలిస్టు ఆ పంక్తిని చదివి వినిపించారు. ''ఢోలు, నిరక్ష్యరాస్యుడు, శూద్రుడు, పశువు, మహిళ... వీళ్లందరూ శిక్షార్హులే..'' అన్నది ఆ పంక్తి సారాంశం. అప్పుడు అఖిలేష్ ఆ జర్నలిస్టును ''ఆ పంక్తులు శూద్రులను, దళితులను, స్త్రీలను అవమానిస్తున్నాయా లేదా?'' అని ప్రశ్నించారు. ''సీఎం యోగి అయినందున ఈ పంక్తులను రాష్ట్ర అసెంబ్లీలో చదవాలని నేను అడుగుతాను'' అన్నారు.

అంతకు ముందు అఖిలేష్ యాదవ్ ఒక ఆలయాన్ని సందర్శించడానికి వెళ్లినప్పుడు ఆర్ఎస్ఎస్, బీజేపీ ఆయనను అడ్డుకోవాలని చూశాయి. రామ్‌చరిత్‌మానస్ శూద్రులను, దళితులను, మహిళలను అవమానిస్తోందని, ఆ పుస్తకాన్ని నిషేధించాలని చెప్పిన ఎస్పీ నేత స్వామి ప్రసాద్ మౌర్యపై చర్య తీసుకోవాలని ఆ రెండు పార్టీలవారు నినదించారు. మౌర్య హిందువుల మనోభావాలను గాయపర్చారని వారి ఆక్షేపణ. కేసులు పెట్టారు. కానీ ఆయన తన వైఖరికి కట్టుబడ్డారు. ఆలయం వద్ద అడ్డుకోవడానికి ప్రయత్నించిన వారికి అఖిలేష్ కూడా గట్టిగా సమాధానమిచ్చారు. వెనుకబడిన వర్గాల (ఓబీసీల)ను, దళితులను మొత్తంగా శూద్రులుగా బీజేపీ పరిగణిస్తోందని, బీజేపీలో ఉంటున్నవారితోపాటు, పార్టీకి ఓటు వేస్తున్న శూద్రులను, దళితులను, మహిళలందరినీ రామ్‌చరిత్ మానస్ అవమానిస్తోందని మౌర్య పేర్కొన్నారు. బీహార్ విద్యా మంత్రి ఆర్జేడీ నేత చంద్రశేఖర్ కూడా ''రామ్‌చరిత్‌మానస్ మనుస్మృతి లాగా, ఆర్ఎస్ఎస్ రెండో సర్‌సంఘ్ చాలక్ (చీఫ్) ఎమ్ఎస్ గోల్వాల్కర్ రచించిన గ్రంథం 'పాంచజన్యం



'లాగా ఒక విభజన గ్రంథం'' అని అన్నారు.

ఈ నేపథ్యంలోనే... ప్రాచీన, మధ్యయుగాల్లో బ్రాహ్మణులు రాసిన కుల గ్రంథాలకు వ్యతిరేకంగా ఉత్తర భారత శూద్ర, దళిత రాజకీయనేతలు మేధాపోరాటం చేస్తున్నారు. ''ఈ పుస్తకాలను ఉపయోగించుకోవడం ద్వారా ఆరెస్సెస్, బీజేపీలు సమకాలీన హిందూ జాతీయవాదాన్ని నిర్మించి అన్ని విద్యా సంస్థలపై ఆధిపత్యాన్ని నెలకొల్పాలని చూస్తున్నాయి. ఆహార ఉత్పత్తిదారులు, తోలుపని వారు, వడ్రంగులు, కుమ్మరులు, పశుపోషకులు, గొర్రెలకాపర్లు వంటి వారిని గౌరవించకూడని, వారు పనికిమాలిన వారని సూచించడానికి 'శూద్ర', 'చండాల' భావనలను ఈ పుస్తకాలు చాలా వరకు వ్యాపింపజేశాయి. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదవటానికి, విద్యను అభ్యసించడానికి వీరికి అర్హత లేదని, సమాజంలో గౌరవం పొందే అర్హత వీరికి లేదని ఈ పుస్తకాలు చెప్పాయి. అలాగే ఆలయాల్లో ప్రవేశించడానికి వీరికి అనుమతి లేదని పేర్కొన్నాయి'' అని ఆరోపిస్తున్నారు.

ఓబీసీ, దళిత్ వంటి సమకాలీక వర్గీకరణలను స్వాతంత్ర్యానంతర భారత్‌లో కులాలు, కమ్యూనిటీల కోసం దాదాపుగా వాడేవారు. గతంలో ఓబీసీలు, దళితులు బ్రాహ్మణ పుస్తకాలను నిశితంగా పరిశీలించలేదు. అందుచేత తమ గురించి ఈ పుస్తకాలు ఏమని పేర్కొన్నాయన్నది వీరు ఎన్నటికీ అర్థం చేసుకోలేదు. భారతదేశంలోని ఓబీసీలను ఏమాత్రం అర్థం చేసుకోకుండానే శూద్రులు అనే వర్గీకరణను పై పుస్తకాల్లో రాసేశారు. అందుకే జాతీయవాద సమయంలో జాట్లు, పటేళ్లు, మరాఠీలు, కమ్మవారు, రెడ్లు, లింగాయతులు, నాయర్లు తదితరులు శూద్ర హోదాను కాకుండా క్షత్రియత్వాన్ని తాము పొందవచ్చని ఆలోచించారు. శూద్ర హోదా అవమానకరమైనదని వారు భావించారు. ప్రాచీన, మధ్యయుగాలకు చెందిన రచనల్లో చాలా మంది బ్రాహ్మణ రచయితలు శూద్ర, చండాల అనే భావనను వారు పనికిరానివారు అని చిత్రించేందుకు ఉపయోగించారు. రుగ్వేదం రచించిన రోజుల నుంచి ఇది చారిత్రకంగా సాగుతూ వచ్చింది. వారు తమను తాము హిందువులుగా ఎన్నటికీ భావించలేదు. ముస్లిం చరిత్రకారుడు అల్ బెరూనీ (క్రీ.శ. 973–1053) 'అల్–హింద్' అనే పుస్తకం రాసిన తర్వాతే, హిందూ అనే భావన భారతీయ నిఘంటువులోకి వచ్చి చేరింది. అయితే ఇప్పుడు ఆరెస్సెస్, బీజేపీ భావ వ్యాప్తిలో ముస్లింలకు మొహమ్మద్ ఎలాగో, తులసీదాసు కూడా అలాగే గొప్ప హిందూ ప్రవక్త అయిపోయారు. ప్రవక్తను విమర్శించేవారు ఎవరైనా సరే, చంపేస్తామనే బెదిరింపులకు లోనయ్యేవారు. ఇప్పుడు స్వామి మౌర్యను అంతమొందించాలని ఒక హిందూ మతగురువు ఇప్పటికే ఫత్వా జారీ చేశారు. కానీ శూద్రులు, దళితుల విషయంలో ఎవరైనా ఇలాంటి విమర్శ చేస్తే వారికి ఏమీ కాదు.

ఓబీసీ మహాసభ సభ్యులు గత వారం రామ్‌చరిత్‌మానస్ పుటలను బహిరంగంగా తగులబెట్టారు. ఈ దేశం అగ్రరాజ్యమని నేడు ఆరెస్సెస్, బీజేపీ శక్తులు పిలుస్తున్నాయి. అయితే శూద్రుల, దళితుల, ఆదివాసీల శ్రమ మాత్రమే ఈ దేశాన్ని ఈ స్థాయికి తీసుకొచ్చింది. ఇది భారతదేశం గురించిన నూతన భావన. ఆరెస్సెస్, బీజేపీ అధికారంలోకి వచ్చాక, అధికార కుల రాజకీయాలు నిశిత పరీక్షకు గురవుతున్నాయన్న విమర్శ ఉంది. ఎందుకంటే సామాజిక, రాజకీయ ప్రక్రియలో ఈ కులతత్వపు గ్రంథాలను పాలకవర్గ శక్తులు తిరిగి రుద్దాలని కోరుకుంటున్నాయి. తమ ఉనికిని, భవిష్యత్తును సరికొత్త ఉచ్చులోకి దింపే ప్రయత్నం జరుగుతోందని శూద్ర, ఓబీసీ, దళితులు మెల్లగా గుర్తిస్తున్నారు. గతంలో ఓబీసీలు, దళితులు రిజర్వేషన్ చుట్టూనే పోరాడుతూ వచ్చారు. ఆరెస్సెస్, బీజేపీలు ఉద్యోగాలను ప్రైవేటీకరించడం ద్వారా, దాదాపు ఈ సమస్యను అసంగతంగా మార్చి వేశాయి. ద్విజ నాయకత్వం కింద ముస్లింలు శత్రువులు అనే ముద్రను బలంగా చొప్పించడం ద్వారా శూద్రులు, దళితులను ద్విజ నియంత్రణలోకి తీసుకురావాలని వీరు కోరుకున్నారు. క్రమంగా ఈ ఎజెండాలో తమను ఉచ్చులోకి లాగుతున్నారని శూద్రశక్తులు గ్రహిస్తున్నాయి. అదే సమయంలో ప్రాంతీయ పార్టీలను లేకుండా చేయాలని ఆరెస్సెస్, బీజేపీ కోరుకుంటున్నాయి. బెంగాల్, ఒడిషా తప్ప దేశ వ్యాప్తంగా ఉన్న ప్రాంతీయ పార్టీలు, మండల్ విప్లవం తర్వాత పుట్టుకొచ్చిన శూద్ర నేతల ఆధిపత్యంలో ఉంటున్నాయన్నది గమనించాలి.

శూద్ర, దళిత కమ్యూనిటీల నుంచి మేధావులు ఆవిర్భవిస్తుండటంతో, రామ్‌చరిత్‌మానస్, ఇతర ప్రాచీన సంస్కృత గ్రంథాల చుట్టూ కొత్త చర్చలు మొదలు కానున్నాయి. అఖిలేష్ శూద్రుడు కాబట్టి 2016 యూపీ ఎన్నికల్లో ఓడిపోయి, ముఖ్యమంత్రిగా అధికార నివాసాన్ని ఖాళీ చేసినప్పుడు ఆవు పాలతో, గోమూత్రంతో సీఎం నివాసాన్ని శుద్ధి చేసి యోగి ఆదిత్యనాథ్ తనను ఎంతగా అవమానించిందీ అఖిలేష్‌కి, శూద్రులు, దళితులకు ఇంకా గుర్తుంది. ఇప్పుడిక రామ్‌చరిత్‌మానస్ లేవనెత్తిన సమస్యతో ఉత్తర భారతదేశంలో అనేక కుల సాంస్కృతిక పోరాటాలు ప్రధాన భూమికలోకి రానున్నాయి.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఎదగండి మంత్రిగారూ



ఆడపిల్లలు పెళ్లీడు దాటకుండానే మాతృత్వ మధురిమల్ని కౌగలించుకోవాలని అస్సాం సీఎం అయిన హిమంత్ బిస్వా శర్మ అనే పురుషుడు సలహా ఇచ్చారు. ఎవరిని, దేనిని, ఎప్పుడు కౌగలించుకోవాలో అమ్మాయిలకు చెప్పడం ఆయన పని కాదు.

– మినీ నాయర్, రచయిత్రి

బాగుంది కదా!



2014లో పానిపట్‌లో జరిగిన టోర్నమెంట్‌లో 11 ఏళ్ల బాలుడు తన క్రికెట్ జట్టును విజయ పథంలో నడిపించి, 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా కూడా ఎంపికయ్యాడు. బాలుడిగా నాడు మారు వేషంలో ఆడిన షెఫాలీ వర్మ నేడు అండర్ –19 ప్రపంచకప్పులో ఇంగ్లండ్‌పై ఘన విజయం సాధించిన భారత జట్టుకు కెప్టెన్!

– జ్యోతి యాదవ్, రిపోర్టర్

దేశాన్ని కలపకండి



శ్రీ గౌతమ్ అదానీకి ఒకటి గుర్తు చెయ్యాలని అనుకుంటున్నాను. అదానీ అంటే ఇండియా కాదు. ఇండియా అంటే అదానీ కాదు. హిండెన్‌బర్గ్ నివేదిక అదానీ గ్రూప్ మీదే కానీ, ఇండియా మీద కాదు. 'దుష్టబుద్ధికి దేశభక్తే చివరి శరణ్యం' అని ఒక మహనీయుడు అన్నారు.

– అద్వైత్, చరిత్రకారుడు

నో థంబ్స్ అప్



ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లకు వెయ్యి మంది టీచర్లను నియమిస్తున్నారు! ఇది 'థంబ్స్ అప్' ఇవ్వవలసిన సందర్భమే కానీ... అలా బొటన వేలు ఎత్తి చూపిస్తే అనుచితంగా ఉండదు కదా!

– దీపక్ షెనాయ్, మనీ ఎక్స్‌పర్ట్

మనుషులుగా గుర్తించారు



గొప్ప బడ్జెట్ అనేందుకు చిన్న ఉదాహరణ. అన్ని పట్టణాలు, నగరాలలో మ్యాన్‌హోల్స్ మిషన్‌హోల్స్‌గా మారబోతున్నాయి! యంత్రాలు వచ్చాక ఇక మాన్యువల్ స్కావింజింగ్ ప్రమాదాలు, అవమానాలు కూడా ఉండవు.

– అభిజిత్ మజుందార్, జర్నలిస్ట్

ఉపాధికి హామీలేని బడ్జెట్

అభిప్రాయం



డా॥ తిరునహరి శేషు

ఏడు ప్రాధాన్యతా అంశాలతో (సప్తర్షి) 2023–24 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన యూనియన్ బడ్జెట్... కోవిడ్ అనంతరం దేశం ఎదుర్కొంటున్న అత్యంత ప్రధానమైన సమస్యలైన ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనకూ, స్వయం ఉపాధికీ ప్రాధాన్యం ఇవ్వకపోవడం ఆశ్చర్యమేస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడుతున్న ఆర్థిక మందగమన పరిస్థితులలో వేలాది మంది ఉద్యోగాలూ, ఉపాధీ కోల్పోతున్న తరుణంలో... బడ్జెట్‌లో ఉపాధి, ఉద్యోగాల కల్పనకు చర్యలు చేపట్టకపోవడం శోచనీయం. 2006 నుండి దేశవ్యాప్తంగా విస్తృతంగా అమలవుతున్న 'మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం' (మగ్రేగా)కు గత మూడు బడ్జెట్లలో వరుసగా నిధులు కోత పెట్టడం వలన పథకం లక్ష్యం నీరుగారి పోయే ప్రమాదం ఏర్పడింది.



113.7 మిలియన్ కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్న ఈ పథకానికి 2021–22 బడ్జెట్‌లో రూ. 98 వేల కోట్లూ, 2022–23 బడ్జెట్‌లో రూ. 75 వేల కోట్లూ కేటాయించగా... 2023 –24 బడ్జెట్‌లో కేవలం రూ. 60 వేల కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి 21.6 శాతం నిధులను తగ్గించారు. ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసి గ్రామీణ ప్రాంతాలలో నైపుణ్యంలేని వారికి వందరోజుల పని దినాలు కల్పించడానికి రూ. 2.72 లక్షల కోట్లు అవసరమవుతుంది. కానీ ఈ బడ్జెట్‌లో రూ. 60 వేల కోట్లే కేటాయించటంతో గ్రామీణ ప్రాంతాలలో ఉపాధికి హామీ దొరకదేమో అనిపిస్తోంది. నిధుల లేమితో పథకం అమలుపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి అనేది వాస్తవం. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ ప్రకారం భారతదేశంలో నిరుద్యోగం 8.3గా ఉంది. దీనిలో గ్రామీణ ప్రాంతాలలో నిరుద్యోగం 9 శాతం కంటే ఎక్కువగా ఉన్నదని సర్వే సంస్థ తన నివేదికలో వెల్లడి చేసింది. ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించటంతో నిరుద్యోగం మరింత పెరిగే ప్రమాదం లేకపోలేదు.

2021–22 బడ్జెట్ పెడుతున్న సమయంలో ఎన్నికలు ఉన్న కేరళ, తమిళనాడు, పశ్చిమబెంగాల్, అస్సాం రాష్ట్రాలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించిన విషయం తెలిసిందే. అలాగే ఇప్పుడు తొమ్మిది రాష్ట్రాలకు జరుగనున్న శాసనసభ ఎన్నికలనూ, 2024లో జరిగే లోక్ సభ ఎన్నికలనూ దృష్టిలో పెట్టుకొని రైతులూ, స్త్రీలూ, వేతనజీవులూ, గిరిజనుల వంటి వారిపై ఈ బడ్జెట్‌లో వరాల జల్లు కురిపించినట్లుగా కనిపి స్తుంది. నాగాలాండ్, మేఘాలయ, త్రిపుర, రాజస్తాన్, మధ్య ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర శాసనసభ ఎన్నికలలో గిరిజనుల ప్రాబల్యం ఎక్కువ కాబట్టి ఆ రాష్ట్రాల శాసనసభ ఎన్నికలలో గెలుపు కోసం గిరిజన సంక్షేమానికి బడ్జెట్‌లో పెద్దపీట వేశారనే చెప్పాలి.

వ్యవసాయ రంగంలో సంస్కరణలు, కేటాయింపులు, రుణ పరిమితి లక్ష్యం పెంపు (20 లక్షల కోట్లు), వేతన జీవులకు వ్యక్తిగత ఆదాయ పన్ను పరిమితి పెంపు, 'పీఎం గరీబ్‌కల్యాణ్ అన్న యోజన' ద్వారా 80 కోట్ల మంది పేదలకు ఉచిత బియ్యం పంపిణీ, 'పీఎం ఆవాస్ యోజన ఇళ్ల నిర్మాణ' పథకానికి రూ. 79 వేల కోట్ల కేటాయింపులు ఆహ్వానించదగినవే. రైల్వేలకూ, మౌలిక సదుపాయాల కల్పనకూ నిధులు కేటాయించిన విధంగానే... విద్య, ఆరోగ్య రంగాలకు మరిన్ని నిధులు కేటాయిస్తే బాగుండేది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌లో కూడా తెలంగాణ రాష్ట్రానికి నిరాశ ఎదురైందనే చెప్పాలి. విభజన చట్టంలో పొందుపరిచిన హామీల ప్రస్తావన లేకుండా రైల్వే ప్రాజెక్టులు, నీటిపారుదల ప్రాజెక్టుల నిధుల ప్రస్తావన లేకుండా; జాతీయ హోదా ప్రస్తావన లేకుండా, జాతీయ విద్యా సంస్థల కేటాయింపు లేకుండా మరొకసారి కేంద్ర బడ్జెట్ నిరాశపరిచిందనే చెప్పాలి. రూ. 45 లక్షల కోట్ల బడ్జెట్‌లో కేటాయింపులు ఘనంగా ఉన్నాయి. కానీ వాటిని పూర్తిస్థాయిలో ఖర్చు చేసి లక్ష్యాలను సాధించినప్పుడే 'విజన్ ఫర్ అమృత్ కాల్'కు సార్థకత చేకూరుతుంది.

ఆర్థిక విశ్లేషకులు, కాకతీయ విశ్వవిద్యాలయం

అంబేడ్కర్ దారిలో చెప్పిందే చేస్తూ...

సందర్భం



జూలూరి గౌరీశంకర్

వర్ణ, కుల, వర్గ, ప్రాంత, భాషా సంస్కృతులకు అతీతంగా మనుషులందరూ సమానమే. ఇకపై అసమానతలు, అణచివేతలు లేకుండా ఒక మనిషిని మరో మనిషీ, ఒక వర్గం మరో వర్గాన్నీ, ఒక జాతిపై మరో జాతీ ఆధిపత్యాలకు ఇక చెల్లు అంటూ మహత్తర మానవీయ మహా సందేశం 1950 జనవరి 26 నాటి నుంచి భారత రాజ్యాంగం ద్వారా అమలులోకి వచ్చింది.

స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి అంశాలకు ప్రాముఖ్యం ఇస్తూ భారత రాజ్యాంగ రచన చేసిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిస్తూ, నిరంతరం రాజ్యాంగ స్ఫూర్తి రగులుకొనేలా చేస్తూ, తెలంగాణ నూతన సచివాలయానికి బాబాసాహెబ్ అంబేడ్కర్ పేరు పెట్టి దానిని జాతికి అంకితం చేసే 2023 ఫిబ్రవరి 17 చరిత్ర మరువలేని రోజుగా నిలిచిపోతుంది. అదే రోజు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు పుట్టిన రోజు కావడంతో ఆయన జీవితాన్ని స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వంతో నిర్మితమయ్యే సమాజానికి అంకితం చేసుకున్నట్లయ్యింది. 'పుట్టుక నీది.. చావు నీది.. బతుకంతా దేశానిది...' అని లోక్ నాయక్ జయ ప్రకాష్ నారాయణను కాళోజీ తలుచుకున్నట్లుగా... డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ పేరును నూతన సచివాలయానికి నామకరణం చేయడం ద్వారా కేసీఆర్ ఎంచుకున్న బాట, కార్యదీక్ష జగద్విదిత మయ్యాయి. ఇంత మహత్తర కార్యానికి శ్రీకారం చుట్టిన ఆయనను భారతదేశం అంతా హృదయపూర్వకంగా అభినందిస్తోంది. భారత రాజ్యాంగ రచనా కాలం నుంచి సామాజిక న్యాయం అమలు కోసం తరతరాల నుంచి ఎదురు చూసిన నీళ్ళింకిన కళ్లు తాపత్రయంగా తెలంగాణ సచివాలయానికి పెట్టిన అంబేడ్కర్ పేరును చూసి పరవశిస్తున్నాయి.

భారతదేశ వ్యాప్తంగా అనేక ఎయిర్ పోర్టులకు, విద్యా సంస్థలకు, న్యాయ కళాశాలలకు, పార్కులకు, హాస్పిటల్స్‌కు, పలు ప్రభుత్వ బిల్డింగులకు, స్టేడియంలకు అనేక సంస్థలకు అంబేడ్కర్ పేరును వేల సంఖ్యలో పెట్టారు. కానీ దేశ చరిత్రలో సెక్రటేరియట్‌కు ఆయన పేరు పెట్టింది మాత్రం ఒక్క కేసీఆరే అన్నది గమనార్హం. అంబేడ్కర్ చేసిన జీవితకాల పోరాటానికి కొనసాగింపుగా దళితుల జీవన ముఖచిత్రాన్ని మార్చేందుకు 'దళిత బంధు' పథకాన్ని ప్రవేశపెట్టి ఎన్ని సమస్యలు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొంటూ ముందుకు పోతున్నారు తెలంగాణ ముఖ్యమంత్రి. నిరంతరం అంబేడ్కర్ స్ఫూర్తిని ఆవాహన చేసుకోవడానికి ఆయన పేరును రాష్ట్ర సచివాలయానికి పెడుతున్నారు. ప్రభుత్వానికి న్యాయవ్యవస్థ, చట్టసభలు, కార్యనిర్వాహక వ్యవస్థలు ప్రాణాల వంటివి. సెక్రటేరియట్ అన్నది చట్టసభలకు, కార్యనిర్వాహక వ్యవస్థకు ఉమ్మడి



కార్యక్షేత్రంగా నిలుస్తుంది. అటువంటి దానికి అంబేడ్కర్ పేరు పెట్టాలన్న ఆలోచన ఇప్పటిదాకా ఎవరికీ ఎందుకు రాలేదో కానీ... ఈ పనిని తెలంగాణ సీఎం చేసినందుకు దేశం ఆయనను అభినందిస్తోంది. ఈ అభినందనను మొత్తం తెలంగాణ సమాజానికి దక్కిన గౌరవంగా భావించాలి.

ప్రాథమిక హక్కులను కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వానిదైతే ఆదేశిక సూత్రాలను అమలు చేయవలసిన బాధ్యత సెక్రటేరియట్‌కు ఉంటుంది. ఏ సెక్రటేరియట్ అయితే ఆదేశిక సూత్రాల అమలుకు దూరంగా ఉంటుందో అది భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉన్నట్లుగానే భావించాలి. అసమానతలు తగ్గాలని భారత రాజ్యాంగం చెప్పింది. రాజ్యాంగాన్ని అమలు చేసే కర్తవ్యం సెక్రటేరియట్‌కే ఉంటుంది. దళితులు, ఆదివాసీలు, బీసీలు, మైనారిటీలు, సంచార జాతులు, వృద్ధులు, ఆసరా కోరుకునే వాళ్లు అందరికీ వైద్య, విద్యావకాశాలు కలిగించటం ప్రభుత్వ సామాజిక బాధ్యత. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు మొత్తం ప్రభుత్వాలు చేపట్టవలసిన సంక్షేమ కార్యక్రమాలను గురించే చెపుతున్నాయి. ఈ సూత్రాలను ఆచరణలో ఉంచడం ద్వారా తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

సగటు మనిషి ఆదాయం క్రమంగా పెరుగుతోంది. ధనికులు, పేదల మధ్య తేడాలు అంత భయంకరంగా లేవు. తెలంగాణ ప్రభుత్వం రైతులు, దళితులపై పెట్టుబడులు పెడుతోంది. వాటికి తగిన ఫలితాలూ వస్తున్నాయి. తెలంగాణ సర్కార్ రాజ్యాంగ స్ఫూర్తితో నడుస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధిలో దేశంలోనే ముందంజలో ఉంచింది. సీఎం ఏదైతే మాట్లాడుతున్నారో దాన్ని సరిగ్గా అమలుచేసి చూపుతున్నారు. తెలంగాణను దేశానికే ధాన్యాగారంగా మార్చారు. వలసలు తగ్గాయి. గ్రామాల్లో పనులు సురువయ్యాయి. గ్రామాలు పచ్చాపచ్చగా మెరుగుపడుతున్నాయి. కాళేశ్వరాన్ని కట్టి చూపించారు. తెలంగాణ దేశానికి అభివృద్ధి నమూనాగా మిగిలింది. దేశంలో ఎక్కడాలేని విధంగా అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహం తెలంగాణలో నిర్మితమవుతూ ఉంది. రైతురాజ్యానికి బీజాలు పడ్డాయి. రైతులకు ఉచిత విద్యుత్తును అందిస్తున్నారు. అనుకున్న పనిని పటిష్ఠంగా చేయగలిగిన శక్తిమంతమైన నాయకునిగా కేసీఆర్ నిలిచారు. చట్టసభలకు, కార్యనిర్వాహక వ్యవస్థకు దూరాన్ని చెరిపేసిన ప్రభుత్వంగా తెలంగాణ ప్రభుత్వం నిలిచింది. రాజ్యాంగం ఎవరి మీద దృష్టి పెట్టమని చెప్పిందో దానిమీదనే ముఖ్యమంత్రి దృష్టి పెట్టారు. తెలంగాణ సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టడమే కాకుండా ఆయన స్ఫూర్తితోనే కార్యనిర్వాహకునిగానూ పనిచేసి చూపెడుతున్నారు.

వ్యాసకర్త ఛైర్మన్, తెలంగాణ సాహిత్య అకాడమి

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి: శు.త్రయోదశి సా.6.58 వరకు, తదుపరి చతుర్దశి, నక్షత్రం: ఆరుద్ర ఉ.6.50 వరకు, తదుపరి పునర్వసు, వర్జ్యం: రా.8.04 నుండి 9.50 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.50 నుండి 9.35 వరకు, అమృతఘడియలు: లేవు; రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు, యమగండం: ప.3.00 నుండి 4.30 వరకు, సూర్యోదయం: 6.36, సూర్యాస్తమయం: 5.52

పంటలకు 'కట్'కట

▶ మొదటి పేజీ తరువాయి

ఇవ్వడం లేదు. ఇప్పుడు ఎండలు కొడ్తున్నాయి. ఇన్ని రోజుల్లాగా కాకుండా ఇప్పుడు పంటలకి వాటర్ అవసరం. మందు కొడ్దామన్నా నీళ్లు లేవు. ఒకసారేమైన (కరెంట్) ఆన్ చేయగలుగుతరా సర్?

ఏఈ: లేదండి.. సాధ్యం కాదు. పై నుంచి ఆర్డర్స్ కదా. మనం ఏమీ చేయలేం.

రైతు: 24 గంటలని చెప్పి ఇట్లా కట్ చేస్తే మా పంటలు ఏం కావాలి? ఇప్పుడు కరెంట్ తీస్తే ఎట్లా?

- మహబూబాబాద్ జిల్లా గూడూరుకు చెందిన ఓ రైతు, విద్యుత్ శాఖ ఏఈ మధ్య ఇటీవల జరిగిన ఈ ఫోన్ సంభాషణ రాష్ట్రంలో వ్యవసాయ విద్యుత్ సరఫరా పరిస్థితికి అద్దం పడుతోంది. ఆ రైతు కాల్‌ను రికార్డు చేసి సోషల్ మీడియాలో పెట్టడంతో వైరల్‌గా మారింది.

సాక్షి, హైదరాబాద్/
సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్


జనగామ జిల్లా గానుగుపహాడ్‌లో సాగునీరందక నెర్రలుబారిన పొలం

రాష్ట్రంలో వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని ప్రభుత్వం చెప్తున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. అనధికారికంగా గణనీయ స్థాయిలోనే కోతలు అమలవుతున్నాయి. వ్యవసాయానికి కేవలం 8–10 గంటలు మాత్రమే.. అదీ ఉదయం, రాత్రి రెండు దఫాలుగా త్రీఫేజ్ కరెంట్ సరఫరా జరుగుతోంది. జిల్లాలు, సబ్‌స్టేషన్ల వారీగా సరఫరా వేళల్లో తేడాలు ఉంటున్నాయి. మధ్య మధ్యలో విద్యుత్ ట్రిప్ అవుతుండటంతో మోటార్లు ఆగిపోయి.. పంటలకు నీళ్లు అందడం లేదని రైతులు వాపోతున్నారు. వేసవికి ముందే కోతలు మొదలవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే నిర్మల్, గద్వాల, ఆదిలాబాద్ తదితర జిల్లాల్లో పలువురు రైతులు ఆందోళన బాట పట్టారు. విద్యుత్ వినియోగ అంచనాలు తప్పడం, భారీ నష్టాల నేపథ్యంలో బహిరంగ కొనుగోళ్లను తగ్గించడమే కోతలకు కారణమని ట్రాన్స్‌కో వర్గాలు చెప్తున్నాయి.

వినియోగ అంచనాలు తప్పడంతో..

రాష్ట్రంలో మొత్తం 1,65,48,929 విద్యుత్ కనెక్షన్లు ఉండగా.. గృహ విద్యుత్ కనెక్షన్లు 72.85 శాతం, వ్యవసాయ కనెక్షన్లు 15.49 శాతం, పరిశ్రమలు, ఇతర వాణిజ్య కనెక్షన్లు 11.66 శాతం ఉన్నాయి. లెక్కల ప్రకారం వ్యవసాయ కనెక్షన్ల సంఖ్య 27లక్షలకుపైగా ఉంటుంది. గత ఏడాదికి కంటే ఈసారి 5 నుంచి 10 శాతం వరకు విద్యుత్ వినియోగం పెరగొచ్చని అధికారులు అంచనా వేసుకుంటే.. ఇప్పటికే 15 నుంచి 20 శాతం వరకు పెరిగినట్టు సమాచారం.

భారీ నష్టాలు.. తగ్గిన కొనుగోళ్లు..

వ్యవసాయానికి 24 గంటల ఉచిత సరఫరాతో డిస్కంలపై భారం పడుతోంది. మరోవైపు కాళేశ్వరం, ఇతర ఎత్తిపోతల పథకాలతోపాటు ప్రభుత్వ శాఖలు/విభాగాల నుంచి రావాల్సిన రూ.వేల కోట్ల విద్యుత్ బకాయిలను ప్రభుత్వం చెల్లించక.. డిస్కంలు ఆర్థికంగా కుంగిపోయాయి. ఎన్నడూ లేనట్టుగా 2022–23లో రూ.5,597 కోట్ల మేర చార్జీలను పెంచినా డిస్కంల నష్టాలు తగ్గలేదు. ఈ నేపథ్యంలోనే బహిరంగ మార్కెట్ నుంచి విద్యుత్ కొనుగోళ్లను విద్యుత్ సంస్థలు తగ్గించుకున్నట్టు తెలుస్తోంది. గతంలో రోజుకు రూ.70–100 కోట్ల ఖర్చుతో 20–30 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను కొనుగోలు చేయగా.. ప్రస్తుతం రూ.20–30 కోట్లతో 5 మిలియన్ యూనిట్లలోపే కొనుగోలు చేస్తున్నట్టు సమాచారం.

వేసవిలో కష్టమే!

వచ్చే వేసవిలో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతుందని విద్యుత్ సంస్థలు అంచనా వేశాయి. ఇప్పటివరకు రాష్ట్రంలో గరిష్టంగా 14,160 మెగావాట్ల డిమాండ్ నమోదవగా.. ఈసారి 16,000 మెగావాట్ల వరకు ఎగబాకే అవకాశం ఉందన్నాయి. దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉండటంతో విద్యుత్ కొరత, ధరలు భారీగా పెరగొచ్చని అంటున్నాయి. దీనితో గృహ వినియోగానికీ కోతలు పెట్టక తప్పని పరిస్థితి ఉంటుందని ట్రాన్స్‌కో చెప్తోంది.

రోజంతా బావి వద్దనే..



యాసంగిలో రెండెకరాల్లో మొక్కజొన్న వేశా. పంట 45 రోజుల వయసులో ఉంది. పదిరోజులుగా కరెంటు సరిగా ఉండటం లేదు. త్రీఫేజ్ కరెంట్ తరచూ ట్రిప్ అవుతోంది. రెండు, మూడు గంటలు కూడా నీరు పారడం లేదు. రోజంతా పడిగాపులు కాస్తూ మోటార్ ఆన్ చేసుకోవాల్సి వస్తోంది. మరో 10 రోజులు ఇలాగే ఉంటే పంట దెబ్బతింటుంది.

– జంగిలి రవి, గుడ్డెలుగులపల్లి, దుగ్గొండి, వరంగల్

మేడారంలో ప్రత్యేక పూజలు



ఎస్ఎస్ తాడ్వాయి: ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారంలో సమ్మక్క, సారలమ్మ మినీ జాతర గురువారం రెండో రోజుకు చేరింది. బుధవారం మండమెలిగె పండుగతో జాతర ప్రారంభం కాగా.. రెండో రోజు ఆదివాసీ సంప్రదాయం ప్రకారం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. మేడారం, కన్నెపల్లి ఆదివాసీలు, గ్రామస్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సమ్మక్క సారలమ్మ పూజారులు వారి ఇళ్లలో కూడా అమ్మవార్లకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి జంపన్నవాగు వద్ద స్నానాలు ఆచరించారు. గద్దెల ప్రాంగణంలో మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి మొదలైన భక్తుల రద్దీ సాయంత్రం వరకు కొనసాగింది.

ఘనంగా నృసింహుడి ఎదుర్కోలు



యాదగిరిగుట్ట: పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీస్వామి, అమ్మవార్లకు గురువారం ఉదయం సింహ వాహనసేవ, రాత్రి ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు. ఆలయంలో ఉదయం హవన పూజలు, మూలమంత్ర, మూర్తిమంత్ర అనుష్టానాలు, పారాయణికులతో వేద పారాయణాలు జరిపించిన తర్వాత శ్రీస్వామి, అమ్మవార్లను సింహవాహనం సేవపై తిరువీధుల్లో ఊరేగించారు. సాయంత్రం జరిగిన ఉత్సవంలో శ్రీస్వామి వారిని అశ్వవాహనంపై మేళ తాళాలతో ఊరేగించి ఆలయ ముఖ మండపంలో ఎదుర్కోలు వేడుకలను ఘనంగా నిర్వహించారు.

కేసీఆర్‌కు బూట్లు కొనిచ్చేంత పెద్దదానివా?

నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



నర్సంపేట: 'చెప్పుల దుకాణం యజమానిలా మాట్లాడుతున్నావు, కేసీఆర్‌కు బూట్లు కొనిచ్చేంత పెద్దదానివా?' అని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిలను ఉద్దేశించి అన్నారు. గురువారం ఆయన వరంగల్ జిల్లా నర్సంపేటలోని క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, కేసీఆర్‌ను ఉద్దేశించి షర్మిల చేసిన వ్యాఖ్యలను ఖండించారు. నోటి దురుసు తగ్గించుకోవాలని హితవుపలికారు. వైఎస్.రాజశేఖరరెడ్డి కూడా పాదయాత్ర చేశారని, కానీ ఇలా చిల్లర మాటలు ఏనాడూ మాట్లాడలేదని అన్నారు. కేసీఆర్ కుటుంబంపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే పాదయాత్రను కచ్చితంగా అడ్డుకుంటామన్నారు.

750 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం

సింగరేణి సీఎండీ శ్రీధర్



సాక్షి, హైదరాబాద్: ఇకపై రోజుకు 2.30 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణాకు చర్యలు తీసుకోవాలని సింగరేణి బొగ్గు గనుల సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్ ఆదేశించారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో 750 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. ఒడిశాలోని నైనీ, కొత్తగూడెంలో వీకే ఓపెన్ కాస్టు నుంచి 80 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిపితే 12 శాతం వృద్ధితో వార్షిక లక్ష్యాన్ని చేరుకోగలమని ఆయన స్పష్టం చేశారు.

కేసీఆర్ ఒక్కరోజు పాదయాత్రకు రావాలి

- అందుకు ఆయనకు షూస్ గిఫ్ట్‌గా పంపుతున్నా
- వరంగల్ జిల్లాలో మళ్లీ పాదయాత్ర ప్రారంభిస్తున్నా
- వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల


బూట్లు చూపిస్తున్న వైఎస్ షర్మిల

సాక్షి, హైదరాబాద్/చెన్నారావుపేట/నెక్కొండ: 'పాదయాత్ర ఒక యజ్ఞం.. అది అందరికీ సాధ్యం కాదు'అని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. గురువారం ఆమె లోటస్‌పాండ్‌లోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వం వరంగల్ జిల్లాలో ఎక్కడైతే తన ప్రజాప్రస్థానం పాదయాత్ర ఆపిందో అక్కడి నుంచే మళ్లీ మొదలుపెడుతున్నట్లు తెలిపారు. పాదయాత్రను తిరిగి ప్రారంభిస్తున్నందున గవర్నర్‌ను కలవడం కుదరలేదన్నారు. తాను ఎవరినీ వ్యక్తిగతంగా విమర్శించనని, ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోకపోతే ప్రశ్నిస్తానన్నారు. తెలంగాణ ప్రజలను కేసీఆర్ ఘోరంగా మోసం చేశారన్నారు. కేసీఆర్ కారణంగా దాదాపు 16 లక్షల మంది రైతులు డిఫాల్టర్లుగా నిలబడ్డారన్నారు. దమ్ముంటే, తన పాలనపై నమ్మకం ఉంటే కేసీఆర్.. ఒక్క రోజు ఈ బూట్లు వేసుకొని పాదయాత్రకు రావాలని ఆమె సవాల్ విసిరారు. తనతో పాదయాత్రకు వచ్చి ప్రజలకు సమస్యలు ఏమీ లేవని రుజువు చేయాలన్నారు. సమస్యలు లేవని చూపిస్తే తాను ముక్కు నేలకు రాసి, రాజకీయాలు మానేసి.. ఇంటికి వెళ్లిపోతానన్నారు. సమస్యలు ఉన్నాయని తేలితే కేసీఆర్ తన పదవికి రాజీనామా చేసి దళితుడిని సీఎం చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ తమతో పాదయాత్రకు రావడానికి బూట్లు కూడా పంపిస్తున్నామన్నారు.

కేసీఆర్ పాలనకు అంతం పలకాలి

హామీలను అమలు చేయని కేసీఆర్ పాలనను అంతం చేయాలని వైఎస్ షర్మిల అన్నారు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం శంకరంతండాలో రెండు నెలల క్రితం ఆగిన చోట నుంచే గురువారం సాయంత్రం 4.30 గంటలకు ఆమె ప్రజాప్రస్థానం పాదయాత్రను తిరిగి ప్రారంభించారు. సూరిపెల్లి క్రాస్ రోడ్డు నుంచి తోపనగడ్డ తండా మీదుగా నెక్కొండకు పాదయాత్ర చేరింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసీఆర్ రూ.4 లక్షల కోట్ల అప్పును ఎవరి కోసం తీసుకుని ఖర్చు చేశారో ప్రజలకు చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు.

బెంచీపై కూర్చునే విషయంలో ఘర్షణ

ఛాతీపై కొట్టడంతో విద్యార్థి మృతి

- నిజామాబాద్ జిల్లాలోని మైనారిటీ గురుకులంలో ఘటన

డిచ్‌పల్లి(నిజామాబాద్ రూరల్): మెస్ హాల్‌లోని బెంచీ మీద కూర్చునే విషయమై ఇద్దరు విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరుమృతి చెందారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం బర్ధిపూర్ శివారులోని తెలంగాణ మైనారిటీ గురుకుల బాలుర పాఠశాలలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, మృతుడి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం... నిజామాబాద్ నగరంలోని గౌతంనగర్‌కు చెందిన ఓ విద్యార్థి(14) బర్ధిపూర్ మైనారిటీ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. మధ్యాహ్న భోజన సమయంలో మెస్ హాల్‌లోని బెంచీ మీద కూర్చునే విషయమై ఈ విద్యార్థితో పాటు మరో విద్యార్థి పోటీపడ్డారు. 'నేను ముందుగా వచ్చానంటే, నేను ముందుగా వచ్చాను'అని ఇద్దరూ గొడవపడ్డారు. సదరు విద్యార్థి ఛాతీపై పిడికిలి బిగించి బలంగా కొట్టడంతో నేలపై బోర్లా పడిపోయాడు. ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు వెంటనే వచ్చి బాధిత విద్యార్థిని పైకి లేపేందుకు యత్నించగా, అప్పటికే అపస్మారకస్థితికి చేరుకున్నాడు. ఆందోళన చెందిన ఉపాధ్యాయులు ఈ విషయాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ ఎండీ జమీల్‌కు చేరవేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి బాధిత విద్యార్థిని తరలించగా వైద్యులు పరీక్షించి, అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. ఉపాధ్యాయులు ఇచ్చిన సమాచారం మేరకు ఆస్పత్రికి చేరుకున్న బాధితుడి తల్లి, కుటుంబీకులు, బంధువులు మృతదేహం వద్ద కన్నీరుమున్నీరుగా విలపించారు. విద్యార్థి మృతిపై పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది భిన్నమైన కథనాలు చెప్పడంతో అతడి కుటుంబీకులు, బంధువులు ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. వెంటనే ప్రిన్సిపాల్‌సహా బాధ్యులైన సిబ్బందిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు డిచ్‌పల్లి ఎస్సై కె.గణేశ్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తగా మైనారిటీ గురుకుల పాఠశాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మూడో రోజూ కొనసాగిన ఐటీ సోదాలు

- వెంకట్రామిరెడ్డి, అతడి పీఏ ఇళ్లలో తనిఖీలు
- వర్టెక్స్, ముప్పా సంస్థల్లోనూ... పలు కీలక పత్రాల స్వాధీనం

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డితోపాటు అతడి కుటుంబ సభ్యుల ఇళ్లు, కార్యాలయాల్లో వరుసగా మూడోరోజూ ఆదాయపు పన్ను శాఖ తనిఖీలు కొనసాగాయి. అలాగే, వర్టెక్స్ హోమ్స్, ముప్పా ప్రాపర్టీస్, వసుధ ఫార్మాకెమ్ లిమిటెడ్ సంస్థల్లోనూ సోదాలు జరిగాయి. గురువారం నాటి సోదాల్లో తెల్లాపూర్ రాజపుష్ప లైఫ్ స్టైల్ సిటీలోని వెంకట్రామిరెడ్డి నివాసంతోపాటు ఆయన పీఏ నరేందర్‌రెడ్డి ఇంట్లోనూ ఐటీ అధికారులు తనిఖీలు నిర్వహించినట్టు తెలిసింది. రాజపుష్ప డైరెక్టర్లు, కీలక ఉద్యోగులు కలిపి మొత్తం పది చోట్ల తనిఖీలు కొనసాగినట్టు సమాచారం. అదేవిధంగా గచ్చిబౌలిలోని ముప్పా ప్రాపర్టీస్ ప్రధాన కార్యాలయంతోపాటు సంస్థ ఇతర కార్యాలయాల్లోనూ సోదాలు నిర్వహించిన అధికారులు పలు వివరాలు సేకరించినట్టు తెలిసింది. స్థిరాస్తి వ్యాపారంలో కొన్నేళ్లుగా వర్టెక్స్ హోమ్స్ సంస్థ జరిపిన లావాదేవీలపైనా ఆరా తీశారు.

హైదరాబాద్‌కు వసుధ ఎండీ?

ఐటీ అధికారుల సోదాల విషయం తెలుసుకుని గుంటూరుకు వెళ్లిన వసుధ ఫార్మా కంపెనీ ఎండీ ఎంపీ రామరాజును ఐటీ అధికారులు గురువారం హైదరాబాద్‌కు రప్పించినట్టు సమాచారం. సోదాలు చేస్తున్న అధికారులు పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

పాలు అనుకుని పురుగు మందు తాగేశారు

- ములుగు జిల్లాలో ఘటన

వెంకటాపురం(ఎం): ముగ్గురు విద్యార్థులు బాటిల్‌లో ఉన్న పురుగు మందును పాలు అనుకుని తాగేశారు. ములుగు జిల్లా వెంకటాపురం (ఎం) మండలం కేశవపురం పరిధిలోని ఒడ్డెరగూడెం ప్రాథమిక పాఠశాలలో గురువారం ఈ ఘటన జరిగింది. పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న హారపెల్లి అక్షర, సాదు అఖిల, 5వ తరగతి చదువుతున్న సాదు ఐశ్వర్య కలసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ క్రమంలో అక్షర తన బ్యాగులోని పెట్ బాటిల్‌లో ఉన్న పురుగు మందును పాలు అనుకుని తాగింది. తర్వాత పక్కనే ఉన్న అఖిల, ఐశ్వర్యకు కూడా ఇవ్వడంతో వారు కూడా పురుగు మందును తాగారు. విషయం తెలుసుకున్న ప్రధానోపాధ్యాయుడు రాజేశ్ ముగ్గురు పిల్లలను ములుగు ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం పిల్లల ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు.

ఏడుగురు మావోయిస్టు మిలీషియా సభ్యుల అరెస్టు

భద్రాచలం అర్బన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం కొండవాయి సమీప అటవీప్రాంతంలో చేపట్టిన తనిఖీల్లో ఆరుగురు నిషేధిత మావోయిస్ట్ పార్టీ మిలీషియా సభ్యులు, ఒక గ్రామకమిటీ అధ్యక్షుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు భద్రాచలంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను ఏఎస్పీ పరితోష్ పంకజ్ వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా కిష్టారం, కుపాడ్ గ్రామాలకు చెందిన కల్ము సత్యం, కల్ము జోగా, మడివి మంగ, మడకం అయిత, కికిడి జోగా, వండో ఉంగా, కల్ము భీమా గత మూడేళ్లుగా మావోయిస్టు పార్టీకి చెందిన విప్లవ ప్రజాసంఘం(ఆర్‌పీసీ) మిలీషియా సభ్యులుగా పనిచేస్తున్నారని తెలిపారు. తెలంగాణ– ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలో మావోయిస్టు పార్టీ నాయకులు ఆదేశాల ప్రకారం చట్టవ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తుండటమే కాక, పోలీసులను మట్టుబెట్టేందుకు కొండవాయి సమీపాన ప్రెషర్ మైన్స్ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం చర్ల పోలీసులు, సీఆర్‌పీఎఫ్ 141 'బీ'కంపెనీ ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో ఈ ఏడుగురు పట్టుబడ్డారని ఏఎస్పీ తెలిపారు. సమావేశంలో చర్ల, భద్రాచలం సీఐలు బి.అశోక్, నాగరాజురెడ్డి, సీఆర్‌పీఎఫ్ 141 బెటాలియన్ అధికారులు లతీఫ్ కుమార్ సాహు, కమల్ వీర్ యాదవ్ పాల్గొన్నారు.


మిలీషియా సభ్యుల వివరాలు వెల్లడిస్తున్న భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్

'పక్షి నడక'కు వేళాయె..!

రేపు రెండో విడత బర్డ్‌వాక్ ఈవెంట్

ముందస్తుగా పేర్ల నమోదుకు సూచన

జన్నారం (ఖానాపూర్): పక్షుల పండుగకు వేళయింది. రెండోసారి బర్డ్‌వాక్ నిర్వహణకు అటవీ శాఖ సమాయత్తమైంది. కవ్వాల్ టైగర్ జోన్‌లోని మంచిర్యాల జిల్లా జన్నారం అటవీ డివిజన్‌లో పక్షులను తిలకించేందుకు బర్డ్‌వాక్ పేరిట అవకాశం కల్పిస్తోంది. గత ఏడాది ఫిబ్రవరిలో మొదటిసారి బర్డ్‌వాక్ నిర్వహించగా ఢిల్లీ, మహారాష్ట్ర, ఏపీ, తదితర రాష్ట్రాల నుంచి అనేకమంది పక్షి ప్రేమికులు, వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్లు వచ్చి పక్షులను తమ కెమెరాల్లో బంధించారు. ఈసారి మరింత ఎక్కువ మంది వచ్చే అవకాశం ఉండటంతో రెండు దఫాలుగా నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 4, 5 తేదీల్లో మొదటి దఫా, 18, 19 తేదీల్లో రెండో దఫా బర్డ్ వాక్ నిర్వహించనున్నారు.

బసకు ఏర్పాట్లు

పక్షి ప్రేమికులు అడవిలోనే ఒక రాత్రి బస చేసేందుకు అటవీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జన్నారం అటవీ డివిజన్‌లోని గొండుగూడ, ఇందన్‌పల్లి వాచ్ టవర్ల ప్రాంతాల్లో టెంట్లు వేస్తున్నారు. తెల్లవారు జామునే పక్షులను కెమెరాల్లో బంధించేందుకు వీలుగా ఆ సమీప ప్రాంతాల్లో నివాసాలు ఏర్పాటు చేశారు. ఉదయాన్నే బైసన్‌కుంట, మైసమ్మ కుంట, కల్పకుంట ప్రాంతాల్లో బర్డ్‌వాక్‌కు ఏర్పాట్లు చేశారు.


గత సంవత్సరం నిర్వహించిన బర్డ్ వాక్ ఈవెంట్‌లో పక్షి ప్రేమికులు

నిబంధనలు ఇవీ

బర్డ్ వాక్‌కు వచ్చే పక్షి ప్రేమికులు రూ.2 వేలు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఒక్కసారి రిజిస్ట్రేషన్ అయ్యాక డబ్బులు తిరిగి ఇవ్వడం, వ్యక్తులను మార్చడం కుదరదు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తికి ఆహారం, ఆవాసంతోపాటు స్థానికంగా రవాణా సౌకర్యం ఉంటుంది. డార్క్ బ్రౌన్ లేదా గ్రీన్ కలర్ దుస్తులు వేసుకోవాలి. వాటర్‌బాటిల్, బెడ్‌షీట్, షూస్, టార్చ్, మస్కిటో కాయిల్ వెంట తెచ్చుకోవాలి. ఎమర్జెన్సీ మెడిసిన్ అవసరం ఉన్న వారు దాన్ని కూడా తెచ్చుకోవాలి. ఆల్కహాల్, సిగరేట్ నిషేధం.

రెండు దఫాలుగా నిర్వహిస్తాం: సిరిపురం మాధవరావు, డిప్యూటీ కన్జర్వేటర్

గత సంవత్సరం బర్డ్‌వాక్‌కు చాలామంది పేర్లు నమోదు చేసుకున్నారు. డిమాండ్ ఎక్కువగా ఉన్నందున ఈసారి రెండుసార్లు బర్డ్‌వాక్ నిర్వహిస్తున్నాం. రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికే సౌకర్యాలు కల్పిస్తాం. పూర్తి వివరాలు, రిజిస్ట్రేషన్ కోసం రేంజ్ అధికారి హఫీజుద్దీన్‌ను 7337552150 నంబరులో సంప్రదించాలి.

క్లుప్తంగా...

పెరిగే భూతాపాన్ని ఆపలేం!

బెర్లిన్: భూతాపం(గ్లోబల్ వార్మింగ్) పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్‌కే పరిమితం చేయాలన్న పారిస్ ఒప్పందం ఆచరణ సాధ్యమయ్యేలా ప్రస్తుతం కనిపించడం లేదని జర్మనీ పరిశోధకులు తేల్చిచెప్పారు. అనుకున్న లక్ష్యం సాధించాలంటే సామాజికమార్పు తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఈ మేరకు జర్మనీలోని యూనివర్సిటీ హాంబర్గ్ క్లస్టర్ ఆఫ్ ఎక్సలెన్స్ 'క్లైమేట్, క్లైమాటిక్ చేంజ్, సొసైటీ(క్లిక్స్) పేరిట ఒక నివేదిక విడుదల చేసింది. వాతావరణ మార్పులపై యుద్ధం అనేది కొత్త కోణంలో జరగాలని సైంటిస్టులు అభిప్రాయపడ్డారు. వాతావరణ మార్పులకు అడ్డుకట్ట వేయాలన్న ఆశయాలు కాగితాలకే పరిమితం అవుతున్నాయని, అభివృద్ధి పేరిట జరుగుతున్న కార్యక్రమాలు, ప్రపంచ పరిణామాలను గమనిస్తే భూతాపం పెరుగుదలను 1.5 డిగ్రీలకు పరిమితం చేయాలన్న లక్ష్యం ఆచరణ సాధ్యం కాదని తేలిపోతుందని 'క్లిక్స్' ప్రతినిధి అనితా ఏంగెల్స్ చెప్పారు.

విద్వేష ప్రసంగాలను ఆపాలని ఆదేశించినా చర్యల్లేవు

న్యూఢిల్లీ: విద్వేష ప్రసంగాల కట్టడికి చర్యలు తీసుకోవాలని తాము పదేపదే ఆదేశాలిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని గురువారం సుప్రీంకోర్టు విచారం వ్యక్తం చేసింది. విద్వేష ప్రకటనలను అడ్డుకోవాలంటూ వస్తున్న అర్జీలపై అవే ఉత్తర్వులివ్వాల్సి రావడం ఇబ్బందికరంగా ఉంటోందని వ్యాఖ్యానించింది. హిందూ జన్ ఆక్రోశ్ మోర్చా ఈ నెల 5న ముంబైలో తలపెట్టిన ర్యాలీని నిషేధించాలని, ఆ సంస్థ మత విద్వేషాలను పెంచుతోందంటూ దాఖలైన పిటిషన్‌పై ధర్మాసనం విచారణ చేపట్టింది. 'ఇలాంటి వాటిపై ఇప్పటికే పలుమార్లు ఆదేశాలిచ్చాం. యంత్రాంగం నుంచి చర్యలు కరువయ్యాయి. అందుకే ఇలా ప్రతి కార్యక్రమానికి ఉత్తర్వులివ్వాల్సి రావడం మాకు చిరాకు కలిగిస్తోంది' అని ధర్మాసనం పేర్కొంది.

వీఆర్ఎస్ తీసుకుంటే తర్వాతి పే స్కేల్ రివిజన్ వర్తించదు

న్యూఢిల్లీ: స్వచ్ఛంద పదవీ విరమణ(వీఆర్ఎస్) తీసుకున్న ఉద్యోగులకు ఆ తర్వాతి కాలంలో వచ్చిన పే స్కేల్ రివిజన్‌లను వర్తింపజేయడం కుదరదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. మహారాష్ట్ర స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్‌లో వీఆర్ఎస్ తీసుకున్న కొందరు మాజీ ఉద్యోగులు వేసిన పిటిషన్ విచారణ సందర్భంగా కోర్టు పై విధంగా స్పందించింది. ' జీతభత్యాల పెంపు, పే స్కేల్ రివిజన్ అనేది పూర్తిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధాన నిర్ణయం. ఉద్యోగుల జీవితాలతో ముడిపడిన అంశమైనందున ఈ విషయం పరిశీలించే బాధ్యత ప్రభుత్వాలదే. ద్రవ్యోల్బణం, జీవన వ్యయాలకనుగుణంగా జీతాలు ఉండాలి' అని తెలిపింది.

పార్లమెంట్‌లో 'హిండెన్‌బర్గ్' ప్రకంపనలు

- అదానీ గ్రూప్‌పై ఇచ్చిన నివేదికపై తక్షణమే చర్చించాలి
- ఉభయ సభల్లో విపక్షాల పట్టు
- వాయిదా తీర్మానాల తిరస్కరణతో గందరగోళం
- సభను అడ్డుకున్న విపక్ష ఎంపీలు.. వెల్‌లో నిరసన
- లోక్‌సభ, రాజ్యసభ నేటికి వాయిదా



ఢిల్లీలో విజయ్ చౌక్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఖర్గే, విపక్ష పార్టీల నేతలు

సాక్షి, న్యూఢిల్లీ: అదానీ గ్రూప్‌పై హిండెన్‌బర్గ్ ఇచ్చిన నివేదిక గురువారం పార్లమెంట్‌లో తీవ్ర ప్రకంపనలు సృష్టించింది. మార్కెట్ విలువను భారీగా కోల్పోతున్న అదానీ కంపెనీల్లో ఎల్ఐసీ, ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఆర్థిక సంస్థల పెట్టుబడుల అంశంపై తక్షణమే చర్చించాలంటూ విపక్షాలు చేపట్టిన ఆందోళనతో ఉభయ సభలు స్తంభించాయి. హిండెన్‌బర్గ్ నివేదికపై చర్చించాలని కాంగ్రెస్, బీఆర్ఎస్ సహా 9 విపక్షాల ఎంపీలు వెల్‌లోకి వచ్చి సభా కార్యక్రమాలను అడ్డుకున్నారు. దీంతో ఉభయ సభలు శుక్రవారానికి వాయిదా పడ్డాయి.

9 పార్టీల వాయిదా తీర్మానాలు

సభా కార్యకలాపాల ఆరంభానికి ముందే ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో విపక్ష నేతలు పార్లమెంట్ ప్రాంగణంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అదానీ అంశంపై కేంద్రం సమాధానం ఇచ్చేదాకా సభా కార్యక్రమాలు అడ్డుకోవాలని నిర్ణయించారు. దీనికి అనుగుణంగానే ఉభయ సభల్లో 9 పార్టీలు వాయిదా తీర్మానాలిచ్చాయి. లోక్‌సభలో కాంగ్రెస్ తరఫున మాణిక్యం ఠాగూర్, బీఆర్ఎస్ తరఫున నామా నాగేశ్వర్‌రావు, రాజ్యసభలో మల్లికార్జున ఖర్గే వాయిదా తీర్మానం ఇచ్చారు. ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభమైన వెంటనే స్పీకర్ ఓం బిర్లా.. జాంబియా నుంచి వచ్చిన పార్లమెంటరీ ప్రతినిధి బృందానికి స్వాగతం పలికారు. ప్రశ్నోత్తరాలు చేపట్టాలని నిర్ణయించారు. అయితే, అదానీ అంశంపై చర్చించేందుకు రూల్ 267 కింద తామిచ్చిన వాయిదా తీర్మానాలపై చర్చించాలని విపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. ప్రశ్నోత్తరాలకు సహకరించాలంటూ స్పీకర్ పదేపదే కోరినా వెనక్కి తగ్గలేదు. ఏకంగా వెల్‌లోకి దూసుకొచ్చి నినాదాలతో హోరెత్తించారు. దీంతో సభను స్పీకర్ మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభమయ్యాక విపక్ష ఎంపీలు ఆందోళనను కొనసాగించారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి జోక్యం చేసుకుంటూ సభా కార్యక్రమాలు సజావుగా సాగేందుకు సహకరించాలని కోరారు. అయినప్పటికీ విపక్ష సభ్యులు వెనక్కి తగ్గకపోవడంతో లోక్‌సభ శుక్రవారానికి వాయిదా పడింది. రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి కనిపించింది. సభను శుక్రవారానికి వాయిదా వేశారు.

జేపీసీ లేక సీజేఐ నేతృత్వంలో కమిటీ

అదానీ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాలని, ఇందుకోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) లేక సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. ఉదయం ఉభయ సభలు వాయిదా పడిన వెంటనే మల్లికార్జున ఖర్గే నేతృత్వంలోని విపక్ష ఎంపీలు విజయ్‌చౌక్‌లో విలేకరులతో మాట్లాడారు. ''మార్కెట్ విలువ కోల్పోతున్న సంస్థల్లో ఎల్ఐసీ, ప్రభుత్వ రంగ బ్యాంకులతో బలవంతంగా పెట్టుబడులు పెట్టించారు. దీనిపై చర్చించడానికి మేమిచ్చిన తీర్మానాన్ని సస్పెండ్ చేశారు. అదానీ అంశంపై పార్లమెంట్‌లో లోతుగా చర్చించాలి. అదానీపై విచారణ వివరాలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు బయటపెట్టాలి'' అని డిమాండ్ చేశారు.

సమగ్ర విచారణతోనే..: నామా, కేకే

అదానీ వ్యవహారంపై జేపీసీ లేక సీజేఐ కమిటీతో సమగ్ర విచారణ జరిపిస్తేనే వాస్తవాలు బయటకు వస్తాయని బీఆర్ఎస్ ఎంపీలు నామా నాగేశ్వర్ రావు, కె.కేశవరావు పేర్కొన్నారు. ఎల్ఐసీ సహా బ్యాంకుల్లో డబ్బులు దాచుకున్న పేదల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు.

జనం సొమ్మును లూటీ చేశారు

ఎల్ఐసీ, ఎస్‌బీఐ సహా పలు ప్రభుత్వ సంస్థలతో అదానీ గ్రూప్‌లో బలవంతంగా పెట్టుబడులు పెట్టించారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ఆరోపించారు. తాజా సంక్షోభం వల్ల ఆయా సంస్థలు భారీగా నష్టపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. కోట్లాది మంది భారతీయులు పొదుపు చేసుకున్న సొమ్ము ప్రమాదంలో చిక్కుకుందని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. అదానీ అంశంపై దర్యాప్తు జరిపించాలని విపక్షాలు కోరినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని జైరామ్ రమేశ్ మండిపడ్డారు. బ్యాంకుల్లో ప్రజలు దాచుకున్న డబ్బును అదానీ సంస్థల్లో పెట్టుబడి పెట్టారని, ఇప్పుడు వారంతా భయాందోళనకు గురవుతున్నారని సమాజ్‌వాదీ పార్టీ నేత రామ్‌గోపాల్ యాదవ్ చెప్పారు. జనం సొమ్మును అదానీ లూటీ చేశారని సీపీఎం నేత ఎలమారమ్ ధ్వజమెత్తారు. దీనిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. భారీ కుంభకోణం జరిగితే ప్రభుత్వం ఎందుకు నోరువిప్పడం లేదని ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్ నిలదీశారు.

అదానీ అంశంపై విపక్షాల ఐక్యత

ఏ తరహా దర్యాప్తు అనే డిమాండ్‌లో స్పష్టత కరువు

న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో నిరసన తెలిపే విషయంలో అదానీ–హిండెన్‌బర్గ్ అంశంపై మరింత దూకుడుగా ముందుకెళ్లాలని విపక్ష పార్టీలు ఏకాభిప్రాయానికొచ్చాయి. కానీ అదానీ షేర్ల వివాదంపై ఏ తరహా దర్యాప్తుకు డిమాండ్ చేయాలనే అంశంలో పార్టీల మధ్య ఏకాభిప్రాయం కరువైంది. పార్లమెంట్‌లో అదానీ అంశాన్ని చర్చించాలని పట్టుబట్టడం, ఇరు సభలూ వాయిదాపడిన తర్వాత కాంగ్రెస్ చీఫ్ ఖర్గే నేతృత్వంలో భావసారూప్యత ఉన్న పార్టీల నేతలు ఢిల్లీలో సమావేశమయ్యారు. అదానీ అంశంపై ఒక్కటిగా పోరాడాలని సమావేశంలో ఉమ్మడి నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలతో బలవంతంగా అదానీ గ్రూప్‌లో పెట్టుబడులు పెట్టించారని సమావేశంలో కొందరు నేతలు వ్యాఖ్యానించారు. అయితే, అదానీ గ్రూప్ లక్ష్యంగా విమర్శలు ఉండాలిగాని హిండెన్‌బర్గ్ రీసెర్చ్ పేరును ప్రస్తావించకూడదని, ప్రస్తావిస్తే విషయం భారత్ ఆవల, పక్కదారి తప్పుతుందని కొందరు అభిప్రాయపడ్డారు. సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)తో దర్యాప్తు చేయించాలన్న డిమాండ్‌ను ఖర్గే ప్రధానంగా ప్రస్తావించారు. సీపీఐ, సీపీఎం, సమాజ్‌వాదీ పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్ మాత్రం సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో విచారణకు డిమాండ్‌చేయాలని తమ అభిప్రాయం తెలిపాయి. కొందరు సెక్యూరిటీస్ , ఎక్సే్ఛంజ్ బోర్డ్(సెబీ) ఆధ్వర్యంలో దర్యాప్తు జరగాలన్నారు.

అవమానాలు, నిరాదరణ..

- రష్యా నుంచి వచ్చానని ఉక్రెయిన్ నెటిజన్లు ట్రోలింగ్
- విశ్వసుందరి పోటీల్లో పక్షపాతం జరిగిందని రష్యా భామ అన్నా లిన్నికోవా ఆవేదన



మాస్కో: అమెరికాలో ఇటీవల ముగిసిన విశ్వసుందరి పోటీలపై రష్యా అందాల భామ అన్నా లిన్నికోవా సంచలన ఆరోపణలు చేశారు. ఈ పోటీల సమయంలో తనను అందరూ దూరంగా పెట్టారని, తీవ్రమైన నిరాదరణ ఎదుర్కొన్నానని అన్నారు. ఈవెనింగ్ మాస్కో పత్రికకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ విశ్వసుందరి పోటీల్లో కూడా పక్షపాతం చూపించారని అమెరికా, ఉక్రెయిన్ అందాల బామలకే అందరూ అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారని విమర్శించారు. ఈ సారి మిస్ అమెరికా ఆర్‌బానీ గాబ్రియెల్ విశ్వసుందరి కిరీటం దక్కించుకున్న విషయం తెలిసిందే. ఈ పోటీల్లో తాను ఉక్రెయిన్ సోషల్ మీడియా నుంచి తీవ్రమైన నెగిటివిటీ ఎదుర్కొన్నానని, అక్కడ నెటిజన్లు తనని అవమానిస్తూ, బెదిరింపులకు గురి చేశారని వెల్లడించారు. ఉక్రెయిన్, స్విట్జర్లాండ్ నుంచి అందాల పోటీల్లో పాల్గొనడానికి వచ్చిన వారు తనని ఒక నిప్పుని చూసినట్టే చూశారని వెల్లడించారు. కానీ మిస్ వెనిజులా మాత్రం తనను ఎంతో బాగా చూశారని చెప్పారు. ' వెనిజులా నుంచి వచ్చిన అమందా దుదామెల్ ఎంతో మంచి మనసున్న అమ్మాయి. ఇతరులకి సాయంగా ఉంది' అని చెప్పుకొచ్చారు.

ఎట్టకేలకు సిద్దిఖీకి బెయిల్

లక్నో: ఉత్తరప్రదేశ్ జైల్లో రెండు సంవత్సరాలకు పైగా గడిపిన కేరళ పాత్రికేయుడు సిద్దిఖి కప్పన్ ఎట్టకేలకు బెయిల్‌పై గురువారం బయటకు వచ్చారు. 2020 అక్టోబర్‌లో యూపీలోని హత్రాస్‌లో దళిత యువతి అత్యాచారం, హత్య ఉదంతాన్ని కవర్ చేయడానికి వెళ్లిన కప్పన్‌ను పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. ఈ ఉదంతాన్ని కవర్ చేయడానికి వెళ్లిన కప్పన్‌ని చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, పాపులర్ ఫ్రంట్‌తో ఆయనకు సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలపై అదుపులోనికి తీసుకున్నారు. అప్పట్నుంచి ఆయన విచారణ ఖైదీగానే జైల్లో మగ్గిపోతున్నారు. ఎట్టకేలకు జైలు నుంచి విడుదలయ్యారు. ఉదయం 9.15 గంటలకి బయటకు వచ్చిన కప్పన్ తాను సుదీర్ఘమైన పోరాటాన్ని చేశానని చెప్పారు. అందుకే చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ రెండున్నరేళ్లలో కప్పన్ తల్లి కన్నుమూశారు. ఈ కేసులో సెప్టెంబర్‌లో సుప్రీం కోర్టు బెయిల్ ఇచ్చినప్పటికీ ఈడీ మనీలాండరింగ్ కేసు పెట్టడంతో మరికొన్నాళ్లు జైల్లో ఉండవలసి వచ్చింది.

బైడెన్ ప్రభుత్వంలో ఎన్నారైల పట్టు

అమెరికా హౌస్ కమిటీల్లో నలుగురు ఇండియన్ అమెరికన్లకు దక్కిన చోటు



ప్రమీల



అమిబేరా

వాషింగ్టన్: అమెరికా రాజకీయాల్లో ఇండియన్ అమెరికన్లకి ప్రాధాన్యత పెరుగుతోంది. కాంగ్రెస్ సభ్యులైన నలుగురు ఇండియన్ అమెరికన్లను అత్యంత ముఖ్యమైన హౌస్ పానెల్స్ సభ్యులుగా నియమించారు. ఇమిగ్రేషన్ శాఖలో అత్యంత శక్తిమంతమైన హౌస్ జుడీషియరీ కమిటీ ప్యానెల్ సభ్యురాలిగా కాంగ్రెస్ సభ్యురాలు ప్రమీల జయపాల్ నియమితులయ్యారు. అమెరికాలో ఛిన్నాభిన్నంగా మారిన ఇమిగ్రేషన్ వ్యవస్థని గాడిలో పెట్టడానికి అవకాశం ఇచ్చినందుకు జయపాల్ హర్షం వ్యక్తం చేశారు. ఇక ఇంటెలిజెన్స్‌కు సంబంధించి వ్యవహారాలను నడిపే కమిటీ సభ్యుడిగా అమిబేరాని నియమించారు. అమెరికా జాతీయ భద్రత అంశంలో ఇంటెలిజెన్స్ కమిటీ ప్రధాన పాత్ర పోషిస్తుంది. కాలిఫోర్నియా నుంచి ఆరు సార్లు కాంగ్రెస్‌కు ఎన్నికైన బేరా జాతి భద్రతకు సంబంధించిన కమిటీలో సభ్యుడు కావడం ఎంతో గర్వకారణమని వ్యాఖ్యానించారు. అమెరికా సహా ప్రపంచ దేశాలకు ముప్పుగా మారిన చైనా వ్యవహారాలపై కొత్తగా ఏర్పాటైన కమిటీలో సభ్యుడిగా రాజా కృష్ణమూర్తిని నియమించారు. మరొక ఇండియన్ అమెరికన్ ప్రజాప్రతినిధి రో ఖన్నాకి అమెరికా, చైనా మధ్య వ్యూహాత్మక పోటీకి సంబంధించిన కమిటీలో సభ్యుడిగా చోటు కల్పించారు. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా ఆర్థికంగా, భద్రతా పరంగా అమెరికా సవాళ్లు విసురుతున్న నేపథ్యంలో వాటిని ఎదుర్కోవడానికి వ్యూహరచన చేయాల్సిన అవసరం ఉందని కృష్ణమూర్తి అభిప్రాయపడ్డారు.

కశ్మీర్‌లో సెంట్ బాటిల్ ఐఈడీ బాంబ్

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లో పలు పేలుళ్లతో సంబంధమున్న లష్కరే తోయిబా ఉగ్రవాది ఆరిఫ్‌ను పోలీసులు రేసీ జిల్లాలో అరెస్ట్‌చేశారు. అతని వద్ద సుగంధ ద్రవ్య సీసాలో అమర్చిన అధునాతన పేలుడు పదార్థం(ఐఈడీ)ను స్వాధీనం చేసుకున్నారు. జమ్మూకశ్మీర్‌లో ఇలా పర్ఫ్యూమ్ బాటిల్‌లో ఐఈడీ బాంబ్‌ను స్వాధీనం చేసుకోవడం ఇదే తొలిసారి అని జమ్మూకశ్మీర్ డైరెక్టర్ జనరల్ దిల్బాగ్ సింగ్ చెప్పారు. స్ప్రే బటన్‌ను నొక్కడంతో యాక్టివేట్ అయిన ఆ బాంబ్‌ను నిర్వీర్యం చేసే పనిలో భద్రతా బలగాలు నిమగ్నమయ్యాయి. 'వాస్తవానికి ఆరిఫ్ ఉపాధ్యాయుడిగా 12 ఏళ్ల క్రితం ప్రభుత్వ ఉద్యోగంలో చేరాడు. మూడేళ్ల క్రితం కరాచీకి పారిపోయిన మేనమామ ద్వారా కశ్మీర్‌లోని లష్కరే ఉగ్రవాది ఖాసిమ్‌తో సంబంధం పెట్టుకుని ఉగ్రవాదిగా మారాడు' అని డీజీపీ చెప్పారు.

మేఘాలయలో బీజేపీ ఒంటరి పోరు

న్యూఢిల్లీ/షిల్లాంగ్: త్వరలో జరగనున్న మేఘాలయ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మొత్తం 60 సీట్లకు అభ్యర్థులను బరిలో నిలపనుంది. నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార నేషనలిస్ట్ డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ కూటమితో కలిసి 60 సీట్లకుగాను 20 చోట్ల పోటీ చేయనుంది. బీజేపీ కార్యదర్శి, ఈశాన్య రాష్ట్రాల కో–ఇన్‌చార్జి రితురాజ్ సిన్హా గురువారం ఢిల్లీలో మీడియాకు ఈ విషయం వివరించారు. తమ పార్టీ మేఘాలయలోని మొత్తం స్థానాలకు ఒంటరిగా పోటీ చేయనుండటం ఇదే మొదటిసారని చెప్పారు. సీఎం కాన్రాడ్ సంగ్మాకు పోటీగా సౌత్ తురా స్థానం నుంచి మాజీ తీవ్రవాది బెర్నార్డ్ మారక్ బరిలోకి దిగనున్నారు. మారక్ ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఉన్నారు.

అయోధ్య చేరుకున్న పవిత్ర సాలగ్రామ శిలలు



అయోధ్య: అయోధ్యలో నిర్మిస్తున్న రామమందిరం గర్భగుడిలో కొలువుతీరే బాలరాముడి విగ్రహ తయారీకి వినియోగించే పవిత్ర సాలగ్రామ శిలలను నేపాల్ నుంచి తెప్పించారు. దాదాపు ఆరు కోట్ల సంవత్సరాల పురాతన శిలలుగా చెప్పబడే ఈ శిలలను నేపాల్‌లోని మస్తాంగ్ జిల్లాలోని ముక్తినాథ్‌కు సమీపంలో కాళీ గండకీ నదీ ప్రవాహప్రాంతం నుంచి సేకరించారు. జానకీరాముల విగ్రహాలను చెక్కేందుకు 26 టన్నులు, 14 టన్నులు బరువైన ఈ రెండు శిలలను రోడ్డు మార్గంలో బుధవారం రాత్రి అయోధ్యకు తీసుకొచ్చారు. 51 మంది వైదికుల వేదమంత్రోచ్చారణల నడుమ శిలలను ఆలయానికి సంబంధించిన శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టుకు అందజేశారు. ఈ సందర్భంగా కరసేవక్‌పురంలో గురువారం మధ్యాహ్నం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శిలలను చూసి తరించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు, స్థానికులు తరలివచ్చారు. అంతకుముందు, సీతాదేవి జన్మస్థలంగా పేరొందిన నేపాల్‌లోని జనక్‌పూర్ నుంచి ఈ శిలల రోడ్డుమార్గ ప్రయాణం మొదలైంది.

జనం సొమ్మును బీజేపీ నేతలకు దోచిపెట్టే కుట్ర

బర్ధమాన్: సొంత పార్టీ నాయకులకు లబ్ధి చేకూర్చడానికి కేంద్రంలోని అధికార బీజేపీ ఆరాటపడుతోందని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ విమర్శించారు. ఇందుకోసం ఎల్ఐసీ, జాతీయ బ్యాంకుల్లో జనం దాచుకున్న సొమ్మును ఉపయోగించుకుంటోందని అన్నారు. ప్రజల డబ్బును సొంత పార్టీ నేతలకు దోచిపెట్టాలన్నదే బీజేపీ పన్నాగమని మండిపడ్డారు. ఆమె గురువారం పూర్వబర్ధమాన్ జిల్లాలో ఓ కార్యక్రమంలో మాట్లాడారు. కేంద్ర బడ్జెట్ అబద్ధాల పుట్ట అని దుయ్యబట్టారు. బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తర్వాత షేర్ మార్కెట్ భారీగా నష్ట పోయిందని గుర్తు చేశారు.

554 మంది జడ్జీల్లో 430 మంది జనరల్ కేటగిరీయే

న్యూఢిల్లీ: 2018 నుంచి హైకోర్టు జడ్జీలుగా నియమితులైన 554 మందిలో 430 మంది జనరల్ కేటగిరీకి చెందిన వారేనని న్యాయ శాఖ మంత్రి కిరెన్ రిజిజు రాజ్యసభలో తెలిపారు. మిగిలిన వారిలో 58 మంది ఇతర వెనుకబడిన కులాలకు, 19 మంది షెడ్యూల్ కులాలకు చెందిన వారు కాగా, కేవలం ఆరుగురు షెడ్యూల్ తెగలకు, 27 మంది మైనారిటీలని వివరించారు. మొత్తమ్మీద 84 మంది మహిళా జడ్జీలున్నారని చెప్పారు. మొత్తం జడ్జీల్లో జనరల్ కేటగిరీకి చెందిన వారే 77% పైగా ఉన్నారన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జీల నియామకాలకు రిజర్వేషన్లు లేవని మంత్రి పేర్కొన్నారు. అత్యున్నత న్యాయ వ్యవస్థలోనూ సామాజిక వైవిధ్యం సాధించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. జడ్జీల నియామకాలకు ప్రతిపాదనలు పంపే సమయంలో అర్హులైన ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, మహిళా జడ్జీల పేర్లను కూడా పరిశీలించాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులను కోరుతోందని వెల్లడించారు. 2018 నుంచి ఇప్పటి వరకు సుప్రీంకోర్టులో 30 మంది జడ్జీలు నియమితులయ్యారని చెప్పారు. దేశవ్యాప్తంగా ఉన్న జిల్లా జడ్జీల్లో 612 మంది ఎస్సీలు, 204 మంది ఎస్టీలు, 1,329 మంది ఓబీసీలు, 1,406 మంది మహిళలు ఉన్నారని ఒక ప్రశ్నకు సమాధానంగా పేర్కొన్నారు.

ఆస్ట్రేలియా కరెన్సీపై బ్రిటిష్ రాజరికం కనుమరుగు

కాన్‌బెర్రా: ఆస్ట్రేలియా మరో బ్రిటిష్ వలసపాలన తాలూకు గుర్తును చెరిపేసుకుంటోంది. అక్కడి 5 ఆస్ట్రేలియా డాలర్ల కరెన్సీ నోటుపై ఇన్నాళ్లూ బ్రిటిష్ రాణి ఎలిజబెత్ ముఖచిత్రాన్ని ముద్రించారు. రాణి ఎలిజబెత్ అస్తమయం తర్వాత రాజుగా పగ్గాలు చేపట్టిన కింగ్ ఛార్లెస్ ముఖచిత్రాన్ని 5 డాలర్ల కరెన్సీ నోటుపై ముద్రించాలని భావించట్లేదని ఆస్ట్రేలియా కేంద్ర బ్యాంక్ తాజాగా ప్రకటించింది. అయితే, ఛార్లెస్ ఫొటో ఉండే కొత్త నాణేలను మాత్రం ఈ ఏడాది చివరిలోపు చలామణిలోకి తీసుకురానున్నారు. ఇన్నాళ్లూ ఒక్క 5 డాలర్ల నోటుపైనే బ్రిటిష్ రాజరిక ఆనవాళ్లు ఉండేవి. ఎలిజబెత్ ఫొటో తొలగింపుతో నోట్లపై నామరూపాలు పోయినట్లే. ఈ మార్పుపై ప్రభుత్వంతో చర్చించాకే ఈ తుది నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర బ్యాంక్ వెల్లడించింది. ఆస్ట్రేలియా రాజ్యాంగం ప్రకారం బ్రిటిష్ రాజరికమే అత్యున్నత పరిపాలన హోదాలో ఉంది. కానీ మారిన వర్తమాన రాజకీయ, భౌగోళిక పరిస్థితుల్లో ఆ రాజరికం కేవలం అలంకారప్రాయంగా తయారైంది. 'కొత్త నోటుకు ఒకవైపు ఆస్ట్రేలియా పార్లమెంట్, మరో వైపు ఆస్ట్రేలియా తొలితరం స్థానికుల లేదా దేశ అద్భుత ప్రకృతి అందాల ఫొటోను పొందుపరుస్తాం' అని ఆర్థిక మంత్రి జిమ్ చామర్స్ అన్నారు. కరెన్సీపై రాజరికాన్ని వదలుకోవడంపై అక్కడి రాజకీయవర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గణతంత్రదేశంగా ఆవిర్భవించే ప్రయత్నం చేస్తోందని కొందరు ఎంపీలు వ్యాఖ్యానించారు.

నాసా విద్యుత్ విమానం వచ్చేస్తోంది

కేంబ్రిడ్జ్: గగనతలంలో భారీ స్థాయిలో కర్బన ఉద్గారాలను వెదజల్లే చిన్న విమానాలకు చరమగీతం పాడేందుకు అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా నడుం బిగించింది. వాయుకాలుష్యం లేని అధునాతన విద్యుత్ విమానాన్ని సిద్ధంచేస్తోంది. ఈ ప్రయోగాత్మక విమానానికి ఎక్స్–57 అని నామకరణం చేసింది. ఈ ఏడాదే ఈ బుల్లి విమానం గగనతల అరంగేట్రం చేయనుంది. దీనిని 14 ప్రొపెల్లర్లను అమర్చారు. ఇటలీ తయారీ టిక్నామ్ పీ2006టీ నాలుగు సీట్ల విమానానికి ఆధునికత జోడించి లిథియం అయాన్ బ్యాటరీలతో పనిచేసేలా కొత్త ఎలక్ట్రిక్ ఏరోప్లేన్‌ను సిద్ధం చేస్తున్నారు. సాధారణంగా ఉండే రెండు రెక్కలకే అటు నుంచి ఇటు చివరిదాకా సమ దూరంలో ఎక్కువ బ్యాటరీలు, చిన్న మోటార్ల కలయితో ప్రొపెల్లర్లను ప్రయోగాత్మక డిజైన్‌లో అమర్చడం విశేషం. ప్రయాణసమయంలో ప్రొపెల్లర్‌తో పనిలేనపుడు వెంటనే దాని బ్లేడ్లు వెనక్కి ముడుచుకుంటాయి. దీంతో వేగం తగ్గే ప్రసక్తే లేదు. కొత్త డిజైన్ ప్రొపెల్లర్లతో శబ్దకాలుష్యం తక్కువ. ఎక్కువ సాంద్రత ఉండే గాలిలోనూ అత్యంత వేగంగా దూసుకెళ్లేలా 11 బ్లేడ్లతో ప్రొపెల్లర్లను రీడిజైన్ చేశారు. ప్రొపెల్లర్లతో జనించే అత్యంత అధిక శక్తి కారణంగా ఈ విమానాలకు పొడవాటి రన్‌వేలతో పనిలేదు. అత్యల్ప దూరాలకు వెళ్లగానే గాల్లోకి దూసుకెళ్లగలవు. ప్రస్తుతానికి 200 కిలోమీటర్లలోపు, గంటలోపు ప్రయాణాల కేటగిరీలో దీనిని ప్రవేశపెట్టాలని యోచిస్తున్నారు.

ఈడీ చార్జిషీట్‌లో కేజ్రీవాల్ పేరు

- లిక్కర్ స్కామ్ అనుబంధ చార్జిషీట్‌లో చేర్చిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్
- విజయ్‌నాయర్ తన మనిషి అని, ఆయన్ను నమ్మొచ్చని ఢిల్లీ సీఎం చెప్పారని వెల్లడి
- ఫేస్‌టైం కాల్‌లో సమీర్ మహేంద్రుతో మాట్లాడారని ఆరోపణ
- కేజ్రీవాల్‌ను ఎవరెవరు కలిసిందీ వివరణ
- ఎమ్మెల్సీ కవిత, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పేర్లు ప్రస్తావన



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ కుంభకోణానికి సంబంధించి ఈడీ గురువారం అనుబంధ చార్జిషీట్ దాఖలు చేసింది. ఇందులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ పేరును చేర్చింది. సౌత్ గ్రూపు నుంచి రూ.100 కోట్లు తీసుకున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న విజయ్‌నాయర్ తన మనిషి అని, విజయ్‌ను నమ్మొచ్చని ఫేస్‌టైం కాల్‌లో సమీర్ మహేంద్రుతో కేజ్రీవాల్ అన్నారని పేర్కొంది. కేజ్రీవాల్‌ను ఎవరెవరు కలిసిందీ, ఎవరెవరు ఫోన్‌లో మాట్లాడిందీ తెలిపింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పేర్లను మరోమారు ప్రస్తావించింది. ఈడీ దాఖలు చేసిన 428 పేజీల సప్లిమెంటరీ చార్జిషీట్‌ను రౌజ్ అవెన్యూ ప్రత్యేక కోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఇందులో పేర్కొన్న నిందితులు విజయ్‌నాయర్, అభిషేక్ బోయినపల్లి, శరత్ చంద్రారెడ్డి, బినోయ్‌బాబు, అమిత్ అరోరాలతో పాటు ఏడు కంపెనీలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ ఈ నెల 23కు వాయిదా వేసింది.

కిక్‌బ్యాక్‌లపై చర్చించారు!

స్కామ్‌లో కీలక వ్యక్తులతో పాటు ఆయా సంస్థల్లో పనిచేస్తున్న వారి స్టేట్‌మెంట్లను చార్జిషీట్‌కు ఈడీ జత చేసింది. అరుణ్‌పిళ్లై కవిత తరఫు ప్రతినిధిగా ఇండో స్పిరిట్స్‌లో చేరారని తెలిపింది. సౌత్ గ్రూపునకు చెందిన కవిత, మాగుంట, అభిషేక్ బోయినపల్లి, శరత్‌చంద్రారెడ్డిలు ఎవరెవరితో మాట్లాడారు? ఎవరెవరితో ఎక్కడ సమావేశమయ్యారన్న అంశాలు పొందుపరిచింది. కిక్‌బ్యాక్‌ల రూపంలో ముందుగా పెట్టుబడి ఎలా తిరిగి రాబట్టాలనే అంశాన్ని పెట్టుబడిదారులు చర్చించారని పేర్కొంది. విజయ్‌నాయర్ పాలసీ రూపకల్పనలో కీలకపాత్ర పోషించాడని పేర్కొంది. మనీలాండరింగ్ కేసు పెట్టడానికి తగిన కారణాలున్నాయని తెలిపింది. సౌత్ గ్రూపులో ఎమ్మెల్సీ కవిత, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, రాఘవ మాగుంట, శరత్‌రెడ్డిలు భాగస్వాములు అని తెలిపింది. సౌత్ గ్రూపునుంచి ఆప్ నేతలకు సొమ్ములు ఎలా చేరాయో వివరించింది. ఎవరెవరిని ఏయే కారణాలతో అరెస్టు చేసిందీ తెలియజేసింది. సౌత్‌గ్రూపు నుంచి తీసుకున్న రూ.100 కోట్లలో రూ.30 కోట్లు గోవా ఎన్నికలకు ఆప్ ఖర్చు చేసినట్లు ఆరోపించింది.

కవిత, ఆమె భర్తతో భేటీ అయ్యా: సమీర్ మహేంద్రు

తన వాటా నుంచి ఆంధ్రప్రభ పబ్లికేషన్స్, ఇండియా ఎహెడ్‌లకు రూ.1 కోటి, రూ.70 లక్షలు చొప్పున ఇండో స్పిరిట్స్ నుంచి జమ చేయాలని అరుణ్‌పిళ్లై సూచించారు. శరత్‌చంద్రారెడ్డికి ఐదు జోన్లు, ఎంఎస్‌రెడ్డికి రెండు జోన్ల ద్వారా ఇండో స్పిరిట్స్‌లో రూ.5 కోట్ల పెట్టుబడితో రూ.17 కోట్లు ఆర్జించారు. మాగుంట శ్రీనివాసులు రెడ్డితో ఢిల్లీ నివాసంలో రెండు, మూడుసార్లు భేటీ అయి మద్యం వ్యాపారంపై మాట్లాడా. ఈ సమయంలో మాగుంట కుమారుడు రాఘవ, బుచ్చిబాబు ఉన్నారు. అరుణ్‌పిళ్లై అతని అనుయాయులు అభిషేక్ బోయినపల్లి, బుచ్చిబాబులతో మాట్లాడడానికి విజయ్‌నాయర్ జూమ్ మీటింగ్ ఏర్పాటు చేశారు. అరుణ్, అభిషేక్, బుచ్చిబాబులకు రాజకీయ పలుకుబడి ఉందని వారు ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు స్నేహితులని విజయ్‌నాయర్ చెప్పారు. అరుణ్‌తో ఫోను సంభాషణల్లో కవిత పేరు వచ్చింది. ఇండో స్పిరిట్స్ వెనక ఎవరు ఉన్నారో చెప్పాలని అరుణ్‌పిళ్లైను అడగ్గా తెలంగాణ సీఎం కుమార్తె కవిత ఉన్నారని, ఆమె తరఫు తాను ప్రతినిధినని చెప్పారు. హైదరాబాద్ వెళ్లి కవిత ఇంట్లో కవిత, భర్త అనిల్‌తో భేటీ అయ్యా. అరుణ్ తమ కుటుంబానికి సన్నిహితుడని ఇప్పటికే కలిసి వ్యాపారం చేస్తున్నామని కవిత చెప్పారు.

కేజ్రీవాల్, సిసోడియాలతో భేటీ అయ్యా: దినేష్ అరోరా

తొలుత సంజయ్ సింగ్‌ను కలిశా. అతని ద్వారా మనీష్ సిసోడియాను హోటల్‌లో కలిశా. సంజయ్ సింగ్ విజ్ఞప్తి మేరకు ఇతర హోటళ్ల యాజమాన్యాలు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఖర్చుల నిమిత్తం రూ.82 లక్షల చెక్కులు ఇచ్చాయి. ఐదు, ఆరు సార్లు సిసోడియాతో మాట్లాడడంతో పాటు ఒకసారి సంజయ్‌సింగ్‌తో కలిపి ముఖ్యమంత్రి నివాసంలో సీఎం కేజ్రీవాల్‌తో భేటీ అయ్యా. తొలుత విజయ్‌నాయర్‌తో పరిచయం అయింది. అనంతరం అర్జున్ పాండే, అరుణ్‌పిళ్లై , బుచ్చిబాబు, అభిషేక్ బోయినపల్లిలను నాయర్ పరిచయం చేస్తూ వీరికి తెలంగాణ ఎమ్మెల్సీ కవిత, ఏపీ ఎంపీ ఎంఎస్‌రెడ్డిలకు బాగా దగ్గరవారని తెలిపారు. సౌత్ గ్రూపు విజయ్ నాయర్‌కు రూ.100 కోట్లు అడ్వాన్స్‌గా ఇచ్చింది. బిజినెస్‌లో సౌత్‌గ్రూప్‌కు ఆరుశాతం కిక్‌బ్యాక్ కింద మొత్తంగా సుమారు రూ.210 కోట్లు వస్తుంది. సౌత్ గ్రూపునకు రూ.100 కోట్లు రికవరీ అయిన తర్వాత మిగిలిన రూ.100 కోట్లు విజయ్‌నాయర్ (ఆప్ కోసం), సౌత్ గ్రూపు పంచుకుంటారు. మద్యం వ్యాపారంపై చర్చించడంతోపాటు అడ్వాన్స్‌గా ఇచ్చిన రూ.100 కోట్లు ఎలా రికవరీ అవుతుందో కూడా చర్చించాం.

రూ.19 కోట్లు కాదు..రూ.32 కోట్లు తీసుకున్నా: అరుణ్

నవంబర్, డిసెంబర్ 2021ల్లో విజయ్‌నాయర్ ఫోన్ చేసి ఢిల్లీలోని ఇండియా హ్యాబిటిట్ సెంటర్‌లో కలవమన్నారు. ఇండో స్పిరిట్స్ నుంచి రూ.19 కోట్లు తీసుకున్నట్లుగా గతంలో ఇచ్చిన స్టేట్‌మెంట్ తప్పు. రూ.32 కోట్లు తీసుకున్నా. దీంట్లో రూ.25 కోట్లు నేరుగా నా ఖాతాలోకే వెళ్లాయి. ఒక ఈవెంట్ నిమిత్తం ఆంధ్రప్రభ పబ్లికేషన్స్‌కు ఇండో స్పిరిట్స్ ద్వారా రూ.1 కోటి, ఇండియా ఎహెడ్‌కు రూ.70 లక్షలు అందజేశా. గచ్చిబౌలిలోని శ్రీహిల్స్ దగ్గర నాలుగు ఎకరాలు కొనుగోలు నిమిత్తం వేముల హరి ద్వారా క్రియేటివ్ డెవలపర్స్‌కు రూ.5 కోట్లు అడ్వాన్స్‌గా ఇచ్చా. మార్చి 2021లో శరత్‌రెడ్డితో పాలసీ మార్పుపై చర్చించాం. మే 2021న బంజరాహిల్స్‌లోని ఎమ్మెల్సీ కవిత నివాసంలో అభిషేక్ బోయినపల్లిని కలిశా. అక్కడే శరత్‌రెడ్డికి అభిషేక్‌ను పరిచయం చేశా. ఢిల్లీ సీఎం కార్యాలయం పక్కనే విజయ్ నాయర్ నివాసం ఉంటారు. ఆప్ సోషల్ మీడియా చూసేది కూడా విజయ్‌నాయర్ కావడంతో అతడిపై కేజ్రీవాల్‌కు పూర్తి నమ్మకం ఉంది. మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఏర్పాటు చేసిన సమావేశంలో రాఘవ, నాగరాజరెడ్డిలు కూడా పాల్గొన్నారు. న్యూ పాలసీపై ఢిల్లీ సీఎంతో తాను మాట్లాడానని, కేజ్రీవాల్ తనని ఢిల్లీ లిక్కర్ ట్రేడ్‌కు ఆహ్వానించారని మాగుంట తెలిపారు. ఇండో స్పిరిట్స్‌లో ఎమ్మెల్సీ కవిత తరఫున భాగస్వామిని. కవితకు చాలా కాలంగా స్నేహితుడిని. ఇండో స్పిరిట్స్ లాభాలతో ఏం చేయాలనేది ఇంకా డిసైడ్ చేసుకోలేదు. సమీర్ మహేంద్రు, కవితలు ఫేస్ టైంలో మాట్లాడుకునే ఏర్పాటు చేశా. ఒకసారి హైదరాబాద్‌లో నేరుగా కలుసుకునే ఏర్పాటు చేశా. ఇండో స్పిరిట్స్‌లో అసలు పెట్టుబడిదారు కవిత అని సమీర్ మహేంద్రుకు చెప్పా. శరత్‌రెడ్డి హోల్‌సేల్ బిజినెస్‌లో ఎంటర్ కాలేదు.

అభిషేక్ పలుమార్లు డబ్బిచ్చారు: గౌతమ్ ముత్తా

ఇండియా ఎహెడ్ న్యూస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఐఏఎన్‌పీఎల్)లో పెట్టుబడులు పెట్టాలని అభిషేక్ బోయినపల్లిని కోరా. పెట్టుబడి మొత్తం కంపెనీ ఖాతాకు కాకుండా నాకు ఇవ్వాలని కోరా. ఐఏఎన్‌పీఎల్‌కు రూ.50 లక్షల చెక్కు అభిషేక్ ఇచ్చారు. దీన్ని కొన్ని కారణాల వల్ల తిరిగి ఇచ్చేశా. ఛానల్ నడపడానికి వ్యక్తిగతంగా ఇవ్వాలని కోరగా 10.11.2020న రూ.1.08 కోట్లు బదిలీ చేశారు. అనంతరం జెడ్ఎన్‌పీఎల్ షేర్లు రూ.5.80 కోట్లకు కొనుగోలు చేసి నన్ను, అభిషేక్‌ను డైరెక్టర్లుగా అపాయింట్ చేయాలని కోరా. దీని నిమిత్తం జెడ్ఎన్‌పీఎల్‌కు రూ.75 లక్షల రుణం ఇచ్చా. దీన్ని షేర్ల కొనుగోలులో అడ్జస్ట్ చేశారు. అనంతరం ఇండియా ఎహెడ్ ఐపీఆర్ సొంతమైన ఆంధ్రప్రభ పబ్లికేషన్ లిమిటెడ్‌కు రూ.1.30 కోట్లు బదిలీ చేశా. ఇండియా ఎహెడ్ ట్రేడ్‌మార్క్‌ను నా పేరుమీద బదిలీ చేసుకున్నా. ఈ క్రమంలో పలుతేదీల్లో అభిషేక్ రూ.6.53 కోట్లు బదిలీ చేశారు.

సమీర్ తదితరులతో సమావేశమయ్యా:

అభిషేక్ బోయినపల్లి స్టేట్‌మెంట్: విజయ్ నాయర్ ఆప్‌కు బాగా దగ్గర. విజయ్ ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ 2021–22 రూపొందించారని అరుణ్ పిళ్లై తెలిపారు. శరత్‌చంద్రారెడ్డి రిటైల్ జోన్స్ రన్ చేయడానికి ఆసక్తి చూపారు. తాజ్ హోటల్‌లో సమీర్ మహేంద్రు, అరుణ్‌పిళ్లై, శరత్‌రెడ్డి, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, రాజేశ్ మిశ్రా బినోయ్‌బాబు, బుచ్చిబాబులతో సమావేశమయ్యా. 10 రిటైల్ ఎల్7 లైసెన్సులు మాగుంట, సమీర్‌మహేంద్రు, శరత్‌రెడ్డిలకు వచ్చినందుకు సెలబ్రేట్ చేసుకున్నాం. సమీర్‌కు రెండు, మాగుంటకు మూడు, శరత్‌రెడ్డిలకు ఐదు ఎల్7 లైసెన్సులు వచ్చాయి. అరుణ్, బుచ్చిబాబు, విజయ్‌నాయర్‌తో మరోసారి సమావేశమయ్యా. ఈ సమయంలోనే గౌతమ్ ముత్తాకు రూ.75 లక్షలు ఎందుకు ఇచ్చారన్న అంశంపై చర్చ జరిగింది.

సాక్షి కరీంనగర్
శుక్రవారం 3 ఫిబ్రవరి 2023



ఆరుద్ర నక్షత్రోత్సవ పూజలు

వేములవాడ: రాజన్న ఆలయంలో గురువారం ఆరుద్ర నక్షత్ర పూజలు నిర్వహించారు. రాజన్నకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలు, సదస్యం నిర్వహించారు.



యువ జోరు.. పరుగుల హోరు

ఓ వైపు సిక్సర్ల మోత.. మరోవైపు బౌండరీల బాదుడు.. మైదానం మొత్తం పరుగుల వరద మధ్య 'సాక్షి' ప్రీమియర్ లీగ్ సీజన్ 4 క్రికెట్ పోటీలు సాగాయి.

8లో▸

గరిష్టం/కనిష్టం
30.0/14.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఆరోగ్య కేంద్రాల ఎదుట ఆశాల ధర్నా



కరీంనగర్‌టౌన్: కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆశా కార్యకర్తలు గురువారం జిల్లా వ్యాప్తంగా 10 మండలాల ఆరోగ్యకేంద్రాల ముందు ధర్నా నిర్వహించి, మెడికల్ ఆఫీసర్లకు వినతిపత్రాలు సమర్పించారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ.. 18 ఏళ్లుగా ఆశ వర్కర్‌గా పనిచేస్తున్నా.. ఇప్పటివరకు ప్రభుత్వం కార్మికులుగా గుర్తించి కనీస వేతనం నిర్ణయం చేయలేదన్నారు. కార్యక్రమంలో ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షుడు సదా, తులసి, పద్మజ, సుద, శంకరమ్మ, కవిత, వరలక్ష్మి, జానకి పాల్గొన్నారు.

పద్మనగర్‌లో మంటలు



కరీంనగర్ క్రైం: కరీంనగర్ శివారు పద్మనగర్‌లో గల వ్యవసాయ క్షేత్రంలో ఎండిన చెట్లకు, గడ్డికి గురువారం మధ్యాహ్నం మంటలు వ్యాపించాయి. చింతకుంట సమీపంలో ఉన్న రెండు పడకల భవనాల సమీపంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. వ్యవసాయ పరిశోధన కేంద్ర, ఆబోతుల వీర్య ఉత్పత్తి కేంద్రం ఆవరణ వరకు మంటలు వ్యాపించాయి. స్థానికుల సమాచారంతో ఫైర్ అధికారులు చేరుకొని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. కరీంనగర్ ఫైర్ ఇంజన్‌తోపాటు నగర పాలక సంస్థకు చెందిన నీటి ట్యాంకర్ల సహకారంతో రాత్రి మంటలను అదుపులోకి తెచ్చారు. గుర్తు తెలియని వ్యక్తులు పొగ పెట్టడంతో మంటలు చెలరేగినట్లు కరీంనగర్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్ తెలిపారు.

నూతన సూపర్ లగ్జరీ బస్సులు ప్రారంభం



విద్యానగర్(కరీంనగర్): టీఎస్‌ఆర్టీసీ నూతనంగా కొనుగోలు చేసి కరీంనగర్ రీజియన్‌కు అందించిన బీఎస్–6 మోడల్ సూపర్ లగ్జరీ బస్సులను గురువారం కరీంనగర్ డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ మామిళ్ల చంద్రశేఖర్‌గౌడ్ కరీంనగర్ ఆర్టీసీ–1డిపో ప్రాంగణంలో ప్రారంభించారు. బస్సులో ప్రయాణికులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. ఆర్టీసీ డ్రైవర్లు సుశిక్షితులైన డ్రైవర్లని, ఎంతో అనుభవం కలిగి ఉంటారని, ప్రయాణికులు వారి అనుభవంపై నమ్మకం ఉంచి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఖుస్రో షా ఖాన్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఆపరేషన్స్) ఎస్.చందర్‌రావు, డిప్యూటీ రీజినల్ మేనేజర్ (మెకానికల్) శివశంకర్, నూతనంగా డిప్యూటీ రీజినల్ మేనేజర్ (మెకానికల్)గా బాధ్యతలు స్వీకరించిన భీంరెడ్డి, కరీంనగర్ 1, 2 డిపోల డిపో మేనేజర్లు సిబ్బంది పాల్గొన్నారు.

తగ్గిన పత్తి ధర

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో పత్తి ధర స్వల్పంగా తగ్గుతోంది. మూడు రోజుల క్రితం క్వింటాల్‌కు రూ.8వేలు పలుకగా గురువారం రూ.7,800 ధర పలికింది. 129 వాహనాల్లో 1,845 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకరాగా గరిష్ఠ ధర క్వింటాల్‌కు రూ.7,800, మోడల్ ధర రూ.7,700, కనిష్ఠ ధర రూ.7,200 పలికింది. గన్ని సంచుల్లో 16 మంది రైతులు 23 క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తీసుకరాగా క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.7,500, మోడల్ ధర రూ.7,400, కనిష్ఠ ధర రూ.6,500 పలికింది. క్రయవిక్రయాలను కార్యదర్శి గుగులోతు రెడ్డి నాయక్ పర్యవేక్షించారు.

సీవోఈలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్(మానకొండూర్): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న 38 సీవోఈ జూనియర్ కళాశాలల్లో ఇంటర్‌లో ప్రవేశానికి అర్హత పరీక్ష కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అల్గునూర్ సీవోఈ ప్రిన్సిపాల్ జి.దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 4వ తేదీ వరకు దరాఖాస్తు గడువు ఉందని అన్నారు. అర్హత ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



నగరంలో శోభాయాత్ర

శోభాయమానంగా శోభాయాత్ర

తొమ్మిది రథాలపై శ్రీనివాసుని ఊరేగింపు

- కళార్చనతో కళాకారుల నీరాజనాలు
- ఆకట్టుకున్న గజరాజులు, అశ్వాలు
- ఆహ్లాదం పంచిన కేరళ సింగారి మేళం.. దశావతారాలు
- గోవింద నామస్మరణతో మారుమోగిన కరీంనగరం



కరీంనగర్‌కల్చరల్: గజరాజులు.. అశ్వాలు.. కాంతారా వేషధారణలు.. కేరళ రాష్ట్ర సంప్రదాయ కళాకారుల ఆటపాటలు.. విచిత్ర వేషాధారణలు.. దారిపొడవునా కోలాట నృత్యాలు, భజనలు, పంచవాయిద్యాలు, శ్రీవారి రథాలలో విద్యుత్ దీపాల కాంతులతో గురువారం రాత్రి శ్రీవేంకటేశ్వరుని శోభాయాత్ర అంగరంగ వైభవంగా సాగింది. రాంనగర్‌లోని మార్క్‌ఫెడ్ మైదానం నుంచి గజరాజు ముందుండి ఆ వెనకే అశ్వదళం నడిపించిన శోభాయాత్ర సంబురంగా సాగింది. మంత్రి గంగుల కమలాకర్ కుటుంబ సభ్యులు, 12వ తరం అన్నమయ్య తాళ్లపాక హరినారాయణచార్యులు, ఈవో ఉడుతల వెంకన్న, ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, గంగాధర్, గంప రమేశ్ హారతి ఇచ్చి శోభాయాత్ర ప్రారంభించారు.

భక్త నీరాజనం

తిరుమలలో మాదిరిగా జరుగుతున్న శోభాయాత్రను తిలకించేందుకు భక్తులు ప్రజలు ఇంటిల్లిపాది తండోప తండాలుగా తరలివచ్చారు. శోభాయాత్రలో పాల్గొని భజనలు, గోవిందనామస్మరణలు చేస్తూ భక్తి పారవశ్యంలో మునిగి తేలారు. మహిళలు మంగళ హారతులు పట్టి స్వాగతం పలికారు. భవనాల పైనుంచి పూల వర్షాన్ని కురిపిస్తూ తన్మయత్వం పొందారు.



మహిళల కోలాటం



గజరాజులతో మంత్రి గంగుల, మేయర్ సునీల్‌రావు, సీపీ



చిన్నారుల ప్రదర్శన

నగరంలో ఇద్దరు పిల్లల కిడ్నాప్!

- చాక్లెట్లు కొనిస్తానని చెప్పి మహారాష్ట్ర తీసుకెళ్లిన వృద్ధురాలు
- అక్కడి పోలీసుల సమాచారంతో విషయం వెలుగులోకి..

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: చాక్లెట్ కొనిస్తానని ఆశచూపిన ఓ వృద్ధురాలు ఇద్దరు పిల్లలను మహారాష్ట్రకు తీసుకెళ్లిన ఉదంతం ఇది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..'హుస్నాబాద్ సమీపంలోని ధర్మారం గ్రామానికి చెందిన కాదాసి సురేశ్ తన బంధువుల అంత్యక్రియలకు హాజరయ్యేందుకు ఇటీవల కరీంనగర్‌లోని మంకమ్మతోటకు కూతురు అక్షిత (11) కుటుంబసభ్యులతో వచ్చారు. అక్షితను తన బామ్మరిది మిడిదొడ్డి ప్రవీణ్ ఇంట్లోనే వదిలిన సురేశ్ తిరిగి స్వగ్రామానికి వెళ్లిపోయాడు. బుధవారం మధ్యాహ్నం ఇంటి పక్కనే నివసించే జయశ్రీ అనే వృద్ధురాలు అక్షితతోపాటు ప్రవీణ్ కుమారుడు లోకేశ్ (9)లకు చాక్లెట్లు కొనిస్తానని ఆశచూపి తీసుకెళ్లింది. ఆ సమయంలో లోకేశ్ వద్ద ఫోన్ కూడా ఉంది. ఎంతసేపైనా తిరిగి రాకపోవడంతో ప్రవీణ్ ఫోన్ చేశాడు. ఇపుడే వస్తున్నామని చెప్పి సాయంకాలం తరువాత ఫోన్ స్విచ్ఛాఫ్ చేసింది. గురువారం ఉదయం మహారాష్ట్రలోని షిరిడీ పోలీసులు ప్రవీణ్‌కు ఫోన్‌చేసి అక్షిత, లోకేశ్‌లు వృద్ధురాలు తమ అదుపులో ఉన్నారని సమాచారం ఇచ్చారు. దీంతో పిల్లల ఆచూకీ తెలియడంతో వెంటనే ప్రవీణ్, సురేశ్ గురువారం రాత్రి టూటౌన్ పోలీసుల వద్దకు పరుగులు తీశారు. శుక్రవారం ఉదయం ఇక్కడి పోలీసులు బాధితుల తల్లిదండ్రులతో కలిసి మహారాష్ట్రకు వెళ్లి పిల్లలను, వృద్ధురాలిని ఇక్కడికి తీసుకురానున్నారు. వృద్ధురాలు పిల్లలతో కలిసి కరీంనగర్‌లో రైలెక్కినట్లు సమాచారం. ఆమె మానసిక పరిస్థితి కొంత కాలంగా బాగాలేదని తెలిసింది.

రైతు సంక్షేమానికి అనేక పథకాలు

జమ్మికుంట(హుజూరాబాద్): కేసీఆర్ ప్రభుత్వం రైతు సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక పథకాలు అందిస్తుందని టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు అన్నారు. గురువారం జమ్మికుంట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ఆధ్వర్యంలో రూ.కోటితో నిర్మించిన పీఏసీఎస్ గోదాంను ప్రారంభించి మాట్లాడారు. గోదాం రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి, డీసీవో శ్రీమాల, జెడ్పీ చైర్మన్ కనుమల్ల విజయ, కేడీసీసీ ఉపాధ్యక్షుడు పింగిళి రమేశ్, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ దేశిని స్వప్నకోటి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, కౌన్సిలర్లు, డైరెక్టర్లు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.



గోదాంను ప్రారంభిస్తున్న కొండూరి

అసమ్మతి కుంపట్లు!

- హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అసమ్మతి గళం
- బీజేపీతో కలిసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు
- జమ్మికుంటలో బీజేపీని దుమ్మెత్తిపోసిన రెండురోజులకే అదే పార్టీతో జట్టు
- మున్సిపల్ చైర్మన్‌వి ఏకపక్ష నిర్ణయాలంటూ రగడ
- ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి వద్దకు చేరిన పంచాయితీ
- అదే బాటలో జమ్మికుంట మున్సిపల్ లొల్లి..?

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ రాజీనామా వ్యవహారం చల్లబడిందో లేదో మళ్లీ హుజూరాబాద్ మున్సిపల్ పాలకవర్గం పంచాయితీ తెరపైకి వచ్చింది. హుజూరాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధికపై బీఆర్‌ఎస్, బీజేపీ కౌన్సిర్లు గురువారం ఏకంగా కలెక్టరేట్ ఏవో నారాయణకు ఫిర్యాదు ప్రతులను అందజేశారు. హుజూరాబాద్ నుంచి నేరుగా బీఆర్‌ఎస్‌కు చెందిన 22 మంది, బీజేపీకి చెందిన ముగ్గురు కౌన్సిలర్లు కొత్తకొండ వీరభద్రస్వామి దేవస్థానం వద్దకు చేరుకొని చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం విషయంలో ఏకతాటిపై ఉండాలని ప్రతిజ్ఞ చేసిన అనంతరం కరీంనగర్‌కు చేరుకొని ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో హుజూరాబాద్ అవిశ్వాస వ్యవహారం అధికార బీఆర్‌ఎస్ పార్టీలో చర్చనీయాంశమైంది. ఇదే బాటలో జమ్మికుంట పాలకవర్గంలో కూడా అవిశ్వాస మునలం పుట్టినట్లు సమాచారం. గతనెల 31వ తేదీన జమ్మికుంటలో భారీ బహిరంగ సభలో బీఆర్‌ఎస్ అగ్రనేతలంతా బీజేపీ విధానాలపై దుమ్మెత్తిపోసిన రెండురోజులకే అదే పార్టీ నేతలతో కలిసి అవిశ్వాసానికి వెళ్లడం గమనార్హం.



ఏవోకు ఫిర్యాదు ప్రతులు ఇస్తున్న కౌన్సిలర్లు

ఏకపక్ష నిర్ణయాల వల్లే...

హుజూరాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక భర్త గందె శ్రీనివాస్ వ్యవహార శైలి వల్లే అవిశ్వాసం వరకు అసమ్మతి రగడ రాజుకుందనే ప్రచారం మెండుగా ఉంది. గతంలో శ్రీనివాస్ వ్యవహారంపై అప్పటి మంత్రి ఈటల రాజేందర్, ప్రస్తుత మంత్రి గంగుల కమలాకర్‌కు, మరికొంత మంది పార్టీ ముఖ్యనేతలకు ఫిర్యాదు చేశారు. అయినా ఆయన వ్యవహార శైలిలో మార్పులేకపోవడం వల్లే అసమ్మతి గళాన్ని వినిపిస్తున్నట్లు సమాచారం. అభివృద్ధి పనుల విషయంలో తోటి కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వకుండా, బినామీలతో కాంట్రాక్టు పనులు చేయిస్తూ మెజార్టీ కౌన్సిలర్ల మనోభావాలను పరిగణనలోకి తీసుకోకుండా, అధికారులను భయభ్రాంతులకు గురి చేయడం వల్లే ఈ నిర్ణయానికి మెజార్టీ సభ్యులు తోడైనట్లు తెలిసింది. పాలకవర్గంలో 30 మంది సభ్యులుండగా ఒకరు మృతి చెందారు. 25 మంది కౌన్సిలర్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. చైర్‌పర్సన్‌కు ముగ్గురు కౌన్సిలర్లు మాత్రమే మద్దతుగా మిగిలారు.

ఎమ్మెల్సీ వద్దకు పంచాయితీ..

25 మంది కౌన్సిలర్లు గురువారం సాయంత్రం హుజూరాబాద్‌లో ఉన్న ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిని కలిసి విషయాన్ని వివరించినట్లు సమాచారం. పార్టీ అధిష్టానం నిర్ణయించిన మేరకు నడుచుకోవాలని, సమస్యను పార్టీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని, ఎలాంటి తొందరపాటు నిర్ణయాలకు తావివ్వద్దని ఎమ్మెల్సీ వారికి సూచించినట్లు సమాచారం. అయినప్పటికీ మెజార్టీ కౌన్సిలర్లు పార్టీ నిర్ణయమే శిరోధార్యమని, తమ ఫిర్యాదును పరిగణలోకి తీసుకోవాలని, పార్టీకి చెడ్డ పేరు వచ్చే విధంగా తాము వ్యవహరించమని, మెజార్టీ సభ్యుల మనోభావాలను గుర్తించి నిర్ణయం తీసుకోవాల్సిందేనని మొరపెట్టుకున్నట్లు వినికిడి. దీంతో ఈ విషయాన్ని ఆయన ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారని తెలిసింది. హుజూరాబాద్ తరహాలోనే జమ్మికుంట మున్సిపల్ పాలకవర్గంలో కూడా ముసలం పుట్టినట్లు సమాచారం. వరుస పరిణామాలతో అధికార పార్టీలో గందరగోళం నెలకొంది.

- గత పాలకవర్గంలోనూ ఇదే తరహాలో అర్ధంతరంగా అవిశ్వాసం ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈటల రాజేందర్ మంత్రిగా ఉన్న సమయంలో 2018 ఆగస్టులో అప్పుడు చైర్మన్‌గా ఉన్న విజయ్‌కుమార్‌తో రాజీనామా చేయించారు. అనంతరం ఆ స్థానంలో మందా ఉమాదేవి చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టగా.. ఆమె 10 నెలలపాటు పదవిలో కొనసాగారు. ఆ తరువాత ప్రత్యేకాధికారుల పాలన సాగింది. అనంతరం 2020 జనవరిలో మున్సిపల్ ఎన్నికలు జరగ్గా.. జనవరి 27న గందె రాధిక నేతృత్వంలో నూతన పాలకవర్గం కొలువుదీరింది. మూడేళ్లు పూర్తి చేసుకున్న క్రమంలో రాష్ట్రాల అవిశ్వాసాలకు తెరలేవగా.. ఆ మంటలు ఇక్కడ కూడా అంటుకున్నాయి.

చైర్‌పర్సన్ రేసులో ముగ్గురు..!

బీఆర్‌ఎస్–బీజేపీ కౌన్సెలర్లు అవిశ్వాస తీర్మానం ఇవ్వగా.. అన్నీ అనుకూలిస్తే అవిశ్వాసం విజయవంతమైతే చైర్‌పర్సన్ స్థానానికి ముగ్గురు పోటీలో ఉన్నారు. మందా ఉమాదేవి, దండ శోభ, వైస్ చైర్‌పర్సన్ కొల్లిపాక నిర్మల రేసులో ఉన్నట్లు తెలిసింది. ఈ విషయంలో అధిష్టానం నిర్ణయమే ఫైనల్ కానుంది.

హైవేపై అర్ధరాత్రి ఉనుక



రహదారిపై ఉనుక

- తప్పిన పెనుముప్పు
- లారీలో తరలిస్తుండగా ఘటన
- దుమ్ముధూళితో నిండిన రోడ్డు
- రహదారి కనిపించక చెట్టును ఢీకొన్న కారు

మానకొండూర్: అది.. కరీంనగర్– వరంగల్ ప్రధాన రహదారి. నిత్యం వందలాది సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. అసలే అర్ధరాత్రి. ఆపై చలికాలం. నిద్రమత్తు. అకస్మాత్తుగా ఆ రోడ్డుపై వస్తున్న వాహనాలను ఉనుక ఇబ్బందికి గురిచేసింది. ఉనుక మొత్తం రోడ్డును కమ్మేసింది. ఏం జరిగిందో.. రోడ్డుపై ఇదంతా ఏంటని ఎవరికీ తెలియని పరిస్థితి. అదే క్రమంలో వాహనాలను పెద్ద ప్రమాదమే తప్పింది. ఓ కారు అయితే అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది.

- మానకొండూర్ మండలంలోని ఖాదర్‌గూడెం శివారులో బుధవారం అర్ధరాత్రి దాటాక వరంగల్ వైపు నుంచి కరీంనగర్ వైపు ఓ లారీ ఉనుక లోడుతో వెళ్తోంది. లారీలోని ఉనుకపై కప్పిన పరదా ఊడిపోయింది. దీంతో ఉనుకంతా రహదారిపై పడిపోయింది. రహదారి మొత్తం దుమ్ము ధూళితో నిండిపోయింది. వాహనాలు ఎటు వైపు వెళ్తే అటువైపే ఉనుక రావడంతో రహదారి కనిపించకుండా పోయింది. దారి కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రహదారి మొత్తం పొగమంచు కమ్మేసినట్లు అయ్యింది. వరంగల్ నుంచి కరీంనగర్ వైపు అదే సమయంలో వెళ్తున్న ఓ కారు దారి కనిపించక చెట్టును ఢీకొంది. కారు ముందు భాగం దెబ్బతింది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు అయితే కాలేదు. పెను ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. రాత్రి నుంచి ఉదయం వరకూ రహదారిపై ఉనుకతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. అయినా.. ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. చివరకు ఖాదర్‌గూడెం గ్రామస్తులే ట్రాక్టర్‌తో ఉనుకను రహదారిపై తొలగించారు.



చెట్టును ఢీకొన్న కారు

క్లుప్తంగా

జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ



రామడుగు(చొప్పదండి): మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ జెన్‌నెక్ట్స్ పాఠశాలకు చెందిన ఎం.సాయి వినీల్ ఇటీవల కేరళ రాష్ట్రంలోని త్రిసూర్‌లో నిర్వహించిన దక్షిణ భారత జాతీయస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ కనబర్చి ప్రత్యేక బహుమతి సాధించినట్లు అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం విద్యార్థిని అభినందించి బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాబార్డ్ సొసైటీ సేవలు అభినందనీయం



ఇల్లందకుంట(హుజూరాబాద్): నాబార్డ్ (స్పందన) సొసైటీ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని నాబార్డ్ జీఎం అనంత్ పటాలా అన్నారు. గురువారం నాబార్డ్ సౌజన్యంతో స్పందన ఫెవో సొసైటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మహిళలకు ఫ్యాషన్ డిజైన్‌పై ఉచిత శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కంకణాల శ్రీలత, ఏపీఎం రమాదేవి, మహిళలు పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మానకొండూర్: తెలంగాణ సాంఘీక గిరిజన సంక్షేమ గురుకుల డీగ్రీ కళాశాలల్లో డిగ్రీ మొదటి సంవత్సరం 2023–24 ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని మానకొండూర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, డిస్ట్రిక్ కోర్డినేటర్ కె శ్రీనివాస్‌రెడ్డి, మహిళా గురుకుల డీగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌లో 40శాతం ఉత్తీర్ణత కలిగి సంవత్సర ఆదాయం రూ.1.50లక్షలు(గ్రామీణ), రూ.2లక్షలు (పట్టణ) కలిగి ఉండాలన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈనెల 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వృద్ధురాలి మృతి

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): మండలంలోని రాచర్ల గుండారం గ్రామానికి చెందిన మైదంపల్లి రాజమ్మ(85) గురువారం ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందింది. ఎస్సై శేఖర్ తెలిపిన వివరాలు. రాజమ్మ కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయి తిరుగుతోంది. ఈక్రమంలో గ్రామ శివారులోని వారి వ్యవసాయ పొలం వద్దకు వెళ్లింది. బావి వద్ద తిరుగుతుండగా కాలుజారి అందులో పడిపోయింది. మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం కోసం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి భర్త ఎల్లారావు గతంలోనే అనారోగ్యంతో మరణించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

యువ జోరు.. పరుగుల హోరు..






సీనియర్స్ విభాగంలో ఫైనల్‌కు చేరిన వాగ్దేవి డిగ్రీ కళాశాల జట్టు, హోరాహోరీగా తలపడుతున్న జట్లు, క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీటీసీ చంద్రశేఖర్ గౌడ్

- ఎస్‌పీఎల్ సీజన్–4లో తొలి అర్ధసెంచరీ నమోదు
- రెండో రోజు పోటీలను ప్రారంభించిన డీటీసీ చంద్రశేఖర్ గౌడ్
- సీనియర్స్ ఫైనల్‌లో వాగ్దేవి కళాశాల, మంచిర్యాల

కరీంనగర్‌స్పోర్ట్స్: అసలు క్రికెట్ పోరు అంటే ఇదేనేమో.. ఓ వైపు సిక్సర్‌ల మోత.. మరోవైపు బౌండరీల బాదుడు.. ఇలా మైదానం మొత్తం పరుగుల వరదను పారిస్తుంటే ప్రేక్షకులు, తోటి క్రీడాకారుల కేకలు, ఈలల మధ్య 'సాక్షి' ప్రీమియర్ లీగ్ సీజన్ 4 క్రికెట్ పోటీలు ఉత్సాహంగా, ఉల్లాసంగా, హోరాహోరీగా సాగాయి. ఈ సీజన్‌లో తొలి అర్ధ సెంచరీని వాగ్దేవి డిగ్రీ కళాశాలకు చెందిన నిఖిల్ సాయి నమోదు చేశాడు. నేడు సీనియర్స్ సెమీఫైనల్ మ్యాచ్‌లు జరుగనున్నాయి.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్..

క్రీడలతో క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉందని, క్రీడల్లో రాణించినట్లే విద్యలోనూ రాణించాలని ఉమ్మడి జిల్లా రవాణా శాఖ అధికారి మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ అన్నారు. ఎస్‌పీఎల్ రెండో రోజు పోటీలను ఆయన ప్రారంభించారు. అంతకుముందు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కాసేపు క్రికెట్ ఆడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. కార్యక్రమంలో కరీంనగర్ సాక్షి యూనిట్ బ్రాంచి మేనేజర్ వైద శ్రీనివాస్, కరీంనగర్ బ్యూరో చీఫ్ బాషబోయిన అనిల్ కుమార్, బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాసరావు, సాక్షి సిబ్బంది సిలివేరి మహేందర్, రాకేష్, పరుషరాం, జ్యోతిష్మతి కళాశాల పీడీ వెంకటేశ్వర్లు, ఎస్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ విశ్వప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



అర్ధసెంచరీ చేసిన నిఖిల్ సాయి

తొలి అర్ధసెంచరీ నమోదు

వాగ్దేవి డిగ్రీ కళాశాలకు చెందిన నిఖిల్ సాయి ట్రినిటీ కళాశాలతో జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో కేవలం 24 బంతుల్లో 4 సిక్స్‌లు, 6 ఫోర్లతో 51 పరుగులు చేసి అర్ధసెంచరీని నమోదు చేశాడు. అదే కళాశాలకు చెందిన సాయి కృష్ణారెడ్డి 21 బంతుల్లో 3 సిక్స్‌లు, 6 ఫోర్లతో 46 పరుగులు చేయగా.. సెమీస్‌లో 18 బంతుల్లో ఒక సిక్స్, 4 ఫోర్లతో 34 పరుగులు చేశారు. అశ్వక్ 3 వికెట్లు, శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన నౌమాన్ 10 బంతుల్లో 3 సిక్స్‌లు, ఒక ఫోర్‌తో 25 పరుగులు, బౌలింగ్‌లో 2 వికెట్లు తీశాడు.

రెండో రోజు ఫలితాలు

- జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాల తిమ్మాపూర్, ఎస్సారార్ కళాశాల కరీంనగర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఎస్సారార్ కళాశాల 51 పరుగుల తేడాతో విజయం సాధించి సెమీఫైనల్‌లో ప్రవేశించింది. జట్టులో అల్సీ, నవీన్ రాణించారు
- జేఎన్‌టీయూ మంథని, శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాల తిమ్మాపూర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో శ్రీ చైతన్య జట్టు 32 పరుగుల తేడాతో విజయాన్ని నమోదు చేసుకుంది. జట్టులో నౌమాన్, అరవింద్ రాణించారు.
- వాగ్దేవి డిగ్రీ కళాశాల మంచిర్యాల, ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాల పెద్దపల్లి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో వాగ్దేవి జట్టు 70 పరుగులు భారీ విజయాన్ని నమోదు చేసింది. జట్టులో నిఖిల్ సాయి, సాయికృష్ణారెడ్డి రాణించారు.

- వాగ్దేవి డిగ్రీ కళాశాల మంచిర్యాల, శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాల తిమ్మాపూర్ జట్ల మధ్య జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో వాగ్దేవి డిగ్రీ కళాశాల జట్టు 8 వికెట్ల తేడాతో విజయాన్ని నమోదు చేసి సీనియర్స్ విభాగంలో ఫైనల్‌లో ప్రవేశించింది.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం



కమాన్‌పూర్: మండలంలోని రొంపికుంట గ్రామానికి చెందిన మిరాల రాజు గుడిసె షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. రాజు కుటుంబ సభ్యులు గుడెసకు తాళం వేసి కూలీ పనులకు వెళ్లారు. గుడిసెలో నుంచి మంటలు రావడంతో ఇంటిపక్కవారు మంటలను ఆర్పివేసే ప్రయత్నం చేశారు. అదే సమయంలో గ్యాస్ సిలండర్ పేలడంతో మంటలు ఎగిసిపడ్డాయి. స్థానికులు పెద్దపల్లి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఫైరింజన్ వచ్చి మంటలను ఆర్పివేసింది. ఘటనలో గుడిసెలో ఉన్న వస్తువులన్నీ కాలిపోయి. మొత్తంగా రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు రాజు తెలిపారు. తహసీల్దార్ దత్తు ప్రసాదరావు, ఆర్ఐ సంధాని, సర్పంచ్ కట్కం రవీందర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

తిమ్మాపూర్(మానకొండూర్): తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీకి చెందిన పెరుమల్ల వీరమల్లు (53) కుటుంబ కలహాలతో గురువారం ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎల్ఎండీ ఎస్సై ప్రమోద్‌రెడ్డి తెలిపారు. వీరమల్లు నిత్యం మద్యం సేవించి కుటుంబసభ్యులతో గొడవకు దిగేవాడని, ఈ క్రమంలో భార్య ఎల్లమ్మ, కుమారులు వేరుగా ఉంటున్నారని అన్నారు. దీంతో మనోవేదనకు గురై ఇంట్లో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. ఘటన స్థలంలో వివరాలు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కరీంనగర్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

ఎంపీగా చేసిందేమిటో వెల్లడించాలి

- కేంద్ర బడ్జెట్‌లో జిల్లా ప్రజలకు మొండి చేయి
- మేయర్ వై.సునీల్‌రావు



మాట్లాడుతున్న మేయర్ వై.సునీల్‌రావు

కరీంనగర్: కరీంనగర్ ఎంపీగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్ నాలుగేళ్లలో జిల్లాకు చేసిన అభివృద్ధి ఏమిటో వెల్లడించాలని కరీంనగర్ మేయర్ వై.సునీల్‌రావు డిమాండ్ చేశారు. గురువారం ఎస్‌బీఎస్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లా ప్రజలకు ఆశలు ఉండేవని, నిర్మల సీతారామన్ బడ్జెట్ చూశాక నిరుత్సాహం నెలకొందని అన్నారు. నాలుగేళ్లుగా నిధులు తేకుండా, అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా, కేవలం బీజేపీ పార్టీ అధ్యక్షుడిగా ప్రచారం కోసం పాకులాడటమే తప్పా బండి సంజయ్ చేసింది గుండుసున్నా అన్నారు. బడ్జెట్ ప్రవేశంపై అసలు బండి సంజయ్‌కి సరైన సమాచారం లేదని ఎద్దేవా చేశారు. నాలుగేళ్లుగా బడ్జెట్‌లో ఎలాంటి కొత్త ప్రాజెక్టులు, పరిశ్రమలు, విద్యాసంస్థలకు అవకాశాలు ఇవ్వడం లేదని, జాతీయ రహదారులు కొత్త రైల్వేలైన్లకు నిధుల కేటాయింపుల ఊసేలేదని మండి పడ్డారు. గతంలో ఎంపీగా ఉన్న వినోద్‌కుమార్ చొరవతోనే జాతీయ రహదారులు, రైల్వే లైన్లు, విద్యాసంస్థలు నెలకొల్పడం జరిగిందని గుర్తు చేశారు. లక్షలాది కోట్ల అప్పులు చేస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా రైతులు నడ్డివిరుస్తున్న బీజేపీ నిజస్వరూపాన్ని ప్రజలు గ్రహించారని అన్నారు. ఎంపీ బండి సంజయ్ ఇకనైనా అనవసరపు విమర్శలు కట్టిపెట్టి అభివృద్ధిపై దృష్టిసారించాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో కార్పొరేటర్లు గందె మాధవి, నేతికుంట యాదయ్య, వాల రమణారావు, భూమాగౌడ్, జయశ్రీ, కంసాల శ్రీనివాస్, అర్ష మల్లేశం, చాడగొండ బుచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్‌ను విమర్శిస్తే సహించం'



మాట్లాడుతున్న జీవీ రామక్రిష్ణారావు

కరీంనగర్: బీఆర్ఎస్ పార్టీని, సీఎం కేసీఆర్‌ను, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై విమర్శలు చేస్తే సహించేది లేదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామక్రిష్ణారావు అన్నారు. గురువారం కరీంనగర్‌లోని తారక హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి అవగాహన రాహిత్యంతో మాట్లాడటం తగదని, కేటీఆర్‌ను విమర్శించే స్థాయి ఆమెది కాదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో తెలంగాణకు, ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు ఒరిగిందేమి లేదని, ఎంపీగా బండి సంజయ్ పూర్తిగా వైఫల్యం చెందాడని విమర్శించారు. జమ్మికుంట బహిరంగ సభలో కేటీఆర్ మాట్లాడిన మాటలకు జవాబు చెప్పాల్సిన బీజేపీ నాయకులు తోకముడుచుకోవడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. ఈ విలేకర్ల సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్, సుడా డైరెక్టర్లు చీటి రాజేందర్‌రావు, మారుతి, రవివర్మ, శ్రీనివాస్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, కులదీప్‌వర్మ, రుద్ర రాధ, గందె కల్పన, సలీమ్, తదితరులు పాల్గొన్నారు.

'బడ్జెట్‌లో గిరిజనులకు మొండి చేయి'



మాట్లాడుతున్న కెమసారం తిరుపతి

విద్యానగర్(కరీంనగర్): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గిరిజనులకు మొండి చేయి చూపిందని తెలంగాణ ఎరుకల ప్రజా సమితి రాష్ట్ర అధ్యక్షుడు కెమసారం తిరుపతి అన్నారు. గురువారం కరీంనగర్‌లోని తెలంగాణ ఎరుకల ప్రజా సమితి కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గిరిజన యూనివర్సిటీ, ఏకలవ్య గురుకుల పాఠశాలలు, గిరిజనుల కోసం ప్రత్యేక పథకాలు ఒకటి కూడా లేకపోవడం బాధాకరమన్నారు. ప్రతీ జిల్లాకు ఒక ఏకలవ్య గురుకుల పాఠశాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు మొగులి శేఖర్, కుర్ర సమ్మయ్య, మొగిలి సారయ్య, మొగిలి తిరుపతి, ఉండాడి పోచమల్లయ్య, అంగిడి శ్రీను, కల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలి



మంత్రి గంగులకు వినతిపత్రం ఇస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కరీంనగర్: ఈనెల 4వ తేదీ నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని కోరుతూ గురువారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రత్నం రమేశ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు విద్యారంగానికి 20శాతం కేటాయించారని, ప్రత్యేక రాష్ట్రం ఏర్పాడ్డాక ఏడాదికి కొంచం తక్కువ శాతం బడ్జెట్‌ను కేటాయిస్తున్నారని అన్నారు. గతేడాది కేవలం ఆరు శాతం మాత్రమే కేటాయించారని తెలిపారు. యూనివర్సిటీలకు తక్కువ బడ్జెట్ కేటాయించడం వల్ల ఉన్నత విద్యను అభ్యసించే పేద విద్యార్థులకు విద్యను దూరం చేస్తున్నారని అన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ని దృష్టిలో ఉంచుకొని అసెంబ్లీ సమావేశాల్లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించడం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేశ్, సురేష్, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ నమూనా పత్రాలు దహనం



పత్రాలు దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కరీంనగర్: కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించడాన్ని నిరసిస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని తెలంగాణచౌక్‌లో కేంద్ర బడ్జెట్ నమూనా పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి శనగరపు రజనీకాంత్ మాట్లాడుతూ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2023 బడ్జెట్‌లో ఇటీవలి కాలంలో లేవనెత్తిన దాదాపు అన్ని విద్యారంగ అవసరాలు, సంస్థల డిమాండ్లను విస్మరించిందని అన్నారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మొత్తం బడ్జెట్ ప్రసంగంలో ఒక్కసారి కూడా 'ప్రభుత్వ విద్య' అనే పదాన్ని ప్రస్తావించలేదని మండిపడ్డారు. గత బడ్జెట్‌లో విద్యారంగానికి 2.64శాతం కేటాయింపు చేస్తే ఈ బడ్జెట్ అంచనాలో 2.50 శాతంకు తగ్గిందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గజ్జెల శ్రీకాంత్, సహాయ కార్యదర్శి అరవింద్, నాయకులు పూజిత, నవ్య, తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో..

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పద్దుల కేటాయింపుల్లో కార్మికులకు తీవ్ర అన్యాయం జరగడాన్ని నిరసిస్తూ గురువారం కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ నమూనా పత్రాలు దహనం చేశారు. కేంద్ర బడ్జెట్‌లో సంక్షేమ పథకాల ఎత్తివేయడం కోసం ఉపాధి నిధులను భారీగా తగ్గిస్తూ వ్యవసాయ కార్మికులకు దళితులకు కడుపుగొట్టే కుట్ర చేశాడని విమర్శించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేశ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అజయ్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని విస్మరించిన కేంద్ర బడ్జెట్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి సరైన నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ కమాన్‌చౌరస్తాలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ బడ్జెట్ కేవలం పార్లమెంట్ ఎన్నికల దృష్టిలో పెట్టుకొని ప్రవేశపెట్టిన ఎన్నికల బడ్జెట్ తప్ప విద్యార్థులకు, యువకులకు ఏమీ ప్రయోజనం లేదన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామారపు వెంకటేష్, మచ్చ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ సందర్శన



అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిప్యూటీ డైరెక్టర్లు

శాతవాహనయూనివర్సిటీ: కరీంనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీని హైదరాబాద్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిప్యూటీ డైరెక్టర్లు డాక్టర్ వై వెంకటేశ్వర్లు, డాక్టర్ చంద్రకళలు సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ డిగ్రీ, పీజీ ద్వితీయ, తృతీయ సంవత్సరం అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు ఫిబ్రవరి 5వ తేదీ వరకు అపరాధ రుసుం రూ.500తో చెల్లించాలని తెలిపారు. డాక్టర్ చంద్రకళ మాట్లాడుతూ విద్యార్థులు యూనివర్సిటీ నుంచి వచ్చే ఈ–మెయిల్ ప్రతిరోజూ చెక్ చేసుకోవాలని అన్నారు., యూనివర్సిటీ నుంచి వచ్చే నాక్ సమాధానాలు నింపాలని, ప్రతి విద్యార్థి వారి యొక్క ఈమెయిల్‌ని అప్‌డేట్ చేసుకోవాలని తెలిపారు. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రాంతీయ సమన్వయ కేంద్రం అధికారి అడెపు శ్రీనివాస్ మాట్లాడుతూ డిగ్రీ మొదటి మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్ష ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ రూ.500 అపరాధ రుసుముతో 10వ తేదీ వరకు ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాదేవ్, వీరస్వామి, స్వరూప, రాజు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కాల్వ నిర్మించాలని రైతుల ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులు

గన్నేరువరం(మానకొండూర్): మిడ్ మానేరు ప్రాజెక్టు కుడి కాల్వకు అనుసంధానంగా నిర్మించిన ఉప కాల్వ 9 నుంచి 1ఎల్ కాల్వ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ గురువారం మండలంలోని మాదాపూర్ గ్రామంలోని కాల్వ వద్ద మాదాపూర్, హన్మజిపల్లె గ్రామ రైతులు ఆందోళన చేపట్టారు. వైఎస్సార్‌టీపీ మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి సంపతి ఉదయ్ మద్దతు తెలిపి రైతులు తిరుపతిరెడ్డి, మల్లారెడ్డి, మత్స్యకారుడు నాగయ్యతో కలిసి మాట్లాడారు. నాలుగు నెలల క్రితం ఈ కాల్వ పనులు చేపట్టి పంటలకు, చెరువులకు సాగునీరు అందించాలని కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో వినతిపత్రం ఇచ్చినా పనుల్లో చలనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కాల్వ కింద ఉన్న మూడు గ్రామాలకు చెందిన 500 ఎకరాలు నీరు లేక ఎండిపోయే పరిస్థితికి చేరుకుందన్నారు. దీనిపై ఈ నెల 4వ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా, రాజీవ్ రహదారిపై రాస్తారోకో చేపట్టనున్నట్లు తెలిపారు.

ఉద్యమాల్లో అమరులైన వారిని గుర్తుంచుకోవాలి



మాట్లాడుతున్న తంగెడ కిషన్‌రావు

శాతవాహనయూనివర్సిటీ: పోరాట పటిమ– కలం యొక్క బలమే తెలంగాణ సహజ లక్షణమని తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య తంగేడ కిషన్‌రావు అన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయం తెలుగు శాఖ నిర్వహిస్తున్న తెలంగాణ ఉద్యమాలు సాహిత్యం రెండు రోజుల జాతీయ సదస్సు ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యమాలు అనేక రకాలని వీటిలో భాషా ఉద్యమాలు కొన్ని, స్వరాష్ట్ర ఉద్యమాలు కొన్ని అని తెలంగాణా కొరకు ఉద్యమాలు చేసి ఎంతోమంది అమరులయ్యారని వారిని గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఎంతో మంది పోరాట పటిమతో స్వరాష్ట్ర ఉద్యమం చేయగా మరి కొంతమంది కవులు బాణీలు కట్టి వారి సాహిత్యంతో తెలంగాణ రాష్ట్రం సాధించే వరకు అవిశ్రాంతంగా కృషి చేశారని తెలిపారు. శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ వరప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాష సాహిత్యాలు చాలా ఉన్నతమైనవని వాటి వాటి కలయికే తెలంగాణ ఉద్యమమని ఇలాంటి శీర్షికలతో సదస్సులు సమావేశాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల విద్యార్థులకు సరియైన దిశా నిర్దేశము జరుగుతుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జాఫర్ జరి అధ్యక్షతన జరిగిన ప్రముఖ కవి వారాల ఆనంద్, లక్ష్మణరావు లక్ష్మీనారాయణ పావని, ఆచార్య సుజాత, డాక్టర్ పద్మావతి, యశ్వంతరావు, విజయ ప్రకాష్‌తో పాటు వివిధ శాఖల అధిపతులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు జిల్లాలో నిర్వహించే కంటి వెలుగు శిబిరాలు

కరీంనగర్‌టౌన్: జిల్లాలో శుక్రవారం రోజు 48 ప్రదేశాల్లో కంటి వెలుగు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జువేరియా తెలిపారు. ఈనెల 3న కరీంనగర్‌లోని 5, 7, 11, 17, 22, 27, 33, 35, 37, 42, 47, 51, 57 డివిజన్‌లలో, హుజురాబాద్‌లోని 9, 26 వార్డుల్లో, హుజూరాబాద్ మండలం చెల్పూరు, పెద్ద పాపయ్యపల్లి గ్రామాల్లో, జమ్మికుంటలోని 3, 25 వార్డుల్లో, మండలంలోని సైదాబాద్, వావిలాల గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే వీణవంక మండలంలోని వీణవంక, చల్లూరు, చిగురు మామిడి మండలంలో చిగురుమామిడి, పెద్దపల్లి, చొప్పదండి మండలంలో వార్డు నంబర్ 4, రుక్మాపూర్ గ్రామం, ఇల్లందకుంట మండలంలో ఇల్లందకుంట, సిరిసేడు, గంగాధర మండలంలో కొండయ్యపల్లి, మధురానగర్, సర్వారెడ్డిపల్లి, రామడుగు మండలంలో రామడుగు, గోపాలరావుపేట, రామచంద్రపురం, కొత్తపల్లి మండలంలో కొత్తపల్లి వార్డు నంబర్ 10, ఆసిఫ్‌నగర్, కరీంనగర్ రూరల్ మండలంలో చామనపల్లి, మానకొండూరు మండలంలో మానకొండూర్, చెంజర్ల, వేగురుపల్లి, సైదాపూర్ మండలంలో వెన్నంపల్లి, ఎలబోతారం, కేశపట్నం మండలంలో కేశపట్నం, గొల్లపల్లి, తిమ్మాపూర్ మండలంలో తిమ్మాపూర్, గన్నేరువరం, పోరండ్ల గ్రామాల్లో కంటి వెలుగు బృందాలు పనిచేస్తున్నాయని తెలిపారు. 18 ఏళ్ల పైబడిన వారందరూ తమ ఆధార్ కార్డు తీసుకొని కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఐఎంఏ ఆధ్వర్యంలో గ్రామాల దత్తత



మాట్లాడుతున్న ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు బీఎన్ రావు

కరీంనగర్‌టౌన్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సామాజిక బాధ్యతగా గ్రామాలను దత్తత తీసుకొని వైద్యసేవలు అందించేందుకు నిర్ణయించినట్లు ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బీఎన్ రావు తెలిపారు. గురువారం ఐఎంఏ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఐఎంఏ 70 శాఖల్లోని 19 వేల మంది బాధ్యులతో గ్రామాల దత్తతను అమలు చేస్తామని తెలిపారు. ఇందులో 10 శాతం మంది వైద్యులు ముందుకు వచ్చిన 1,900 గ్రామాల్లో ఉచిత వైద్య సేవలు అందుతాయన్నారు. మొదట కరీంనగర్‌లో ప్రారంభించేందుకు నిర్ణయించామని, ఇక్కడి వైద్యుల నుంచి విశేష స్పందన వచ్చిందని తెలిపారు. 25 మంది వైద్యులు ఇప్పటికే తాము దత్తత తీసుకునే గ్రామాల పేర్లు ఇచ్చారని వెల్లడించారు. అయితే ఇది కొత్త పథకం ఏమీ కాదని జాతీయ ఐఎంఏ 2004లోనే గ్రామాల దత్తతకు తీర్మాణం చేసిందన్నారు. కరీంనగర్‌లో డాక్టర్ మధుసూదన్‌రావు తన స్వగ్రామమైన లింగాపూర్‌ను దత్తత తీసుకుని 15 ఏళ్ల పాటు నిర్విరామంగా నిరుపేదలకు సేవలు అందించారని తెలిపారు. ఆయన స్ఫూర్తితోనే తిరిగి ప్రారంభిస్తున్నామని అన్నారు. కరీంనగర్ రాష్ట్రంలోని అన్ని ఐఎంఏ శాఖలకు ఆదర్శంగా నిలిచేలా సేవలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో ఐఎంఏ బాధ్యులు రాంకిరణ్, వెంకట్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, వసంతరావు, ప్రదీప్‌కుమార్, విజయలక్ష్మి, ఝాన్సీ, అలీం, కార్తీక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

డీటీసీని కలిసిన ఆర్టీసీ డిపోల మేనేజర్లు


డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌తో ఆర్టీసీ మేనేజర్లు ప్రణీత్, మల్లయ్య

విద్యానగర్: కరీంనగర్ డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ మామిళ్ల చంద్రశేఖర్‌గౌడ్‌ను ఆయన కార్యాలయంలో ఆర్టీసీ కరీంనగర్–1, 2 డిపోల మేనేజర్లు ప్రణీత్, మల్లయ్యలు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో సంస్థ కరీంనగర్ పీఆర్‌వో బి.మలహల్‌రావు, రెండు డిపోల ఎల్‌వోలు సంపత్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మ్యాథ్స్ ఎక్స్‌పో


గణిత నమూనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కొత్తపల్లి: స్థానిక సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ (సీబీఎస్‌ఈ) స్కూల్‌లో గురువారం నిర్వహించిన మ్యాథ్స్ ఎక్స్‌పో ఆకట్టుకుంది. విద్యార్థులు తయారు చేసి, ప్రదర్శించిన గణిత నమూనాలు చూసి, అతిథులు అభినందించారు. పారమిత, సెయింట్ జార్జ్ విద్యాసంస్థల చైర్మన్ పోతిరెడ్డి ఫాతిమారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో లయన్ మధుసూదన్‌రెడ్డి, సిగ్మా శ్రీరామ్, డాక్టర్ సత్యనారాయణ శర్మ, అమీర్, అకాడమిక్ సీఈవో ఉమాకాంత్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. ఎక్స్‌పోలో భాగంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

‘బడ్జెట్‌లో యువతకు తీవ్ర అన్యాయం’

కరీంనగర్: కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ యువతకు తీవ్ర అన్యాయం చేసిందని, ఇది కార్పొరేట్, ప్రైవేట్ రంగాలను మరింత బలోపేతం చేసేలా ఉందని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోనగిరి మహేందర్, బ్రాహ్మణపల్లి యుగంధర్‌లు ఒక ప్రకటనలో ఆరోపించారు. కేంద్రంలో ప్రధాని మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తెలంగాణ రాష్ట్రం, యువత పట్ల తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలైన కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ, ములుగులో గిరిజన యూనివర్సిటీల ఏర్పాటును విస్మరించిందని పేర్కొన్నారు. విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాలపై బడ్జెట్‌లో కంటితుడుపు చర్యలు కూడా లేవన్నారు. ఇది సామాన్య ప్రజలను దారిద్ర్యరేఖ దిగువకు చేర్చేందుకు, సంపన్నులకు మేలు చేసేలా ఉందని ఎద్దేవా చేశారు.

వేంకటేశ్వరస్వామి శోభాయాత్ర



కరీంనగర్ కల్చరల్: వేంకటేశ్వర స్వామి షష్ఠమ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శోభాయాత్ర నిర్వహించారు. కరీంనగర్‌లోని మంకమ్మతోట మీసేవ కేంద్రం వద్ద మంకమ్మతోట భక్త బృందం ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమాన్ని అన్నమయ్య 12వ తరం వారసుడు హరినారాయణాచార్యులు ప్రారంభించారు. నందెల్లి రమ–శేఖర్, జిల్లెల కోటేశ్వర్, సంపత్, శ్రీనివాస్, మహేందర్, అరుణ్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్ విశ్వవిద్యాలయాల హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, పీడీ

కరీంనగర్ స్పోర్ట్స్: తమిళనాడు రాష్ట్రంలోని పెరియార్ యూనివర్సిటీలో ఈ నెల 4 నుంచి జరగనున్న అంతర్ విశ్వవిద్యాలయాల హ్యాండ్‌బాల్ పోటీలకు కరీంనగర్‌లోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన విద్యార్థులు అక్షయ్, తిరుమలేష్‌లు ఎంపికైనట్లు కళాశాల పీడీ పన్యాల శ్రీనాథ్ రెడ్డి తెలిపారు. వారు ఇటీవల జరిగిన శాతవాహన యూనివర్సిటీ స్థాయి పోటీల్లో రాణించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.శ్రీనివాస్, బండి శ్రావణ్, బండి సంపత్‌కుమార్, రామేశ్వర్‌రావు, అధ్యాపకులు అభినందించారు.

మందుల కొరత.. రోగుల వెత

- కేస్‌షీట్లు లేవు.. తెల్ల కాగితాలపై రాస్తున్న వైద్యులు
- జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో పరిస్థితి
- ప్రైవేటు మెడికల్ షాపులకు వెళ్తున్న పేషెంట్లు
- అధిక ధరలతో జేబులు గుల్ల



కరీంనగర్‌టౌన్: జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో మందుల కొరత పేద రోగుల పాలిట శాపంగా మారుతోంది. అన్నీ ఉచితమే అని వస్తే.. మాత్రలు లేకపోవడంతో ప్రైవేటు మెడికల్ షాపుల్లో కొనుగోలు చేయాల్సి వస్తోంది. దీంతో వారి జేబులు గుల్లవుతున్నాయి. ఉత్తర తెలంగాణకు పెద్ద దిక్కుగా ఉన్న కరీంనగర్ జిల్లా కేంద్ర ఆసుపత్రిలో సాధారణ మందులు కూడా లేవంటున్నారు. పలు సమస్యలతో బాధపడేవారు నిత్యం 450 మందికి పైగా ఈ దవాఖానాకు వస్తుంటారు. వారందరికీ వైద్యులు అవసరమైన మందులను చీటీపై రాసిస్తున్నారు. తీరా ఓపీ ఫార్మసీ విభాగం వద్దకు వెళ్తే వాటిలో చాలా మందులు లేవన్న సమాధానం వస్తోంది. తప్పనిసరి పరిస్థితుల్లో బాధితులు సమీపంలోని ప్రైవేటు మెడికల్ షాపుల్లో అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు.

ముఖ్యమైన మందులూ లేవు..

ఔట్, ఇన్ పేషెంట్లకు అవసరమైన పెయిన్ కిల్లర్ ట్రమడాల్, కడుపులో గ్యాస్ సమస్యలకు వాడే పాంటాప్రజోల్, ఎన్‌ఎస్ ఐవీ సెలైన్, పిల్లలకు వాడే మోషన్స్ సాచెట్స్ స్పోర్‌లాక్, పిల్లల సిరప్‌లు బుస్కోపాన్, అజిత్రోమైసిన్, ఆస్తమాకు వాడే డెరిఫిలిన్, ఇన్‌ఫెక్షన్లకు వాడే క్లాండమైసిన్ వంటి ముఖ్యమైన మందులు జిల్లా ఆసుపత్రిలో లేవు. వైద్యులు కాగితంపై రాసిచ్చిన వెంటనే పేషెంట్లు ప్రైవేటు మెడికల్ షాపులకు పరుగులు తీస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు.

రెండు రోజుల్లో అందుబాటులో ఉంచుతాం

ఆసుపత్రిలో అయిపోయిన మందులకు సంబంధించి ఎప్పటికప్పుడు ఇండెంట్ పెడుతున్నాం. సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి మాత్రల సరఫరా వేగంగా జరగడం లేదు. రెండు రోజుల్లో దవాఖానాలో లేని అన్ని రకాల మందులను పేషెంట్లకు అందుబాటులో ఉంచుతాం.
– ఆకుల ప్రభాకర్, ఆసుపత్రి ఫార్మసిస్టు

నిలిచిన స్టేషనరీ సరఫరా..

ఆసుపత్రికి స్టేషనరీ సరఫరా నిలిచిపోయింది. నిన్న, మొన్నటి వరకు ఓపీ చిట్టీలు కూడా తెల్ల పేపర్ల పైనే రాశారు. పేషెంట్ల వ్యాధికి సంబంధించిన వివరాలు రికార్డు చేసేందుకు వాడే కేస్‌షీట్లు లేవు. తెల్ల కాగితాలపైనే స్టాంపులు వేసి, డాక్టర్లు మందులు, చికిత్సకు సంబంధించిన వివరాలు రాస్తున్నారు. ఫలితంగా పేషెంట్ సమాచారం పూర్తిగా రికార్డు కావడం లేదు. భవిష్యత్తులో కేస్‌షీట్ కావాలన్నా దొరకని పరిస్థితి నెలకొంది.

సీపీని కలిసిన ఎంఐఎం నాయకులు


సీపీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

విద్యానగర్: పోలీస్ కమిషనర్ సుబ్బారాయుడును గురువారం ఎంఐఎం కరీంనగర్ నగర అధ్యక్షుడు, తెలంగాణ హజ్ కమిటీ సభ్యుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్పొరేటర్లు, నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమి, ఎంఐఎం ప్రధాన కార్యదర్శి సయ్యద్ బర్కత్ అలీ, సహాయ కార్యదర్శి హఫీజ్ మొయిజుద్దీన్ ఖాద్రి యూసుఫ్, కోశాధికారి సయ్యద్ ఇబ్రహీం బియాబాని, కార్పొరేటర్లు అఖిల్ ఫిరోజ్, షర్ఫుద్దీన్, అలీబాబా, ఆతిన, అజర్ దబీర్, డివిజన్ల అధ్యక్షులు ఎండీ.సాజిద్, ఫసియుద్దీన్ ఖాలిద్, అన్నెమల్ల సురేష్, జావిద్, బాల్ రాజు, యాకుబ్, ఇలియాజ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుని కుటుంబానికి రూ.20 లక్షలివ్వాలి



కూలిన గోడను పరిశీలిస్తున్న సీపీఎం, సీపీఐ నాయకులు

కరీంనగర్: ఇంజినీర్ తప్పిదం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా గోడ కూలి, బిహార్‌కు చెందిన కార్మికుడు మరణించాడని, మరో ఇద్దరు కార్మికులు గాయపడ్డారని సీపీఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం, సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. మృతుని కుటుంబానికి రూ.20 లక్షలు, గాయపడిన వారికి ప్రమాద తీవ్రతను బట్టి ఎక్స్‌గ్రేషియా, వైద్య ఖర్చులు చెల్లించాలని డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం, సీపీఐ నగర కమిటీల ఆధ్వర్యంలో స్మార్ట్‌సిటీ పనుల్లో భాగంగా గోడ కూలి స్థలాన్ని వేర్వేరుగా పరిశీలించారు. కట్టరాంపూర్ నుంచి అంబేడ్కర్ స్టేడియం మీదుగా ప్రధాన వరద కాలువలో కలపాల్సిన డ్రైనేజీని కట్టరాంపూర్ ఆటో స్టాండ్ నుంచి తిరుమల్ నగర్, హనుమాన్ నగర్ మీదుగా ప్రధాన వరద కాలువలో కలపడానికి చేసే ప్రయత్నంలోనే ఈ ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు. హనుమాన్ నగర్‌లో 10 ఫీట్ల వెడల్పుతో డ్రైనేజీని, ఇంటి కాంపౌండ్ పక్కనే తవ్వడం వల్ల గోడ కూలిందని తెలిపారు. దీనిపై మున్సిపల్ కమిషనర్, మేయర్ స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని, కాంపౌండ్ వాల్ కోల్పోతున్న ఇంటి యజమానులకు పరిహారం చెల్లించాలన్నారు. కార్యక్రమాల్లో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గీట్ల ముకుంద రెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు నరేష్, నగర కమిటీ సభ్యుడు పున్నం రవి, నాయకులు, సీపీఐ నగర సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు, నాయకులు బండ ప్రమోద్ రెడ్డి, సందీప్ రెడ్డి, సత్యం, రామ్ సింగ్, విజయ్, మనోజ్, సంజీవ్, శ్రీనివాస్ రెడ్డి తదితరులున్నారు. పాల్గొన్నారు.

వరిలో తగ్గిన మొగి పురుగు ఉధృతి


పొలాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు

కొత్తపల్లి: ప్రస్తుత పరిస్థితుల్లో వరిలో మొగి పురుగు ఉధృతి తగ్గిందని కేవీకే శాస్త్రవేత్తలు శ్రీనివాస్ రెడ్డి, విజయ్‌కుమార్‌లు తెలిపారు. కొత్తపల్లిలోని వరి పొలాలను గురువారం కొత్తపల్లి మండల వ్యవసాయాధికారి రంజిత్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. మొగి పురుగు ఉధృతి తగ్గి, పొలాలు సాధారణ స్థితికి చేరుకున్నాయని చెప్పారు. వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల ఈ పురుగు కాండాన్ని తొలవడంతో పంట ఎదుగుదల లేకుండా గింజలు తాలై పోతాయని అన్నారు. మొగి పురుగు నియంత్రణకు నారు దశలో అయితే నారు తీసే వారం రోజులు ముందు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలను ఎకరా నారుమడిలో 800 గ్రాములు చల్లాలని పేర్కొన్నారు. ప్రధాన పొలంలో 15 రోజుల్లోపు పంటకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలను ఎకరాకు 10 కిలోల చొప్పున చల్లుకోవాలని తెలిపారు. అదే 30 రోజులు దాటిన పొలం అయితే కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేస్తే పురుగును నివారించవచ్చని పేర్కొన్నారు. అలాగే జింక్ లోపం ఉన్నట్లయితే లాబొరేటరీ జింక్‌ను 1కిలో ప్యాకెట్ 3 ఎకరాలకు చల్లుకోవాలని సూచించారు. కొత్తపల్లి ఆర్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ వెంకట్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో స్నానపు గదులు నిర్మించండి


వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 17, 18, 19 డివిజన్లకు సంబంధించి రేకుర్తి శ్మశానవాటికలో ఇటీవల కూల్చివేసిన స్నానపు గదులను తిరిగి నిర్మించాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ స్వరూపరాణికి వినతిపత్రం అందించారు. గతంలో ఉన్న గదులు కూల్చివేయడం వల్ల దహన సంస్కారాలకు వచ్చే మహిళలు స్నానాలు చేసేందుకు, దుస్తులు మార్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పనులు త్వరగా పూర్తి చేసి, నీటి సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు బండ రమణారెడ్డి, గొల్లె బాలకృష్ణ, దుర్గం ఆంజనేయులు, ఎడమ సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో సత్తా


విద్యార్థులను అభినందిస్తున్న అనంతరెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్: నెహ్రూ యువకేంద్రం, యువశక్తి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గత నెల 30, 31 తేదీల్లో కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి గ్రామీణ క్రీడోత్సవాల్లో కరీంనగర్‌లోని సాయి మానేరు పాఠశాల విద్యార్థులు సత్తా చాటినట్లు పీఈటీ సిలివేరి మహేందర్ తెలిపారు. జూనియర్స్ కేటగిరీ కబడ్డీ విభాగంలో ద్వితీయ స్థానం సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో క్రీడల్లో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. డైరెక్టర్లు కడారి సునీతారెడ్డి, కడారి కృష్ణారెడ్డి, కడారి శ్వేతారెడ్డి, ఏవో సుభాష్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ సరితారెడ్డి, ఉపాధ్యాయులు, పీఈటీలు రాజశేఖర్, తిరుపతి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలు సంఘటితంగా హక్కులు సాధించుకోవాలి


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి కమలాకర్

జమ్మికుంట(హుజూరాబాద్): బీసీ సంక్షేమ సంఘం హుజూరాబాద్ నియోజకవర్గ స్థాయి క్యాలెండర్‌ను పౌర సరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ గురువారం ఆవిష్కరించారు. బీసీలు సంఘటితంగా హక్కులు సాధించుకోవాలని, సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. సామాజిక, రాజకీయ, ఆర్థిక, విద్యా, ఉద్యోగ రంగాల్లో ముందుండాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టంగుటూరి రాజ్‌కుమార్, రాష్ట్ర నాయకులు పొనగంటి మల్లయ్య, జమ్మికుంట మండల అధ్యక్షుడు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు ముద్రగడ నవీన్‌కుమార్, జిల్లా నాయకులుకొలిపాక శ్రీనివాస్, డివిజన్ నాయకులు కాజీపేట శ్రీనివాస్, కృష్ణ, తులసి లక్ష్మణమూర్తి, పంతాటి రవీందర్, ఏబూసి ఓదేలు, తాళ్ళపెల్లి కుమారస్వామి, కొమ్ము రాజు తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఆభరణాలు అప్పగింత


ఆభరణాలు అప్పగిస్తున్న అదనపు డీసీపీ చంద్రమోహన్

కరీంనగర్ క్రైం: ఆటో ఎక్కి దిగే సమయంలో మర్చిపోయిన బంగారు, వెండి ఆభరణాల కలిగిన బ్యాగును కరీంనగర్ సీసీఎస్ పోలీసులు గుర్తించి, బాధితురాలికి అప్పగించారు. సీసీఎస్ ఏసీపీ కె.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా రామకృష్ణకాలనీకి చెందిన సుల్తాన్ కల్యాణి పని నిమిత్తం జనవరి 28న కరీంనగర్ వావిలాలపల్లిలోని తన సోదరి ఇంటికి వచ్చింది. ఆదివారం సాయంత్రం మంచిర్యాలకు వెళ్లేందుకు కోర్టు సమీపంలో తన బాబుతో కలిసి ఆటో ఎక్కి తన వద్ద ఉన్న నాలుగు తులాల బంగారు, 7 తులాల వెండి ఆభరణాలు, రూ.2,500 కలిగిన బ్యాగును ఆటో సీటు వెనక వైపు ఉన్న ఖాళీ ప్రదేశంలో వేసింది. తర్వాత మరిచిపోయి బస్టాండ్ వద్ద ఆటో దిగింది. కొంత సేపటికి తన వద్ద ఉండాల్సిన బ్యాగు ఆటోలో మరిచిపోయినట్లు గుర్తించి, కరీంనగర్ సీసీఎస్ పోలీసులను ఆశ్రయించింది. వారు ఎస్సారార్ కళాశాల నుంచి బస్టాండ్ వరకు రహదారిపై ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. అయితే కల్యాణి ఆటో సీటు వెనక వైపు బ్యాగు వేయడంతో ఆటోడ్రైవర్ సైతం దానిని గుర్తించలేదు. పోలీసులు బుధవారం సదరు ఆటోను గుర్తించారు. గురువారం కరీంనగర్ అదనపు డీసీపీ చంద్రమోహన్ చేతుల మీదుగా బాధితురాలు కల్యాణి దంపతులకు బ్యాగును అప్పగించారు. కార్యక్రమంలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ లింగమూర్తి, హెడ్ కానిస్టేబుల్ సురేందర్‌పాల్‌సింగ్, కానిస్టేబుల్ కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ టీచర్ల వివరాలు పొందుపర్చాలి


డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్: బదిలీలు, పదోన్నతులకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ టీచర్ల రోస్టర్ లిస్టు, అడిక్వసీ వివరాలను పూర్తిస్థాయిలో అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు మీసాల మల్లిక్ కోరారు. ఈ మేరకు గురువారం డీఈవో జనార్దన్‌రావుకు వినతిపత్రం అందించారు. ఇప్పటివరకు కేవలం ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి సీనియారిటీ జాబితా 2002 వరకు పొందుపర్చారని తెలిపారు. కానీ ఎస్సీ, ఎస్టీ రోస్టర్ ఏ డీఎస్సీ వరకు కటాఫ్ అవుతుందో తెలియాలంటే ముందుగా రిజర్వేషన్ ప్రకారం ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ టీచర్ల వివరాలు తెలపాలన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టుల వివరాలను క్యాడర్, మేనేజ్‌మెంట్ వారీగా బహిర్గతం చేసి, ఎలాంటి అవకతవకలకు తావివ్వకుండా చూడాలని కోరారు. బదిలీలు, పదోన్నతుల్లో పారదర్శకత పాటించాలన్నారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు ఐలయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల అభ్యంతరాలు పరిష్కరించాలి


డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్: ప్రమోషన్లకు సంబంధించి టీచర్ల అభ్యంతరాలను పరిష్కరించి, సీనియారిటీ జాబితా సవరించాలని తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కట్ట రాజేశ్వర్, గన్నమనేని రంగారావులు కోరారు. ఈ మేరకు గురువారం డీఈవో జనార్దన్‌రావుకు వినతిపత్రం అందించారు. ఎస్‌జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్ పదోన్నతికై అర్హత ఉన్న అన్ని సబ్జెక్టుల్లో అవకాశం కల్పించాలని, ఒక సబ్జెక్టు కోసం డిక్లరేషన్ ఇవ్వాలనడం సరికాదన్నారు. ఇతర రాష్ట్రాల్లో బీఈడీ చేసిన అభ్యర్థులకు గతంలో మాదిరిగా పదోన్నతికి అర్హతలు ఉంటే పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్టీసీ డిప్యూటీ ఆర్‌ఎంగా బాధ్యతలు


బాధ్యతలు స్వీకరిస్తున్న భీంరెడ్డి

విద్యానగర్: కరీంనగర్ ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ (మెకానికల్)గా ఎస్.భీంరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన వి.శివశంకర్ నల్గొండకు బదిలీ కావడంతో వేములవాడ డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న భీంరెడ్డి పదోన్నతి పొంది, కరీంనగర్ డిప్యూటీ రీజినల్ మేనేజర్(మెకానికల్)గా నియమితులయ్యారు.

ఇండియన్ ఆర్మీ ఉద్యోగాలకు ఎంపిక



కొత్తపల్లి: కొత్తపల్లిలోని తేజస్ డిఫెన్స్ అకాడమీకి చెందిన 201 మంది విద్యార్థులు ఇండియన్ ఆర్మీ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సూర్యాపేటలో గతేడాది అక్టోబర్‌లో జరిగిన ర్యాలీలో తేజస్ నుంచి 1,416 మంది విద్యార్థులు పాల్గొనగా అగ్నిపథ్ తొలి బ్యాచ్‌లో రాష్ట్రంలోనే అత్యధికంగా 201 మంది ఎంపికవ్వడం గర్వంగా ఉందని ఆ డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ సీహెచ్.సతీశ్‌రావు తెలిపారు. గురువారం తేజస్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించిన మాట్లాడారు. ఇండియన్ ఆర్మీలో ఆర్మీ జనరల్ డ్యూటీకి 179 మంది, ఆర్మీ టెక్నికల్‌కు 18 మంది, ఆర్మీ ట్రేడ్‌మెన్‌లో 4గురు ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు.

పీహెచ్‌సీ ఎదుట ఆశవర్కర్ల ధర్నా

- కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్


వైద్యాధికారికి వినతిపత్రం ఇస్తున్న ఆశవర్కర్లు

కొత్తపల్లి: తమకు ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని, ఆలోగా ఆంధ్రప్రదేశ్‌లో మాదిరిగా ఫిక్స్‌డ్ వేతనం రూ.10 వేలు చెల్లించాలని ఆశవర్కర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం మండల వైద్యాధికారి వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కంటి వెలుగు శిబిరాల్లో సేవలందిస్తున్న ఆశవర్కర్లకు అదనంగా డబ్బులివ్వాలని, 2022 డిసెంబర్ 6 నుంచి నిర్వహించిన లెప్రసీ సర్వేకు డబ్బులు చెల్లించాలని కోరారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం ఆశవర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలన్నారు. లేనిపక్షంలో ఫిబ్రవరి 16న చలో హైదరాబాద్ కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

కేంద్ర బడ్జెట్‌లో ‘ఉపాధి’కి కోత

కరీంనగర్: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఉపాధిహామీ పథకానికి కోత పెట్టి, కూలీలను పనులకు దూరం చేయాలని చూస్తున్నారని బీకేఎంయూ రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దేశాన్ని పాలిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం సంపన్న వర్గాలకు కొమ్ము కాస్తోందని మండిపడ్డారు. దేశంలో పేద, బడుగు, బలహీన వర్గాలకు ప్రతీరోజు పని కల్పించి, వారికి ఆర్థిక తోడ్పాటునందించేందుకు ఉపాధిహామీ పథకాన్ని తీసుకువచ్చారని పేర్కొన్నారు. కూలీలకు 200 రోజులు పని కల్పించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలి రేట్లను పెంచాలన్నారు. గ్రామీణ భారత అభివృద్ధిలో ఉపాధిహామీ పథకం కీలక పాత్ర పోషిస్తుందని గతంలో నీతి అయోగ్ స్పష్టం చేసిన విషయాన్ని కేంద్ర ప్రభుత్వం మరిచిపోయిందని తెలిపారు. జాబ్ కార్డు ఉన్న ప్రతీ కూలీకి పని కల్పించడం, సకాలంలో వేతనాలు చెల్లించేలా బడ్జెట్ కేటాయింపుల్లో సవరణ చేయాలని డిమాండ్ చేశారు.

సీపీకి శుభాకాంక్షలు


సీపీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న స్వప్న–శ్రీనివాస్

సప్తగిరికాలనీ: కరీంనగర్ పోలీస్ కమిషనర్ సుబ్బారాయుడును మేము సైతం ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు చకిలం స్వప్న–శ్రీనివాస్ దంపతులు గురువారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు.

ఉపసర్పంచ్‌పై వీగిన అవిశ్వాస తీర్మానం



రామడుగు(చొప్పదండి): రామడుగు ఉపసర్పంచ్ వడ్లూరి రాజేందర్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయిందని కరీంనగర్ ఆర్డీవో ఆనంద్‌కుమార్ తెలిపారు. జీపీ కార్యాలయంలో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 15 మంది వార్డు సభ్యులకు కేవలం ఏడుగురు హాజరుకావడంతో తీర్మానం వీగిపోయిందని ప్రకటించారు. ఎంపీడీవో రాజీవ్‌మల్హోత్ర తదితరులున్నారు.

పవర్ కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు 11 కేవీ సుభాష్‌నగర్ ఫీడర్ పరిధిలోని ఆదర్శనగర్, సుభాష్‌నగర్, బుట్టరాజారాంకాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–1 ఏడీఈ ఎస్.నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్లుప్తంగా...

నెల్లూరు రూరల్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఆదాల



సాక్షి, అమరావతి: నెల్లూరు రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని పార్టీ అధ్యక్షుడు, ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నియమించారని ఆ పార్టీ ప్రధాన కార్య దర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. వచ్చే ఎన్నికల్లో నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి పార్టీ అభ్యర్థిగా ఆదాల ప్రభాకర్‌రెడ్డే పోటీ చేస్తారని ప్రకటించారు. గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌తో సజ్జల రామ కృష్ణారెడ్డి, ప్రాంతీయ సమన్వయకర్త బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి తదితరులు సమావేశమ య్యారు. అనంతరం సజ్జల మీడియాతో మాట్లాడారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి 2024 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తానని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రకటించిన ఆడియో ఇటీవల సర్క్యులేట్ అయ్యిందని గుర్తు చేశారు. టీడీపీలోకి వెళ్లాలని నిర్ణయం తీసుకున్నాక కోటంరెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఖాళీ అయిన నెల్లూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త స్థానాన్ని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డితో సీఎం వైఎస్ జగన్ భర్తీ చేశారని వివరించారు. బాలి నేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నెల్లూరు రూ రల్ నియోజకవర్గంలో ఇకపై ఆదాల ద్వారానే అన్ని కార్యక్రమాలు జరుగుతాయని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో ఆదాల విజయం నల్లేరుపై నడకేనని ధీమా వ్యక్తం చేశారు.

హుండీ ఆదాయంలో రికార్డుల మోత

ఆపద మొక్కులవాడి ఆదాయం 11 నెలల్లోనే రూ.1,414.21 కోట్లు

తిరుమల: ఆపద మొక్కులవాడికి సాధారణంగా మే, జూన్ నెలల్లో మాత్రమే హుండీ ద్వారా లభించే ఆదాయం నెలకు రూ.100 కోట్లు దాటేది. మిగిలిన నెలల్లో నెలకు రూ.100 కోట్లలోపే ఉండేది. ప్రస్తుతం శ్రీవారికి నిత్యం రూ.4 కోట్లకు పైగా హుండీ ఆదాయం లభిస్తోంది. టీటీడీ చరిత్రలో ముందెన్నడూ లేని విధంగా గత ఏడాది మార్చి నుంచి ప్రతినెలా హుండీ ఆదాయం రూ.100 కోట్లు దాటుతోంది. గడచిన 11 నెలల్లో రూ.1,414.21 కోట్లు రాగా.. ఈ ఏడాది రూ.1,500 కోట్ల మార్కును దాటిపోనుంది.

తరలిపోతున్న తెల్ల బంగారం



పత్తి పంటకు ఆదిలాబాద్ జిల్లాలో సరైన మద్దతు ధర లేక మహారాష్ట్రకు తరలిపోతోంది. జిల్లాలో గురువారం పత్తి క్వింటాకు సీసీఐ ధర రూ.7,700 పలుకగా, ప్రైవేటు వ్యాపారులు రూ.7710కు కొనుగోలు చేశారు. జైనథ్ మండలం మాండగడ గ్రామం వద్ద పత్తిని వాహనంలో తరలిస్తుండగా కనిపించిన దృశ్యమిదీ.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

ట్యాపింగ్ కాదది.. రికార్డింగే

జరగని ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లుగా చిత్రీకరిస్తూ చంద్రబాబు కుట్ర

జాతీయ సమస్యగా దానిపై పోరాటం చేసే స్థాయికి దిగజారిన వైనం

- ఈ కుట్రలో కోటంరెడ్డి పాత్రధారి
- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి
- వైఎస్సార్‌సీపీ లేకుంటే ఎమ్మెల్యే అయ్యేవాడివా?
- ఏపీ మంత్రి పెద్దిరెడ్డి మండిపాటు
- ఇది నమ్మకద్రోహం
- మాజీ మంత్రి పేర్ని నాని ధ్వజం

సాక్షి, అమరావతి : 'ఏపీలో రాజకీయం చేయడానికి ఏ సమస్యా లేకపోవడంతో జరగనే జరగని ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు చిత్రీకరించి.. దానిని జాతీయ సమస్యగా సృష్టించి, పోరాటం చేసే స్థాయికి టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు దిగజారారు. ఈ కుట్రలో కోటంరెడ్డి పాత్రధారి. ఇందులో భాగంగా కోటంరెడ్డి ప్రభుత్వంపై బురద చల్లి పార్టీ వీడాలనుకోవడం దారుణం. ఇంతకూ రికార్డ్ చేసింది కోటంరెడ్డి మిత్రుడే' అని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, విద్యుత్, అటవీ, గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) మండిపడ్డారు. గురువారం వారు వేర్వేరుగా మీడియాతో మాట్లాడారు. ఆ వివరాలు వారి మాటల్లోనే..

టీడీపీలో చేరే వారు బావిలో దూకినట్లే

ఇష్టం లేనివారు టీడీపీలోకి వెళ్లాలనుకుంటే వెళ్లొచ్చు. కానీ ప్రభుత్వంపై, వైఎస్సార్‌సీపీపై బురదజల్లాలనుకోవడం సమంజసం కాదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీని స్థాపించకపోతే నీలాంటి వాళ్లు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యే వారా? కోటంరెడ్డి ఆరోపిస్తున్నట్లుగా అది ఫోన్ ట్యాపింగ్ కానే కాదు. ఆయన మిత్రుడే రికార్డ్ చేశారన్న విషయం కోటంరెడ్డికి కూడా తెలుసు. ఇదంతా చంద్రబాబు కుట్ర. ఇలాంటి కుట్రలు, కుతంత్రాలకు సీఎం వైఎస్ జగన్ భయపడరు. టీడీపీలో చేరే ఎమ్మెల్యేలు బావిలో దూకినట్టే.

– పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, విద్యుత్, అటవీ, గనుల శాఖ మంత్రి

టీడీపీ రాజకీయ లబ్ధి కోసమే..



నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఫోన్ సంభాషణను ఆయన మిత్రుడే రికార్డింగ్ చేసి.. అందరికీ పంపారు. బయట సర్క్యులేట్ అవుతున్న ఆ ఆడియో క్లిప్‌ను ఇంటెలిజెన్స్ అధికారి కోటంరెడ్డికి పంపి, సరి చూసుకోవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ తరఫున రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుతో సమావేశమయ్యాక.. 2024లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తానని చెప్పిన మాటల ఆడియో కూడా సర్క్యులేట్ అవుతోంది. చంద్రబాబుతోనూ లోకేశ్‌తోనూ కోటంరెడ్డి ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నారని టీడీపీ నేతలే చెబుతున్నారు. ఫోన్ ట్యాపింగ్ చేసి ఉంటే.. చంద్రబాబుతో కోటంరెడ్డి సంప్రదింపులు జరుపుతున్నట్లుగా మేం అప్పుడే గుర్తించేవాళ్లం కాదా? టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏబీ వెంకటేశ్వరరావు ద్వారా చంద్రబాబు.. మా ఫోన్లను ట్యాపింగ్ చేశారని.. దానిపై న్యాయస్థానంలో కేసు కూడా వేశాం. వాళ్లలాగే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కూడా ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నట్లు రాజకీయ లబ్ధి కోసం టీడీపీ కుట్ర పూరితంగా చిత్రీకరిస్తోంది.


– సజ్జల రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు

డిసెంబర్ 25న బాబును కలిశారు



'నీ ఫోన్ సంభాషణను నీ మిత్రుడు రామశివారెడ్డి రికార్ట్ చేసి, అందరికీ పంపారు. అది బయట సర్క్యులేట్ అవుతుంటే.. ఇంటెలిజెన్స్ అధికారి దాన్ని నీకు వాట్సాప్‌లో పంపి.. సరి చూసుకోవాలని సూచించడంలో తప్పేముంది? ఇది వాస్తవం కాదంటే.. నీ ఫోన్‌కు సంబంధించి గత ఆర్నెల్ల వాట్సాప్ డేటాను బహిర్గతం చేయగలవా? కోటంరెడ్డిని సీఎం జగన్ ఎంతగానో నమ్మితే.. ఇలా నమ్మక ద్రోహానికి పాల్పడటం తగదు. 'డిసెంబర్ 25న బ్లూ కలర్ బెంజ్ కారులో చంద్రబాబు ఇంటికి కోటంరెడ్డి వచ్చి.. రెండు గంటలపాటు మాట్లాడి వెళ్లారు. ఇదివరకట్లాగే నారాయణతో సంబంధాలు కొనసాగించాలని బాబు చెప్పారు. లోకేశ్‌తో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నారు. పాదయాత్రకు ముందు లోకేశ్ సలహాలు కూడా అడిగారు. కోటంరెడ్డి ఆస్పత్రిలో ఉన్నప్పుడు లోకేశ్ ఫోన్ ద్వారా పరామర్శించారు' అని టీడీపీ నేతలు, కోటంరెడ్డి పక్కనున్న వారే చెబుతున్నారు.

– పేర్ని నాని, మాజీ మంత్రి



కన్హా శాంతివనంలో గురూజీ కమ్లేశ్ పటేల్‌తో హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్, న్యాయమూర్తుల బృందం

దేశప్రగతికి ఆధ్యాత్మికత మూలాధారం

లాలాజీ మహరాజ్ జయంతి ఉత్సవాల్లో కేంద్రమంత్రి దేవుసింగ్ చౌహాన్

నందిగామ: సమాజంలోని ప్రతివ్యక్తి ఆధ్యాత్మికతను అలవర్చుకున్నట్లయితే అందమైన ప్రపంచం తయారవుతుందని, దేశప్రగతికి ఆధ్యాత్మికత మూలాధారమని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి దేవుసింగ్ జేసింగ్ భాయ్ చౌహాన్ అన్నారు. రంగారెడ్డి జిల్లా నందిగామలోని కన్హా శాంతి వనంలో జరిగిన శ్రీ రామచంద్ర మిషన్ వ్యవస్థాపకుడు లాలాజీ మహరాజ్ 150వ జయంతి ఉత్సవంలో ఆయన వర్చువల్ విధానంలో మాట్లాడారు. ప్రతి వ్యక్తి హార్ట్‌ఫుల్‌నెస్ పద్ధతి ద్వారా ధ్యానం చేసినట్లయితే ఆత్మశుద్ధి అవుతుందన్నారు. ప్రస్తుత గురూజీ కమ్లేశ్ పటేల్‌కు పద్మభూషణ్ అవార్డు రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. గురూజీ కమ్లేశ్ పటేల్ మాట్లాడుతూ ప్రాణాహుతి, హార్ట్‌ఫుల్‌నెస్ ద్వారా ధ్యానం చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అనంతరం చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ ప్రకాశ్, సర్కిల్ అధికారి రేవా ఆధ్వర్యంలో లాలాజీ స్మారక పోస్టల్ స్టాంపును విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రముఖ సంగీత కళాకారుడు హరిప్రసాద్ చౌరాసియా సంగీత విభావరి అలరించింది. ఉత్సవాలకు హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌తోపాటు జస్టిస్ రాధారాణి, జస్టిస్ ఎస్.నంద, జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి, జస్టిస్ భీమపాక నగేశ్, జస్టిస్ నవీన్‌రావు, జస్టిస్ శ్రీసుధ, జస్టిస్ నాగార్జున్, జస్టిస్ సురేందర్, జస్టిస్ సుధీర్‌కుమార్‌లు పాల్గొని ధ్యానం చేశారు.

దేశవ్యాప్తంగా ఏపీ 'పెట్టుబడుల' సదస్సులు

- ముంబై, అహ్మదాబాద్, బెంగళూరు, కోల్‌కతా, త్రివేంద్రం, చెన్నై, హైదరాబాద్‌లో నిర్వహణ

సాక్షి, అమరావతి: పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా విశాఖలో మార్చి నెలలో జరిగే గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సును విజయవంతం చేయడమే లక్ష్యంగా.. దేశవ్యాప్తంగా పెట్టుబడుల సన్నాహక సదస్సులను ఏపీ ప్రభుత్వం నిర్వహించబోతోంది. ఫిబ్రవరి 10 నుంచి 24 వరకు దేశంలోని 7 ప్రధాన నగరాల్లో రోడ్‌షోలు నిర్వహించేందుకు ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు ప్రణాళికలు రూపొందించింది. సీఎం జగన్ ఇటీవల ఢిల్లీలో ప్రారంభించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సన్నాహక సదస్సు విజయవంతమవ్వడంతో.. అదే స్ఫూర్తితో ఈ రోడ్‌షోలను కూడా నిర్వహించబోతోంది. ఫిబ్రవరి 10న త్రివేంద్రం, కోల్‌కతా, 14న బెంగళూరులో, 17న చెన్నై, అహ్మదాబాద్, 21న ముంబై, 24వ తేదీన హైదరాబాద్‌లో ఈ రోడ్‌షోలు నిర్వహించాలని నిర్ణయించింది. రాష్ట్రంలో పెట్టుబడులకు అవకాశమున్న వనరులు, ప్రయోజనాలను వివరించడంతో పాటు ప్రధానంగా 13 రంగాల్లో పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా ఈ రోడ్ షోలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి పలు సంస్థలు ఇప్పటికే ఆసక్తిని వ్యక్తం చేశాయి. మార్చి 3–4 తేదీల్లో విశాఖ వేదికగా జరిగే గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సులో ఆ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతూ.. వాస్తవ ఒప్పందాలు చేసుకుంటాయని పరిశ్రమల శాఖ అధికారులు వెల్లడించారు.

మాజీ సీఎస్ సోమేశ్‌కు బెయిలబుల్ వారెంట్

కోర్టు ధిక్కరణ కేసులో హైకోర్టు జారీ



సాక్షి, హైదరాబాద్: జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీలో ఒక ప్లాట్‌కు సంబంధించిన వ్యవహారంలో ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌కు హైకోర్టు బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. కోర్టుకు హాజరుకావాలని పలుమార్లు ఆదేశించినా.. రాకపోవడంతో ఈ మేరకు చర్యలు తీసుకుంది. హౌసింగ్ సొసైటీ వ్యవహారంలో కోర్టు తీర్పు అమలు చేయనందుకు సోమేశ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ విశాఖపట్నంకు చెందిన జయరావు కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ మమ్మినేని సుధీర్‌కుమార్ గురువారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. మాజీ సీఎస్‌కు బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు.

ఆదిలాబాద్‌లో ఐటీ టవర్

- నిర్మాణానికి రూ.40 కోట్లు మంజూరు
- ఐటీఈ అండ్ సీ శాఖ నుంచి ఉత్తర్వులు
- డిజైన్‌కు ఆమోదం..
- టీఎస్ఐఐసీకి అప్పగింత



గత సెప్టెంబర్‌లో ఆదిలాబాద్‌లో బీడీఎన్టీ ఐటీ కంపెనీ పరిశీలించిన ఐటీ శాఖ మంత్రి కేటీఆర్

సాక్షి, ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఐటీ టవర్‌కు బీజం పడింది. నిర్మాణం కోసం రూ.40 కోట్లు మంజూరు చేస్తూ రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ (ఐటీఈ అండ్ సీ డిపార్ట్‌మెంట్) నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్, తెలంగాణ ఐటీ (ఇన్వెస్ట్‌మెంట్స్) డైరెక్టర్ విజయ్ రంగినేని ఉత్తర్వులు జారీ చేశారు. గతనెల 21న సీఐఐ తెలంగాణ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఐటీ సదస్సులో పాల్గొన్న విజయ్ రంగినేని ఆరోజే దీనికి సంబంధించి నిధుల కేటాయింపును తెలియజేసినప్పటికీ అధికారిక మంజూరు మాత్రం తాజాగా విడుదలైంది. ఇదిలా ఉంటే తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీఎస్ఐఐసీ)కి దీని నిర్మాణ బాధ్యతలు ప్రభుత్వం అప్పగించింది.

గతంలోనే మూడెకరాలు మంజూరు

ఐటీ టవర్ నిర్మాణం కోసం మావల మండలం బట్టిసావర్గాం గ్రామంలో మూడెకరాల భూమిని ప్రభుత్వం గతంలోనే మంజూరు చేసింది. గత కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఈ భూమి కేటాయింపులో ముఖ్య భూమిక పోషించారు. ఆదిలాబాద్‌లో ఐటీ టవర్ నిర్మాణానికి ప్రధానంగా చొరవ చూపింది ఎమ్మెల్యే జోగు రామన్న. బీడీఎన్టీ ఐటీ కంపెనీని ఆదిలాబాద్‌లో స్థాపించేందుకు జిల్లాకు చెందిన ఎన్ఆర్ఐ సంజీవ్ దేశ్‌పాండే ముందుకు వచ్చారు. ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ను కలిసి ఆదిలాబాద్‌లో ఐటీ కంపెనీ స్థాపించే విషయాన్ని వివరించారు. ఆ తర్వాతే ఇక్కడ ఐటీ టవర్ నిర్మాణానికి అంకురార్పణ జరిగింది.



ఆదిలాబాద్‌లో ఐటీ టవర్ నమూనా

ప్రభుత్వ పాలసీ..

రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ నుంచి జారీ అయిన ఉత్తర్వుల్లో ప్రభుత్వం తన పాలసీని కూడా స్పష్టం చేసింది. ప్రధానంగా తెలంగాణ ప్రభుత్వం ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ పాలసీ (ఐసీటీ పాలసీ) ప్రకారం టైర్–2 పట్టణాల్లో ఐటీ సేవలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రకటించింది. తద్వారా ఆర్థిక, సామాజిక లక్ష్యాలను సాధించడమే కాకుండా స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే ప్రధాన ఉద్దేశమని తెలిపింది. ఆదిలాబాద్‌లో బీడీఎన్టీ ఐటీ కంపెనీని గత సెప్టెంబర్ 26న సందర్శించిన రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అప్పుడే ద్వితీయ శ్రేణి పట్టణాల్లో ఐటీ సేవల అభివృద్ధి లక్ష్యాన్ని వివరించారు. కాగా, ఇటీవల ఇక్కడ నిర్వహించిన సీఐఐ తెలంగాణ సదస్సులో స్టార్టప్‌ల ఏర్పాటులో స్థానికులు పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామిక వేత్తలకు ఐటీ దిగ్గజాలు సూచించారు.

ఐటీ టవర్ నిర్మాణం వివరాలు

స్థలం	బట్టిసావర్గాం
విస్తీర్ణం	3 ఎకరాలు
సర్వే నంబర్	72
విస్తీర్ణం	48వేల చ.అ.

పౌల్ట్రీ రైతుల విలవిల

- తగ్గిన కోడి ధర
- పక్షం క్రితం రూ.118.. నేడు రూ.87
- సంక్షోభం దిశగా పౌల్ట్రీ రంగం
- పీకల్లోతు కష్టాల్లో రైతులు

కరీంనగర్ అర్బన్: పౌల్ట్రీ రంగం కుదేలవుతోంది. కోళ్లను నమ్ముకున్న ఫాం యజమానులకు తీరని నష్టం వాటిల్లుతోంది. రోజురోజుకూ కోడి కిలో ధర తగ్గుతుండటంతో లబోదిబోమంటున్నారు. దాణా, కోడిపిల్లల ధరలు తగ్గకపోగా విక్రయించే సమయంలో కోడి ధర అమాంతం పడిపోతోంది. ఈ నేపథ్యంలో లక్షల పెట్టుబడులు పెట్టిన రైతులు పెట్టిన పెట్టుబడిని పొందకపోగా నష్టాలపాలవుతున్నారు. కోళ్ల వ్యాపారంపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో కార్పొరేట్ శక్తులే శాసిస్తున్నాయి. ధరలపై నిర్దిష్ట విధానం లేకపోవడంతో పూర్తిగా పేకాటను మరిపిస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే కోళ్ల పరిశ్రమకు స్వస్తి పలికే అవకాశాలు లేకపోలేదు.

పక్షం రోజుల్లోనే రూ.31 పతనం

కోళ్ల ఫారం రైతులకు, వినియోగదారులకు కోడి ధరలో తేడా ఉంది. ట్రేడర్లు, చికెన్ సెంటర్లకు లాభాలు పోనూ వినియోగదారుని ధరను నిర్ణయిస్తారు. గత నెల 17వరకు కోడి కిలో ధర ఫారం రేట్ రూ.118 ఉండగా గురువారానికి రూ.87కు చేరింది. అంటే రూ.31 తగ్గింది. దీంతో పౌల్ట్రీ రైతుకు ఒక కోడిని పోషించేందుకు అయ్యే ఖర్చు రూ.200 కాగా ప్రస్తుత ధరతో విక్రయిస్తే కోడికి మైనస్ పోనూ రూ.172 మాత్రమే వస్తుండగా ఒక కోడిపై రైతు రూ.28 నష్టం. ఈ లెక్కన 5 వేల కోళ్ల ఫారం ఉన్న రైతు పెట్టిన పెట్టుబడిలోనే రూ.1.40 లక్షల నష్టం. దీనికితోడు ట్రేడర్ల దోపిడీతో అతలకుతలమవుతున్నారు.

ఆ ముగ్గురికి లాభాలే..

బాయిలర్ కోళ్ల పరిశ్రమ పక్షం రోజులుగా పౌల్ట్రీ రైతులను పీకల్లోతు కష్టాల్లోకి నెడుతోంది. పౌల్ట్రీ రంగంలోకి కార్పొరేట్ శక్తులు రావడమే కాకుండా కోడి ధరలు అమాంతం పడిపోతున్నాయి. షెడ్‌లో 6 వేల కోళ్లను పెంచడానికి రూ.12 లక్షలు పెట్టుబడి అవసరం. పెంచేందుకు తీసుకువచ్చే కోడిపిల్లను రూ.25 నుంచి 30 వరకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. మొక్కజొన్న ధరలు, సోయాబీన్ ధరలు తగ్గినా దాణా ధరలు తగ్గించడం లేదు.



కోళ్ల ఫారంలో కోళ్లు

- ఇలా కోడి పిల్ల దశ నుంచి అమ్మే వరకు 45 రోజుల్లో మూడున్నర కిలోల దాణా ఆహారంగా తీసుకుంటుంది. అంటే దాదాపు రూ.180 వరకు ఆహారం తింటుంది.
- ఉనుక, వైద్యం, విద్యుత్, పనిచేసేవాళ్లతో కలిపి ఒక్కో కోడి పెంపకానికి రూ.200 వరకు వెచ్చించాల్సి వస్తోంది.

5 రోజులుగా ఫారం రేట్ ధరలిలా

తేదీ	ధర
జనవరి 29	99
30	98
31	95
ఫిబ్రవరి 1	92
2	87

- ఇక కోళ్లను విక్రయించే సమయంలో పేపర్ రేట్ గురువారం 87 ఉండగా కరీంనగర్ డెలివరీ రేట్ 83 కాగా ఈ ధరపై మైనస్ 8కు అంటే రూ.75కి విక్రయిస్తున్నారు. అంటే ఒక్కో కోడి సగటున బరువు 2.300 కిలోలు లెక్క కట్టినా రూ.172 మాత్రమే రైతుకు వస్తుంది. ఇక దాణా సరఫరా చేసేవారికి, కోళ్లను కొనుగోలు చేసే ట్రేడర్లకు, చికెన్‌ను విక్రయించే చికెన్ సెంటర్లకు మాత్రం లాభాలే.

ధర తగ్గినా చికెన్ సెంటర్లలో తగ్గలే

ధర తగ్గినా చికెన్ సెంటర్లలో యథేచ్ఛగా వినియోగదారులను దోచుకుంటున్నారు. గురువారం స్కిన్‌లెస్ ధర కిలోకు రూ.180 ఉండగా స్కిన్‌తో కిలో ధర రూ.158 కాగా స్కిన్‌లెస్ రూ.210, విత్‌స్కిన్ రూ.170కి విక్రయిస్తున్నారు. వారికి గిట్టుబాటయ్యే ధరను నిర్ణయిస్తున్నప్పటికీ అదనంగా దండుకుంటుండగా అడ్డుకట్ట వేసేవారే లేరు.

అభివృద్ధిని చూసి ఆదరిస్తున్నారు

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- నాందేడ్‌లో బీఆర్ఎస్ సభ ఏర్పాట్లు పరిశీలన

నిర్మల్: రాష్ట్రంలో చేసిన అభివృద్ధిని చూసి దేశమంతా బీఆర్ఎస్‌ను ఆదరిస్తున్నారని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ, న్యాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. ఈనెల 5న నాందేడ్‌లో సభ నిర్వహించనున్న నేపథ్యంలో గురువారం మహారాష్ట్రలోని భోకర్ మండలంలో మంత్రి పర్యటించారు. అనంతరం నాందేడ్ వెళ్లి సభ ఏర్పాట్లను పర్యవేక్షించారు. భోకర్ మండలంలోని రాతీ గ్రామంలో సర్పంచ్ మల్లేశ్‌పటేల్‌తో సహా వందమంది మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి తాము బీఆర్ఎస్‌లో చేరామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బీఆర్ఎస్ దేశమంతా వేగంగా విస్తరిస్తోందన్నారు. మహారాష్ట్రలోనూ భారీగా చేరికలకు రంగం సిద్ధమైందన్నారు. ఆయా కార్యక్రమాల్లో ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, నాయకులు బామిని రాజన్న, రాంకిషన్‌రెడ్డి, లోలం శ్యాంసుందర్ పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌లో చేరిన రాతీ సర్పంచ్, గ్రామస్తులు

'దేశంలో బీజేపీకి వ్యతిరేక పవనాలు'

భైంసాటౌన్: దేశంలో బీజేపీ వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని రాష్ట్ర దేవాదాయ, న్యాయ, అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. నాందేడ్‌లో బహిరంగ ఏర్పాట్లు పరిశీలించేందుకు వెళ్తూ భైంసాలోని డీబీ పటేల్ నివాసంలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలతో సామాన్యులు విసుగుచెందారని, బీఆర్ఎస్‌కు జాతీయస్థాయిలో గుర్తింపు వస్తోందన్నారు. నాందేడ్‌లో నిర్వహించే భారీ బహిరంగసభను విజయవంతం చేయాలని కోరారు.

11న నవోదయ ప్రవేశ పరీక్ష

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో తొమ్మిదో తరగతిలో ఖాళీ సీట్ల భర్తీకి ఈ నెల 11న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.చక్రపాణి తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి 994 మంది దరఖాస్తులు చేసుకున్నారని, కాగజ్‌నగర్ పట్టణంలోని జవహర్ నవోదయ విద్యాలయం సెంటర్–1, సెయింట్ క్లారెట్ స్కూల్ సెంటర్–2లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

స్నానానికి వెళ్లి బాలిక మృతి

కాగజ్‌నగర్‌రూరల్: పెద్దవాగులో మునిగి బాలిక మృతిచెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్సై సోనియా వివరాల ప్రకారం... మండలంలోని వంజిరి గ్రామానికి చెందిన ఎరుగటి అశ్విని (8) స్నానం చేసేందుకు ఆమె చెల్లెళ్లు అంకిత, అనూషతో పాటు అజీం, దుర్గం లక్ష్మి గ్రామ శివారులోని పెద్దవాగుకు వెళ్లారు. స్నానం చేసే క్రమంలో అశ్విని వాగులో గల్లంతైంది. గమనించిన స్థానికులు కాపాడేందుకు యత్నించినా అప్పటికే మృతిచెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మార్చి 23, 24 తేదీల్లో జాతీయ సదస్సు



జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ మల్లేశ్, డైరెక్టర్ సూరేపల్లి సుజాత

శాతవాహనయూనివర్సిటీ: శాతవాహన విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ సోషల్ సైన్సెస్ కళాశాలలోని సామాజిక శాస్త్ర విభాగం అధ్వర్యంలో మార్చి 23, 24 తేదీలలో రెండు రోజులు జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు సదస్సు డైరెక్టర్ సూరేపల్లి సుజాత తెలిపారు. 'తెలంగాణలో సామాజిక శాస్త్రాలు.. ఎదుర్కొంటున్న సవాళ్లు.. అవకాశాలు' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సదస్సు కరపత్రాలను విశ్వవిద్యాలయ ఉపకులపతి సంకసాల మల్లేశ్, తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి తంగేడ కిషన్ రావు ఆవిష్కరించారు. రిజిస్ట్రార్ ఎం.వర ప్రసాద్, డాక్టర్ వి.రమేశ్, ప్రిన్సిపాల్ డాక్టర్ జాఫర్, సదస్సు డైరెక్టర్ ఆచార్య సూరేపల్లి సుజాత, డాక్టర్ కే.పద్మావతి, గంద్ర లక్ష్మణ్ రావు, డాక్టర్ డి.యశ్వంత్ రావు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

సీపీని కలిసిన ఆర్టీసీ ఆర్ఎం



సీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్ఎం

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎల్.సుబ్బారాయుడును గురువారం ఆర్టీసీ కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఖుస్రో షా ఖాన్ మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఆర్ఎం వెంట కరీంనగర్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఆపరేషన్స్) ఎస్.చందర్‌రావు, డిప్యూటీ రీజినల్ మేనేజర్ (మెకానికల్) వి.శివశంకర్, కరీంనగర్ జోన్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారి ఎం.రవీందర్, కరీంనగర్ 1, 2 డిపో మేనేజర్లు ప్రణీత్, మల్లయ్య, రీజినల్ మేనేజర్ కార్యాలయ పీఆర్ఓ మలహల్‌రావు ఉన్నారు.

తీరిన కోరిక

ప్రతి పైసా కూడగట్టి విమానం ఎక్కారు



● బెంగళూరు విధాన సౌధ ముందు కేరళ ఉపాధి కూలీల బృందం

అమ్మ విమానం ఎక్కి ఉండదు ఒక్కసారైనా. మనకు తీసుకెళ్లే వీలు ఉన్నా ఇంట్లోని ఆడవాళ్లను విమానం ఎక్కించడానికి ఖర్చు కారణం చూపుతాము. కేరళలో కూలి పని చేసే 24 మంది స్త్రీలు తాము జీవితంలో ఒక్కసారైనా విమానం ఎక్కాలని నిశ్చయించుకున్నారు. పైసా పైసా కూడగట్టారు. టికెట్లు బుక్ చేశారు. చిన్నపిల్లల్లా కేరింతలు కొడుతూ కొచ్చి నుంచి బెంగళూరుకు ఆకాశంలో ఎగిరారు. ఎంత మంది స్త్రీలకో ఇలాంటి కోరిక ఉండొచ్చు. ప్రయత్నిస్తే సాధ్యమని వీరు అంటున్నారు.

‘మాకు రెండు కోరికలు. ఒకటి విమానం ఎక్కాలి. రెండు ఏసీ ట్రైన్‌లో ప్రయాణించాలి. ఆ రెండు కోరికలూ ఇప్పుడు తీర్చుకుంటున్నాం’ అంది 55 ఏళ్ల గీతా ఉన్నికృష్ణన్. మొన్నటి జనవరి 26న కొచ్చి నుంచి బెంగళూరుకు విమానంలో ప్రయాణించిన బృందంలో ఈమె కాకుండా ఇంకో 23 మంది మహిళలు ఉన్నారు. వీరంతా కేరళ లోని కొట్టాయం జిల్లాలో పనాచ్చికాడ్ అనే చిన్న పంచాయతీకి చెందినవారు. అందరూ గ్రామీణ ఉపాధిలో భాగంగా పంచాయితీ కింద పని చేసే వారే. రోజు కూలీలు అనుకోవచ్చు. చెత్త ఎత్తే వారు, రోడ్లు ఊడ్చేవారు, పంచాయితీ చేసే నిర్మాణాల్లో రాళ్లు ఎత్తేవారు ఈ మహిళలు.

‘అయితే ఏమిటి? మేము విమానం ఎక్కకూడదా?’ అనుకున్నారు. కాని వీరు యువతులో, చిన్నపిల్లలో కాదు. ఈ బృందంలో తక్కువ వయసు 55 అయితే అందరికంటే ఎక్కువ వయసు 77. ‘మా రోజు కూలీ రోజుకు 311 రూపాయలు. అయితే అందులో నుంచే పైసా పైసా దాచిపెట్టి టికెట్ డబ్బు చేయాలనుకున్నాం. ఒక మొత్తం అయ్యాక మా పంచాయతీ మెంబర్ అబ్రహంను కలిశాం. ఆయన మాకు అండగా నిలిచి టికెట్లు బుక్ చేయడమే కాకుండా మా ప్రయాణంలో భాగమయ్యాడు’ అన్నారు వాళ్లు.

కొచ్చి నుంచి తెల్లవారుజాము విమానం ఎక్కేటప్పుడు వీరి సంబరం అంతా ఇంతా కాదు. బెంగళూరులో దిగాక ఒక ఎం.ఎల్.ఏ సాయంతో వీరు విధాన సభ చూసే అవకాశం పొందారు. ‘మేము మెట్రో రైలు కూడా ఎక్కాం తెలుసా?’ అన్నారు వాళ్లు. 77 ఏళ్ల చెల్లమ్మ అయితే ఎంతో మురిసిపోయింది. ‘ఇలా జరుగుతుందని నిజంగా అనుకోలేదు’ అందామె.

వీరంతా బెంగళూరు నుంచి కొచ్చికి తాము కోరుకున్నట్టు ఏసి ట్రైన్‌లో తిరుగు ప్రయాణం చేయనున్నారు.

ప్రతి ఒక్కరికి చిన్న చిన్న ముచ్చట్లు తీర్చుకునే హక్కు ఉంది. స్త్రీలు తమ ముచ్చట్లను అనేక కారణాల రీత్యా బయటకు చెప్పరు. కుటుంబంలోని మగవారు అడిగి వాటిని తీర్చరు. కాని ఆ ముచ్చట తీరితే వారికి కలిగే ఆనందం ఎంతటిదో ఈ బృందాన్ని చూస్తే తెలుస్తుంది. అమ్మనో, అత్తగారినో, అంతగా జరుగుబాటులేని మేనత్తనో, పిన్నినో విమానం ఎక్కించి సంతోషపడాలని ఎవరికైనా అనిపిస్తే సంతోషం. ఎవరికీ అనిపించకపోయినా ఈ కథనం చదివి అలా స్ఫూర్తి పొందితే మరీ సంతోషం.

ఫ్యాషన్



పెళ్లికళకు పరిపూర్ణత

కలల రోజు కళ్ల ముందు నిలిచే సమయం అత్యంత వైభవంగా మారిపోవాలనుకుంటారు. అందుకు తగినట్టుగానే ప్రతి అలంకరణలోనూ ప్రత్యేకత చూపుతారు. ఆ పెళ్లి కళకు పరిపూర్ణత రావాలంటే మాత్రం కేశాలంకరణదే అత్యంత కీలకమైన పాత్ర. సాధారణ డిజైన్స్ నుంచి ఆధునికపు హెయిర్ స్టైల్స్ ఎలా రూపు మార్చుకున్నాయో తెలుసుకుంటే మీదైన ప్రత్యేకమైన రోజుకు మరింత అందంగా ముస్తాబు అవ్వచ్చు.



పెళ్లికూతురు ఆకర్షణీయ రూపానికి జీవం పోసేది కేశాలంకరణే. పెళ్లి దుస్తులను ఎంత ప్రత్యేకంగా ఎంచుకుంటారో జడను కూడా అంతే స్పెషల్‌గా డిజైన్ చేయించుకుంటారు. సాధారణ పూల జడల నుంచి వజ్రాలతోనూ, బంగారంతోనూ మెరిసే అందమైన పొడవాటి జడలను నవ వధువుల ఎంపికలో ఉంటాయి. అలాగే, పెళ్లికూతురి దగ్గరి బంధువులు, స్నేహితులు కూడా వీటి ఎంపికలో పోటీ పడుతుంటారు. ఇందుకు ఇమిటేషన్ జ్యువెలరీతో పాటు ఇతర ఫ్యాన్సీ జడలు కూడా రకరకాల డిజైన్లలో అందుబాటులోకి వచ్చాయి. లక్షల రూపాయల నుంచి వందల రూపాయల వరకు ఉన్న ఈ డిజైన్స్‌లో ఇవి కొన్ని.

సంప్రదాయ వేడుకలలో వేసే హెయిర్ స్టైల్స్ ఎప్పుడూ ఒకేలా ఉంటుంటాయి. ఈ బ్రైడల్ హెయిర్ స్టైల్స్‌లో మార్పులు చూస్తే ఇన్ని డిజైన్స్ ఉన్నాయా అనే ఆశ్చర్యం కలగక మానదు. ఇందుకోసం ఉపయోగిస్తున్న లాంగ్ రిబ్బన్, మిర్రర్, టాజిల్స్‌తోనూ జడలు ప్రధాన ఆకర్షణగా డిజైనర్ల చేతుల్లో రూపు దిద్దుకుంటున్నాయి.



సొంతంగా తయారీ

ఆసక్తి గల వారు పూసలు, ముత్యాలు, స్టోన్స్, రంగు దారాలను ఉపయోగించి మల్టీకలర్ లాంగ్ జడలను సొంతంగా తయారు చేసుకోవచ్చు. దారాలకు పూసలు గుచ్చి, గమ్‌తో స్టోన్స్ లేదా అద్దాలను అతికించి పొడవాటి దండలుగా (జడ అంత పొడవులో) తయారు చేసుకోవాలి. వాటిని డ్రెస్‌తో మ్యాచ్ చేసుకోవాలి. సందర్భాన్ని బట్టి ఎలాంటి అలంకరణ బాగుంటుందో చూసుకొని, ఆ జడను అలంకరించుకోవాలి.

ఫ్యాన్సీ అలంకరణ

సాధారణ కేశాలంకరణలో మల్లె, గులాబీ పూల జడలు పెళ్లికూతురు అలంకరణలో భాగంగా ఉంటాయి. కొందరు తమ చీర రంగుతో మ్యాచ్ అయ్యే పూల జడలను ఎంపిక చేసుకుంటారు. ఇవే కాకుండా స్వరోస్కి స్టోన్స్ ఉన్న పొడవాటి వరుసల క్లిప్స్‌ను పెట్టేసి కేశాలంకరణ పూర్తి చేసుకోవచ్చు. ఇవి, రిసెప్షన్ వంటి వేడుకల్లో అందంగా ఉంటాయి. పెళ్లికి ఎంచుకోగల ఆధునిక కేశాలంకరణలో ఇవి ఇప్పుడు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. డిజైన్ బట్టి ఈ జడల ధరలు అందుబాటులో ఉన్నాయి.

మెరిసే.. మెరిసే

కేశాలంకరణ ప్రత్యేక సందర్భాల్లోనే కాదు ప్రతిరోజూ స్పెషల్‌గా ఉండాలనుకుంటారు. ఇలాంటి వారికి డే హెయిర్ జ్యువెలరీ (హెయిర్ క్లిప్స్) అందుబాటులో ఉన్నాయి. వీటిని గెట్ టు గెదర్ వంటి పార్టీలకు వేసుకునే వెస్ట్రన్ డ్రెస్సులకూ అందంగా నప్పుతాయి.

పెళ్లి కూతురి లేదా అతిథుల తమ కేశాలంకరణలో వివిధ స్టైల్స్‌ను అనుకరించాలంటే అందుకు తగిన ఆన్‌లైన్ ట్యుటోరియల్ వీడియోలు కూడా అందుబాటులో ఉన్నాయి. వాటిని చూసి ఎలాంటి స్టైల్ బాగుంటుందో ఎంపిక చేసుకునే వీలుంటుంది. మీదైన గొప్ప రోజు కోసం మీ జుట్టును స్టైలింగ్ చేయడం వల్ల పెళ్లికి వచ్చే మొత్తం అందరినీ మంత్ర ముగ్ధులను చేస్తుంది. పెళ్లిరోజును మరింతగా వెలిగిపోయేలా మార్చేస్తుంది.

బ్యూటిప్స్

మొటిమలు, మచ్చలు మటుమాయం!



ముఖంపై మొటిమలు ఉంటే రోజ్ వాటర్, అలోవెరా జెల్ కలిపి రాసుకోండి. దీనికోసం టీస్పూన్ అలోవెరా జెల్‌ను స్పూన్ రోజ్ వాటర్‌లో కలిపి మీ ముఖానికి ప్యాక్‌లా వేయాలి. అర గంట తరువాత, ముఖాన్ని శుభ్రమైన నీటితో కడగాలి. కలబందను ముఖానికి రోజుకు రెండు మూడు సార్లు అప్లై చేయడం ద్వారా మొటిమల సమస్య నుండి బయటపడవచ్చు.

ముఖ సౌందర్యానికి రోజూ పచ్చి కూరగాయలు తినాలి. లేదా పచ్చి కూరగాయల జ్యూస్ తాగినా అద్భుతంగా పనిచేస్తుంది. కూరగాయలతో జ్యూస్ చేసుకుని తీసుకోవడం వల్ల అందంగా తయారవుతారు. పసుపు, చందనం కలిపి తరచూ ముఖానికి మసాజ్ చేయటం కూడా అందాన్ని రెట్టింపు చేస్తుంది. స్నానం చేసే సమయంలో లేదంటే మామూలుగా అయినా వీటిని శరీరానికి రాసుకోవటం అలవాటు చేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.

వంటిల్లు

ఉడిపి మెనూ..

అదేమిటో కానీ, మన ఇంటి వంట కంటే పక్కింటి పోపుకే ఘుమఘుమలు ఎక్కువ. మన పొరుగున ఉన్న కర్నాటక రాష్ట్రం ఉడిపి వాళ్ల ఆరోగ్యవంటలకు మన వంటింట్లో పోపు వేద్దాం. పాలిచ్చే తల్లి ఏమి తినాలో ఉడిపి వాళ్ల మెనూ చూద్దాం.

బాదం పోరిడ్జ్ (రవ్వ గంజి)



కావలసినవి: రవ్వ – 2 టేబుల్ స్పూన్‌లు ; నీరు– కప్పు ; బాదం – 8 ; బెల్లం పొడి– టేబుల్ స్పూన్ ; పాలు– అర కప్పు.

తయారీ: ● బాదం పప్పును మిక్సీలో వేసి పొడి చేయాలి. నీటిని మరిగించాలి. పాలను కాచి పక్కన ఉంచాలి. ● మందపాటి పెనంలో రవ్వను పచ్చి వాసన పోయేటట్లు కొద్దిసేపు వేయించాలి (రంగు మారే వరకు వేయించరాదు). ● రవ్వలో మరుగుతున్న నీటిని పోస్తూ (ఉండలు కట్టకుండా) కలపాలి. ● ఇప్పుడు బెల్లం పొడి, బాదం పొడి, వేడి పాలను పోసి కలిపి ఉడకడం మొదలైన తరవాత మూత పెట్టి మంట ఆపేయాలి. ఇది పాలిచ్చే తల్లికి చక్కటి పోషకాహారం. గట్టిగా హల్వాలా తినవచ్చు లేదా జావలా గరిటె జారుడు గా ఉండాలంటే పాల మోతాదు పెంచుకోవచ్చు.

ఉడిపి సాంబార్



కావలసినవి: కందిపప్పు – అరకప్పు (కడిగి అరగంటసేపు నానబెట్టాలి) ; పసుపు– అర టీ స్పూన్ ; ఉప్పు– రుచికి తగినంత ; బీరకాయ ముక్కలు– 300 గ్రాములు ; టొమాటో ముక్కలు – కప్పు.

సాంబార్ పేస్ట్ కోసం: మినప్పప్పు– టేబుల్ స్పూన్ ; గుంటూరు మిర్చి– 8 ; పొట్టి మిరపకాయలు – 6 ; ధనియాలు – 2 టేబుల్ స్పూన్‌లు ; యాలకులు – 2 ; లవంగాలు – 3 ; దాల్చిన చెక్క– అంగుళం ముక్క ; జీలకర్ర – టీ స్పూన్ ; పచ్చి కొబ్బరి ముక్కలు– అర కప్పు ; గసగసాలు– టీ స్పూన్.

సాంబార్ పోపు కోసం: నూనె : టేబుల్ స్పూన్ ; మెంతులు – చిటికెడు ; ఆవాలు– అర టీ స్పూన్ ; ఇంగువ పొడి – చిటికెడు ; కరివేపాకు– 2 రెమ్మలు ; చింతపండు– 70 గ్రాములు (300 మి.లీ రసం చేయాలి) ; నీరు– ముప్పావు లీటరు ; ఉప్పు – తగినంత.

గార్నిష్ చేయడానికి: నూనె – 2 టీ స్పూన్‌లు ; వేరుశనగ పప్పు – 4 టేబుల్ స్పూన్‌లు ; ఆవాలు – అర టీ స్పూన్ ; ఎండు మిర్చి– 2 ; కొత్తిమీర తరుగు – కప్పు.

తయారీ: ● కంది పప్పును ప్రెషర్ కుక్కర్‌లో వేసి ఒకటిన్నర కప్పుల నీళ్లు పోసి, పసుపు వేసి ఉడికించాలి. చల్లారిన తర్వాత ఉప్పు వేసి మెత్తగా పేస్ట్ చేయాలి. ● మందపాటి బాణలి వేడి చేసి సాంబార్ పేస్టు కోసం తీసుకున్న దినుసులను సన్నమంట మీద వేయించి చల్లారిన తరవాత నీటిని వేస్తూ మెత్తగా గ్రైండ్ చేయాలి. ● బీరకాయ ముక్కల్లో కొద్దిగా నీటిని చిలకరించి మీడియం మంట మీద ఒక మోస్తరుగా ఉడికించాలి. మరీ మెత్తగా ఉడకకూడదు. ● మందపాటి పాత్రలో నూనె వేడి చేసి పోపు కోసం తీసుకున్న దినుసులను వేసి వేయించి టొమాటో ముక్కలు వేసి మగ్గనివ్వాలి. తర్వాత చింతపండు రసం పోసి కలిపి అందులో సాంబార్ పేస్ట్, బీరకాయ ముక్కలు, కందిపప్పు పేస్ట్ వేసి కలిపి రుచి చూసి అవసరమైతే మరికొంత ఉప్పు వేసి కలిపి ఉడికించాలి. ● చిన్న బాణలిలో నూనె వేసి గార్నిష్ చేయడానికి తీసుకున్న దినుసులను వేయించి ఉడుకుతున్న సాంబార్‌లో వేసి దించేయాలి. ఇది అన్నంలోకి చక్కటి రుచినిస్తుంది. రోటీ చపాతీల్లోకి చేసేటప్పుడు నీటి మోతాదు తగ్గించుకుని చిక్కగా చేసుకోవాలి.

చేమ కూర స్నాక్



కావలసినవి: చేమ ఆకులు – 6 ; రవ్వ – అర కప్పు.

మసాలా కోసం: కొబ్బరి ముక్కలు– అర కప్పు ; ధనియాలు – టేబుల్ స్పూన్ ; జీలకర్ర – అర టేబుల్ స్పూన్ ; చింతపండు – గోళీ అంత ; బెల్లం పొడి – టేబుల్ స్పూన్ ; ఎండు మిర్చి – 3 ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి.

పోపు కోసం: నూనె– టేబుల్ స్పూన్ ; కొబ్బరి తురుము – అర కప్పు ; బెల్లం పొడి– టేబుల్ స్పూన్.

తయారీ: ● చేమ ఆకులను శుభ్రం చేసి చిన్న ముక్కలుగా తరిగి పక్కన ఉంచాలి. ● మసాలా దినుసుల కోసం తీసుకున్న అన్నింటినీ మిక్సీలో వేసి నీటిని వేస్తూ ముద్దగా గ్రైండ్ చేసుకోవాలి. ● ఈ మసాలా లో రవ్వ, చేమ ఆకు వేసి కలపాలి. దీనిని నాలుగు భాగాలు చేసి లడ్డులుగా చేసి ఆవిరి మీద ఉడికించాలి. వేడి తగ్గిన తరవాత మెల్లగా చిదమాలి. ● ఇప్పుడు పెనం పెట్టి నూనె వేడి చేసి కొబ్బరి తురుము, బెల్లం పొడి వేసి వేయించాలి. అవి వేగిన తరవాత ఉడికించిన చేమకూర ఆకుల మిశ్రమాన్ని వేసి బాగా కలపాలి. తీపి ఇష్టపడేవాళ్లు దీనిని బ్రేక్‌ఫాస్ట్‌గా తింటారు. భోజనం తరవాత తినడానికి బాగుంటుంది. ఈవెనింగ్ స్నాక్‌గా కూడా బాగుంటుంది.

మోహన్ లడ్డు



కావలసినవి: గోధుమ పిండి– కప్పు ; బియ్యప్పిండి– టేబుల్ స్పూన్ ; నెయ్యి – 2 టేబుల్ స్పూన్‌లు ; చక్కెర– కప్పు ; నీరు – అర కప్పు ; యాలకుల పొడి– అర టీ స్పూన్ ; జీడిపప్పు – 2 టేబుల్ స్పూన్‌లు ; కిస్‌మిస్ – టేబుల్ స్పూన్ ; నూనె – పూరీలు కాలడానికి తగినంత.

తయారీ: ● వెడల్పు పాత్రలో గోధుమపిండి, బియ్యప్పిండి, ఒక టేబుల్ స్పూన్ నెయ్యి వేసి, నీటిని పోస్తూ ముద్దగా కలపాలి. బాణలిలో నూనె వేడి చేసి ఈ పిండినంత టినీ పూరీలు చేసుకోవాలి. మోహన్ లడ్డు కోసం చేసే ఈ పూరీలు మెత్తగా ఉండకూడదు, కరకరలాడాలి. చల్లారిన తరవాత వీటిని తుంచి చిన్న ముక్కలు చేయాలి. ● బాణలిలో నెయ్యి వేడి చేసి జీడిపప్పు, కిస్‌మిస్ వేయించి పూరీ ముక్కల్లో కలపాలి. ● ఒక పాత్రలో చక్కెర వేసి, నీరు పోయాలి. చక్కెర కరిగిన తరవాత, యాలకుల పొడి వేసి మీడియం మంట మీద సిరప్ తయారయ్యే వరకు మరిగించాలి. ఈ చక్కెర పాకాన్ని పూరీ ముక్కల మీద పోస్తూ లడ్డు చేయాలి. ఇది ఉడిపి స్పెషల్.

సొప్ప పాల్య



కావలసినవి: పాలకూర – 2 కట్టలు ; ఉల్లిపాయ– 1 (తరగాలి) ; ఉప్పు – అర టీ స్పూన్ ; మిరియాల పొడి– టీ స్పూన్.

పోపు కోసం: నెయ్యి– 2 టీ స్పూన్‌లు ; జీలకర్ర – అర టీ స్పూన్ ; కరివేపాకు– 2 రెమ్మలు.

తయారీ: ● పాలకూరను శుభ్రం చేసి తరగాలి. ● బాణలిలో నెయ్యి వేడి చేసి జీలకర్ర వేయాలి. అవి చిటపటలాడిన తర్వాత ఉల్లిపాయ ముక్కలు వేసి మగ్గనివ్వాలి. ఆ తర్వాత కరివేపాకు వేయాలి. ● ఇప్పుడు పాలకూర, ఉప్పు, మిరియాల పొడి వేసి కలిపి మూత పెట్టి సన్న మంట మీద పది నిమిషాల సేపు మగ్గనివ్వాలి (ఆకులోని నీటితోనే మగ్గుతుంది). దీనిని పాలిచ్చే తల్లికి రెండు రోజులకొకసారి పెడతారు.

● టెక్..టాక్

లెనోవా యోగా స్లిమ్ 7ఐ ప్రో ఎక్స్



డిస్‌ప్లే: 14.5 అంగుళాలు రిజల్యూషన్: 3072× 1920 పిక్సెల్స్
రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జడ్
ఫీచర్స్: వైఫై 6ఇ, బ్లూటూత్ 5.1
ఐఆర్ కెమెరా (ఫేస్ రికగ్నైజేషన్)
బ్యాటరీ లైఫ్: 10 గంటలు
బరువు: 1.4 కేజీలు
ప్రారంభ ధర: ₹ 1,12,200/–

గూగుల్ మ్యాప్‌కు ప్రత్యామ్నాయాలు



జీపిఎస్–ఆధారిత నావిగేషన్ ప్లాట్‌ఫామ్‌లలో గూగుల్ మ్యాప్‌కు పేరు ఉంది. అయితే మార్కెట్‌లో బెస్ట్‌ఫీచర్‌లతో కూడిన ప్రత్యామ్నాయాలు కూడా ఉన్నాయి. మచ్చుకు రెండు...

'మ్యాప్ మైఇండియామూవ్' అనేది గూగుల్ మ్యాప్‌కు పాపులర్ అల్టర్‌నేటివ్‌గా పేరు తెచ్చుకుంది. వాయిస్–గైడెడ్ నావిగేషన్‌లాంటి స్టాండర్డ్ ఫీచర్స్ దీనిలో ఉన్నాయి. పనిచేయని స్ట్రీట్‌లైట్లు, పనికిరాని స్పీడ్‌బ్రేకర్లు, ప్రమాదకరమైన గుంతలు... మొదలైన వాటికి సంబంధించిన సమాచారాన్ని రిపోర్ట్ చేస్తుంది.

ఇక sggic జీపిఎస్ నావిగేషన్ మ్యాప్స్ యాప్‌కు ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది యూజర్లు ఉన్నారు. ఈ యాప్ ద్వారా ఆఫ్‌లైన్‌లో వివిధ దేశాలకు సంబంధించిన 3డీ మ్యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

కోకా కోలా స్మార్ట్‌ఫోన్



పాపులర్ సాఫ్ట్‌డ్రింక్ బ్రాండ్ కోకా కోలా తమ బ్రాండెడ్ స్మార్ట్‌ఫోన్‌ను లాంచ్ చేయడానికి రెడీ అవుతోంది.

దీనికి సంబంధించిన కొత్త డిజైన్‌ను ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. ఫోన్ వెనక కోకా కోలా బ్రాండ్ కనిపిస్తుంది. కోకా కోలా బ్రాండ్ కలర్ థీమ్ రెడ్‌తో ముస్తాబైన ఈ స్మార్ట్‌ఫోన్ త్వరలో మన దేశంలో విడుదల కానుంది. కోకా కోలా ఫోన్ ఏమిటి! అని ఆశ్చర్యపోతాం గానీ నాన్–స్మార్ట్‌ఫోన్ కంపెనీలు స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లోకి రావడం ఇది మొదటిసారి కాదు. కోకా కోలా స్మార్ట్‌ఫోన్ రియల్‌మీ 104జీ మోడల్‌లో ఉండనున్నదని వార్తలు వినిపిస్తున్నాయి.

వాట్సాప్‌లో త్వరలో కొత్త ఫీచర్స్



యూజర్స్ కోసం రాబోయే రోజుల్లో కొత్త ఫీచర్స్ తీసుకురావడానికి వాట్సాప్ కసరత్తు చేస్తోంది. న్యూ టెక్ట్స్ ఎడిటర్‌కు న్యూ ఫాంట్స్ యాడ్ చేయడం ద్వారా విత్‌ఇన్ ఇమేజ్, వీడియోలలో టెక్ట్స్ ఎడిట్ చేయడం, డిఫరెంట్ ఫాంట్స్‌తో టెక్ట్స్ యాడ్ చేయవచ్చు. టెక్ట్స్ ఎడిటర్‌ను రీవ్యాంప్ చేసి మరిన్ని ఫీచర్‌లు తీసుకురానున్నారు. గ్రూప్ టెక్ట్స్, డిస్క్రిప్షన్స్‌కు సంబంధించి పదాల పరిమితిని పెంచనున్నారు.

● సక్సెస్ స్టోరీస్



కిషన్



రితిక పాండే

బ్రిలియంట్ యంగ్ టాలెంట్

- కొత్తగా ఆలోచిస్తే విజయం మనదే

ఇరవై రెండు సంవత్సరాల వయసులో... ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన కంటెంట్ క్రియేషన్ ప్లాట్‌ఫామ్‌కు బిజినెస్ హెడ్‌గా పనిచేస్తున్నాడు కిషన్ పన్‌పాలియా. ఇరవైనాలుగు సంవత్సరాల వయసులోనే ఆర్టిస్ట్‌గా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది రితిక పాండే. ఈ ఇద్దరు తాజాగా... 'ఫోర్బ్స్ 30 అండర్ 30' 2023 జాబితాలో చోటు సంపాదించారు...

చిన్న వయసులోనే మోస్ట్ పాపులర్ కంటెంట్ క్రియేషన్ ప్లాట్‌ఫామ్ 'పెప్పర్ కంటెంట్'కు బిజినెస్ హెడ్‌గా పెద్ద బాధ్యతలు నిర్వహిస్తున్నాడు కిషన్ పన్‌పాలియా.

ఒక్కసారి ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళితే...

'ఇండియా కాటన్ సిటీ'గా పేరుగాంచిన మహారాష్ట్రలోని అకోల. కిషన్ ఎనిమిదవ తరగతి చదువుతున్నాడు. 'పాకెట్ మనీ కోసం తల్లిదండ్రుల మీద ఆధారపడడం ఎందుకు? నేను సంపాదించలేనా!' అని ఆలోచించి రంగంలోకి దిగాడు. తన ఐడియా చెప్పి స్నేహితులు బంధువులను ఒప్పించాడు. అందరూ కలిసి స్క్రాప్ కొని అమ్మడం మొదలు పెట్టారు.

పాకెట్ చాలనంత మనీ వచ్చి చేరింది!

కట్ చేస్తే...

బిట్స్ పిలానిలో చదువుకునే రోజుల్లో కిషన్‌కు మంచి గుర్తింపు ఉండేది. దీనికి కారణం కాలేజీ ఈవెంట్ కోసం లక్షా పాతికవేల స్పాన్సర్‌షిప్‌ను సంపాదించడం. నిజానికి కాలేజి ఈవెంట్‌కు పాతికవేలకు మించి స్పాన్సర్‌షిప్ వచ్చేది కాదు. మొదటి సంవత్సరంలో ఉన్నప్పుడు తన సీనియర్స్ అనిరుధ్ సింగ్లా, రిషబ్ శేఖర్‌లు 'పెప్పర్ కంటెంట్' పేరుతో కంటెంట్ క్రియేషన్ ప్లాట్‌ఫామ్ స్టార్ట్ చేశారు. కిషన్‌ను కూడా తమతో కలుపుకున్నారు.

మొదటిసారిగా ఆటోమోటివ్ పార్ట్స్ డీలర్ నుంచి 'కూల్ కంటెంట్' ఆఫర్ వచ్చింది. రాసే వారి కోసం చూశారు. పదానికి పదిహేను పైసలు అంటే ఎవరు మాత్రం వస్తారు!

దీంతో తప్పనిసరి పరిస్థితులలో తామే కంటెంట్ పనిలోకి దిగారు. పది రోజుల్లో 300 పీస్‌లు రాశారు. ఇక అప్పటి నుంచి వెనక్కి తిరిగి చూసుకోలేదు.

ప్రస్తుతం 'పెప్పర్ కంటెంట్' 2,500 మంది కస్టమర్‌లతో, 1.2 లక్షల మంది కంటెంట్ క్రియేటర్స్‌తో పనిచేసింది. మన దేశంలో లార్జెస్ట్ ఫ్రీలాన్స్ క్రియేటర్స్ ప్లాట్‌ఫామ్‌గా ఎదిగింది.

బిజినెస్ సెన్స్, రెవెన్యూ మేనేజ్‌మెంట్‌లో తనదైన ప్రత్యేకతను సృష్టించుకున్న కిషన్‌ను తన 'సక్సెస్ మంత్రా' గురించి అడిగితే– 'నిరంతర సాధన' అంటాడు.

> నిరంతర సాధనే సక్సెస్ మంత్ర. – కిషన్

> విశ్వవిద్యాలయాలు, గొప్ప పుస్తకాల నుంచి మాత్రమే కాదు ప్రకృతి ప్రపంచం నుంచి కూడా ఎంతో నేర్చుకోవచ్చు. – రితిక

వారణాసిలో పుట్టిన రితిక పాండే ముంబై రావడానికి ముందు ఆఫ్రికాలోని వివిధ ప్రాంతాలలో పెరిగింది. శ్రిష్టి మణిపాల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్ట్, డిజైన్ అండ్ టెక్నాలజీలో చదువుకుంది. వేల్స్ (యూకే)లోని ఒక సిటీలో కొంతకాలం పురాణాలు, సైన్స్–ఫిక్షన్ ఆధారంగా కళాసాధన ప్రారంభించింది.

అక్కడి నుంచి ఇండియాకు తిరిగి వచ్చిన తరువాత హిమాచల్‌ప్రదేశ్‌లోని మారుమూల ప్రాంతాలకు ప్రయాణించింది. ప్రకృతి ప్రపంచంతో స్నేహం చేసింది. తనలో సృజనాత్మకమైన కొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించుకుంది.

'విశ్వవిద్యాలయాలు, గొప్ప పుస్తకాల నుంచి మాత్రమే కాదు ప్రకృతి ప్రపంచం నుంచి కూడా ఎంతో నేర్చుకోవచ్చు. అందుకే ఎన్నో మారుమూల ప్రాంతాలకు వెళ్లాను. ఇది నిరంతరమైన ప్రయాణం. నిరంతర సాధన. ఆర్టిస్టులు నేర్చుకోవడానికి ప్రకృతిలోనే ఎన్నో పాఠాలు ఉన్నాయి' అంటుంది రితిక.

రితిక వర్ణచిత్రాలలో మనుషులు కనిపిస్తారు. మొక్కలు, జంతువులు కనిపిస్తాయి. స్థూలంగా చెప్పాలంటే హ్యూమన్, నాన్–హ్యూమన్‌కు సంబంధించి రిలేషన్ అనే థీమ్ కనిపిస్తుంది.

'గ్రోస్‌వెనర్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన రితిక ఆర్ట్‌వర్క్ సోలో షోకు అద్భుతమైన స్పందన వచ్చింది. ఎంతో మంది ప్రైవేట్ ఆర్ట్ కలెక్టర్స్ ఆసక్తి ప్రదర్శించారు' అంటున్నారు లండన్‌లోని గ్రోస్‌వెనర్ గ్యాలరీ డైరెక్టర్ చార్లెస్ మూర్.

● బ్రెయిన్ జిమ్

ఘటాఫట్ ధనాధన్ ★★★★

8	3	4
1	5	?
6	7	2

క్వశ్చన్‌మార్క్ స్థానంలో ఉండాల్సిన నంబర్ ఏమిటి?

జవాబు: 9
కారణం: ప్రతి వరుస కూడితే జవాబు 15.

యువర్స్

● ఇంగ్లిష్ ఇడియమ్స్

ఎవరీ డచ్ అంకుల్?

విమర్శ ముఖ్యమే కానీ శృతి మించిన విమర్శ సరికాదు. విమర్శ కోసం విమర్శ చేసేవారిని, అడగకుండానే సలహా ఇచ్చేవారిని 'డచ్ అంకుల్' అంటారు.

ఉదా: **అన్నపూర్ణాస్ హజ్బెండ్ ఈజ్ సచ్ ఏ డచ్ అంకుల్ ఎట్ డిన్నర్ పార్టీస్. హీ ఆల్వేస్ ట్రైస్ టు సార్ట్ ఔట్ ఎవ్రీ వన్స్ లివ్స్**



డచ్ అంకుల్ పేరేమిటో మనకు తెలియదుగానీ, వన్స్ అపాన్ ఏ టైమ్ జరిగిన ఆంగ్లో–డచ్ వార్ నేపథ్యం నుంచి పుట్టుకు వచ్చిన మాట ఇది.

బకిల్ డౌన్

ఒక పనిలో విజయం సాధించాలంటే అంకిత భావం ఉండాలి. బాగా కష్టపడాలి. 'ఫలానా పనిలో మనం ఎలాగైనా విజయం సాధించాలి' అని చెప్పడానికి ప్రతీకాత్మకంగా ఉపయోగించే ఇడియమ్ బకిల్ డౌన్.

ఉదా: **ఇఫ్ వుయ్ ఆర్ గోయింగ్ టు కంప్లీట్ దిస్ టాస్క్ ఇట్స్ నెసనరీ టు బకిల్‌డౌన్.**

● గేమింగ్

మార్స్ గ్రహమా మజాకా!

సైన్స్–ఫిక్షన్ అడ్వెంచర్‌గేమ్ 'డెలివర్ అజ్ మార్స్' నిన్న విడుదలైంది. 'డెలివర్ అజ్ మూన్'కు కంటిన్యూగా వస్తున్న గేమ్ ఇది. 'డెలివర్ అజ్ మూన్' కథ ముగిసిన పదిసంవత్సరాల తరువాత ఏమవుతుంది అనేది తాజా గేమ్



కథ. యంగెస్ట్ ఆస్ట్రోనాట్ కతీ జాన్సన్ 'సేవ్ ఎర్త్' మిషన్‌లో భాగంగా రెడ్ ప్లానెట్‌కు వెళతాడు అక్కడ జాన్సన్‌కు ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయి అనేది కథ. గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించిన ఏఆర్‌కె కాలనీ షిప్‌లను రికవరీ చేసుకోవడంలో అడుగడుగునా ప్రమాదాలు ఎదురవుతాయి.

'ఇది ఎమోషనల్ స్టోరీతో కూడిన అడ్వెంచర్ గేమ్' అంటున్నాడు డైరెక్టర్ పాల్ డిట్‌మన్.

జానర్: యాక్షన్ **ఇంజిన్:** అన్‌రియల్ ఇంజిన్ 4 **మోడ్:** పజిల్ అండ్ వీడియో మోడ్

ప్లాట్‌ఫామ్: ప్లేస్టేషన్ 5, ప్లేస్టేషన్ 4, ఎక్స్‌బాక్స్ వన్, మైక్రోసాఫ్ట్ విండోస్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్

సినిమా

తెలుగులో తెలుగు అమ్మాయిలు తప్ప ఇతర భాషల బ్యూటీలు ఎక్కువగా సినిమాలు చేస్తుంటారు. ముఖ్యంగా అటు ముంబై ఇటు కేరళ భామల హవా ఎక్కువగా ఉంటుంది. అయితే తెలుగులో బాగా పాపులార్టీ తెచ్చుకున్న నాయికలు ఇప్పుడు మలయాళంకి వెళుతున్నారు. ఇద్దరు సీనియర్ హీరోయిన్లకు, ఒక యువ హీరోయిన్‌కు మాలీవుడ్ నుంచి కాల్ వెళ్లింది. మలయాళంలో ఈ ముగ్గురి తొలి చిత్రం గురించి తెలుసుకుందాం.

మాలీ కాలింగ్



● తమన్నా

ఇండస్ట్రీకి వచ్చి పదిహేను సంవత్సరాలు దాటినా ఇంకా అగ్రకథానాయికల్లో ఒకరిగా కొనసాగుతున్నారు తమన్నా. ముఖ్యంగా తెలుగు, తమిళ, హిందీ భాషల్లో సినిమాలు చేసిన తమన్నా వీలైనప్పుడు కన్నడ తెరపైనా మెరిశారు. అయితే మలయాళ వెండితెరపై మాత్రం కనిపించలేదు. ఇండస్ట్రీకి వచ్చిన 17 ఏళ్ల తర్వాత తమన్నా ఫస్ట్ టైమ్ ఓ మాలీవుడ్ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దిలీప్ హీరోగా అరుణ్ గోపీ దర్శకత్వంలో రూపొందుతున్న 'బాంద్రా' చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారామె. ఈ సినిమాలో తమన్నా మహారాణి పాత్రలో కనిపించనున్నారట. సో.. మాలీవుడ్‌కి రాణిలా ఎంటర్ అవుతున్నారన్న మాట. ఈ చిత్రం ఈ ఏడాదే రిలీజ్ కానుంది. కాగా దిలీప్ హీరోగా నటిస్తున్న మరో సినిమాతో టాలీవుడ్ బాపు బొమ్మగా ప్రేక్షకులు చెప్పుకునే కన్నడ భామ ప్రణీత కూడా మాలీవుడ్ ఎంట్రీ ఇస్తుండటం విశేషం. ఈ సినిమాకు రతీష్ రఘునందన్ దర్శకుడు. ఆల్రెడీ ఈ సినిమా షూటింగ్ కూడా మొదలైంది. అయితే ఇప్పటివరకు ఎక్కువగా క్లాస్ పాత్రల్లోనే కనిపించిన ప్రణీత ఈ సినిమాలో మాత్రం కాస్త మాస్‌గా కనిపించనున్నారట. క్యారెక్టర్ దృష్ట్యా ప్రణీత పాత్రకు కాస్త అహంకారం ఉంటుందట. సో.. ప్రణీత మాలీవుడ్ ఎంట్రీ మమమ్మాస్ అన్నమాట. ఈ సినిమాను కూడా ఈ ఏడాదిలోనే రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఇక ఓ బిడ్డకు (కుమార్తె ఆర్నా) జన్మనిచ్చిన తర్వాత ప్రణీత ఒప్పుకున్న తొలి సినిమా ఇదే. మరోవైపు టాలీవుడ్ బేబమ్మ ('ఉప్పెన'లో కృతీ శెట్టి పేరు), యంగ్ బ్యూటీ కృతీ శెట్టికి కూడా మాలీవుడ్ నుంచి పిలుపొచ్చింది. మలయాళ యంగ్ హీరో టొవినో థామస్ నటిస్తున్న తాజా పాన్ ఇండియా మూవీ 'అజయంటే రండం మోషణం'లో కృతీ శెట్టి ఓ హీరోయిన్‌గా నటిస్తుండగా, ఐశ్వర్యా రాజేష్, సురభి లక్ష్మీ కూడా హీరోయిన్లుగా చేస్తున్నారు. మూడు యుగాల కథాంశంతో ఈ చిత్రం రూపొందుతోంది.



● కృతి, ప్రణీత

సీనియర్ దర్శకుడు సాగర్ కన్నుమూత



సీనియర్ దర్శకుడు వి. సాగర్ (71) గురువారం వేకువజామున 5.45కి చెన్నైలోని తన నివాసంలో కన్నుమూశారు. సాగర్ పూర్తి పేరు ఉయ్యూరు విద్యాసాగర్ రెడ్డి. గుంటూరు జిల్లా నిడమర్రులో పుట్టిన సాగర్ ఎస్సెల్సీ పాసయ్యాక సినిమా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. ముందు ఎడిటింగ్, ఆ తర్వాత డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్‌గా చేశారు. 'రాకాసి లోయ' చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయం అయిన సాగర్ ఆ తర్వాత 30 చిత్రాలకు పైగా దర్శకత్వం వహించారు. సాగర్ దర్శకత్వంలో కృష్ణ హీరోగా రూపొందిన 'అమ్మ దొంగ' సూపర్ హిట్ అయ్యింది. ఆ తరువాత కృష్ణతోనే 'జగదేక వీరుడు' చిత్రాన్ని తెరకెక్కించారు. అలాగే వినోద్ కుమార్, సౌందర్య జంటగా సాగర్ తెరకెక్కించిన 'అమ్మ నా కోడలా' మంచి సినిమా అనిపించుకుంది. ఆయన దర్శకత్వం వహించిన 'రామసక్కనోడు'కి మూడు నంది అవార్డులు లభించాయి. స్టార్ డైరెక్టర్లుగా పేరు తెచ్చుకున్న వీవీ వినాయక్, శ్రీను వైట్ల వంటి వారు సాగర్ శిష్యులే. తెలుగు సినిమా దర్శకుల సంఘానికి మూడుసార్లు అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారు సాగర్. కాగా చెన్నై, హైదరాబాద్‌లో నివసిస్తుంటారు సాగర్. చెన్నైలో ఉంటూ వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. ''గురువారం ఉదయం ఆస్పత్రిలో చేరాల్సి ఉండగా, అనుకోకుండా గుండెపోటు రావడంతో కన్నుమూశారు'' అని సాగర్ పెద్ద కుమారుడు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. సాగర్‌కు భార్య మాలా, ఇద్దరు కొడుకులు చంద్రశేఖర్, రాజశేఖర్, ఒక కుమార్తె చందన ఉన్నారు. చంద్రశేఖర్ సినిమా పరిశ్రమలో కొన్నాళ్లు కెమెరా డిపార్ట్‌మెంట్‌లో చేశారు. రాజశేఖర్ ఆస్ట్రేలియాలో, చందన అమెరికాలో ఉంటున్నారు. సాగర్ భౌతిక కాయానికి నేడు చెన్నైలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

నన్ను క్షమించగలవా?



● బ్రహ్మానందం

ప్రకాశ్‌రాజ్, రమ్యకృష్ణ ప్రధాన పాత్రల్లో కృష్ణవంశీ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రంగ మార్తాండ'. నటుడు బ్రహ్మానందం కీలక పాత్రలో నటించారు. కాలిపు మధు, ఎస్. వెంకట్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న విడుదలవుతోంది. బ్రహ్మానందం పుట్టినరోజు (ఫిబ్రవరి 1) సందర్భంగా 'రంగ మార్తాండ' నుంచి బ్రహ్మానందం గ్లింప్స్ రిలీజ్ చేశారు. ''ధగ ధగ్గాయ రాజమకుట సువర్ణ మణిగణ రాజరాజేశ్వరా, సుయోధన సార్వభౌమ.. శరాఘతాలతో ఛిద్రమై.. ఊపిరి ఆవిరై దిగంతాల సరిహద్దులు చెరిగిపోతున్న వేళ.. అఖండ భారత సామ్రాజ్యాన్ని కురుక్షేత్ర సంగ్రామంలో కానుకగా ఇస్తానని శుష్క వాగ్దానాలు వల్లెవేసిన ఈ దౌర్భాగ్యుడికి కడసారి దర్శనం కల్పిస్తున్నావా? నా దైవ స్వరూపమా.. నన్ను క్షమించగలవా?'' అంటూ భావోద్వేగంతో బ్రహ్మానందం చెప్పే డైలాగ్స్‌తో గ్లింప్స్ సాగుతుంది. రాహుల్ సిప్లిగంజ్, శివాత్మిక నటించిన ఈ చిత్రానికి సంగీతం: ఇళయరాజా.

పద్దెనిమిది రోజులు ఫుడ్ తీసుకోలేదు!

- సందీప్ కిషన్



"సందీప్‌లో ప్రతిభ, కష్టం కనిపించాయి కానీ అదృష్టం కనిపించలేదు' అని హీరో నాని అన్నారు. నిజంగానే నాకు అదృష్టం కలసిరాలేదని, రావాల్సినంత పేరు రాలేదని చాలామంది అంటుంటారు. నాని చెప్పినట్లు 'మైఖేల్'తో నాకు అదృష్టం కూడా కలిసొస్తుందని నమ్ముతున్నా" అని హీరో సందీప్ కిషన్ అన్నారు. రంజిత్ జయకొడి దర్శకత్వంలో సందీప్ కిషన్ హీరోగా తెరకెక్కిన చిత్రం 'మైఖేల్'. నారాయణ్ దాస్ కె. నారంగ్ సమర్పణలో భరత్ చౌదరి, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా సందీప్ చెప్పిన విశేషాలు.

● ఇప్పటివరకూ నేను చేయాలనుకుని చేయలేకపోయినది ఏంటి? అని ఆలోచించినప్పుడు 'మైఖేల్' ఐడియా వచ్చింది. నా ఆలోచన రంజిత్‌కి చెప్పాను. ఆ ఆలోచన తీసుకుని తను చెప్పిన 'మైఖేల్' కథ బాగా నచ్చింది. భరత్ చౌదరి, రామ్మోహన్ రావు, సునీల్ నారంగ్ వంటి నిర్మాతలు తోడవ్వడంతో ఈ సినిమా స్థాయి భారీగా పెరిగింది. ఈ చిత్రకథకి, విజువల్ నెరేటివ్‌కి, సినిమాకి పాన్ ఇండియా స్థాయి ఉంది.. అందుకే పాన్ ఇండియా మూవీగా తీశాం. ● 'మైఖేల్' యూనిక్ స్టోరీ. చెడ్డవాళ్ల మధ్య జరిగే ప్రేమకథ ఇది. యాక్షన్, ఎమోషన్స్, డార్క్ కామెడీ ఉంటుంది. మైఖేల్ చాలా వైల్డ్. గ్యాంగ్‌స్టర్ కాకపోయినా నా పాత్ర ఎగ్రెసివ్‌గా ఉంటుంది. ● ఈ సినిమాలోని ఓ సన్నివేశం కోసం దాదాపు 18 రోజులు పాటు ఫుడ్ తీసుకోకుండా నీళ్ల మాత్రమే తాగేవాణ్ణి. ఒక దశలో కుడి కాలు పని చేయడం మానేసింది. అయినా ఒక ఫైట్ షూట్ చేసి, ప్యాకప్ చెప్పాం. తమిళ సంస్కృతి, భాష నాకు తెలుసు. అందుకే తమిళ ప్రేక్షకుల నుంచి నాకు మంచి ప్రేమ లభించింది.. అలాగే విజయ్ సేతుపతిగారు 'మైఖేల్'లో భాగమయ్యారు. ధనుష్‌గారు 'కెప్టెన్ మిల్లర్'లో నన్ను తీసుకున్నారు. 'మైఖేల్'కి తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో నేనే డబ్బింగ్ చెప్పాను.

● 'మైఖేల్' నాకు చాలా స్పెషల్ జర్నీ. ఈ ప్రయాణంలో బరువు తగ్గాను, స్కూబా డైవింగ్ నేర్చుకున్నాను. అండర్ వాటర్‌లోనూ షూటింగ్ చేశాం. ప్రస్తుతం 'భైరవ కోన, కెప్టెన్ మిల్లర్, బడ్డీ' సినిమాలు చేస్తున్నాను. అలాగే 'ఫ్యామిలీ మ్యాన్ 3' వెబ్ సిరీస్ ఉంది.

సల్మాన్.. ఆమిర్... ఓ సినిమా!



సల్మాన్ ఖాన్, ఆమిర్ ఖాన్‌లు కలిసి ఓ సినిమా చేయనున్నారా? అంటే అవుననే అంటున్నాయి బాలీవుడ్ వర్గాలు. స్పానిష్ ఫిల్మ్ 'చాంపియన్స్' హిందీ రీమేక్‌ను నిర్మించి, నటించాలనుకున్నారు ఆమిర్. అయితే ఇప్పుడు ఈ రీమేక్‌కు సల్మాన్ ఖాన్ బాగుంటారని భావించారట. ఈ సినిమా గురించి చర్చించడానికి సల్మాన్‌ను ఇంటికి ఆహ్వానించారట ఆమిర్. కాగా తాను నటించిన 'ది ఫారెస్ట్ గంప్' హిందీ రీమేక్ 'లాల్‌సింగ్ చడ్డా' సరిగ్గా ఆడకపోవడంతో వెంటనే మరో రీమేక్‌లో నటించాలనే నిర్ణయాన్ని ఆమిర్ మార్చుకున్నారట. అందుకే హీరోగా నటించాల్సిందిగా సల్మాన్‌ను రిక్వెస్ట్ చేశారని టాక్.

మాస్ వేద



● శివరాజ్‌కుమార్

కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్ హీరోగా నటించిన కన్నడ చిత్రం 'వేద' అదే పేరుతో తెలుగులో విడుదల కానున్న విషయం తెలిసిందే. నిర్మాత వీఆర్ కృష్ణ మండపాటి ఈ నెల 9న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నారు. ''మంచి మాస్ యాక్షన్ మూవీగా రూపొందిన ఈ చిత్రకథ తెలుగు ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకంతోనే అనువదించాం. కన్నడ పరిశ్రమలో శివ రాజ్‌కుమార్ ఒక ఐకానిక్ హీరో. ఆయన కెరీర్‌లో 125వ సినిమా అయిన 'వేద'ని మేం విడుదల చేయడం ఆనందంగా ఉంది'' అని వీఆర్ కృష్ణ అన్నారు. ఈ చిత్రానికి ఎ. హర్ష దర్శకత్వం వహించారు.

మా నాన్న చివరి కోరిక నెరవేరింది

- సూర్య వశిష్ఠ



''బుట్టబొమ్మ'లో నటించే చాన్స్ రావడం హ్యాపీగా ఉంది. ఇందులో నా పాత్ర కొత్తగా, ఆకట్టుకునేలా ఉంటుంది'' అన్నారు సూర్య వశిష్ఠ. అనిఖా, సూర్య వశిష్ఠ, అర్జున్ దాస్ ప్రధాన పాత్రల్లో శౌరి చంద్రశేఖర్ టి. రమేష్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'బుట్టబొమ్మ'. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా రేపు రిలీజ్ అవుతోంది. సూర్య వశిష్ఠ మాట్లాడుతూ– ''మా నాన్న సత్యం గారు 30 ఏళ్లకుపైగా సినీ పరిశ్రమలో ఉన్నారు. రాఘవేంద్రరావు, రాజమౌళి, త్రివిక్రమ్‌గార్ల వద్ద కో డైరెక్టర్‌గా చేశారు. మా నాన్న 'కప్పేల'ని చూపించి, అందులోని ఆటో డ్రైవర్ పాత్ర నాకు సరిపోతుందన్నారు. అయితే కోవిడ్‌తో ఆయన మరణించారు. ఆ తర్వాత త్రివిక్రమ్‌గారిని కలిసి, 'బుట్టబొమ్మ' ఆడిషన్‌లో పాల్గొని, ఎంపికయ్యాను. అలా మా నాన్నగారి చివరి కోరిక నెరవేరింది'' అన్నారు.

ఆనందంతో మాట రాలేదు

- సుహాస్



● గౌరీప్రియ, సుహాస్, టీనా

''మా సినిమా ప్రీమియర్స్ చూసిన చాలా మంది నన్ను దీవిస్తుంటే ఆనందంతో మాట రాలేదు'' అని సుహాస్ అన్నారు. షణ్ముఖ ప్రశాంత్ దర్శకత్వంలో సుహాస్, టీనా శిల్పరాజ్ జంటగా నటించిన చిత్రం 'రైటర్ పద్మభూషణ్'. జి. మనోహర్ సమర్పణలో అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర, చంద్రు మనోహర్ నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ఫ్యామిలీ స్క్రీనింగ్స్ సక్సెస్ మీట్‌లో శరత్ చంద్ర, చంద్రు మనోహర్ మాట్లాడుతూ– ''మా సినిమా ప్రీమియర్స్‌లో ప్రేక్షకులు ప్రతి ఐదు నిమిషాలకోసారి గట్టిగా నవ్వడం మరచిపోలేని అనుభూతి'' అన్నారు.

మూడు చిత్రాల్లో...



● క్రిష్

''క్షణం'కు అసిస్టెంట్ డైరెక్టర్‌గా, 'గూఢచారి, టైగర్ నాగేశ్వరావు' సినిమాలకు, పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీలో కొన్ని చిత్రాలకు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా చేశాను. ఎనిమిదేళ్లుగా ఇండస్ట్రీలో ఉన్నాను. ప్రేక్షకుల చేత మంచి నటుడు అనిపించుకోవాలన్నదే నా లక్ష్యం'' అని క్రిష్ సిద్ధిపల్లి అన్నారు. ఇంకా క్రిష్ మాట్లాడుతూ– ''నేను లేని నా ప్రేమకథ'లో ఓ లీడ్ రోల్ చేశాను. ప్రస్తుతం 'సుఖీభవ', 'రమ్య, రాబర్ట్, రహీం', 'ఎంగేజ్‌మెంట్' అనే మూడు సినిమాల్లో నటిస్తున్నాను. ఇంకా 'లవ్ ఇన్ 65'లో కీ రోల్, 'ఆహా' ఓటీటీ ప్రాజెక్టులో చేస్తున్నాను'' అన్నారు.

సాక్షి బిజినెస్

శుక్రవారం
3-2-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	224	59,932
నిఫ్టీ ▼	6	17,610

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	12,188	▲ 372
డోజోన్స్	33,953	▽ 140
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,166	▲ 89
డాక్స్	15,509	▲ 328
షాంఘై	3,286	▲ 1
నికాయ్	27,402	▲ 55

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారట్)	58,882
బంగారం (22 క్యారట్)	58,646
వెండి (కిలో)	71,576

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	81.10	82.77
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	88.71	91.81
€	యూరో	ఎస్‌బీఐ	99.82	103.20
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	62.71	64.78
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	57.37	59.77
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	61.81	63.86
SAR	సౌదీ రియాల్	[illegible]	20.92	22.59
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.48	23.27
¥	చైనా యువాన్	[illegible]	11.01	13.11

హెచ్‌డీఎఫ్‌సీ లాభం అప్

క్యూ3లో రూ. 7,078 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ మార్టిగేజ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022–23) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్– డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 15 శాతం పుంజుకుని రూ. 7,078 కోట్లకు చేరింది. స్టాండెలోన్ నికర లాభం సైతం రూ. 3,261 కోట్ల నుంచి రూ. 3,691 కోట్లకు ఎగసింది. నికర వడ్డీ ఆదాయం 13 శాతం మెరుగై రూ. 4,840 కోట్లను తాకింది. నికర వడ్డీ మార్జిన్లు 3.5 శాతంగా నమోదయ్యాయి. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 2.32 శాతం నుంచి 1.49 శాతానికి దిగివచ్చాయి.

వడ్డీ రేట్ల ఎఫెక్ట్

ఆర్‌బీఐ వడ్డీ రేట్ల పెంపు నేపథ్యంలో లాభదాయకత మందగించినట్లు హెచ్‌డీఎఫ్‌సీ వైస్‌చైర్మన్, సీఈవో కేకి మిస్త్రీ వెల్లడించారు. అయితే రుణాలను కొత్త రేట్లకు వేగంగా అనుసంధానిస్తున్నట్లు, ఈ ప్రభావం రుణాలపై తదుపరి త్రైమాసికం నుంచీ ప్రతిఫలించనున్నట్లు తెలియజేశారు. వ్యక్తిగత రుణ విభాగం 26 శాతం వృద్ధిని సాధించగా.. సగటు టికెట్(రుణ) పరిమాణం రూ. 35.7 లక్షలకు బలపడినట్లు వెల్లడించారు. రూ. 18 లక్షలకుపైగా వార్షిక ఆదాయంగల రుణగ్రహీతలు 52 శాతంగా తెలియజేశారు. గ్రూప్ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు విలీనంపై ఆర్‌బీఐ, ఎన్‌సీఎల్‌టీ నుంచి నిర్ణయాలు వెలువడవలసి ఉన్నట్లు పేర్కొన్నారు.

ఫలితాల నేపథ్యంలో హెచ్‌డీఎఫ్‌సీ షేరు దాదాపు 2 శాతం క్షీణించి రూ. 2,613 వద్ద ముగిసింది.

భారత్‌లో శామ్‌సంగ్ ఎస్23 తయారీ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: స్మార్ట్ డివైజెస్ తయారీలో ఉన్న కొరియా కంపెనీ శామ్‌సంగ్ భారత్‌లో ప్రీమియం గెలాక్సీ ఎస్23 స్మార్ట్‌ఫోన్లను తయారు చేయనున్నట్టు ప్రకటించింది. ఎస్23 ధరల శ్రేణి భారత్‌లో రూ.75,000 నుంచి రూ.1.55 లక్షలు. ప్రస్తుతం గెలాక్సీ ఎస్ సిరీస్ మోడళ్లు వియత్నాంలో తయారు అవుతున్నాయి. అన్ని గెలాక్సీ ఎస్23 స్మార్ట్‌ఫోన్లు నోయిడా ఫ్యాక్టరీలో తయారు చేయనున్నట్టు కంపెనీ వెల్లడించింది. శామ్‌సంగ్ ఇప్పటికే నోయిడా ఫ్యాక్టరీలో తయారీ ద్వారా దేశీయ డిమాండ్‌లో ఎక్కువ భాగాన్ని పూర్తి చేస్తోంది. కెమెరా లెన్స్‌ల దిగుమతిపై సుంకాన్ని తొలగిస్తున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన ఒక రోజు తర్వాత కంపెనీ నుంచి ఈ ప్రకటన వెలువడడం విశేషం. కెమెరాయే గెలాక్సీ ఎస్ సిరీస్ స్మార్ట్‌ఫోన్ల ప్రత్యేకత.

మూడు మోడళ్లు..

కంపెనీ భారత్‌లో తాజాగా గెలాక్సీ ఎస్23 శ్రేణిలో హై–ఎండ్ కెమెరా సెన్సర్స్‌తో మూడు మోడళ్లను ఆవిష్కరించింది. ఎస్23, ఎస్23 ప్లస్, ఎస్23 అల్ట్రా వీటిలో ఉన్నాయి. 6.8 అంగుళాల క్యూహెచ్‌డీ ప్లస్ 120 హెర్ట్జ్ అమోలెడ్ డిస్‌ప్లేతో ఎటువంటి వెలుతురులోనైనా స్పష్టమైన చిత్రాలను తీయగలిగేలా గెలాక్సీ ఎస్23 అల్ట్రాను రూపొందించింది. ఈ మోడల్‌కు 12 ఎంపీ మొదలు.. 200 ఎంపీ అడాప్టివ్ పిక్సెల్ సెన్సార్ వరకు 5 కెమెరాలను పొందుపరిచారు. విక్టస్–2 కార్నింగ్ గొరిల్లా గ్లాస్, ఆండ్రాయిడ్ 13, ఇన్ డిస్‌ప్లే అల్ట్రాసోనిక్ ఫింగర్‌ప్రింట్ స్కానర్, 12 ఎంపీ డ్యూయల్ పిక్సెల్ ఫ్రంట్ కెమెరా వంటి ఫీచర్లు ఉన్నాయి. ఫిబ్రవరి 17 నుంచి అందుబాటులో ఉండే అవకాశం ఉంది.

మార్కెట్ అస్థిరతలతోనే ఎఫ్‌పీవో వెనక్కి

- ఇన్వెస్టర్ల ప్రయోజనాలే మాకు ముఖ్యం
- అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ



న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ ఫ్లాగ్‌షిప్ కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్ (ఎఫ్‌పీవో)ను ఉపసంహరించుకోవడంపై గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ స్పందించారు. మార్కెట్లో నెలకొన్న అస్థిరతల నేపథ్యంలోనే ఈ నిర్ణయానికి వచ్చినట్టు చెప్పారు. అదానీ గ్రూప్ రూ.20,000 కోట్ల సమీకరణతో ఎఫ్‌పీవోకి రాగా, హెచ్‌ఎన్‌ఐ, సంస్థాగత ఇన్వెస్టర్ల మద్దతుతో పూర్తిగా సబ్‌స్క్రయిబ్ కావడం తెలిసిందే. ''పూర్తిగా సబ్‌స్క్రయిబ్ అయిన ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్‌ను రద్దు చేయడం చాలా మందిని ఆశ్చర్యపరిచింది. నిన్నటి మార్కెట్ అస్థిరతలను చూసిన తర్వాత ఎఫ్‌పీవో విషయంలో ముందుకు వెళ్లడం నైతికత కాదని బోర్డ్ బలంగా అభిప్రాయపడింది''అని గౌతమ్ అదానీ తన సందేశంలో పేర్కొన్నారు. అమెరికాకు చెందిన పెట్టుబడుల సంస్థ హిండెన్ బర్గ్ అదానీ గ్రూప్‌పై పలు ఆరోపణలు చేయగా.. ఆ తర్వాత నుంచి గ్రూప్ కంపెనీల షేర్లు రోజూ నష్టపోతుండడం తెలిసిందే. అదానీ ఎంటర్‌ప్రైజెస్ రూ.3,112–3,276 ధరల శ్రేణితో ఎఫ్‌పీవో పూర్తి చేసుకుంది. కానీ, ఆ తర్వాత మార్కెట్లో షేరు దీనికంటే తక్కువకు పడిపోవడం గమనార్హం. ఓపెన్ మార్కెట్లో తక్కువ ధరకు లభిస్తున్నందున అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఎఫ్‌పీవోలో ఇన్వెస్ట్ చేసి నష్టపోయామని ఇన్వెస్టర్లు భావించే అవకాశం ఉంటుందని కంపెనీ వర్గాలు పేర్కొన్నాయి. ''వ్యాపారవేత్తగా నాలుగు దశాబ్దాల నా ప్రయాణంలో భాగస్వాములు అందరి నుంచి, ముఖ్యంగా వాటాదారుల నుంచి ఎంతో మద్దతు లభించింది. నా వరకు నా వాటాదారుల ప్రయోజనాలే పరమావధి. ఆ తర్వాతే ఏదైనా. కనుక నష్టాల నుంచి ఇన్వెస్టర్లను రక్షించేందుకు ఎఫ్‌పీవోను ఉపసంహరించుకున్నాం'' అని గౌతమ్ అదానీ వివరించారు.

యథావిధిగా గ్రూప్ వ్యాపార కార్యకలాపాలు

ఈ నిర్ణయం గ్రూపు వ్యాపార కార్యకలాపాలపై ఏమీ ఉండదని, ఎప్పటి మాదిరే తాము సకాలంలో ప్రాజెక్టుల పూర్తిపై దృష్టి సారిస్తామని ప్రకటించారు. మార్కెట్లు స్థిరపడిన తర్వాత తిరిగి మార్కెట్‌కు వెళ్లే వ్యూహాన్ని సమీక్షిస్తామని చెప్పారు. ''ఈఎస్‌జీపై మేము బలంగా దృష్టి పెట్టాం. ప్రతీ వ్యాపారం కూడా బాధ్యతాయుత మార్గంలో విలువను సృష్టిస్తుంది. మా పాలనా సూత్రాలకు మేము కుదుర్చుకున్న పలు అంతర్జాతీయ భాగస్వామ్యాలే నిదర్శనం. పలు వ్యాపారాల్లో వీటిని నిర్మించాం'' అని గౌతమ్ అదానీ వాటాదారులకు వివరించారు.

సత్యం కేసులో తాజా ఉత్తర్వులు ఇవ్వండి

సెబీకి శాట్ ఆదేశం



న్యూఢిల్లీ: సత్యం కంప్యూటర్స్ స్కామ్‌లో రామలింగరాజు తదితరులను 14 ఏళ్ల పాటు సెక్యూరిటీస్ మార్కెట్ల నుంచి నిషేధిస్తూ సెబీ జారీ చేసిన ఉత్తర్వులను అప్పిలేట్ ట్రిబ్యునల్ శాట్ పక్కన పెట్టింది. 14 ఏళ్ల వ్యవధిని నిర్దేశించడానికి ఏ కారణమూ చూపలేదని పేర్కొంది. అలాగే ఒక్కొక్కరూ అక్రమంగా ఎంతెంత లబ్ధి పొందారో వేర్వేరుగా లెక్కించాల్సిందని సూచించింది. దీనిపై నాలుగు నెలల్లో కొత్తగా ఉత్తర్వులు ఇవ్వాలంటూ ఆదేశించింది. వివరాల్లోకి వెడితే .. ఖాతాల్లో అవకతవకలు బైటపడటంతో 2009లో సత్యం కంప్యూటర్స్ సంక్షోభంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే. దీనికి సంబంధించి ప్రమోటర్లయిన రామలింగ రాజు, రామ రాజులతో పాటు పలువురిపై కేసులు దాఖలయ్యాయి. ఆరుగురిని సెక్యూరిటీస్ మార్కెట్ల నుంచి 14 ఏళ్ల నిషేధించడంతో పాటు భారీగా జరిమానా విధిస్తూ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ 2018లో రెండు ఉత్తర్వులు ఇచ్చింది. వీటిపై వారు సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించగా తాజా ఆదేశాలు వచ్చాయి.

కొత్త పన్ను విధానం ఆకర్షణీయం

- తక్కువ పన్ను రేటు
- ఎక్కువ మందికి ప్రయోజనకరం
- నచ్చిన విధానం ఎంచుకోవచ్చు
- సీబీడీటీ చైర్మన్ నితిన్‌గుప్తా



న్యూఢిల్లీ: నూతన పన్ను విధానం 2023–24 బడ్జెట్‌తో ఆకర్షణీయంగా మారినట్టు ప్రత్యక్ష పన్నుల కేంద్ర మండలి (సీబీడీటీ) చైర్మన్ నితిన్ గుప్తా తెలిపారు. ఎక్కువ మంది ఇన్వెస్టర్లకు ఇది ప్రయోజనకరమని, తక్కువ పన్ను రేటును వారు ఆస్వాదిస్తారని చెప్పారు. బడ్జెట్ అనంతరం ఓ వార్తా సంస్థతో గుప్తా మాట్లాడారు. తగ్గింపులు, మినహాయింపులను క్రమంగా దూరం చేయడం కోసమే నూతన పన్ను విధానంలో (మినహాయింపుల్లేని) కొత్త శ్లాబులు, రేట్లు ప్రకటించడానికి కారణంగా పేర్కొన్నారు. దీని ద్వారా వ్యక్తులు, సంస్థలపై పన్ను రేట్లు తగ్గించాలన్న దీర్ఘకాలిక డిమాండ్‌ను చేరుకోవడం సాధ్యపడుతుందన్నారు. ''నూతన పన్ను విధానాన్ని రెండేళ్ల క్రితం (2020–21 బడ్జెట్‌లో) ప్రతిపాదించాం. అయినప్పటికీ తగిన ప్రతిఫలాన్ని ఇవ్వడం లేదు. ఇప్పుడు ప్రభుత్వం శ్లాబులను మార్చింది. దీనివల్ల పన్ను చెల్లింపుదారులకు రేట్లు, శ్లాబులు ఇప్పుడు చాలా స్పష్టంగా అర్థమవుతాయి''అని చెప్పారు. కార్పొరేట్ విభాగంలో పన్ను చెల్లింపుదారులకు ఇదే మాదిరి చర్యలను కొంత కాలం క్రితం ప్రకటించగా, వారికి ప్రయోజనకరంగా మారినట్టు గుప్తా తెలిపారు. నూతన పన్ను విధానంతో లబ్ధి పొందని వర్గాలు చాలా తక్కువన్నారు. దీనిలో స్టాండర్డ్ డిడక్షన్ కల్పించినందున, అది పాత విధానంలోని ప్రయోజనాలకు ఏ మాత్రం తీసిపోదన్నారు.

పన్ను చెల్లింపు దారుల ఇష్టమే..

నూతన పన్ను విధానం డిఫాల్ట్ (ప్రమేయం లేని)గా ఉంటున్నందున, పాత పన్ను విధానంలో ఉన్నవారిపై ప్రభావం పడుతుందా? అన్న ప్రశ్నకు.. ఏ విధానం అయినా ఎంపిక చేసుకుని రిటర్నులు దాఖలు చేసే స్వేచ్ఛ పన్ను చెల్లింపుదారులకు ఉంటుందని నితిన్‌గుప్తా చెప్పారు. కావాలంటే పాత పన్ను విధానానికి కూడా మారిపోవచ్చన్నారు. ''డిఫాల్ట్ అంటే ఫైలింగ్ పోర్టల్ స్క్రీన్‌పై ముందు కనిపిస్తుంది. కానీ, అక్కడ ఏ పన్ను విధానం అనే ఆప్షన్ ఉంటుంది. కావాల్సిన విధానాన్ని ఎంపిక చేసుకోవచ్చు''అని గుప్తా వివరించారు. ఏ వర్గం పన్ను చెల్లింపుదారులను కూడా నిరుత్సాహపరచబోమన్నారు. నూతన పన్ను విధానంలో రూ.7 లక్షల వరకు పన్ను చెల్లించే అవకాశం లేకుండా రిబేట్ కల్పించడం తెలిసిందే. దీనికి అదనంగా రూ.50 వేల స్టాండర్డ్ డిడక్షన్ ప్రయోజనం కూడా ప్రకటించారు. పాత విధానంలో అయితే రూ.5 లక్షలకు మించిన ఆదాయంపై 20% పన్ను చెల్లించాల్సి ఉంటుంది. కాకపోతే వివిధ సెక్షన్ల కింద తగిన సాధనాల్లో ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది.

అంతిమంగా కొత్త విధానమే

తక్కువ పన్ను రేట్లతో, మినహాయింపుల్లేని, సులభతర పన్నుల విధానానికి (నూతన పన్ను విధానం) మళ్లడమే ప్రభుత్వ ధ్యేయమని కేంద్ర ప్రభుత్వ రెవెన్యూ విభాగం కార్యదర్శి సంజయ్ మల్హోత్రా తెలిపారు. రెవెన్యూ శాఖ నిర్వహించిన విశ్లేషణ ప్రకారం ఏటా రూ.15 లక్షలు ఆర్జించే వ్యక్తి పాత పన్ను విధానంలో రూ.3.75 లక్షల వరకు క్లెయిమ్‌లు పొందొచ్చని.. కానీ, తక్కువ పన్ను రేట్లతో దీనికి ప్రత్యామ్నాయ పన్నుల విధానాన్ని ప్రతిపాదించినట్టు చెప్పారు. నూతన పన్ను విధానం తప్పనిసరి చేయడానికి ఎలాంటి గడువు పెట్టుకోలేదని స్పష్టం చేశారు.

కొనసాగిన ఊగిసలాట

సెన్సెక్స్‌కు లాభం, నిఫ్టీకి నష్టం



ముంబై: రోజంతా లాభనష్టాల మధ్య దోబూచులాడిన స్టాక్ సూచీలు చివరికి మిశ్రమంగా ముగిశాయి. అదానీ షేర్లలో పతనం కొనసాగడం, అంతర్జాతీయ మార్కెట్లలోని నెలకొన్న మిశ్రమ సంకేతాల మధ్య సెన్సెక్స్ లాభాలను సాధించగా, నిఫ్టీ స్వల్ప నష్టంగా నష్టపోయింది. ఉదయం సెన్సెక్స్ 248 పాయింట్ల నష్టంతో 59,460 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 729 పాయింట్ల రేంజ్‌లో 59,216 వద్ద కనిష్టాన్ని, 60,008 గరిష్టాన్ని తాకింది. చివరికి 224 పాయింట్లు పెరిగి 59,932 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 99 పాయింట్ల నష్టంతో 17,616 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. ఆఖరికి 6 పాయింట్ల స్వల్ప నష్టంతో 17,610 వద్ద నిలిచింది. మెటల్, ఫార్మా, ప్రభుత్వరంగ బ్యాంక్స్, ఆర్థిక షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఎఫ్‌ఎంసీజీ, ఐటీ, ప్రైవేట్ బ్యాంక్స్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు డాలర్లకు డిమాండ్ పెరగడంతో ఫారెక్స్ మార్కెట్లో రూపాయి విలువ 40 పైసలు పతనమై 82.20 స్థాయి వద్ద ముగిసింది. ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల పెంపుకిది చివరి దశ కావచ్చనే అంచనాల మధ్య ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి.

అదానీ గ్రూప్ షేర్లలో కొనసాగిన అమ్మకాలు

అదానీ గ్రూప్ ఎఫ్‌పీఓ ఉపసంహరించుకోవడంతో తీవ్రమైన అమ్మకాల ఒత్తిడిని చవిచూశాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్ 26.50%, అదానీ ట్రాన్స్‌మిషన్, అదానీ గ్రీన్ ఎనర్జీ షేర్లు 10% పతనమయ్యాయి. అదానీ పోర్ట్స్ 6%, అదానీ విల్మార్, ఎన్‌డీటీవీ, అదానీ పవర్ షేర్లు 5% చొప్పున నష్టపోయాయి.

సాక్షి స్పోర్ట్స్

రెజ్లర్ అమన్‌కు కాంస్యం

భారత యువ రెజ్లర్ అమన్ సెహ్రావత్ క్రొయేషియాలో జరుగుతున్న జాగ్రెబ్ ఓపెన్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించాడు. పురుషుల 57 కేజీల కేటగిరీలో మూడో స్థానం కోసం జరిగిన పోరులో పోటీపడిన 17 ఏళ్ల అమన్ 10–4తో జేన్ రే రోడ్స్ రిచర్డ్స్ (అమెరికా)పై గెలుపొందాడు. ఈ ఈవెంట్‌లో యుతొ నిషివుచి (జపాన్) చేతిలో అమన్ సెమీస్‌లో ఓడిపోయాడు. అయితే ప్రత్యర్థి ఫైనల్ చేరడంతో రెపిచేజ్ రౌండ్‌కు అమన్ అర్హత సాధించాడు. మహిళల 50 కేజీల్లో శివాని పవార్ క్వార్టర్ ఫైనల్లోనే వెనుదిరిగింది. ఆమె 0–4తో ఎరిన్ సిమోన్ (అమెరికా) చేతిలో ఓడిపోయింది. భారత రెజ్లింగ్ సమాఖ్యతో విభేదాల నేపథ్యంలో అగ్రశ్రేణి రెజ్లర్లు వినేశ్ ఫొగాట్, బజరంగ్ పూనియా, రవి దహియా ఈ టోర్నమెంట్‌లో ఆడటం లేదు. దీపక్ పూనియా, అన్షు మలిక్, సంగీత ఫొగాట్, సరితా మోర్, జితేంద్ర కిన్హా కూడా టోర్నీనుంచి ముందే తప్పుకున్నారు.



ఆస్ట్రేలియా సాధన షురూ



← ప్రాక్టీస్ చేస్తున్న లబుషేన్



నాగపూర్ చేరుకున్న సిరాజ్ →

ఉస్మాన్ ఖాజాకు లైన్‌క్లియర్

బెంగళూరు: ఐదేళ్ల క్రితం...భారత గడ్డపై బోర్డర్–గావస్కర్ ట్రోఫీ తొలి టెస్టులో ఆస్ట్రేలియా అనూహ్య విజయంతో టీమిండియాకు షాక్ ఇచ్చింది. పుణేలో స్పిన్ పిచ్ సిద్ధం చేస్తే మనకంటే సమర్థంగా దానిని వాడుకున్న ఆ జట్టు పైచేయి సాధించింది. చివరకు సిరీస్ భారత్ ఖాతాలోనే చేరినా...స్పిన్‌పై ఆసీస్ సన్నద్ధతను ఆ టెస్టు చూపించింది. ఇప్పుడు కూడా సరిగ్గా అదే తరహాలో కఠిన పరిస్థితులను ఎదుర్కొనేందుకు కంగారూ బృందం సిద్ధమవుతోంది. అందు కోసం భారత గడ్డపై అడుగు పెట్టగానే ప్రణాళికలు అమలు చేసింది. తొలి టెస్టు ఈ నెల 9న నాగపూర్‌లో మొదలు కానుండగా... దానికంటే ముందు నాలుగు రోజులు మరో వేదికను తమ ప్రాక్టీస్ కేంద్రంగా ఆస్ట్రేలియా మార్చుకుంది. బెంగళూరు శివార్లలో ఆలూరు మైదానంలో ఆ జట్టు సాధన ప్రారంభించింది. ప్రాక్టీస్ మ్యాచ్‌లు అవసరం లేదని ముందే తేల్చుకున్న ఆసీస్...నెట్స్‌లోనే భిన్నమైన పిచ్‌లను రెడీ చేసి బరిలోకి దిగింది. స్పిన్‌ను సమర్థంగా ఎదుర్కొనే క్రమంలో ఆ జట్టు కోచింగ్ బృందంలో డానియెల్ వెటోరీకి చోటు కల్పించింది. ప్రపంచ అత్యుత్తమ స్పిన్నర్లలో ఒకడిగా గుర్తింపు తెచ్చుకున్న వెటోరీ అనుభవం, సూచనలు కచ్చితంగా ఆసీస్‌కు ఉపయోగపడతాయి. గతంలో ఐపీఎల్‌లో బెంగళూరు జట్టుతో కలిసి పని చేసిన సాన్నిహిత్యంతో పిచ్‌ల ఏర్పాటు, ప్రాక్టీస్ విషయంలో ఆర్‌సీబీ బృందం సహకారాన్ని ఆస్ట్రేలియా హెడ్ కోచ్ ఆండ్రూ మెక్‌డొనాల్డ్ తీసుకున్నాడు. నాలుగు టెస్టుల వేదికల్లో ఎదురయ్యే పిచ్‌లపై ఒక అంచనాతో అదే తరహా పిచ్‌లను సిద్ధం చేసి ఆసీస్ ప్రాక్టీస్ చేస్తోంది. నెమ్మదైన టర్నింగ్ పిచ్, బాగా టర్నింగ్‌కు సహకరించే పిచ్, భిన్నమైన బౌన్స్‌లను నాగపూర్, ఢిల్లీ, అహ్మదాబాద్‌లలో ఆ జట్టు ఎదుర్కోవాల్సి రావచ్చు. సీమ్‌కు అనుకూలించే ధర్మశాల తరహా పచ్చిక ఉన్న పిచ్‌పై కూడా ఆస్ట్రేలియా సాధన మొదలు పెట్టింది. గతంలో అశ్విన్, జడేజాలను ఎదుర్కొన్న అనుభవం ఉన్నా...టెస్టుల్లో ఇప్పటి వరకు అక్షర్ పటేల్‌ను ఆస్ట్రేలియా ఎదుర్కోలేదు. అందుకే అతని బౌలింగ్ వీడియో ఫుటేజీపై ప్రత్యేక దృష్టి పెట్టింది. బౌలింగ్ శైలిలో అక్షర్‌ను పోలి ఉండే జమ్మూ కశ్మీర్ లెఫ్టార్మ్ స్పిన్నర్ ఆబిద్ ముస్తాక్ ప్రాక్టీస్‌లో ఆస్ట్రేలియాకు బౌలింగ్ చేస్తున్నాడు. ఆబిద్ ఈ సీజన్ రంజీ ట్రోఫీలో అగ్రశ్రేణి జట్లపై సత్తా చాటి మొత్తం 32 వికెట్లతో అందరి దృష్టినీ ఆకర్షించాడు. టాపార్డర్ బ్యాటర్ ఉస్మాన్ ఖాజా వీసా సమస్య పరిష్కృతమైంది. పాక్‌లో పుట్టిన ఈ క్రికెటర్ చివరి నిమిషంలో వీసా అందకపోవడంతో జట్టు సహచరులతో పాటు భారత్‌కు రాలేకపోయాడు. అయితే ఇప్పుడు అంతా చక్కబడటంతో గురువారం ఖాజా భారత్‌కు బయల్దేరాడు. మరో వైపు వేర్వేరు నగరాల్లో ఉన్న భారత క్రికెటర్లు ఒక్కొక్కరిగా తొలి టెస్టు వేదిక నాగపూర్‌కు చేరుకుంటున్నారు. జట్టు అంతా ఒక్క చోటికి చేరిన తర్వాత టీమ్ ప్రాక్టీస్ ప్రారంభమవుతుంది.

తుది పోరులో పేలవంగా...

- ఫైనల్లో భారత మహిళల పరాజయం
- ముక్కోణపు టోర్నీ విజేత దక్షిణాఫ్రికా



హర్లీన్

ఈస్ట్ లండన్: టి20 ప్రపంచకప్‌కు ముందు సన్నాహకంగా సాగిన టోర్నమెంట్‌లో భారత మహిళల జట్టుకు తీవ్ర నిరాశ! లీగ్ దశలో చక్కటి ప్రదర్శన కనబర్చిన జట్టు పేలవ బ్యాటింగ్ ప్రదర్శనతో చివరి మెట్టుపై చతికిలపడింది. ఫలితంగా ముక్కోణపు టోర్నీలో ఆతిథ్య దక్షిణాఫ్రికా మహిళలు విజేతగా నిలిచారు. గురువారం జరిగిన ఫైనల్లో సఫారీ బృందం 5 వికెట్ల తేడాతో భారత్‌ను ఓడించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 109 పరుగులే చేయగలిగింది. వికెట్లు అందుబాటులో ఉన్నా... సఫారీ టీమ్ కట్టుదిట్టమైన బౌలింగ్ ముందు భారత టాప్–4 బ్యాటర్లంతా వేగంగా ఆడటంలో విఫలమయ్యారు. ఎనిమిది బంతులాడి స్మృతి మంధాన (0) డకౌట్ కాగా, మరో ఓపెనర్ జెమీమా రోడ్రిగ్స్ (11) కూడా విఫలమైంది. హర్లీన్ డియోల్ (56 బంతుల్లో 46; 4 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలవగా, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (22 బంతుల్లో 21; 2 ఫోర్లు) నిరాశపర్చింది. చివర్లో దీప్తి శర్మ (14 బంతుల్లో 16 నాటౌట్) స్కోరును 100 పరుగులు దాటించింది. ఎమ్‌లాబాకు 2 వికెట్లు దక్కాయి. అనంతరం దక్షిణాఫ్రికా 18 ఓవర్లలో 5 వికెట్లకు 113 పరుగులు చేసి విజయాన్నందుకుంది. దక్షిణాఫ్రికా కూడా 21 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి ఇబ్బందుల్లో పడినా...'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' క్లో ట్రయాన్ (32 బంతుల్లో 57 నాటౌట్; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడు ప్రదర్శించి జట్టును గెలిపించింది. స్నేహ్ రాణా 2 వికెట్లు పడగొట్టింది. భారత ఆల్‌రౌండర్ దీప్తి శర్మ 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా నిలిచింది. ఈ నెల 10నుంచి దక్షిణాఫ్రికా గడ్డపైనే మహిళల టి20 వరల్డ్ కప్ జరగనుంది.

మధ్యప్రదేశ్ విజయలక్ష్యం 245

రెండో ఇన్నింగ్స్‌లో ఆంధ్ర 93 ఆలౌట్



ఇండోర్: రంజీ ట్రోఫీలో తొలిసారి సెమీఫైనల్ చేరేందుకు చక్కటి అవకాశాలు సృష్టించుకున్న ఆంధ్ర జట్టు అంతలోనే తడబడింది. డిఫెండింగ్ చాంపియన్ మధ్యప్రదేశ్‌పై ఏకంగా 151 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో పైచేయి సాధించినా...రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ వైఫల్యం జట్టును దెబ్బ తీసింది. ఓవర్‌నైట్ స్కోరు 144/4తో ఆట కొనసాగించిన మధ్యప్రదేశ్ గురువారం తమ తొలి ఇన్నింగ్స్‌లో 228 పరుగులకే ఆలౌటైంది. ఆదిత్య శ్రీవాత్సవ (31) ఒక్కడే కొద్దిగా పోరాడాడు. ఆంధ్ర బౌలర్లలో యర్రా పృథ్వీరాజ్ (5/26) ఐదు వికెట్ల ప్రదర్శనతో ప్రత్యర్థిని కుప్పకూల్చగా... కేవీ శశికాంత్ 3 వికెట్లు పడగొట్టాడు. అయితే ఆ తర్వాత ఆంధ్ర బ్యాటర్లు పూర్తిగా విఫలమయ్యారు. రెండో ఇన్నింగ్స్‌లో జట్టు 32.3 ఓవర్లలో 93 పరుగులకే ఆలౌటైంది. అశ్విన్ హెబర్ (35) టాప్‌స్కోరర్‌గా నిలిచాడు. చేతి గాయంతో బాధపడుతున్న కెప్టెన్ హనుమ విహారి (15) చివరి బ్యాటర్‌గా బరిలోకి దిగి మరో సారి 'లెఫ్ట్‌హ్యాండ్ బ్యాటింగ్'తో జట్టును ఆదుకునే ప్రయత్నం చేసినా లాభం లేకపోయింది. అవేశ్ ఖాన్ 4 వికెట్లు తీశాడు. అనంతరం 245 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన మధ్యప్రదేశ్ ఆట ముగిసే సమయానికి వికెట్ కోల్పోకుండా 58 పరుగులు చేసింది. హిమాన్షు మంత్రి (31 బ్యాటింగ్), యష్ దూబే (24 బ్యాటింగ్) క్రీజ్‌లో ఉన్నారు. ఆ జట్టు విజయం కోసం మరో 187 పరుగులు చేయాల్సి ఉంది. సొంతగడ్డపై ఎంపీ సులువుగా లక్ష్యం ఛేదిస్తుందా లేక ఆంధ్ర మరోసారి చెలరేగి ప్రత్యర్థిని పడగొడతారా చూడాలి.

భారత్‌కు డెన్మార్క్ సవాల్

నేటి నుంచి డేవిస్ కప్ పోరు



హిలెరాడ్ (డెన్మార్క్): డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్–1 ప్లేఆఫ్‌లో భాగంగా భారత్ క్లిష్టమైన పోరుకు సిద్ధమైంది. శుక్ర, శనివారాల్లో జరిగే పోటీల్లో భారత్... డెన్మార్క్‌తో తలపడుతుంది. గతేడాది సొంత గడ్డ (ఢిల్లీ)పై జరిగిన పోరులో భారత్ 4–0తో డెన్మార్క్‌ను ఓడించింది. కానీ అప్పుడు స్టార్ ప్లేయర్, ప్రపంచ 9వ ర్యాంకర్ హోల్గెర్ రూన్ గైర్హాజరయ్యాడు. ఇప్పుడు అతను అందుబాటులో ఉండటం, పోరు వారి గడ్డపైనే జరుగుతుండటంతో భారత్‌కు విజయం అంత సులువు కాదు. 19 ఏళ్ల టీనేజ్ సంచలనం రూన్ గతేడాది మూడు ఏటీపీ సింగిల్స్ టైటిల్స్ సాధించాడు. ఈ సీజన్ ఆరంభ గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ప్రీక్వార్టర్స్ చేరాడు. ఏటీపీ ర్యాంకుల్లో టాప్–300 ర్యాంకింగ్స్‌లో కూడా లేని భారత ఆటగాళ్లకు ఏకంగా టాప్–10లోని ఆటగాడు ఎదురవడమే ఈ ప్లేఆఫ్ టైని క్లిష్టంగా చేసింది. రెండు రోజుల పాటు జరిగే ఈ సమరంలో భారత్ నుంచి యూకీ బాంబ్రీ (571 ర్యాంకు), సుమిత్ నగాల్ (509), ప్రజ్నేశ్ గుణేశ్వరన్ (306), రామ్‌కుమార్ (412), రోహన్ బోపన్న (డబుల్స్) బరిలోకి దిగుతున్నారు. అయితే భారత్‌కు రూన్ రూపంలో గట్టి ప్రత్యర్థి ఎదురవుతున్నప్పటికీ మిగతా ఇద్దరు హోల్మ్‌గ్రెన్ (484 ర్యాంకర్), ఎల్మెర్ మోయెల్లెర్ (718 ర్యాంకర్) లోయర్ ర్యాంకింగ్ ప్లేయర్లు ఉండటం భారత శిబిరానికి కాస్త ఊరట! రూన్‌తో పోరాటం కష్టమైనా మిగతా సింగిల్స్, డబుల్స్, రివర్స్ సింగిల్స్‌లో భారత ఆటగాళ్లు గెలిస్తే... ఈ పోరులో గట్టెక్కవచ్చు.

షెడ్యూల్

నేటి మ్యాచ్‌లు

యూకీ బాంబ్రీ X హోల్గెర్ రూన్
సుమిత్ నగాల్ X అగస్ట్ హోల్మ్‌గ్రెన్
యూకీ–బోపన్న X ఇంగిల్డ్‌సన్–సిగ్స్‌గార్డ్

రేపటి మ్యాచ్‌లు

సుమిత్ X రూన్
యూకీ X హోల్మ్‌గ్రెన్
యూకీ–బోపన్న X ఇంగిల్డ్‌సన్–సిగ్స్‌గార్డ్

ఆర్చర్‌కు 6 వికెట్లు

చివరి వన్డేలో ఇంగ్లండ్ గెలుపు



కింబర్లీ: దక్షిణాఫ్రికా చేతిలో వన్డే సిరీస్‌ను కోల్పోయిన తర్వాత చివరి మ్యాచ్‌ను ఇంగ్లండ్ విజయంతో ముగించింది. బుధవారం జరిగిన మూడో వన్డేలో ఇంగ్లండ్ 59 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. ముందుగా ఇంగ్లండ్ 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 346 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జోస్ బట్లర్ (127 బంతుల్లో 131; 6 ఫోర్లు, 7 సిక్స్‌లు), డేవిడ్ మలాన్ (114 బంతుల్లో 118; 7 ఫోర్లు, 6 సిక్స్‌లు) సెంచరీలతో కదం తొక్కగా... ఎన్‌గిడికి 4 వికెట్లు దక్కాయి. అనంతరం దక్షిణాఫ్రికా 43.1 ఓవర్లలో 287 పరుగులకు ఆలౌటైంది. హెన్రిచ్ క్లాసెన్ (62 బంతుల్లో 80; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), రీజా హెన్‌డ్రిక్స్ (61 బంతుల్లో 52; 6 ఫోర్లు) రాణించారు. పేస్ బౌలర్ జోఫ్రా ఆర్చర్ (6/40) ప్రత్యర్థిని కుప్పకూల్చగా, ఆదిల్ రషీద్ 3 వికెట్లు పడగొట్టాడు.

క్వార్టర్ ఫైనల్లో సాయిప్రణీత్

థాయ్‌లాండ్ ఓపెన్ బ్యాడ్మింటన్

బ్యాంకాక్: భారత షట్లర్ భమిడిపాటి సాయిప్రణీత్ థాయ్‌లాండ్ ఓపెన్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. అయితే మిగతా షట్లర్లకు ప్రిక్వార్టర్స్‌లోనే చుక్కెదురైంది. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో సాయిప్రణీత్ 24–22, 7–21, 22–20తో జియోన్ హెయోక్ జిన్ (కొరియా)పై విజయం సాధించాడు. శుక్రవారం జరిగే క్వార్టర్స్‌లో అతను ఆరో సీడ్ లి షి ఫెంగ్ (చైనా)తో తలపడనున్నాడు. మిక్స్‌డ్ డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో సిక్కిరెడ్డి– రోహన్ కపూర్ ద్వయం 11–21, 10–21తో 6వ సీడ్ ఫెంగ్ యాన్ జి–హువాంగ్ (చైనా) జోడీ చేతిలో, 8వ సీడ్ ఇషాన్ భట్నాగర్– తనీషా క్రాస్టో జంట 19–21, 16–21తో అక్బర్ బింటాంగ్–మార్షెలా గిస్కా ఇస్లామి (ఇండోనేసియా) జోడీ చేతిలో కంగుతిన్నాయి. పురుషుల డబుల్స్‌లో ఇషాన్ భట్నాగర్–సాయిప్రతీక్ 14–21, 21–18, 24–26తో తనడాన్ పన్‌పనిచ్–వచిరవిత్ సొతన్ (థాయ్‌లాండ్) చేతిలో ఓటమి పాలయ్యారు. మహిళల సింగిల్స్‌లో అష్మిత 21–19, 13–21, 27–29తో ఆరో సీడ్ లైన్ హోజ్‌మార్క్ (డెన్మార్క్) చేతిలో తుదికంటా పోరాడి ఓడింది. పురుషుల సింగిల్స్‌లో కిరణ్ జార్జ్ 22–20, 15–21, 20–22తో లీ చుక్ యి (హాంకాంగ్) చేతిలో ఓడాడు.



విజేతలకు ఘనస్వాగతం: దక్షిణాఫ్రికాలో జరిగిన తొలి అండర్–19 మహిళల టి20 ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన భారత జట్టులో సభ్యులైన తెలంగాణ ప్లేయర్లు గొంగిడి త్రిష, సొప్పదండి యశశ్రీ గురువారం స్వస్థలం చేరుకున్నారు. వీరిద్దరితో పాటు ఫిట్‌నెస్ ట్రైనర్ షాలినిలకు శంషాబాద్ విమానాశ్రయంలో రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, 'శాట్స్' చైర్మన్ ఆంజనేయగౌడ్ ఘనస్వాగతం పలికారు.



తిరగేసి డ్రస్సు నేసేస్తే...

ఫొటో తిరగబడలేదు.. డ్రెస్సే తిరగేసి వేసుకున్నారు.. ఫ్యాషన్‌కు రాజధానిగా పిలిచే ప్యారిస్ ఫ్యాషన్ వీక్‌లో దీన్ని చూసిన అందరికీ పిచ్చిలేచిందట. విక్టర్ అండ్ రోల్ఫ్ ఫ్యాషన్ హౌస్ దీని సృష్టికర్త. అక్కడ లైవ్‌లో చూసినోళ్ల పరిస్థితి అలా ఉంటే.. ఒరిజినల్ ఐడియాలు కరువయ్యే.. చివరికి ఈ సంస్థ ఇలాంటి పిచ్చి టైపు క్రియేషన్‌కు తెరలేపిందని ఇటు ఇంటర్నెట్లో కామెంట్లు వెల్లువెత్తాయి.

వ్యాధులపై అవగాహన పెరగాలి

ఆ దిశగా ఐపీఎస్ఎం మరింత కృషి చేయాలి • గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

సాక్షి, హైదరాబాద్/లాలాపేట: వ్యాధుల సమర్థ నివారణకు ప్రజల్లో అవగాహన పెంచడం ఒక్కటే మేలైన మార్గమని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ స్పష్టం చేశారు. ఈ విషయంలో ఇండియన్ అసోసియేషన్ ఫర్ ప్రివెంటివ్ అండ్ సోషల్ మెడిసిన్ (ఐఏపీఎస్ఎం) అవిశ్రాంత కృషి చేస్తోందని కొనియాడారు. వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు.. సామాజిక, ఆర్థిక అంశాల ప్రభావం ఆరోగ్యంపై ఎలా ఉంటుందో పరిశోధించే సోషల్ మెడిసిన్ రంగాల్లో ఐఏపీఎస్ఎం పనిచేస్తోంది. ఐఏపీఎస్ఎం ఏర్పాటై 50 ఏళ్లు అవుతున్న సందర్భంగా బీబీనగర్‌లోని ఎయిమ్స్ ఆసుపత్రి, జాతీయ పోషకాహార సంస్థ సంయుక్తంగా 'ఐఏపీఎస్ఎంకాన్' పేరుతో సదస్సును నిర్వహిస్తున్నాయి. మూడు రోజులపాటు జరగనున్న ఈ సదస్సు గురువారం ఎన్ఐఎన్‌లో ఘనంగా ప్రారంభమైంది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ మాట్లాడుతూ కోవిడ్ మహమ్మారిని సమర్థంగా ఎదుర్కొనే విషయంలో ఐఏపీఎస్ఎం వంటి సంస్థలు, ప్రజారోగ్య సిబ్బంది కీలకపాత్ర పోషించారని అన్నారు. వ్యాధుల గురించి, వాటి నివారణకు తీసుకోవాల్సి చర్యలు.. అందుబాటులోకి వస్తున్న కొత్త కొత్త చికిత్స పద్ధతులను జన సామాన్యంలోకి తీసుకెళ్లేందుకు ఐఏపీఎస్ఎం మరింత కృషి చేయాలని సూచించారు. ప్రజలకు దీనిపై అవగాహన ఏర్పడితే సమస్య సగం పరిష్కారమైనట్లేనని అన్నారు. కోవిడ్ మహమ్మారి సమస్య దాదాపుగా సమసిపోయినప్పటికీ భవిష్యత్తులో ఇలాంటి సాంక్రమిక వ్యాధులు మరికొన్నింటిని ఎదుర్కోవాల్సిన పరిస్థితి రావచ్చని గవర్నర్ హెచ్చరించారు. తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో ఫ్లోరోసిస్ సమస్య, మరికొన్ని చోట్ల మూత్రపిండాల సమస్యలు ఎక్కువగా ఉన్నాయని.. ఇలా వివిధ ప్రాంతాల్లో వ్యాధులు ఎందుకు ప్రబలుతున్నాయో పరిశోధించాలని గవర్నర్ కోరారు.

యంగెస్టు స్టేట్‌కు యంగ్ గవర్నర్‌ను

'భారతదేశంలోనే యంగెస్టు స్టేట్ తెలంగాణ. దానికి దేశంలోని అందరు గవర్నర్‌లతో పోలిస్తే నేనే యంగ్ గవర్నర్' అని గవర్నర్ తమిళిసై అన్నారు. నూతన రాష్ట్రాన్ని నూతన గవర్నర్ ఏవిధంగా మెనేజ్ చేస్తుందని అందరూ అనుకుంటున్నారని, అయితే తాను వృత్తి రీత్యా గైనకాలజిస్టును అయినందున కొత్తగా పుట్టిన బిడ్డను ఎలా జాగ్రత్తగా చూసుకుంటామో అదే విధంగా తెలంగాణ రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నానని పేర్కొన్నారు. పైగా పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలను నిర్వహిస్తున్నానని.. దీంతో తాను కవల పిల్లలను చూసుకుంటున్నట్లు రెండు రాష్ట్రాల్లో గవర్నర్‌గా విధులు నిర్వహిస్తున్నానని వివరించారు. ఐఏపీఎస్ఎంకాన్ ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్ డాక్టర్ వికాస్ భాటియా, ఉపాధ్యక్షురాలు డాక్టర్ రష్మీ కుందాపూర్, ఐఏపీఎస్ఎం ప్రెసిడెంట్ ఎలెక్ట్ డాక్టర్ ఎ.ఎం.ఖాద్రీ పాల్గొన్నారు.

అన్ని కాలేజీల్లో సీపీఆర్ శిక్షణ ఇవ్వాలి: గవర్నర్

పంజగుట్ట: కార్డియోపల్మనరీ రిససిటేషన్ (సీపీఆర్) శిక్షణను ఒక జీవితాన్ని కాపాడే మంచిపనిగా గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అభివర్ణించారు. విదేశాల్లో 60 నుంచి 65 శాతం సీపీఆర్ శిక్షణ పొందిన వారుంటే భారత్‌లో కేవలం 2 శాతం ఉండటం బాధాకరమన్నారు. ప్రతీ కాలేజీలో సీపీఆర్ శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. గురువారం రాజ్‌భవన్ సంస్కృతిహాల్లో గాంధీ మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థుల అసోసియేషన్, గాంధీ మెడికల్ కాలేజీ గ్లోబల్ అలయన్స్, అమెరికన్ హార్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'కమ్యూనిటీ హ్యాండ్స్ ఓన్లీ సీపీఆర్' పేరుతో రాజ్‌భవన్ సిబ్బందికి, వారి కుటుంబసభ్యులకు సీపీఆర్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. గవర్నర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈ ఈ కార్యక్రమంలో అమెరికన్ హార్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్, గాంధీ మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ లింగమూర్తి పాల్గొన్నారు.



సీపీఆర్ చేసి చూపిస్తున్న గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్

సమతా కుంభ్ ఉత్సవాలకు అంకురార్పణ



భగవద్రామానుజల సువర్ణమూర్తికి పూజలు చేస్తున్న చినజీయర్

శంషాబాద్ రూరల్: శ్రీరామనగరంలోని సమతా స్ఫూర్తి కేంద్రంలో గురువారం 'సమతా కుంభ్' ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. శ్రీ త్రిదండి చిన జీయర్‌స్వామి పర్యవేక్షణలో ముచ్చింతల్ శివారులోని శ్రీరామనగరంలో స్ఫూర్తి కేంద్రం మొదటి వార్షికోత్సవాల్లో భాగంగా ఉదయం భగవద్రామానుజల సువర్ణమూర్తికి ఉత్సవారంభస్నపనం చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై సాయంత్రం శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర సామూహిక పారాయణం నిర్వహించారు.

తెలుగు గంగ విస్తరణ, గాలేరునగరి పనులపై తెలంగాణ అభ్యంతరం

సాక్షి, హైదరాబాద్: తెలుగు గంగ ప్రాజెక్టు విస్తరణ పనులతోపాటు గాలేరు నగరి సుజల స్రవంతి(జీఎన్ఎస్ఎస్) ప్రాజెక్టు పనులకు ఏపీ ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించడంపై తెలంగాణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. అనుమతిలేని ఈ రెండు ప్రాజెక్టుల పనులు చేపట్టకుండా ఏపీని నిలువరించాలని తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్సీ సి.మురళీధర్ గత సోమవారం కృష్ణానదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) చైర్మన్‌కు లేఖ రాశారు. జీఎన్ఎస్ఎస్ తొలిదశ కింద ప్యాకేజీ-2 పనుల్లో భాగంగా ప్రధానకాల్వ తవ్వకాలతోపాటు ఇతర పనులకు ఏపీ టెండర్లను ఆహ్వానించిందని వివరించారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా కృష్ణా బేసిన్ వెలుపల నిర్మిస్తున్న గాలేరు నగరి ప్రాజెక్టుకు కృష్ణాజలాలను తరలించడం అక్రమమని స్పష్టం చేశారు. అక్కడి నుంచి 15 టీఎంసీలు చెన్నైకి, 19 టీఎంసీలు ఎస్సార్బీసీ కాల్వకు మాత్రమే విడుదల చేసేందుకు అనుమతి ఉందని తెలిపారు. తెలుగు గంగ ప్రధానకాల్వ 120.925 కి.మీ. వద్ద లిఫ్టును నిర్మించి 12.50 ఎంసీఎఫ్టీల జలాలను వైఎస్సార్ కడప జిల్లా మైదుకూరుకు తరలించడానికి ఏపీ టెండర్లను ఆహ్వానించిందని కృష్ణాబోర్డు దృష్టికి తీసుకెళ్లారు.

వ్యథ నుంచి పుట్టిన వారధి

వాగు దాటుతూ ఇద్దరు చనిపోవడంతో సొంతంగా వంతెన కట్టిన రైతు



తాళ్లు, కర్రలతో ఏర్పాటుచేసిన వంతెన



రైతు నాగేశ్

భైంసా రూరల్: ఎవరో వస్తారని ఎదురు చూడలేదు. ఎవరూ స్పందించకపోయినా పట్టించుకోలేదు. తాను అనుకున్నది చేశాడు. నలుగురికీ ఆదర్శంగా నిలిచాడు. సొంత డబ్బుతో వాగుపై వంతెన నిర్మించాడు నిర్మల్ జిల్లా భైంసా మండలం ఖత్‌గాం గ్రామానికి చెందిన యువ రైతు నాగేశ్. గ్రామ రైతులు పొలాల వద్దకు వెళ్లడానికి సుద్దవాగు అడ్డుగా ఉంది. గతంలో వాగు దాటుతూ ఇద్దరు మృతి చెందారు. వాగుపై వంతెన నిర్మించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో.. రైతులు, కూలీలు పొలాల వద్దకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. దీంతో రైతు నాగేశ్ సొంత ఖర్చుతో తాళ్లు, కర్రలతో వంతెన నిర్మించాడు. వాగు అవతలివైపు 400 ఎకరాల పంట పొలాలున్నాయి. రైతు నాగేశ్ పొలం కూడా ఉంది. సొంతంగా రూ.25 వేలు ఖర్చుచేసి తాళ్లు, వెదురు కర్రలతో వంతెన నిర్మించిన నాగేశ్‌ను రైతులు, గ్రామస్తులు అభినందిస్తున్నారు.

ఈ- రేస్..

భారత్‌దే భవిష్యత్

ఇక్కడ నైపుణ్యమున్న రేసర్లకు కొదవలేదు

- రానున్న కాలం ఎలక్ట్రానిక్ వాహనాలదే
- ఫార్ములా–1 నుంచి ఫార్ములా–ఈ వైపు ఆసక్తి
- మహీంద్రా రేసింగ్‌తో మంచి ఫలితాలు
- 'సాక్షి'తో బ్రెజీలియన్ రేసర్ 'లుకాస్ డి గ్రాసీ'



సాక్షి, సిటీబ్యూరో: మరికొద్ది రోజుల్లో భాగ్యనగరం వేదికగా దేశంలోనే మొదటిసారిగా తలపెట్టిన ఫార్ములా ఈ -రేసింగ్ చాంపియన్‌షిప్‌లో అంతర్జాతీయ రేసర్లు పాల్గొనున్నారు. ఇందులో భాగంగా మహీంద్రా రేసింగ్ తరఫున ప్రముఖ బ్రెజీలియన్ ఫార్ములా రేసర్ 'లుకాస్ డి గ్రాసీ' హైదరాబాద్‌కు వచ్చారు. లుకాస్ 2014లో బీజింగ్ ఈ-ప్రిక్స్‌లో మొట్టమొదటి ఫార్ములా ఈ- రేస్‌ను గెలిచారు. 101 రేసులు, 40 పోడియంలు, 13 విజయాలతో ప్రపంచవ్యాప్తం గా అత్యంత విజయవంతమైన ఫార్ములా డ్రైవర్లలో ఒకరుగా నిలిచారు. సియోల్ వేదికగా 100 రేసుల మార్క్‌ను చేరుకున్న మొట్టమొదటి రేసర్‌గా చరిత్ర సృష్టించారు. ఫార్ములా ఈ- ప్రస్థానంలో మూడో తరంగా ప్రత్యేకతగాంచిన జెన్- 3లో తన సామర్థ్యాన్ని మరోసారి నిరూపించుకోవడానికి మహీంద్రా రేసింగ్‌తో కలిసి పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి'తో 'లుకాస్ డి గ్రాసీ' ఫార్ములా ఈ- ప్రిక్స్ గురించి లుకాస్ వివరించారు. ఆ విషయాలు ఆయన మాటల్లోనే.

మంచి పరిణామం..

భౌగోళికంగా, ఆర్థిక వ్యవస్థ, జనాభా తదితర అంశాల్లో ఎంతో దృఢమైన దేశం భారత్. ఇలాంటి అత్యంత సామర్థ్యవంతమైన వేదికపై ఫార్ములా ఈ- రేసింగ్ వరల్డ్ చాంపియన్‌షిప్ నిర్వహించడం మంచి పరిణామం. గ్లోబల్ మార్కెట్‌ను ప్రభావితం చేయడంలో భారత్ ప్రధానమైనది. ఇక్కడ మంచి నైపుణ్యమున్న రేసింగ్ ఔత్సాహికులు ఉన్నారు. భారత్ రేసర్లకు ప్రోత్సాహం అందిస్తే భవిష్యత్‌లో ఫార్ములా ఈ- చాంపియన్‌షిప్‌లో ఈ దేశం ప్రత్యేకతను సంతరించుకునే అవకాశముంది.

ఎక్కువ మంది ఆసక్తి..

ప్రస్తుతం ఫార్ములా–1 నుంచి ఫార్ములా–ఈలోకి ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తున్నారు. ఫార్ములా–ఈ రేసింగ్ మిగతా విభాగాలకంటే భిన్నంగా ఉంటుంది. ఫార్ములా–ఈలో అత్యధిక వేగంతో, తక్కువ బరువుతో అధునాతన సాంకేతిక పరిణామాలు చోటుచేసుకున్నాయి. గతంలో రేసింగ్ కార్ల తయారీ వాటి సామర్థ్యం రేసింగ్ అనుకూలతలు ఫార్ములా–ఈతో సరితూగలేవు. ముఖ్యంగా జెన్3 కార్లు 600 కిలో వాట్స్ చార్జింగ్ సామర్థ్యంతో గంటకు 300 కిలో మీటర్ల వేగంతో దూసుకుపోతున్నాయి.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.